# దళిత సాహిత్యం
# మాదిగ దృక్పథం

దార్ల వెంకటేశ్వరరావు

# దళిత సాహిత్యం
# మాదిగ దృక్పథం

డా॥ దార్ల వెంకటేశ్వరరావు

సొసైటీ & ఎడ్యుకేషన్ ట్రస్టు
హైదరాబాదు
2008

# *Dalita Sahityam: Madiga Drukpatham*

*(Essays on Literary Criticism)*

Written by Dr. Darla VenkateswaraRao
M.A., (Telugu). M.A. (Sociology), PGDLTL, Dip.in.Skt, M.Phil., Ph.D., (Telugu)

Lecturer (Sr.Scale),
Department of Telugu,
School of Humanities,
University of Hyderabad,
Gachibowli, Hyderabad-500 046., A.P.

Home Page: www.vrdarla.blogspot.com
Email: vrdarla@gmail.com darlash@uohyd.ernet.in
Phone: 09989628049, Office: 040-23133563

First Edition : 2008
Copy Right : Author.
Copies : 500
Price : 50/-

For Copies :

M.Manju Sree, Govt, JR. Lecturer in Telugu,
House No: 4-8-89, Alamapally, Vikarabad, Ranaga Reddy Dist.

Dr. Darla Ravi Kumar, Telugu Pandit,
Cheyyery Agraharam, Via: Anathavaram (S.O.)
East Godavari Dist., A.P., India - 533 222.

www.madigakavulu.blogspot.com
www.societyandeducation.org
( Free download for research scholars, Ph: 9396202960 )

Samantara Book House,
Lakdi-ka-pool, Red Hills, Hyderabad.

Prajasakti Book House, Chikkadapalli, Hyderabad.

Visalandhra Book House, Hyderabad
Navodaya Book House, Hyderabad

DTP: Majji Durgarao. Mobile:09848248003

Cover Page: Ravi Shankar

Printed at : Shree Graphics, Red Hills, Hyderabad.

# అంకితం



(మాదిగ చరిత్ర, సంస్కృతి, సాహిత్యం పై విశేషమైన పరిశోధన చేస్తున్న వారిలో Prof. Simon Charsley, Hon. Senior Research Fellow, Faculty of Law, Business and SocialSciences, University of Glasgow, Scotland., ఒకరు. మాదిగలపై ఆయన చేస్తున్న పరిశోధనను గుర్తించి కృతజ్ఞతా పూర్వకంగా డా// దార్ల వెంకటేశ్వరరావు, డా// జె.భీమయ్య గార్ల ఆధ్వర్యంలో University of Hyderabad లో మాదిగ రిసెర్చ్ స్కాలర్స్ ఆయనను సన్మానించారు. చిత్రంలో ఎడమ వైపున ప్రొఫెసర్ సైమన్ చార్లీ, కుడివైపున ఆయనను సన్మానిస్తున్న డా// దార్లను చూడవచ్చు.)

*దళిత, మాదిగ జీవితాల్లో కొత్త వెలుగులు ప్రసరింపాలని*
*ఆకాంక్షించే ఉద్యమకారులు, సాహితీ వేత్తలు, పరిశోధకులు, మేధావులందరికీ...*
*కైమోడ్పులతో.....*

*- - దార్ల వెంకటేశ్వరరావు*

# కృతజ్ఞతలు

హైదరాబాదు విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా అవకాశం కలిగించి సాహిత్యంలో కృషి చేసేందుకు ప్రోత్సహించిన విశ్వవిద్యాలయం వారికి...

నా రచనలను, భావజాలాన్ని గౌరవిస్తూ స్వేచ్ఛనిస్తూ ప్రోత్సహించే మా తెలుగు శాఖ అధ్యక్షులు ప్రముఖ, రచయిత, విమర్శకులు ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారికి...

ఎం.ఏ నుండి పిహెచ్.డి. వరకు పాఠం చెప్పి సహ అధ్యాపకుడిగా ఆదరించిన గురువర్యులు ఆచార్య పరిమి రామనరసింహం గారికి, ఆచార్య శరత్‌జ్యోత్స్నారాణి గారికి, ఆచార్య ఎన్.ఎస్. రాజు గారికి, ఆచార్య కె.కె. రంగనాథచార్యులు గారికి, ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం గారికి, ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య గారికి, ఆచార్య రవ్వా శ్రీహరి గారికి, ఆచార్య జి. అరుణకుమారి గారికి, డా// పిల్లలమర్రి రాములు గారికి తదితరుల అందరికీ....

నన్ను ఎల్లప్పుడు ప్రోత్సహిస్తున్న ఆచార్య గుజర్లమూడి కృపాచారి గారికి, ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి గారికి, చేకూరి రామారావు గారికి, ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య గారికి, ఆచార్య ఆకురాతి పున్నారావు గారికి, ఆచార్య కొలకలూరి ఇనాక్ గారికి, ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారికి, డా// బన్న అయిలయ్య గారికి, ఆచార్య యోహాన్ బాబు గారికి.....

దళిత సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూనే మాదిగల స్వీయ అస్తిత్వం కోసమై ఉద్యమం చేస్తున్న కార్య కర్తలందరికీ,

ఎస్.సి. వర్గీకరణ సమస్యను ప్రజాస్వామ్య ఉద్యమంగా ఆహ్వానించిన వారందరికీ....

ఈ వ్యాసాలను ప్రచురించిన ప్రజాసాహితి, సాహితీ కౌముది, ప్రకాశిని, అరుణతార, హైదరాబాదు మిర్రర్, వార్త మొదలైన పత్రికల యాజమాన్యానికి...

ఈ పుస్తకంలోని వ్యాసాలను ఇంటర్నెట్ పత్రికలు ఈమాట, ప్రజాకళ, దట్స్ తెలుగు, ప్రాణహిత మొదలైన మాస పత్రికలలో ప్రచురించినందుకు ఆ యాజమాన్యానికి...

ఈ పుస్తకంలోని *తెలుగు దళిత కథాపరిణామం* వ్యాసాన్ని తెలుగు కథా సాహిత్యం : ఆధునిక దృక్పథం గ్రంథంలో ముందుగా ప్రచురించిన ఆచార్య శరత్‌జ్యోత్స్నారాణి గారికి, రాగవాసిష్ఠం పై రాసిన వ్యాసాన్ని జాతీయ సదస్సు పరిశోధన ప్రత్యేక సంచికలలో ప్రచురించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం, అసోసియేట్ ప్రొఫెసర్ డా// కేశవులు గారికి....

ఈ వ్యాసాలు రాసేటప్పుడు వివిధ చర్చలలో పాల్గొని పుస్తకానికి “మాదిగ చైతన్యం” పేరుతో ముందుమాట రాసిన హైదరాబాదు విశ్వవిద్యాలయం, తులనాత్మక సాహిత్యం అధ్యాపకుడు డా// జె. భీమయ్య గారికి....

ఆంగ్లంలో అభిప్రాయాన్ని రాసిచ్చిన హైదరాబాదు విశ్వవిద్యాలయం, సామాజిక శాస్త్ర అధ్యాపకుడు డా// జి. నాగరాజు గారికి, వర్గీకరణ సమస్యపై ఒక మంచి పుస్తకాన్ని రాసి దానికి నన్ను అభిప్రాయం రాయమనడమే కాకుండా, ఈ పుస్తకంపై లోతైన విశ్లేషణతో ఒక చిన్న సిద్ధాంత వ్యాసంలా తన అభిప్రాయాలను రాసిన సాంబయ్య గుండిమెడ గారికి...

ఈ పుస్తకాన్ని ప్రచురించిన సొసైటీ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్టు సభ్యులు పి.వి. కిరణ్ కుమార్, రవి కుమార్, శివరాం ప్రసాద్, గార్లకు...

నా సుఖః దుఖాలలో నాతో సమానంగా పయణించే నా సహధర్మచారిణి, నా జీవిత భాగస్వామి మంజుశ్రీకి...

నా కుటుంబ సభ్యులకు... నా కృతజ్ఞతలు

నాకు ఎప్పుడు అందుబాటులో ఉండి, నా ప్రసంగాలను, రచనలను ఎప్పటికప్పుడు టైపు చేసి వెంటనే ఆన్ లైన్, ప్రింట్ మీడియాలకు పంపించడానికి ఎంతో శ్రద్ధ చూపిస్తున్న నా పరిశోధక విద్యార్థి మజ్జి దుర్గారావుకి ఆశీర్వచనాలు.

ఈ పుస్తకాన్ని ప్రచురించేటప్పుడు, అంతకు ముందు పత్రికలకు పంపేటప్పుడు ప్రూఫ్ రీడింగ్ లో సహకరించిన పరిశోధక విద్యార్థులు జరుపుల రమేష్, మద్దిరాల సిద్ధార్థలకు, వివిధ రకాలుగా సహకరించిన దార్ల సుధీర్ కుమార్, దార్ల మురళిలకు నా అభినందనలు.

మా విశ్వవిద్యాలయంలో జరిపే దళిత సమావేశాలలో పాల్గొనే అవకాశం కల్పిస్తున్న దళిత స్టూడెంట్స్ యూనియన్, అంబేద్కర్ స్టూడెంట్స్ యూనియన్ ల వారికి,

ఈ వ్యాసాలను పత్రికల్లో చదివి వెంటనే వివిధ విషయాలను చర్చిస్తూ, ప్రోత్యహించే ప్రముఖ రచయిత డా// బోయి జంగయ్య, మాదిగ దండోరా ఉద్యమ నాయకుడు, రచయిత కృపాకర్ మాదిగ, ప్రముఖ రచయితలు జూపాక సుభద్ర, తాళ్ళూరి లాబన్ బాబు, డా// జి.వి. రత్నాకర్, డా// కేశవ్ కుమార్ గార్లకూ...

దిగుమర్తి సురేష్, గురజాల రవి, హరినాథ్, ధనరాజ్, ఐనాల సైదులు, పసునూరి రవీందర్, జి. సీతా రాములు, నవజీవన్, ఎజ్రా శాస్త్రి, ఇ. వెంకటేష్, పొన్నాల బాలయ్య, కదిరి కృష్ణ, సిద్ధంకి యాదగిరి, భట్టు సుధాకర్ తదితరులందరికీ నా కృతజ్ఞతలు.

ఈ పుస్తకాన్ని అందంగా ముద్రించిన శ్రీ గ్రాఫిక్స్ వారికి, ముఖ చిత్రాన్ని అందంగా చిత్రించిన రవి శంకర్ గారికి, అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

*- దార్ల వెంకటేశ్వరరావు*

# విషయసూచిక


| | |
|---|---|
| అంకితం | 3 |
| కృతజ్ఞతలు | 4 |
| ఒక అస్తిత్వ ఉద్యమ ఆరాటం –డా// దార్ల వెంకటేశ్వరరావు | 7 |
| మాదిగ చైతన్యం - డా// జె. భీమయ్య | 8 |
| FROM CARRION TO CLARION - Dr. Nagaraju Gundimeda | 1 2 |
| *రాగవాసిష్ఠం- నాటక వైశిష్ట్యం* | 1 3 |
| *తెలుగు దళిత కథాపరిణామం* | 2 6 |
| *వర్గీకరణ వాదానికి శాస్త్రీయ దృక్పథం* | 3 2 |
| *దళిత సాహిత్యం: మాదిగ దృక్పథం* | 3 9 |
| *దళిత సమస్యలపై ప్రజాసాహితి దృక్పథం* | 4 9 |
| *ఆచార్య కొలకలూరి ఇనాక్ కథల్లో* | |
| *వస్తు వైవిధ్యం - సామాజిక వాస్తవికత* | 6 0 |
| అనుబంధం: | |
| *మాదిగ సాహిత్యం: తెలుగు సాహితీ ఫలకంపై కొత్త దరువు* | |
| *- సాంబయ్య గుండిమెడ* | 6 8 |
| ఉపయుక్త గ్రంథ సూచిక | 93 |

# ఒక అస్తిత్వ ఉద్యమ ఆరాటం

సమాజంలో జరిగే వివిధ సంఘటనల ప్రత్యక్ష స్పందనలు దళిత సాహిత్యంలో కనిపిస్తున్నాయి. అందులో కులం ఆధారంగా కొనసాగే వివక్ష మరీ ముఖ్యమైంది. వివక్షను ప్రశ్నించడం దళిత సాహిత్యంలో ప్రధానంగా కనిపిస్తున్నా, అలాంటి వివక్షే మళ్ళీ దళితసాహిత్యంలోనూ కనిపిస్తుంది. మన భారతీయ సమాజం కులవ్యవస్థ అనే నిచ్చెన మెట్లతో నిర్మితమై ఉండటం వల్ల వివక్ష అనేక పొరలు పొరలుగా ఉంటుంది. అది దళిత సాహిత్యంలోనూ ప్రతిఫలిస్తుంది. దీన్ని శాస్త్రీయంగా విశ్లేషిస్తూ రాసిన కొన్ని వ్యాసాలను ఒక సంపుటిగా తీసుకొస్తున్నాను.

సమాజం నుండి విడిగా సాహిత్యాన్ని చూడలేకపోయినా, సమాజంలో అన్ని సమస్యలను కొన్ని సందర్భాలలో సాహిత్యం పట్టించుకోకపోవచ్చు. అలా విస్మరణకు గురైన వారి నుండి కూడా నేడు సాహిత్యం వస్తుంది. ఆ సాహిత్యం అస్తిత్వ ఉద్యమాల్లో భాగమైంది. ఆత్మగౌరవ ప్రతిఫలనమయ్యింది. అది అంతటితో ఆగకుండా ఒక ప్రత్యేక ధోరణిగా, వాదంగా, ఉద్యమంగా నిలదొక్కుకొని స్వీయ అస్తిత్వంతో ముందుకు వెళుతుంది. అలా ముందుకు వెళ్తున్న సమకాలీన సాహిత్యంలో ఒక ప్రధాన ఉద్యమం మాదిగ సాహిత్య ఉద్యమం. ఇది అంబేద్కర తాత్త్విక భూమికను, ఆయన పోరాట పటిమను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్తున్న ఉద్యమం. తమ సాంస్కృతిక మూలాలను పునర్మూల్యాకనం చేసుకుంటూ అన్ని సంస్కృతులు గొప్పవేనని చాటుతూ ముందుకొస్తున్న ఉద్యమం. దీనిలోని వ్యాసాలు ఒక చారిత్రక నేపథ్యాన్ని కలిగి జాతి అస్తిత్వాన్ని ప్రతిఫలించే చైతన్యంతో కనిపిస్తాయి. వీటిని చదివిన ప్రజాస్వామిక వాదులందరూ మాదిగ ఉద్యమం సాహిత్య అస్తిత్వాన్ని స్వాగతిస్తారని నమ్ముతున్నాను.

*- దార్ల వెంకటేశ్వరరావు*

డా// జె. భీమయ్య, M.A., M.A., M.Phil, Ph.D.
లెక్చరర్, తులనాత్మక సాహిత్య కేంద్రం,
హైదరాబాదు విశ్వవిద్యాలయం.
గచ్చిబౌలి, హైదరాబాదు – 500 046
Ph: 040- 2313 3356, Cell: 09492304730
Mail: jbsh@uohyd.ernet.in

# మాదిగ సాహిత్యం

సాధారణంగా రచయితలు తాము ప్రచురించే పుస్తకాల్లో ముందుమాటలను ఆయా రంగాలలో ముఖ్యంగా సాహితీ రంగంలో అనుభవం, కీర్తి ప్రతిష్టలు మరియు నిష్ణాతులైన వ్యక్తుల చేత రాయించుకోవటం పరిపాటి. ఇది ఒక బలమైన సాంప్రదాయంగా సాహితీ జగత్తులో కొనసాగుతున్నది. ప్రసిద్ధ భారతీయ ఆంగ్ల నవలా రచయిత ముల్క్‌రాజ్ ఆనంద్ రచించిన మొట్టమొదటి నవల "అంటచబుల్' (1935)కి ఇ.యం. ఫోర్‌స్టర్ ముందుమాట రాయటంతో ఇంగ్లాడులోని "పెంగ్విన్ పబ్లికేషన్స్' ప్రచురించింది. అంతకు ముందు ఆ నవలను ప్రచురించటానికి ప్రచురణ కర్తలు నిరాకరించారు. ఆనాటి ప్రచురణ కర్తల స్వభావాన్ని ఆర్థిక పరిభాషలో గుత్తాధి పత్యంగాను, సామాజిక రీతిలో బ్రాహ్మణత్వంగా పోల్చవచ్చు. డబ్బే ప్రధానాంశంగా మారిన ఈ రోజుల్లో అటువంటి పరిస్థితికి తెరపడింది.

నా దృష్టిలో పుస్తకానికి ముందుమాట అనేది ఒక టార్చ్‌లాంటిది. వార్తా పత్రికల్లోని సంపాదకీయం లాంటిది. శరీరంలోని అన్ని అవయవాలతో అనుసంధానంగా విధి నిర్వహించే గుండెకాయలాంటిది. పుస్తకంలో జాలువారిన రచయిత మనోభావాలను ప్రతిబింబిస్తూ ముందుమాట రాయటం అంత సులువైన పనేమీకాదు. విప్లవ రచయితలు సైతం విప్లవోద్యమాలతో సంబంధమున్న వ్యక్తుల చేతనే ముందుమాటలు రాయించటం జరుగుతుందే. ఒక పుస్తకంపై రకరకాల అభిప్రాయాలు వెలువడవచ్చు. ముందుమాటలోని అభిప్రాయాలే సర్వస్వం కాజాలవు. అలాంటపుడు ఫలానా వ్యక్తే తన పుస్తకానికి ముందుమాట రాయాలని రచయిత పట్టుబట్టటం మొండితనమే అవుతుంది. రచయిత అభిప్రాయాలు ఎలా ప్రతిబింబించినా, పాఠకుడే అంతిమ న్యాయ నిర్ణేత.

పుస్తకానికి ముందుమాట రాసే వ్యక్తి అనుభవజ్ఞుడై, విషయ నిష్ణాతుడై ఉండాలని లేదా కనీసం వయస్సులోనైన తనకంటే కొంత పెద్దవాడై ఉండాలని ఒక నిభందనగా రచయితలు ఏర్పరచుకున్న "సాంప్రదాయాన్ని' "బ్రేక్' చేస్తూ ఏ అనుభవం లేని, విషయ నిపుణత ఆశించినంతగా లేని నాతో తన పుస్తకానికి "ముందుమాట' రాయించిన డా// దార్ల వెంకటేశ్వర రావు అభినందనీయుడు.

మనిషిని మనిషిగా గుర్తించని సమాజం ఇంకా బతికే ఉందనటం అతిశయోక్తి కాదు. వర్ణ ధర్మంపై మొలిచిన "కులం' మొక్క ఏపుగా పెరిగి మర్రి ఊడల్లా సమాజమంతటా ప్రాకింది. కృత్రిమ సంస్కృతిలో రూపుదిద్దుకున్న నగరవాసి యొక్క యాంత్రిక జీవితం సామాజిక కులజాడ్య సమస్యను అంతగా పట్టించుకోదు. గ్రామ పెత్తందార్ల అదుపాజ్ఞల్లో ఉంటూ, కుల వివక్షకు గురవుతూ ఆర్థిక దుస్థితికి లోనైన సామాన్య దళిత జీవి వ్యధ వర్ణనాతీతం. ఇలాంటి బడుగు జీవుల దుస్థితి సాహితీకరించబడినా తమ జీవితానుభవాలను అక్షరాలలో చూసుకోలేని అభాగ్యులు ఎందరో ఉన్నారంటే ఆశ్చర్యం లేదు. సంస్కరణ వాదంతో మొదలైన దళిత జీవిత చిత్రీకరణ అభ్యుదయ రచనగా ఎదుగుతూ తిరుగుబాటు సాహిత్యంగా రూపుదిద్దుకుంది. నేడు దళిత వాదానికి ఎవరి సానుభూతి అక్కరలేదు. తమదైన శైలిలో గుర్తింపుకు, సమాన హక్కులకై నిరంతర పోరాటం చేస్తున్న దళితులు ఒక సామాజిక శక్తిగా ఎదుగుతున్నారు.

కులమతాలు మనం ఏర్పరచుకున్న అడ్డుగోడలని నిజమైన ప్రేమకు ఇవేవి అడ్డం రావని "ప్రేమ' కంటే బలమైన శక్తి ఏదీ లేదని తెలియజెప్పే అరుంధతీ వసిష్టుల ఆదర్శ వివాహం కులాంతరాలు పెంచుతున్న సవర్ణ హిందువులకు కనువిప్పు అవుతుంది. బోయి భీమన్న గారి "రాగా వాసిష్టం' నాటకాన్ని ఈ సందర్భంగా దార్ల తన పుస్తకం ప్రారంభంలోనే ప్రస్తావించటం దళిత సాహితీ చరిత్రక్రమాన్ని పాటించడమే అవుతుంది.

మాదిగ దండోరా ఉద్యమం, దాని దృక్పథం, ఆశయాలు దార్ల పుస్తకం నిండా పరుచుకొని ఉన్నాయి. అంబేద్కర్ ఆశించిన సామాజిక న్యాయం, సమానత్వం ప్రతిఫలించే దిశగా దండోరా ఉద్యమం కొనసాగుతున్న వైనాన్ని దార్ల తన పుస్తకంలో ప్రస్తావించటం మాదిగ చైతన్యాన్ని దాని పోరాట పటిమను తెలియ జెప్పే బాధ్యతను నిర్వహించటమే అవుతుంది. మాదిగ చైతన్యం రివ్వున ఎగసిపడే విధంగా ఉద్యమ కాంతులు మన రాష్ట్ర నలు మూలల ప్రసరించాయి. సామాజిక న్యాయంలో భాగంగానే రిజర్వేషన్ ఫలాలు ప్రజాస్వామ్య బద్ధంగా పంపిణీ జరగాలనే డిమాండ్‌తో దండోరా ఉద్యమం ముందుకెళుతుంది.

దళితుల సమస్య పరిష్కారానికి దళితేతర ప్రజాతంత్ర శక్తుల తోడ్పాటు ఎంతైన అవసరమేనని గుర్తించాల్సి ఉంది. అలా కానపుడు దళిత ఉద్యమాలు పరిమితుల్లోనే ఉండిపోతాయి. మాదిగ దండోర ఉద్యమాన్ని పరిమిత అర్థం నుండి విస్తృత అర్థంలోకి తెచ్చే క్రమంలో దాని స్వరూప స్వభావాన్ని మార్చే ప్రక్రియ ఎంతైనా అవసరమనే భావన చాలామందికి ఉంది. రిజర్వేషన్ వర్గీకరణ నేపథ్యంగానే ఈ ఉద్యమం పుట్టిందనే అపవాదు. నిజానికి వర్గీకరణ సమస్య దళిత సమస్యల్లో ప్రధానాంశమే. దళితుల సమస్య పరిష్కారానికి, సమైఖ్యతకు దోహదపడే విధంగా వర్గీకరణ సమస్యను పరిష్కరించాలి. అంతర్గత సమస్యలను పరిష్కరించుకోకుండా దళిత సమైఖ్యతను కోరటం గురువింద చందమే అవుతుంది. దళితుల్లో 62 ఉపకులాలు ఉన్నాయన్న నిజం దండోరా ఉద్యమం మూలంగానే బైటికి వచ్చింది. ఇన్ని ఉపకులాలు అట్టడుగున పడి ఉన్నాయి కాబట్టే, ఇది మాల మాదిగల సమస్యగానే ఉపరితలంపై కనిపిస్తున్నది. మాదిగ చైతన్యాన్ని మాదిగ

ఉపకులాల ప్రాతినిధ్య చైతన్యంగానే అర్థం చేసుకోవాలి. జస్టిస్ రామచంద్ర రాజు కమీషన్‌తో ప్రారంభమైన దండోర సమస్య అధ్యయన ప్రస్థానం ఎన్నో ఒడిదొడుకులను అధిగమిస్తూ ఉషా మెహ్రా కమీషన్ దాక కొనసాగింది. పార్లమెంటులో ఒక నిర్దిష్టమైన చట్టం తీసుకవస్తే గాని దండోరాకు విముక్తి కలుగదేమో!

అంబేద్కర్ చేసిన సామాజిక కృషిని స్పృశించకుండా, దళిత సాహిత్యాన్ని చర్చించలేం. కుల రహిత సమాజ ఆవిర్భావానికై అంబేద్కర్ చేసిన సామాజిక పోరాటం ఒక చారిత్రాత్మక ఘట్టం. కులమత విశ్వాశాలను ప్రేరేపించే హిందూ ధర్మశాస్త్రాలను నిర్వందంగా వ్యతిరేకించాడు. కులాంతర వివాహాలు జరుగుతున్నప్పటికి కులం పోవటం లేదు. కులం పునాదులపై నిర్మింపబడిన హిందూ మతం వర్ధిల్లినంత కాలం కులం నిర్మూలన జరుగదనేది అంబేద్కర్ అభిప్రాయం. ఆయన హిందువుగా జన్మించినా, తాను హిందువుగానే చనిపోరాదన్న ఆలోచన బౌద్ధ మత స్వీకరణకు గట్టి పునాది వేసింది. మానవత్వం, సమానత్వ భావన, ప్రేమ లాంటి సుగుణాలు హిందూ మతంలో కొరవడిన కారణంగానే దళితులకు ఆ మతంలో విముక్తి లేదని తేల్చిచెప్పాడు అంబేద్కర్. తన తండ్రి బ్రిటీషు సైన్యంలో పనిచేయటం, తాను ఆర్థికంగా కొంత నిలదొక్కుకొని ఉన్నందు వల్ల విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించటానికి అవకాశమేర్పడింది. తన స్థాయిలోనూ తనకు కులపరంగా అవమానం కలగటం తన జాతి మొత్తాన్ని అర్థం చేసుకోవటానికి తోడ్పడింది. విదేశాల్లో తాను నేర్చుకున్న విద్యను తన జాతి విముక్తికై దారపోశాడు. సామాజిక పోరాటాలు నిరంతరంగా నిర్వహించాడు. ఇది అంబేద్కర్ గొప్పతనం.

నాటి నుండి నేటి వరకూ హీనంగానే చూడబడుతున్న దళితులకు రిజర్వేషన్ అనే రాజ్యాంగ ఉపశమనం అంబేద్కర్ సాధించి పెట్టక పోయినట్లయితే అంబేద్కర్‌ను శత్రువుగా పరిగణించే అగ్ర వర్ణాల ఇళ్ళల్లో, పొలాల్లో దళితులు ముఖ్యంగా మాదిగలు పని మనుషులుగా, పాలేర్లుగా ఉండేవారు. అంటే అందరికీ ఈ రిజర్వేషన్ వల్ల విముక్తి లభించిందని కాదు. పని మనుషులుగా, పాలేరులుగా ఉండటం లేదని కాదు. కొంతమంది దళితులైనా పైకొచ్చారనే వాస్తవాన్ని కాదనలేం. కానీ, అధిక సంఖ్యాకులైన దళిత పేదలకు రిజర్వేషన్ ప్రయోజనాలు చేరటం లేదనేదే బాధ. ఇలాంటి పరిస్థితిల్లో రిజర్వేషన్ ఫలాలను ప్రజాస్వామ్య బద్ధంగా అనుభవించాలనే డిమాండ్ సరియైనదే.

రాజ్యాంగ ప్రయోజనాలను జనాభా నిష్పత్తిపై దళిత ఉపకులాల మధ్య పంపిణీ చేయమని అడగటం దళితులను విడగొట్టటమేననే అపోహకు దారితీసింది. రిజర్వేషన్ ఫలాలను అనుభవించిన వారే మళ్ళీ మళ్ళీ అనుభవించటం ద్వారా "క్రిమిలేయర్' పుట్టుకొచ్చింది. ప్రైవేటు సంస్థల్లో రిజర్వేషన్ అమలు చేయాలనే డిమాండ్ క్రిమిలేయర్ వర్గానిదే. ఈ డిమాండ్ సరైందా? కాదా? అని తేల్చేముందు ప్రభుత్వ సంస్థల్లో అమలవుతున్న రిజర్వేషన్ ప్రయోజనాలు ప్రజాస్వామ్య బద్ధంగా పంపిణీ అవుతున్నాయా? లేదా? అనేది ముందు చూడాలి. అగ్ర వర్ణాల ఇండ్ల ముందు పని మనుషులుగాను, వారి పొలాల్లో పాలేరులు గాను కొనసాగే పరిస్థితి నుండి "రిజర్వేషన్ తంతు' కొంత మేరకు ఒక

పార్శ్వంలో దళితులను కాపాడినా, మరో పార్శ్వంలో అది ఒక దళితుని ఇంట్లో సాటి దళితుడు పనిమనిషిగా ఉంటున్న వైనాన్ని కల్గించింది. ఒక దళిత ఉన్నతుని ఇంటి గేటు బైట చేతులు కట్టుకొని నిలుచుండే దళిత పేదలు ఉన్నారంటే ఆశ్చర్యం కలగదు. ఇలాంటి ఆర్థిక అసమానతలు, సామాజిక అంతరాలు దళితుల మధ్యే ఉన్నాయంటే వింతగా తోచదు. అన్ని రకాల అవకాశాలను వినియోగించుకుంటు ఉంటూ, అగ్ర వర్ణ భూస్వాముల ఇళ్ళల్లో పెంచుతున్న కుక్కలను తమ ఇళ్ళల్లో పెంచే సంస్కృతి కల్గి ఉంటూనే, దళితులం కాబట్టే వివక్షకు గురవుతున్నాం, అన్యాయం జరిగిందని గగ్గోలు పెట్టే దళిత బ్రాహ్మణులు ఉన్నారంటే ఆశ్చర్యం కలగక మానదు. వీరికే దళిత సమైఖ్య వాదమనే పాట అవసరం. ఈ భావాల్ని ఈ పుస్తకంలో దార్ల సమన్వయించిన తీరు ప్రశంసనీయం.

ప్రజాసాహితీ, జన సాహితీ లాంటి విప్లవ సాహితీ పత్రికల, సంస్థల దృక్పథాన్ని కూడా దార్ల ఈ పుస్తకంలో విశ్లేషించటం సందర్భోచితమే. సంస్కరణోద్యమాలు ఉపరితల మార్పునే తెస్తాయి కానీ, మౌలికమైన మార్పుని సాధించలేవు. దోపిడి సమాజంలో సమస్త పీడిత ప్రజల విముక్తి వర్గ పోరాటం పైనే ఆధార పడి ఉంటుందన్న "ప్రజా పత్రిక'ల వాదన సరైనదే. వర్గ పోరాటాన్ని కులం అడ్డుకుంటున్నదన్న వాదాన్ని కూడా కొట్టి పారేయలేం. కులాధిపత్యం కారణంగానే విప్లవ పార్టీలలో సైతం నాయకత్వం అగ్రవర్ణాల చేతుల్లోనే ఉండి పోయిందన్న విమర్శను కూడా వాస్తవిక దృష్టితో చూడాలి. కులాధి పత్యానికి, వివక్షకు బలమైన కారణంగా నిలిచే భూస్వామ్య, సామ్రాజ్య సంస్కృతిని నిర్మూలించే దిశగా పోరాటాన్ని సాగించాలనే విప్లవ సాహితీ పత్రికల సంస్థల పిలుపు ఆహ్వానించదగినదే. అవినీతిని, దోపిడిని, దౌర్జన్యాలను ప్రశ్నించకుండా కులంపైనే చేసే ఉద్యమాలు అశేష పీడిత ప్రజానికానికి విముక్తిని ఇవ్వలేవు. ఉద్యమ నాయకత్వం పీడిత వర్గాల చేతుల్లో ఉండాలి. కుల సమస్యపై ఏకమైనంతగా ఆర్థిక సమస్య, భూ సమస్యలపై సామాజిక వర్గాలు ఏకం కావటం లేదు. ఈ దిశగా ప్రజల్లో చైతన్యం రావలసి ఉంది.

కుల-వర్గ సమస్య, వర్తమాన దండోరా ఉద్యమ సమస్యలాంటి సామాజిక ప్రధానాంశాలపై సమగ్రమైన చర్చను లేవదీస్తూ అది సాహిత్యంలో ప్రతి ఫలిస్తున్న తీరును శాస్త్రీయంగా విశ్లేషిస్తూ ప్రచురించిన ఈ పుస్తకం దార్ల సామాజిక అవగాహనకు, సాహిత్య కృషికి, అంకిత భావానికి తార్కాణంగా నిలుస్తుంది. మాదిగ చైతన్యాన్ని మహా చైతన్యంగా మలిచి అశేష పీడిత ప్రజల ఆర్థిక సామాజిక విముక్తి దిశగా ప్రయనించాలని కోరుకుంటూ............

-- జె. భీమయ్య

హైదరాబాదు,
25-12-2008.

Dr. Nagaraju Gundimeda, M.A., Ph.D
Lecturer (Sr. Grade),
Department of Sociology,
School of Social Sciences,
University of Hyderabad
Hyderabad—500046
Ph: 040-23133263, Cell: 09949314204
Email: ngss@uohyd.ernet.in,
nagarajuhcu@gmail.com

# FROM CARRION TO CLARION

Protest is an inherent feature of human society. The progress of any society tends to be determined by the degree of social protest. India is not an exception to this phenomenon. Indian society witnessed a wide range of protest movements differentiated by ideologies, methods and objectives in different historical conjunctures. Literature is one of the dominant agencies to reflect the social reality and question the forms of discrimination and levels of deprivation in diverse spheres of society.

The roots of literary protest movements in Andhra Pradesh could be traced back to Anti-caste movements primarily led by the Shudra castes in South India in general and the peasant castes in particular in colonial Andhra. The anti-caste movement paved the way for the rise of Dalit literature and cultural assertion. Although the ideological foundation of the Dalit movement is laid for social liberty, educational employment equality and provision for political participation, the ideological foundation itself is brought under critical scrutiny and it is subjected to a lot of criticism from multiple quarters in the wake of sub-caste protest movement within the Dalit community in Andhra Pradesh.

*Dalita Sahityam: Madiga Drukpatham* aptly captures community concerns and traces out the rich cultural heritage of the Madigas in carving a significant place in Telugu society. Dr. Darla VenkateswaraRao, one of the youngest poets, a dynamic scholar and rational literary critique, covered a wide range of issues and mapped out the contributions of literary personalities in developing Dalit literature and Dalit epistemology. Although the book provides the historical context of Dalit literary movements, the objective of the author is to contextualize the rise of Dandora movement and develop an alternative cultural perspective based on the social experiences of the marginalized groups such as Madigas. The author forcefully argues that the sense of deprivation in the state sponsored educational and employment institutions in addition to the political marginalization led to the formation of the Madiga Dandora movement whose primary demand is for sub-classification of reservation in proportion to caste population. It also demands adequate recognition to the Madiga culture and literature. The kind of perspective developed by Darla is thought provoking and his presentation of the Madiga perspective is democratic in spirit and secular in ideology.

I take this opportunity to congratulate ‘Darlanna’ for choosing a serious issue of contemporary relevance and delineating the ideological experiences as an insider. This work, I hope, would definitely enrich the treasury of academic knowledge and accomplishes the aspirations of subaltern epistemology in general and the aspirations of Madigas in particular.

- Nagaraju Gundimeda

Hyderabad,
25-12-2008.

# రాగవాసిష్ఠం-నాటక వైశిష్ట్యం

పురాణ ప్రసిద్ధమైన అరుంధతీ - వసిష్ఠుల ప్రణయగాథను ఆధారంగా చేసుకొని వచ్చిన నాటకమే *రాగవాసిష్ఠం* దీన్ని బోయి భీమన్న గారు 1959లో రాశారు. 12 రంగాలు గల ఈ నాటకం రావడం వెనుక కుల సమస్యను, దళితుల సంస్కృతీ పరమైన విషయాలను చర్చించాలనే లక్ష్యం కనిపిస్తుంది. భారతదేశంలో ఆర్య- ద్రావిడ జాతుల పుట్టుకకు సంబంధించిన చారిత్రక లోతులెన్నో ఈ నాటకంలో ఉన్నాయి. పౌరాణిక ఇతివృత్తాన్ని తీసుకొని సమాజాన్ని పట్టి పీడిస్తున్న కుల సమస్యను లోతుగా చర్చించి, "భారతీయులంతా ఒక్కటే" అనే జాతీయతా వాదాన్ని స్థాపించే నాటకంగా దీన్ని అభివర్ణించవచ్చు.

నెల్లూరులో 1957లో రాష్ట్ర హరిజన సేవా సంఘం మహా సభలు జరిగాయి. ఆ సంఘం ఆధ్వర్యంలోనే హరిజన కవులకు సన్మానాలు కూడా చేయాలనుకున్నారు. ఆ సన్మాన సభలో బోయి భీమన్న గారు పాల్గొన్నప్పుడు, ఆ సభలో అధ్యక్షుడు మాట్లాడిన మాటలకు సమాధానంగా ఈ నాటకం రూపొందిందని హైమావతి గారు పేర్కొన్నారు. (పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న, 1982: 324) అయితే, రచయిత జీవితం, సాహిత్య విషయాల గురించి కథనాత్మక శైలిలో సాగిన హైమావతి గారి రచన *పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న*లో ఈ నాటకానికి భీమన్నగారు రాసిన ముందుమాట గురించిన ప్రస్తావన గురించి కూడా కనిపిస్తుంది *"హరిజనులు ఆదిమ వాసులైనా, ఆర్యులు వారిని జయించిన తర్వాత బానిసలుగా మారారనీ, అలాగే చచ్చిన గొడ్లను తినడం వల్ల వెలికి గురికాబడ్డారనే"* ప్రచారం జరుగుతుండటాన్ని భీమన్నగారు అంగీకరించలేదు (పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న 1982: 327). దానికి తనదైన వాదాన్ని వినిపించాలనుకున్నారు. దాని కోసం వేదాలు, మనుస్మృతి, అమరకోశం, రామాయణ మహాభారతాలు, ప్రాచీన సాహిత్యం లోతుగా అధ్యయనం చేశానని కవి చెప్పుకున్నారు. డా//బి.ఆర్. అంబేద్కర్ రచనలను చదివారు. మంగిపూడి వేంకటశర్మగారు రాసిన *నిరుద్ధ భారతం* భీమన్న గారి "హరిజనులు ఆర్యులే"

అనే సిద్ధాంతానికి గొప్ప ప్రేరణనిచ్చిందని రచయితే చెప్పుకున్నారు. *నిరుద్ధ భారతం "భారత జాతి సమైక్యాన్ని నిజంగా కాంక్షించే ప్రతి వ్యక్తికీ పారాయణ గ్రంథం*గా కూడా భీమన్న గారు ఆ కావ్యాన్ని వ్యాఖ్యానించారు. ఆ కావ్యాన్ని భీమన్నగారు విద్యార్థి దశలోనే చదువుకున్నారు. ఆ కావ్యమే ఈ నాటకాన్ని రాయడానికి పురికొల్పిందని నాటక రచనా నేపథ్యాన్నిదాని ముందుమాటలో చెప్పుకున్నారు.

పై అంశాలను బట్టి ఈ నాటకం ఒక సామాజిక సమస్యకు పరిష్కారాన్ని లేదా ఒక సమన్వయాన్ని అందించే గురుతర బాధ్యతతో రాయబడిందని తెలుస్తుంది

అరుంధతీదేవి కథ పురాణ ప్రసిద్ధమైనదని ముందే చెప్పుకున్నాం. అయితే, పురాణాల్లో ముఖ్యంగా శ్రీదేవీ భాగవతం, శివపురాణం, భాగవతం, భారతం తదితర పురాణేతిహాసాల్లో వసిష్ఠుని గురించి చెప్పే కథా సందర్భంలో ఆమె ధర్మపత్నిగా అరుంధతీదేవి ప్రస్తావన వస్తుంది.

అరుంధతీదేవి గురించి ప్రచారంలో ఉన్న కథల్లో పాఠకులకు రకరకాల అనుమానాలు కూడా వ్యక్తమవుతుంటాయి. ఆ పద్ధతిలోనే అరుంధతీదేవికి సంబంధించిన కథలు పుస్తక రూపంలో కనిపిస్తున్నాయి. ఆమె పుట్టు పూర్వోత్తరాల గురించి స్పష్టంగా వివరించకపోయినా, ఆమె ఒక చండాల వంశానికి చెందిన స్త్రీగానూ, గొప్ప సత్యవంతురాలు, పతివ్రతా ధర్మం గల స్త్రీ అని ఎంతో మంది వర్ణించారు. *అరుంధతీదేవి చరిత్రము* పేరుతో నములకంటి జగన్నాథం గారు 1968లో ఒక పుస్తకాన్ని ప్రచురించారు. అలాగే 1992లో డా॥ బి.వి.ఎస్.మూర్తి *దళిత కథామంజరి* పేరుతో రాసిన అస్పృశ్య జాతుల్లో పురాణ పురుషుల కథల్లో 'అరుంధతీదేవి' కథ ఒకటి ఉంది. ఎండ్లూరి సుధాకర్ గారు *ఆరంజ్యోతి* పేరుతో ఒక కథ రాశారు. ఇంకా మరికొన్ని పుస్తకాల్లో ఆల్వాల్ మల్లేష్ రాసిన *అరుంధతీయ చరిత్రము* కూడా పేర్కొనదగినదే! అయితే, వీటన్నింటిలోనూ అరుంధతీదేవి - వసిష్ఠుల కథను పవిత్రంగా వర్ణించడమే తప్ప, ఆ కథను ఒక ప్రత్యేకమైన సైద్ధాంతిక భూమికతో రాసినట్లు కనబడదు.

బోయి భీమన్న గారు మాత్రం అరుంధతీదేవి కథను ఆర్య - అనార్య భేదాలను చర్చించి, శూద్రులు, చండాలురు, మాల, మాదిగల వంటి పేర్లతో పిలిచే వారంతా ఈ దేశ మూల వాసులే కాకుండా, అసలైన ఆర్య జాతీయులవుతారని వాదించే దిశగా ఈ నాటకాన్ని పౌరాణిక - సాంఘిక నాటకంగా తీర్చిదిద్దారు. ఆ విధంగా రచయిత నాటకేతివృత్తంలో వస్తు వైవిధ్యాన్ని సాధించారు.

ఈ రాగవాసిష్ఠం నాటకంలో మరో ప్రత్యేకత ఏమిటంటే పాత్రల పేర్లను కూడా ఎంతో ఔచిత్యంతో పెట్టారు. అరుంధతీదేవి - వసిష్ఠులు పౌరాణిక పాత్రలు. పరమ శివుడు దైవీయమైన పాత్ర. ఇక, ప్రాచీనుడు, కులగిరి, సంధ్య , శివోహం, కుంభోదరం, గోష్పాదం వంటి పాత్రలన్నీ ప్రతీకాత్మకాలు. అవి ప్రకృతికీ, మానవుని స్థితిగతులకూ, వర్ణాహంకారానికి ప్రతీకలుగా రచయిత అభివర్ణించారు. కనుక, పౌరాణిక - సాంఘిక ఇతివృత్తంతో నాటకాన్ని వల్ల వస్తు వైవిధ్యం దీనిలో స్పష్టంగా కనిపిస్తుంది.

అరుంధతీదేవి  ఒక అనార్య యువతి. వసిష్ఠుడు ఆర్య జాతీయుడు. వేదవనంలో తపస్సు చేసుకొంటున్న వసిష్ఠుడికి  ఒకనాడు మధురమైన గీతం వినిపిస్తుంది. ఆ గీతం అతని మనసుని ఆకర్షిస్తుంది.  పాడిందెవరని చుట్టూ పరికించి చూస్తాడు. సంధ్య అనే అమ్మాయి పాడిందా పాట. ఆమె అరుంధతీదేవికి సోదరి. ఆ పాట ద్వారా సంధ్యని, ఆమె ద్వారా అరుంధతీదేవినీ వసిష్ఠుడు కలుసుకొని, అప్రయత్నంగా సరస్సులో పడిపోయిన అరుంధతీదేవిని రక్షించడం ద్వారా అరుంధతీదేవి  నివాసం, ఉండే ఆశ్రమానికి చేరతాడు. ఇద్దరి  మనసులు ఏకమవుతాయి.

అరుంధతీదేవి - వసిష్ఠుల ప్రణయ విషయం వసిష్ఠుడిని చిన్ననాటి నుండీ పెంచి పోషించిన ప్రాచీనుడికి తెలుస్తుంది. మొదట ప్రాచీనుడు ఆ ఇద్దరినీ చూసి పార్వతీ పరమేశ్వరులేమో అని  భావిస్తాడు. తాము వసిష్ఠుడు - అరుంధతులమని వసిష్ఠుడు ప్రాచీనుడికి వివరిస్తాడు. అరుంధతీదేవి గురించి చెప్తాడు. ఆమె ఒక తాపస కన్య అనీ, ఈ పరిసర ఆశ్రమంలోనే ఉంటుందనీ  వసిష్ఠుడు చెప్తాడు. ఆమె పేరు "అరుంధతీదేవి" అని చెప్పగానే, ప్రాచీనుడు "హరి హరీ! అంటరాని, చూడరాని, చెప్పరాని చండాల కన్య!" అనుకొంటూ తిరిగి వెళ్ళిపోతాడు.

ఆమె చండాల కన్యా? అని వసిష్ఠుడు ఆశ్చర్యపోతాడు. ఆ మాట వినగానే సాలభంజికలా కదలకుండా అయిపోతుంది అరుంధతీదేవి.   అక్కా! అక్కా! అంటూ సంధ్య పరుగెట్టుకొంటూ వచ్చిఆ దృశ్యాన్ని చూసి  సజల నేత్రాలతో నిలబడి పోతుంది.

ఆమెను అలాగే వదిలేసి వసిష్ఠుడు తన ఆశ్రమానికి వెళ్ళిపోతాడు. తనలో తాను తర్కించుకుంటాడు. అరుంధతీదేవి చండాలకన్యేనా? ఎంతటి దివ్య సౌందర్యమది? ఆమె ఉన్న ప్రతిచోటూ ఎంత ఆనందదాయకంగా ఉంది! ఎంత పవిత్రంగా ఉంది? ఎంత ప్రశాతంగా ఉందో కదా... అనుకొంటూ మళ్ళీ అరుంధతీదేవి ఆశ్రమానికి వెళ్ళాలని బయలుదేరతాడు.

వసిష్ఠుడికి ఎదురుగా కులగిరి అడ్డు నిలబడతాడు. వసిష్ఠుడిని ఆశ్రమాన్నివిడిచి వెళ్ళనివ్వవద్దని ప్రాచీనుడు తనతో చెప్పాడని అంటాడు.    అంతలో ప్రాచీనుడువస్తాడు.

మాల మాదిగలను వారి జన్మను చులకనగా మాట్లాడతాడు ప్రాచీనుడు. నత్తితో మాట్లాడే కులగిరి "బ్రహ్మజ్ఞానం" గురించి మాట్లాడుతుంటాడు. నత్తి నత్తిగా ఉచ్చారణా దోషాలతో మాట్లాడుతుంటాడు. యజ్ఞోపవీత ధారణ చేసినంత మాత్రం చేత అందరూ బ్రాహ్మణులవ్వరనీ, నిజానికి అటువంటి వాళ్ళు బ్రహ్మజ్ఞానం అనే మాటను  ఉచ్చరించడానికే అర్హులు కారనీ వాదిస్తాడు వసిష్ఠుడు.

ఇరువురూ జాతి భేదాల గురించి వాదించుకుంటారు.ఆర్యజాతి సంరక్షులమైన మనం, సమష్టి క్షేమం కోసం వ్యక్తిగత ప్రయోజనాలను తృణప్రాయంగా త్యజించాలని, అందువల్ల నీచ జాతితో పవిత్రమైన ఆర్యజాతిని సంకరం చేసి సర్వ నాశనం చెయ్యవద్దని  ప్రాచీనుడు వసిష్ఠుడికి  బోధిస్తాడు.

దీనితో వసిష్ఠుడు సంఘర్షణకు లోనవుతాడు. ఈలోగా సంధ్య  వసిష్ఠుడిని వెతుక్కొంటూ కులగిరి దగ్గరకు వస్తుంది. వసిష్ఠుడు ఆ ప్రాంతాన్ని వదిలి వచ్చేసినప్పటి నుండీ

అరుంధతీదేవికి స్మృతి రాలేదని ఆమెను అతడొక్కడే రక్షించగలడని అనుకొంటుంది. వసిష్ఠుడు గురించి వివరాలు అడుగుతుంది. అప్పటికే ఆ ఆశ్రమం వదిలి అరుంధతీదేవి ఆశ్రమం వైపుకే వసిష్ఠుడు వెళ్ళిపోయాడని కులగిరి చెప్తాడు.

తనకు వర్ణభేదం లేదనీ తన హృదయపు తలపులు మూసుకోలేదనీ అరుంధతీదేవి తన హృదయంలో ఉండి సర్వత్రా ఆమె ప్రతిబింబమే కనిపిస్తుందని తనలో తాను సమాధానం చెప్పుకుంటాడు వసిష్ఠుడు. అంతలో వసిష్ఠుని దగ్గరకొచ్చిన సంధ్యతో తాను క్షణంలో వచ్చేస్తాననీ, ఆమెను అరుంధతీదేవి దగ్గరకు వెళ్ళమని చెప్తాడు. *"ఆర్య, అనార్య భేద భావాల్ని తునాతునకలు చేసి, ప్రాచీనుడి నోరు మూయించి, ఈ పారతంత్ర్య వాతావరణం నుంచి బైటికి దూకి వచ్చేస్తానని, తాను పొరపాటు చేసి, ఆమెను వదిలి వచ్చేశాననీ"* పశ్చాత్తాప పడుతుంటాడు.

అంతలో మళ్ళీ ప్రాచీనుడు వస్తాడు. అతడు వసిష్ఠుడిది స్త్రీ వాంఛ అని నిందిస్తాడు. తనది స్త్రీ వాంఛ కాదనీ, తన జీవితం ప్రేమ యజ్ఞంలో బలయిపోయిందంటాడు. ఇక, తపస్సు మానేసి గృహస్థాశ్రమానికి చేరమనీ, అప్పుడు గానీ, కామం చల్లారదంటాడు ప్రాచీనుడు.

తనది కామం కాదంటాడు వసిష్ఠుడు. తపస్సు మానవలసిన పనిలేదనీ అంటాడు. అయినా ఇప్పటికే మహా తపస్వివి. యౌవనస్థుడవు. కనుక ఇప్పటికైనా గృహస్థుడివి కమ్మంటాడు ప్రాచీనుడు. తగిన తేజోవతిని వివాహమాడి రాజయోగినిగా మారమని చెప్తాడు ప్రాచీనుడు. అరుంధతీదేవి కంటే ప్రపంచంలో తేజోవతి లేదంటాడు వసిష్ఠుడు. మసి బొగ్గుకి రత్నకాంతులు ఉంటాయా? అలాగే చండాల కన్యకు తేజస్సెక్కడదని, ఆమెను తారామాత్రంగా చేయగల ప్రచండ రవి తేజస్వినులెందరో ఉన్నారంటాడు. అలా అనేసి గుప్పిటతో కొంత ఇసుకను పైకి తీసి *"దీన్ని అన్నంగా వండి పెట్టగల కన్య నీకు అర్ధాంగి కాగలదు. ఇక నీవు స్వేచ్ఛగా పోవచ్చని"* వసిష్ఠుణ్ణి వదిలేసి ప్రాచీనుడు వెళ్ళిపోతాడు.

ప్రాచీన ధర్మం కంటే ఇసుకే కొంత మెత్తగా కనిపిస్తుందనుకొంటూ, ఇసుకను అరుంధతీదేవి వండక పోతే తాను మరో స్త్రీని పెండ్లాడడం జరుగుతుందా? అయినా ప్రేమకు పరీక్ష పెట్టడమేమిటని తనకి కావాలసింది అరుంధతీదేవి. అంతే తప్ప ఓ స్త్రీ మాత్రమే కాదనీ అనుకుంటాడు. ఇసుకను పారబోసేస్తాడు.

అక్కడ అరుంధతీదేవి తపస్సులో నిమగ్నమై పోతుంది. వసిష్ఠుడు అరుంధతీదేవినే తలచుకొంటూ, మానసిక సంఘర్షణకు గురవుతుంటాడు.

ఆనాటి నుండీ అరుంధతీదేవి ఉండే వేదవనంలోని ఆశ్రమం తప్ప, మిగిలిన ఆశ్రమాలన్నీ కరువు కాటకాల పాలవుతాయి. ప్రజలు ఆకలికి తట్టుకోలేక మునులు కుక్కలను కూడా వదలరు. వాటితోనే తమ ఆకలి తీర్చుకుంటుంటారు.

ఈ పరిస్థితిని గమనించిన ప్రాచీనుడు తన శిష్యుడు కులగిరిని పంపి త్రిమూర్తుల దగ్గరకెళ్ళి సమస్యకు పరిష్కారాన్ని కనుక్కోమంటాడు. బ్రహ్మ, విష్ణువు తమ చేతుల్లో లేదనీ పరమేశ్వరుడి దగ్గరకెళ్ళమంటారు. అప్పటికే ఈశ్వరుడు అరుంధతీదేవి ఆశ్రమానికి బయలుదేరతాడు. అరుంధతీదేవినే తలచుకుంటూ వసిష్ఠుడు తాను తప్పు చేశాననీ, ఇక

శాశ్వతంగా అరుంధతీదేవికి దూరమవ్వాలని అనుకుంటుంటాడు. తన తపస్సు వ్యర్థమనుకుంటాడు. అది ఇసుక తుఫానులో చేసిన తపస్సులాంటిదని అనుకుంటాడు. తనకి మరణమే శరణ్యమనుకుంటాడు. ఆ సమయంలోనే సాధారణ మానవుడిలాగే ఈశ్వరుడు అతడికి ప్రత్యక్షమవుతాడు. ఆ స్థితిలో వసిష్ఠుడు ఈశ్వరుడిని గుర్తించలేడు. తన ప్రేమ సఫలం కానందుకు మరణించాలనుకుంటున్న వసిష్ఠుడిని శివుడే పలకరిస్తాడు. చైతన్యంతో జీవించడంలోనే నిజమైన పురోగతి దాగి ఉందని ఎంత చెప్పినా వినిపించుకోకుండా వెళ్ళిపోవాలనుకున్న వసిష్ఠుణ్ణి తన చేతితో స్పర్శిస్తాడు శివుడు.

“ఆ స్పర్శతో అతడు నూతన చైతన్యం పొందుతాడు.” అయినా తన దారిని తనని పోనిమ్మంటాడు. అయితే అతనిదేదో భగ్న హృదయంలా ఉందనుకుంటాడు శివుడు. ఆ పూర్వాపరాలను అడగకుండానే, అతణ్ణి అంత కఠినంగా హింసించిన ఆ ప్రియురాలెవరని మాత్రం అడుగుతాడు. ఆమె మృదు స్వభావురాలేననీ, తానే కఠినాత్ముడిననీ వసిష్ఠుడు వివరిస్తాడు. తనది ఆర్య జాతి అనీ అనార్య జాతి కన్యను ప్రేమించాననీ చెప్తాడు వసిష్ఠుడు.

దానితో శివుడు అసలు భారతదేశంలో అలాంటి భేద భావమే లేదనీ ద్రావిడులు ఆర్యులు ఒకే జాతివారనీ స్పష్టం చేస్తాడు. భారతీయులదంతా దితి, అదితుల సంతానమే కదా అనీ చెప్తాడు. వెంటనే మళ్ళీ అది కూడా కేవలం *'పెరుగుదలలో పరిసరాల ప్రాబల్యం మినహాయిస్తే, మానవ జాతి అంతా ఒక్కటే కదా?'* అంటాడు.

దీనితో తన అజ్ఞానం క్షమార్హం కాదని తపిస్తుంటాడు వసిష్ఠుడు. పొరపాటు చెయ్యడం మానవ లక్షణమనీ దాన్ని సరిదిద్దుకోవడానికి పశ్చాత్తాపమే సరైన మార్గమని వివరిస్తాడు శివుడు. తన తప్పుని సరిదిద్దుకుంటానని వసిష్ఠుడు శివుడికి చెప్పి వెంటనే శివుణ్ణి వదిలేసి అరుంధతీదేవి దగ్గరకు వెళ్ళిపోతాడు. ధన్యుడవయ్యావంటూ శివుడు వసిష్ఠుణ్ణి దీవిస్తూ నిలబడతాడు. ఇంతలో సంధ్య శివుడు దగ్గరకొచ్చి లోకాలన్నీ తమరినే వెతుకుతున్నాయని అంటుంది. శివుడిని సంధ్య తన అక్క అరుంధతీదేవి తపస్సు చేసుకుంటున్న ఆశ్రమానికి తీసుకొని వెళుతుంది.

మార్గ మధ్యలో ప్రజలు, గోష్పాదం, కుంభోదరం, మునులు కనిపిస్తారు. తాము ఆకలితో అల్లాడుతున్నామనీ కరువుని తీర్చమనీ అంటారు. శివుడుతో వస్తున్న సంధ్యను వాళ్ళు మొదట పార్వతీదేవి అనుకుంటారు. తర్వాత కులగిరి గుర్తిస్తాడు. మాదిగ పిల్లను శివుడు ముట్టుకుంటున్నాడంటాడు. శివుడు మైల పడిపోతున్నాడని గోష్పాదం, కుంభోదరం అతని మాటకు జత కలుపుతారు. చావనైనా చస్తాంగానీ మైలపడిన చేత్తో తమకేమిచ్చినా తీసుకోమంటారు.మరొక వైపు ప్రజలు ఆకలీ... ఆకలీ అని అరుస్తుంటారు.

*'ప్రజలారా! మీరెంతకాలం కుల మత వర్గ విభేదాలతో అజ్ఞానులై ప్రవర్తిస్తారో అంతకాలం మీకీ అరిష్టాలు తప్పవు. ఇక ప్రస్తుతానికి మిమ్మల్ని ఈ విపత్తునుంచి రక్షించగలవారు ఒక్క పతివ్రతలు మాత్రమే. మీరు పోయి పతివ్రతలను ఆశ్రయించండి. మీకింత భిక్ష పెట్టగలర'*ని అంటాడు శివుడు.

అక్కడే దూరంగా ఉన్న ప్రాచీనుడు వర్ణాధిక్యతతో ఈశ్వరుడిని కూడా గుర్తించలేని స్థితిలో ఉంటాడు. *"మాదిగ పిల్ల తపస్సు చేయడం! ఉత్పాతాలు సంభవించడం! ఎంత విపరీతంగా వుంది. ఇక ఆర్య జాతి అడుక్కు తిన్నట్టే!"* అనుకుంటుంటాడు.

కొంచెం దూరం వెళ్ళిన తరువాత సంధ్యా పరమశివులను చూస్తాడు. కానీ వాళ్ళిద్దరినీ అరుంధతీదేవి వసిష్ఠులనుకుంటాడు. తన మాట వినకుండా వశిష్ఠుడు మాదిగ పిల్లనే చేరాడనుకుంటాడు. అందువల్లనే ధర్మ గ్లాని ఏర్పడిందనుకుంటాడు. ఈ ఘోరకలిని చూడలేననుకుని ముఖం తిప్పకుంటాడు. ఈ స్థితిలో వస్తున్న పరమశివుడే ప్రాచీనుడికి అభివాదం చేస్తాడు. ప్రాచీనుడు పరీక్షగా చూసి తమర్ని గుర్తుపట్టలేదంటాడు. తనని పరిచయం చేసుకుంటాడు. ప్రాచీనుడు అప్పడు పరమ శివుడుకి నమస్కరించి ఆ పక్కనున్న సంధ్యను పార్వతీదేవేనా అని అడుగుతాడు. తాను పార్వతీదేవిని కాదనీ, అరుంధతీదేవి తన అక్క అనీ శివుడు తనకు తాత అవుతాడని సంధ్య ప్రాచీనుడికి వివరిస్తుంది.

ఆ సంభాషణకీ, సంబంధానికీ ఆశ్చర్యపోయి వాటి పూర్వాపరాలను అడుగుతాడు ప్రాచీనుడు. తమది ఆద్యార్య సంబంధమనీ, అరుంధతీదేవి మాతంగ కన్య అయినట్లే, కాటికాపరి అయిన పరమేశ్వరుడు కూడ మాతంగుడేననీ చెబుతుంది.

తమతో వేళాకోళమాడుతున్నారేమోననే సందేహాన్ని వ్యక్తం చేస్తాడు ప్రాచీనుడు.ఇది వేళాకోళం కాదనీ సత్యమేననీ చెప్తాడు శివుడు. *"అధికారం కోసం ఆర్య ద్రావిడుల మధ్య జరిగిన అనేక యుద్ధాల పర్యవసానంగా సమాజంలో హెచ్చుతగ్గులేర్పడ్డాయి. గుణాలను అనుసరించి వృత్తులు పుట్టాయి. వృత్తులను అనుసరించి వర్ణాలేర్పడ్డాయి. అవే కులాలైనాయి. మతంగ మహర్షి సంతానం మాల మాదిగలు. మతంగుడు ఆర్య ద్రావిడ సమైక్యతా మూర్తి. ఆర్య ద్రావిడులు మూలార్య జాతి శాఖలు. అన్నదమ్ములు. ఈ భేదాలు తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం సంఘ సముద్రంలో పుడుతూ పోతూ వుండే అలల వంటివని తెలిసికూడా, మీ వంటి పెద్దలు వీటిని పాటించబూనడం కడుం గడు శోచనీయం"* అని స్పష్టంగా వివరిస్తాడు.

ఈ భేద భావాలు స్వార్థం కోసం మానవులు సృష్టించుకున్నవనే కనీస జ్ఞానం తనకు కలగనందుకు సిగ్గుపడుతూ మౌనంగా ఉండిపోతాడు ప్రాచీనుడు.ఆకాశం తెల్లని మేఘాలతో పొగలు వ్యాపించి ఉంటుంది. అదంతా అరుంధతీదేవి తపస్సు వల్ల కలిగిన పొగలుగానే ప్రజలు భావిస్తుంటారు.

అరుంధతీదేవి తపస్సు తీవ్రమై, ఆ తపోవహ్నిలో భగ్నమవుతుందేమోనని, ఆమె తమ్ముడు శివోహం ఒక పాత్రతో నీళ్ళు పట్టుకొని ఆమె చుట్టూ తిరుగుతుంటాడు.వసిష్ఠుడు ఆకాశంలో కనిపిస్తున్న దివ్యజ్యోతిని చూసి ఆశ్చర్యపోతూ ఆందోళన పడుతుంటాడు. "*తపోవహ్నిలో భస్మమైపోతున్నావా అరుంధతీదేవీ*" అంటూ విలపిస్తూ తానూ యోగవహ్నిలో చితాభస్మమైపోతానని అతడు యోగ ముద్ర ధరిస్తాడు. శరీరంలో నుండి మంటలు బయలుదేరతాయి. భస్మమ్ వాసన గుప్పుమంటుంది.

పరమశివుడు ప్రవేశించి ఈ మహా చరిత్ర విషాదాంతం కారాదని, తన దగ్గరున్న కమండలంలోని తీర్ధం తీసి ఇద్దరి మీదా చల్లుతాడు.తపోవహ్ని చల్లారిపోతుంది. కన్నులు తెరచిన అరుంధతీదేవి, పక్కనే ఉన్న వసిష్ఠుణ్ణి చూసి పాదాభివందనం చేస్తుంది. ఆ తరువాత పరమశివుణ్ణి చూసి భక్తి భావంతో నమస్కరిస్తుంది. తానెంత అదృష్టవంతుణ్ణో కదా అని వసిష్ఠుడు మురిసిపోతాడు.

*"కల్యాణ మస్తు"* అని ఇరువురినీ పరమశివుడు దీవిస్తాడు. అరుంధతీదేవి తన పక్కనే ఉన్న ప్రాచీనుడికి నమస్కరించి, ఆశీర్వాదాలు కోరుతుంది. అతడూ ఆమెను దీవిస్తాడు. నమస్కరించిన వసిష్ఠుడినీ ప్రాచీనుడు దీవిస్తాడు. పరమశివుని అనుగ్రహంతో జ్ఞానినైయ్యానని చెప్పి వెళ్ళిపోతాడు. అప్పుడు వసిష్ఠుడు పరమశివుని పాదాలపై పడతాడు. ఏదైనా వరం కోరుకోమన్న శివుడితో తనకు అరుంధతీదేవిని అగ్ని సాక్షిగా వివాహం చేయమంటాడు వసిష్ఠుడు. ఇద్దరినీ దగ్గరకు చేరదీసి ఒకటి చేస్తాడు శివుడు.

ఇంతలో ప్రజలు, మునులు, ముని శిష్యులు కొన ఊపిరితో వస్తారు. *"ఆకలి తీర్చే వాళ్ళే దొరకలేదా"* అని పరమశివుడు అడుగుతాడు. దానితో వాళ్ళు ఆకలి తీర్చేవాళ్ళే దొరకలేదని, ఈ పాపాత్ములకు అన్నపూర్ణ ఎక్కడ కనపడుతుందని పశ్చాత్తాప్పడతారు. అరుంధతీదేవి *'ఈ ప్రజలింత దీనావస్థలో ఉండటానికి కారణం ఏమిట*ని పరమశివుణ్ణి అడుగుతుంది.

అదంతా అరుంధతీదేవికి జరిగిన పరాభవ ఫలితమేననీ, ప్రజల్ని రక్షించమని పరమశివుడు అరుంధతీదేవికి చెప్తాడు. “ప్రజలంతా మాదిగల అన్నం తింటారా?” అని సంధ్య అడిగితే, "తింటాం తింటాం" అంటారు.

*"దేవీ! నీవే ఈ ప్రజల్ని రక్షించగలవ"*ని వసిష్ఠుడు కూడా చెప్తాడు. అప్పుడు వసిష్ఠుడి పాదధూళిని తీసుకొని తాను పతిభక్తి గలదాన్నయితే, అన్నపూర్ణమ్మకు నా పట్ల దయ ఉంటే కొండ రాళ్ళన్నీ పిండి వంటలుగా మారాలనీ, చెట్లన్నీ ఫలించాలనీ, చెరువులన్నీ మంచినీళ్ళతో నిండాలని కోరుకుంటుంది.

అలాగే జరుగుతుంది. ప్రజలంతా ఆనందిస్తారు. *"ఇంత గొప్ప మహాత్కార్యాన్ని సాధించినందుకుగానూ ద్యోమ మండలంలో నీ నాథుని దగ్గరే ఒక శాశ్వత స్థానం లభించేటట్లు వరం ప్రసాదిస్తున్నాను లోకంలోని ప్రతి నూతన దంపతులు ముందుగా నీకే నమస్కరించి, నీ ఆశీస్సులు పొందుతారు, వైదిక భారతీయులకూ, భారత వంశానికీ మాతవు కాగలవనీ"* అరుంధతీదేవిని దీవిస్తాడు శివుడు.

ఆ విధంగా నాటకం సుఖాంతమవుతుంది. ప్రజలందరికీ శ్రేయస్సుని కలిగించి సుఖాంతమూ అవుతుంది. భగవంతుడే ప్రత్యక్షమైనా, భర్తనే ముందుగా పూజించడం, తర్వాత భగవంతుణ్ణి, ఆ తర్వాత పెద్దల్ని గౌరవించడంలో అరుంధతీదేవి సనాతన సంప్రదాయాన్ని చక్కగా పాటించినట్లు రచయిత వర్ణించారు.

నాటకంలో నాందీ, ప్రస్తావనల కంటే, 12 రంగాలుగా విభజించి, మొదటి రంగంలోనే జరగబోయే కథను చక్కగా సూచించగలిగారు. నాటక ప్రదర్శనలో పంచ సంధులను ఉపయోగించుకున్నారు.

'మేలుకో మేలుకో' పాటతో వసిష్ఠుడు తపస్సు నుండి మేల్కొనడం, మూఢత్వాన్ని వదిలి జ్ఞానం వైపు పయనించడం జరిగింది. సంధ్య ద్వారా పరిచయమై, అరుంధతీదేవిని చేరి, జలగండం నుండి రక్షించినట్లు మొదటి రంగాన్ని బట్టి తెలుస్తుంది. జలగండాలేమైనా సంభవించినప్పుడు వాటి నుండి రక్షించుకోవడానికి యోగ ముద్రను దాల్చవచ్చనీ అలా అరుంధతీదేవి చేసిందన్నట్లు రంగాన్ని వర్ణించారు.

తరువాత కథలో కూడా ఇదే రకంగా జరుగుతుంది.. వసిష్ఠుడిని ప్రేమించడం.. ఆ విషయం ప్రాచీనుడికి తెలియడం... ఆమె చండాల కన్య అని వసిష్ఠుడికి, ప్రాచీనుడికీ తెలిసినా, ఆమెకు ఆ విషయం తెలియకుండానే సాలభంజికగా మారిపోవడం, మళ్ళీ సమస్య పరిష్కరింపబడిన తర్వాత ఆమె యోగ ముద్రను దాల్చడం, దాన్ని వీడటం వంటివన్నీ ఒక దాని తర్వాత మరొకటి జరిగిపోతాయి.

ఇది గొప్ప సంవిధానం. గొప్ప నాటక శిల్పం. నాందీ, ప్రస్తావనలు లేకుండానే పంచ సంధులు, కార్యావస్థలతో కథా కథనాన్ని ముందుకి నడిపించడంలో ఉన్న శిల్ప ప్రత్యేకత. ఈ పరిశోధన పత్రంలో శిల్పానుశీలన కంటే విషయానుశీలనకే ప్రాధాన్యతనిస్తున్నాను.

ప్రతి రంగంలోనూ సందర్భానుగుణంగా చక్కని భావాలతో గేయాలు, పద్యాలు వర్ణించారు. ఆ గేయాలు, పద్యాలు గొప్ప భావుకతతో పాటు, చైతన్యవంతమైన సందేశాలతో కూడి ఉన్నాయి. వీటన్నింటితో దీన్ని దృశ్య నాటకంగా ప్రదర్శిస్తే ఆధునిక సినిమాకి ఏ మాత్రమూ తీసిపోనట్లే ఉంది. సినిమా స్క్రిప్టులో ఉండే ఎన్నో రకాల పద్ధతులు దీనిలోనూ ఉన్నాయి.

ఈ నాటకంలో అరుంధతీదేవి, వసిష్ఠుడు, ప్రాచీనుడు, సంధ్య పాత్రలు ప్రధానమైనవి. వసిష్ఠుడు - ప్రాచీనుడు సంఘర్షణాత్మక పాత్రలు. సంప్రదాయాన్ని చెక్కు చెదరనీయకుండా కాపాడేందుకు ప్రాచీన ధర్మాలన్నింటినీ పాటించమని వాదించేవాడు ప్రాచీనుడు. స్నేహం, పరస్పర అవగాహన, మానవీయతా గుణాలే ప్రధానమని నమ్మి, వాటి ముందు జాతి భేదాలు నిలబడవని వాదించే స్వభావం వసిష్ఠుడిది. అర్ష సంప్రదాయానికీ, మార్పుని కోరుకొనే అభ్యుదయ వర్గానికీ మధ్య పాత్రోచితంగా గొప్ప సంఘర్షణ జరిగేటట్లు ఈ పాత్రలను తీర్చిదిద్దారు రచయిత.

కులగిరి ప్రాచీనుడి శిష్యుడు. సదాచారాన్నే నమ్ముకునేవాడు. నత్తి నత్తిగా మాట్లాడుతూ, వచ్చీ రాని శ్లోకాలతో పురాణేతిహాసాలను ప్రామాణిక వాక్యాలుగా చెప్తుంటాడు. అయినా, సందర్భాన్ని బట్టి గురువు దగ్గర కూడా అబద్ధమాడడానికి వెనుకాడడు. మాదిగ లేదా కింది వర్ణాల వారిని వ్యతిరేకిస్తూనే, అందగత్తె అయితే, ఆమె మాదిగమ్మాయి అయినా, ఆమె వల్ల ఆనందం కలుగుతుందంటే దాన్ని పొందడానికి వెనుకాడని వాడు. అగ్రవర్ణమని చెప్పుకుంటూనే, కింది వర్ణాలనబడేవారిని అవసరానికి అనుగుణంగా ఎలా వాడుకుంటూ ఉంటారో కులగిరి పాత్ర ద్వారా రచయిత సూచించే ప్రయత్నం చేశారు.

సంధ్య పాత్ర ప్రకృతి చైతన్యానికి ప్రతీకాత్మకంగా ఎన్నుకున్నారు రచయిత. అలాగే కుంభోదరం, గోష్పాధం పాత్రలు కూడా సనాతన సంప్రదాయంలో కొనసాగే అవకాశవాద పెద్ద

మనుషులకు ప్రతీకగానే తీర్చిదిద్దారు. అరుంధతీదేవి పాత్ర ఒక స్వచ్ఛమైన ప్రేమ మూర్తిగా, ఆదర్శనారిగా, వర్ణభేదాలేమీ తెలియని నిష్కల్మషమూర్తిగా, అందరి సుఖసంతోషాలను కాంక్షించే వరప్రదాయినిగా ఈ పాత్రను గొప్ప ఔచిత్యంతో తీర్చిదిద్దారు.

నిష్కల్మషమైన జీవనానికి మానవుల మధ్య వర్ణ భేదాలు అవసరం లేదు. అవన్నీ కొంతమంది స్వార్థంకోసం, తమ ఆధిక్యం కోసం సృష్టించుకొన్నవి, వాటిని ఎంత త్వరగా విస్మరించి నిర్మూలించగలిగితే, అంత త్వరగా భారతీయత సమైక్యంగా బలపడుతుందనేది ఈ నాటకం ఇచ్చే సందేశం.

నాటకంలో వసిష్ఠుడు, ప్రాచీనుడు, శివుడు పాత్రలగతంగా పలికించిన సంభాషణల్లో ఆర్య - అనార్య భేదాలు భారతదేశంలో నెలకొన్నాయనీ, అవి మానవ జీవనాన్ని హెచ్చు తగ్గుల సమాజంగా విభజించి, మానసిక, భౌతిక సంఘర్షణలకు కారణమవుతున్నాయనీ, వాటిలోని అంతరార్థాన్ని తెలుసుకోవాలని చెప్పించగలిగారు. పరమశివుడు పాత్ర ద్వారా మానవులంతా ఒకే జాతి వారనీ, స్థల, కుల భేదాలను బట్టి, తాత్కాలిక అవసరాలను బట్టి అలా రూపొందించుకున్నారు తప్ప, భేదాలేమీ లేవని చెప్పడం ద్వారా ఈ నాటకం ద్వారా రచయిత విశ్వజనీన మానవుడి లక్షణాలను ప్రతిపాదించినట్లయ్యింది. దీనికి డా//బి.ఆర్.అంబేద్కర్ చెప్పిన 'ఆర్య జాతి సిద్ధాంతాన్ని' చాలా వరకూ ఈ నాటకంలో అనువర్తించిన విధానం ప్రశంసనీయం. సిద్ధాంతం కోసం నాటకం రాసినట్లుగా కాకుండా, నాటకంలోనే అప్రయత్నంగా ఆ సిద్ధాంతం వచ్చి చేరినట్లుగా రచన కొనసాగింది. అయితే ఈ సిద్ధాంతం పట్ల ఇప్పటికీ వాదవివాదాలు జరుగుతునే ఉన్నాయి. చరిత్రకారుల్లోఈ సిద్ధాంతం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతునే ఉన్నాయి. అయినప్పటికీ ఒక నాటకంలో ఏదైనా ఒక సిద్ధాంతం ఎలా సమన్వయించే ప్రయత్నం జరుగుతుందో విశ్లేషిస్తూ, ఆ నాటకాన్ని పరిచయం చేయాలనే లక్ష్యమే ఈ వ్యాసాన్ని రాయించింది.

శూద్రులు, ఆ తర్వాత 'పంచములు' పుట్టుక గురించి రకరకాలుగా ప్రచారాలు జరుగుతున్నాయి. ఆర్యులు ఇతర దేశాల నుండి వచ్చి, ఈ దేశవాసులైన వారిని జయించి, వీరిని దాసులుగా చేసుకొని, దస్యులు, బానిసలుగా పిలిచారని చరిత్రకారులు చెప్తున్నారు. దీన్ని *డా//బి.ఆర్.అంబేద్కర్ రచనలు - ప్రసంగాలు 7వ సంపుటిలో* సోదాహరణంగా విశ్లేషించారు. డా//బి.ఆర్. అంబేద్కర్ ప్రతిపాదించిన సిద్ధాంతం ప్రకారం

1.శూద్రులు సూర్యవంశానికి చెందిన ఆర్య కులాల్లో ఒకరు.

2. ఆర్యుల సమాజం మూడే వర్ణాలను అనగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యుల్ని మాత్రమే గుర్తించిన కాలం ఒకటే ఉంది.

3. శూద్రులు ఒక ప్రత్యేక వర్ణంగా ఏర్పడలేదు. ఇండో ఆర్యన్ సమాజంలో శూద్రులు క్షత్రియ వర్ణంలో ఒక భాగం.

4. శూద్ర రాజులకు బ్రాహ్మణులకు మధ్య ఎడతెగకుండా సాగుతూ వచ్చిన పోరాటంలో బ్రాహ్మణులు అనేక అవమానాలకు హింసలకు గురయ్యారు.

5. ఆ హింసా ఫలితంగా బ్రాహ్మణులకు శూద్రులంటే ఏర్పడిన ద్వేషం కారణంగా బ్రాహ్మణులు శూద్రులకు ఉపనయనం చేయడానికి నిరాకరించారు.

6. ఉపనయన కర్మకు తిరస్కృతులైన కారణంగా ఆత్మీయులైన శూద్రులు సాంఘికంగా అధఃపతనమై వైశ్యులకన్నా తక్కువ స్థాయికి దిగజారి నాలుగో వర్ణం అయ్యారు.

అరుంధతీదేవిని 'ఆరంజ్యోతి' అని కూడా వ్యవహరిస్తుంటారు. మహా పతివ్రత. కర్దమ ప్రజాపతి కుమార్తె. వసిష్ఠుని భార్య. కర్దముడు బ్రహ్మచ్ఛాయలో పుట్టినవాడు. అతని భార్య దేవహూతి. కపిలుడు కూడా కర్దముని కుమారుడే మన పురాణాలు తెలుపుతున్నాయి.

*బ్రహ్మ పుత్రిక అయిన సంధ్యా దేవి మేధాతిథి యజ్ఞంలో ప్రాతస్సంధ్య, అరుంధతీదేవి, సాయం సంధ్య అనే ముగ్గురు మూర్తులుగా పుట్టినట్లు ఒక కథ ఉంది. కర్దమ ప్రజాపతి తొమ్మండుగురు కుమార్తెలు. అందులో అరుంధతీదేవి ఒకటి. అనీ ఒక కథ ఉంది.*

*కర్దముడు ప్రజాపతి అయితే, సృష్టికి కారకులైన ఆది పురుషులలో అతడొకడవుతాడు. ప్రజాప్రతుల కాలంలో వర్ణభేదమే లేదు. అలా కాకుండా కర్దముడు ఆ తరువాత వాడైతే అతడు మతంగుడే కావచ్చు. అప్పుడు అరుంధతీదేవి అక్క చెల్లెండ్రు అనసూయ మొదలైన వాళ్ళంతా మతంగ వంశీయులే కావచ్చు. అరుంధతీదేవి తమ్ముడు కపిలమహర్షి కూడా మతంగుడే అవుతాడు కదా!* (*రాగవాసిష్ఠం* ముందుమాట 10-11) అనేది రచయిత వాదన.

పురాణాల్లో కూడా అరుంధతీదేవి పుట్టుక గురించి స్పష్టమైన వివరణలు కనిపించడం లేదు. అయినా, *పురాణనామ చంద్రిక* వంటి ఆధారాలను అనుసరించి దొరికినంత వరకు ఇలా వివరించుకొనే వీలుంది.

అరుంధతీదేవి, వసిష్ఠుడులకు పుట్టినవాడు శక్తిమహర్షి. శక్తిమహర్షికీ మాతంగ కన్యకు పుట్టినవాడు పరాశరుడు. పరాశరుడికీ, సత్యవతికి పుట్టినవాడు వ్యాసుడు. ఇలా ఈ పుట్టుక పరిణామాన్ని పరిశీలిస్తే వ్యాసుడు ఆర్యుడా? అనార్యుడా? ఆయన రాసిన *మహాభారతం* ఏమి తెలుపుతుందో తెలుసుకోవాలనే ఆసక్తి కలుగుతుంటుంది. మహాభారతంలో అంతర్గతమైన భగవద్గీతలో ఇలాంటి భావాలు కొన్ని కనిపిస్తున్నాయి. 'భగవద్గీత' నాల్గవ అధ్యాయం 13వ శ్లోకంలో చాతుర్వర్ణాలను గుణ కర్మలను బట్టి సృష్టించినట్లు ఒక శ్లోకం కనిపిస్తుంది.

*"చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః*
*తస్య కర్తారమపి మాం విద్ధ్యకర్తారమవ్యయమం."* (భగవద్గీత,4-13)

ఆర్యోక్తిగా ప్రచారంలో ఉన్న ఒక శ్లోకాన్ని నాటకం ముందుమాటలో బోయిభీమన్న గారు ఉదహరించారు.

*"జన్మనా జాయతే శూద్రః*
*కర్మణా జాయతే ద్విజః*
*వేద పాఠంతు విప్రాణాం*
*బ్రహ్మజ్ఞానే బ్రాహ్మణః"* దీని భావజాలమే సమాజంలో స్థిరపడిందనేది రచయిత బోయిభీమన్న గారి అభిప్రాయం. ఒకే వ్యక్తి జన్మతో శూద్రుడైతే, కర్మతో ద్విజుడుగా మారితే, ద్విజులంతా ఆర్యులైతే, శూద్రుడు అనార్యుడెలా అవుతాడు? అంతా ఆర్యులే కదా! ఆ విధంగా

"అరుంధతీదేవి" కూడా ఆర్యురాలే అవుతుందనేది బోయి భీమన్న గారి అభిప్రాయం.

డా//సర్వేపల్లి రాధాకృష్ణన్ ఒక గ్రంథంలో కులం-అస్పృశ్యత గురించి చర్చిస్తూ ఒక వ్యాసంలో ఈ శ్లోకాన్ని పాదసూచికలో కొంత భాగాన్ని ఇచ్చారు. అయినా వర్ణ వ్యవస్థ భారతదేశంలో ఉందనీ, అది గుణ కర్మలను అనుసరించి ఏర్పడిందని చెప్పేవాదనలు ప్రసిద్ధమే.

చాతుర్వర్ణాలు గుణ, కర్మలను బట్టి ఏర్పడ్డాయనేది భగవద్గీత, మనుస్మృతులు మాత్రం చాటి చెప్తున్నాయి. మనుస్మృతి ద్వాదశ అధ్యాయంలో చాతుర్వర్ణాల వారు ఆచరించవలసిన ధర్మాలను ఇలా వివరించడం కనిపిస్తుంది.

" చాతుర్వర్ణ్యస్య కృత్స్నో Z యముక్తో ధర్మస్త్వయానఘ,
కర్మణాం ఫలనిర్వృత్తిం శంస నస్తత్త్వత: పరామ్
స తాను వాచ ధర్మాత్మా మహర్షీన్మానవోభృగు:
అస్య సర్వస్య శృణుత కర్మ యోగస్య నిర్ణయమ్ " (మనుస్మృతి, *12*-1,2)

(మహానుభావా! మాకింత వరకు బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులనుష్ఠించాల్సిన ధర్మాలన్నీ చెప్పినారు. ఇక ఇప్పుడు ఈ జన్మలో చేసిన కర్మలకు తరువాతి జన్మలలో కలుగు ఫలం ఏవిధంగా ఉంటుందో దానినంతా వివరించండి అని మహర్షులు భృగుమహర్షిని అడిగినారు. అప్పడా మహర్షులతో మనుపుత్రుడైన భృగుమహర్షి సమస్త కర్మల యొక్క ఫలితాన్ని ఇట్లు చెప్పసాగెను.)

"శుభాశుభఫలం కర్మ మనోవాగ్దేహ సంభవమ్,
కర్మజా గతయో నృణాముత్తమాధమ మధ్యమా:
"తస్యేహ త్రివిధస్యాపి త్ర్యధిష్ఠానస్య దేహిన:,
దశ లక్షణ యుక్తస్య మనో విద్యాత్ప్రవర్తకమ్." (మనుస్మృతి, *12*-*3*,4)

(మనస్సు, వాక్కు, దేహం ఇవి చేసే కర్మ శుభాశుభ ఫలములను కలిగిస్తున్నది. ఈ కర్మవల్లనే జీవులకు ఉత్తమ, మధ్యమ అధమగతులేర్పడుతున్నాయి. ఈ విధంగా జీవికి మనోవక్కాయములచే ఉత్తమాది త్రివిధగతులేర్పడుతున్నా.దశవిధ లక్షణాలుగల కర్మకు కారణమని చెప్పాల్సి ఉంది.) అని మనుస్మృతి కర్మలను అనుసరించి జన్మ ఏర్పడుతుందనే వివరణను ఇస్తుంది. (చూడు: మనుస్మృతి, తెలుగు తాత్పర్య సహితం, డా// యన్. యల్. నరసింహాచార్య 2000: 334)

బ్రాహ్మణ స్త్రీకి - శూద్ర పురుషునికి పుట్టినవాడు 'చండాలుడు' అని మనుస్మృతి చెప్తుంది. శూద్రుని వలన వైశ్య స్త్రీకి పుట్టిన వాడు అయోగుడు. క్షత్రియ స్త్రీకి పుట్టిన వాడు క్షత, బ్రాహ్మణ స్త్రీకి పుట్టినవాడు చండాలుడు. వీరంతా వర్ణ సంకరులు. వీరే అవర్ణులు. అంటే, ఏ వర్ణానికీ చెందనివారు. వారే 'పంచమ వర్ణం' వాళ్ళు! వర్ణానికీ, జాతికీ కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి. "జాతి అంటే కొన్ని ఆనువంశిక ప్రత్యేక లక్షణాలు కలిగిన ఒక జన సమూహం అని నిర్వచించవచ్చు."(శూద్రులెవరు? అంబేద్కర్ రచనలు ప్రసంగాలు 7 వ సంపుటి,*1992* : 59.) అని డా//బి.ఆర్.అంబేద్కర్ నిర్వచించారు.

జాతిని రూపొందించేటప్పుడు చూడవలసి ఉంటుందని కొన్నిలక్షణాలను పేర్కొన్నారు. అవి: 1.శిరస్సు ఆకృతి, 2. జుట్టు, 3. శరీరచ్ఛాయ, 4. మనుషుల పొడవు.

దీనిలో రంగు, పొడవు అనేవి శీతోష్ణ స్థితిని బట్టి ఆవాసాన్ని బట్టి మారుతూ ఉండే లక్షణాలు. కనుక, వాటిని జాతి నిర్ణయ లక్షణాలుగా పేర్కొనవలసిన అవసరం లేదనే అభిప్రాయం నేడు ప్రబలి ఉంది." (శూద్రులెవరు? అంబేద్కర్ రచనలు ప్రసంగాలు 7వ సంపుటి, *1992* : 59.) అని డా//బి.ఆర్. అంబేద్కర్ వివరించారు.

కేవలం శరీర వర్ణమే ప్రధానమైతే యూరోపియన్ జాతులలో అన్ని వర్ణాల వారూ ఉన్నారని, అయినా వారి మధ్య వర్ణ భేదాలు లేవని డా//బి.ఆర్. అంబేద్కర్ విశ్లేషించారు.

"ఆర్యజాతి వారు, అనార్య జాతులైన దాసులను, దస్యులను యుద్ధంలో జయించారని చెప్పే సిద్ధాంతానికి తావు లేదని ఋగ్వేదంలోని అనేక ఋక్కుల్లో పేర్కొన్న "ఆర్య" శబ్దాన్ని ఆధారం చేసుకొని డా//బి.ఆర్. అంబేద్కర్ సోదాహరణంగా నిరూపించారు.

'ఆర్యులు భారతదేశంపై దాడి చేసి జయించారనేది అభూత కల్పన." అని డా//బి.ఆర్. అంబేద్కర్ వాదన (శూద్రులెవరు? అంబేద్కర్ రచనలు ప్రసంగాలు 7 వ సంపుటి,*1992* : 73) అంతేకాదు 'దాసులు, దస్యులు భారత దేశానికి చెందిన ఆదిమ తెగల వారు అనడం ఖచ్చితంగా తప్పు" (శూద్రులెవరు? అంబేద్కర్ రచనలు ప్రసంగాలు 7 వ సంపుటి,*1992* : 73) అని కూడా డా//బి.ఆర్. అంబేద్కర్ ఆర్యజాతి సిద్ధాంతాన్ని పూర్వ పక్షం చేసే ప్రయత్నం చేశారు.

ఈ పై సిద్ధాంతాన్ని ఆధారంగా చేసుకొనే 'రాగవాసిష్ఠం' నాటక రచయిత బోయి భీమన్న గారు భారతీయులందరూ ఆర్యులే అనే సిద్ధాంతాన్ని ఈ నాటకంలో అన్వయించే ప్రయత్నం చేశారు.

పైగా ఈ నాటకం గురించి హైమవతి గారు భీమన్న గారి ఆత్మకథలో రాస్తూ "ఆర్యులు ద్రావిడులు ఒకే జాతికి చెందిన వారు, రక్త సంబంధీకులు 'అనే సిద్ధాంతం కూడా నార్ల వారికి నచ్చలేదా కాలంలో రాగవాసిష్ఠం నాటకం ఈ సిద్ధాంతం మీద వ్రాయబడి నట్టిదే" (పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న, 1982 : 277) అని మరింతగా స్పష్టం చేయడాన్ని గమనించవలసి ఉంది.

ఈ నాటకం గురించే వ్యాఖ్యానిస్తూ హైమవతి గారు " నిండాచాదస్తం గల సనాతన పండితులు సైతం కాదనలేని సిద్ధాంతాలు భీమన్నవి"(పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న, 1982 : 634) అన్నారు.

ఏది ఏమైనా డా//బి.ఆర్. అంబేద్కర్ భావజాలం బోయి భీమన్న గారిలో స్పష్టంగా కనిపిస్తుందని చెప్పడానికి ఈ నాటకం గొప్ప ఉదాహరణగా చెప్పవచ్చు.

అంతేకాకుండా ఆర్య, అనార్య భేద భావాలు స్థల కాలాలను అనుసరించి ఏర్పడినవని చెప్పడం ద్వారా కూడా ఒక విశ్వజనీనమైన మానవుణ్ణి రచయిత ఈ నాటకంలో ప్రతిష్టించే ప్రయత్నం చేసినట్లు చెప్పే వీలుంది.

ఈ నాటకానికి రచయిత రాగవాసిష్ఠం అని పేరు పెట్టారు. దీన్ని హైమవతి గారు పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్నలో రాగవాశిష్టం అనే చాలా సార్లు రాశారు. ఈ వ్యాసంలో మాత్రం నాటకం ముఖ చిత్రంపై ఉన్న రాగవాసిష్ఠం అనే ప్రయోగించడానికి ప్రయత్నించాను. యోగవాశిష్ఠం, జ్ఞానవాసిష్ఠం ఉన్నట్లే ఈ పవిత్ర కల్యాణ గాథకు 'రాగవాసిష్ఠం' అనే పేరు పెట్టానని రచయిత రాసుకున్న ముందుమాటలోనే చెప్పుకున్నారు. 'రాగం' అంటే అనుబంధం, ప్రేమ, అనురాగం వంటి అర్థాలు ఉన్నాయి. వసిష్ఠుని ప్రేమ, వసిష్ఠుని అనురాగం, వసిష్ఠునిపై అనురాగం వంటి అర్థాలను ఆశించి ఈ నాటకానికి ఈ పేరు పెట్టారని తెలుస్తుంది. నాటకం చివరి వరకూ రాగబంధమే. అంటే ప్రేమ బంధమే కొనసాగింది. ఈ విధంగా చూసినప్పుడు ఇది గొప్ప ఔచిత్యంతో పెట్టిన పేరే.

ఈ విధంగా పరిశీలించినప్పుడు రాగవాసిష్ఠం నాటకంలో కొన్ని చర్చనీయాంశాలు ఉన్నాయనీ, సృజనాత్మక సాహిత్యం కేవలం ఆనందం కోసమే కాకుండా ఆలోచనాత్మకంగా కూడా మలచి సాహిత్య ప్రయోజనాన్ని గుర్తించేలా చేయవచ్చని నిరూపించిన రచనగా దీన్ని చెప్పవచ్చు.

# తెలుగు దళిత కథా పరిణామం

తెలుగులో దళిత సాహిత్యం కవిత్వం, కథ, నవల, నాటకం, పాట, విమర్శ తదితర ప్రక్రియలతో పరిపుష్టిగానే వస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే, దళిత సాహిత్యం ప్రక్రియాపరంగా కూడా ఎంతో వైవిధ్యాన్ని చాటుతోంది. ప్రజలతో ప్రజల ఆకాంక్షలతో ప్రత్యక్ష సంబంధాల ప్రతిఫలనం కూడా దళిత సాహిత్యంలో కనిపించే విశిష్టతల్లో ఒకటి. విప్లవ సాహిత్యానంతరకాలాన్ని చూస్తే, దళితులు తమ సమస్యల కోసం ప్రత్యక్షంగా ప్రజా ఉద్యమాలు నడిపి, ఆ భావాలను సాహిత్యంగా సృజనీకరించే సాహిత్య దృక్పథం దళిత సాహిత్యంలోనే స్పష్టంగా కనిపిస్తుంది. అలాంటి దళిత సాహిత్యం వర్తమాన సాహిత్యంలో 'ఉద్యమ' స్థాయిని పొందింది. 'దళితులు' చేసే ఉద్యమాలను దళిత ఉద్యమాలుగాను, దళిత కవులు, కథకులు రాసే సాహిత్యాన్ని దళిత సాహిత్య వాదంగానూ ఎస్.వి. సత్యనారాయణ మొదలైన విమర్శకులు పేర్కొన్నారు.

సాహిత్య పరిభాషను వాడటంలో కొంతమంది ఎంత నిర్లక్ష్యంగా ఉంటారో, మరి కొంత మంది అంత జాగరూకత తోనూ వ్యవహరిస్తుంటారు. మార్క్సిస్టులు, అంతకు ముందే సంప్రదాయ వాదులు దళిత సాహిత్యాన్ని 'ఉద్యమం'గా గుర్తించడానికి అంగీకరించలేక పోతున్నారు. అయితే, సాహిత్యంలో వాదం, ధోరణి, ఉద్యమం మొదలైన పారిభాషిక పదాలను వాడటంలో చాలా జాగ్రత్త అవసరం. 'వాదం' లో తాత్త్విక దృక్పథం కంటే, తమ ఆశలను, ఆశయాలను వినిపించడమే ప్రధానమవుతుంది. అందులో తాత్త్విక నేపథ్యం ఉన్నా లేకపోయినా పెద్దగా నష్టం లేదు. అది కొన్నిసార్లు కొన్ని తాత్కాలిక ప్రయోజనాలను మాత్రమే ఆశిస్తుంది. తార్కిక నిరూపణలతో ముడిపడి ఉంటుంది. కానీ, ఉద్యమంలో స్పష్టమైన ప్రణాళిక, లక్ష్యం, తాత్త్విక నేపథ్యం, దృక్పథం మొదలైనవి ఉంటాయి. దళిత సాహిత్యానికి " దళిత పాంథర్స్" ఉద్యమం నుండే ఒక ప్రణాళిక ఉంది. కుల నిర్మూలన లక్ష్యం ఉంది. వర్ణాశ్రమ ధర్మాలపై నిర్మితమైన భారతీయ సమాజం, వివిధ మతాల ప్రభావాలు

మొదలైన వాటి నుండి శారీరక, మానసిక, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక క్షోభలను, అవమానాలను ఎదుర్కొన్న జాతులు ప్రధాన జీవన స్రవంతిలోకి రావాలనే నేపథ్యం ఉంది. డా//బి.ఆర్.అంబేద్కర్, జ్యోతి బాపూలే, పెరియార్ రామస్వామి నాయకర్ మొదలైన వారి భావ జాలాన్ని అర్థం చేసుకుంటే గాని ఇవన్నీ అవగాహనలోకి రావు. తెలుగు దళిత సాహిత్యాన్ని ఆ దృక్పథంతో చూస్తే గాని తెలియదు. అలా చూడగలిగినపుడు " దళిత సాహిత్యం" వాదమో, ఉద్యమమో స్పష్టమవుతుంది.

ఈ గ్రంథంలో ప్రయోగించిన దళిత వాదం' అనే పారిభాషిక పదాన్ని 'దళిత సాహిత్య ఉద్యమం' అనే విస్తృతార్థంలో అవగాహన చేసుకోవాలి.

ముందుగా తెలుగు కథ ఎప్పుడు ప్రారంభమైందీ, అలాగే దళిత కథ ఎప్పుడు ప్రారంభమైందీ మొదలైన ప్రశ్నలకు సమాధానాని అన్వేషిస్తూ ముందుకి వెళ్ళ వలసిన అవసరం ఉంది.అప్పుడే దళిత కథా పరిణామాన్ని అవగాహన చేసుకోగలుగుతాం. సందర్భాన్ని బట్టి దాన్నీ వివరిస్తాను.

నిజానికి స్వాతంత్ర్యానికి ముందూ, తరువాతా కూడా తెలుగులో"దళితుల" గురించి చాలామంది కథలు రాశారు. భార్గవీరావు *'ఇంకానా ఇక పై చెల్లదు'* పేరుతో కొన్ని కథలను సంకలనంగా తీసుకొచ్చారు. ఆ తర్వాత డా//ఆర్. చంద్రశేఖర్ రెడ్డి, డా//కె.లక్ష్మీనారాయణల సంపాదకత్వంలో 'దళిత కథలు' (1996) పేరుతో విశాలాంధ్ర వారు ఒక కథా సంపుటిని ప్రచురించారు. దీనిలో తీసుకున్న కథలు దళిత కథలు కావని ఆ సంకలనం బయటికి వచ్చిన తర్వాత చాలా మంది విమర్శించారు. ఆ సంకలనం లో ' దళితుల' గురించి రాసిన కథలు ఉన్నాయి గానీ, 'దళితజాతుల' గురించి కొన్ని కథలే ఉన్నాయనేది వారి ఆలోచన. దళిత రచయితల రచనల కంటే, దళితేతర రచయితల రచనలే ఉండటం ఈ విమర్శకు ఒక కారణం.

ఇలాంటి విమర్శ వచ్చినా కానీ, కాలక్రమంలో దళిత కథా పరిణామాన్ని తెలుసుకోవటానికి ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఆ పుస్తకాల తరువాత డా//కె.లక్ష్మీనారాయణ సంపాదకత్వంలో *దళిత కథలు* పేరుతో 8 సంపుటాలు వెలువడ్డాయి. వాటిలో దళితులు అనుభవించిన అనేక సమస్యలను గుర్తించే అవకాశం కలిగింది. వాటితో పాటు ఇంకా చాలా సంకలనాలు వచ్చాయి.ఇంకా రావలసినవి అనేకం ఉన్నాయి. చాలా కథలు పత్రికల్లో ప్రచురణ పొందాయి. నేటికీ కొన్ని పత్రికల్లో దళిత కథలు ప్రచురితమవుతూనే ఉన్నాయి. వీటితో పాటు ఆయా రచయితలు తాము ప్రచురించాలనుకొంటున్న కథా సంపుటాల్లోనూ కొన్ని కథలు ఉన్నాయి. ఈ కథలన్నింటినీ చూస్తే దళిత కథల్లో కింది పరిణామాలు స్పష్టమవుతాయి. కనుక, దళిత కథల్లో 'దళితవాదానికి' ప్రాతినిధ్యమనదగిన కొన్ని కథలను పరిశీలించడం ద్వారా తెలుగులో వచ్చిన 'దళిత కథ' స్వరూప స్వభావాలు , దాని పరిణామం తెలిసే అవకాశం ఉంది.

సంస్కరణోద్యమ ప్రభావంతో గురజాడ *'దిద్దుబాటు'* (1910) కథానిక ప్రారంభమయ్యింది. ఇది దళిత కథ కాదు. కానీ సంస్కరణోద్యమ ప్రభావంతోనే వెలువడింది. దళితుల సమస్యలు

కూడా సానుభూతితో స్వీకరించిన సహృదయతను అవగాహన చేసుకోవలసిన అవసరం ఉంది. ఇంత చెప్పినా గురజాడ వారి *దిద్దుబాటు* కథానికలో దళితుల గురించేమీ లేదు. 1925 లో శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి *'పుల్లంరాజు'* పేరుతో ఒక కథ రాశారు. ఆ తరువాత 1931 లో *'సాగర సంగం, ఇలాంటి తవ్వాయి వస్తే,* (1934) అనే కథలను కూడా ఆయనే రాశారు. ఆయన వీటిలో దళితుల మధ్య గల అనైక్యతనూ, దళితుల మతాంతరీకరణను చిత్రించారు. ఆ తరువాత దళితేతరులు రాసిన దళిత కథల్లో దళితుల పట్ల సానుభూతి వ్యక్తమవుతుంది. అయినా గానీ జాతీయోద్యమం కోసం గాంధీ నడిపిన 'హరిజనోద్ధరణే' వీటిలో ప్రధానంగా కనిపిస్తుంది. 'మాల - మాదిగ' మొదలైన షెడ్యూల్డు కులాల్లోని ఉప కులాలాను కలిపి 'హరిజనులు' అని పిలుస్తూ రాసిన కథలు అనేకం వచ్చాయి. 'హరిజన ' సమస్య లోతులు తెలియకుండా రాసిన కథలు కూడా చాలా వచ్చాయి. చలం రాసిన *'హరిజన సమస్య', 'మాదిగమ్మాయి '* మొదలైన కథలన్నీ ఈ కోవలోనే చెప్పుకోవచ్చు. అడవి బాపిరాజు రాసిన *'నరసన్న పాపాయి '* (1954) కథ దళితుల దేవాలయ ప్రవేశ నిషేధాన్ని నిరసిస్తూ, వాళ్ళు కూడా మనుషులేననీ, చదువుకున్న దళితేతరులు దళితులతో సంస్కరణ భావాలతో మెలిగే వారని స్పష్టం చేస్తుంది కథ.

దళితుల సమస్యలను ముఖ్యంగా అస్పృశ్యత, నీటి సమస్య, రాజకీయాధికారం, వృతి వల్ల వచ్చే అనారోగ్యం, వృత్తులు మారి చదువుకున్నా, కులపీడన మరో రూపంలో ప్రవేశించిన పరిస్థితులను వర్ణిస్తూ దళితేతర కథా రచయితల నుండి అనేక కథలు వచ్చాయి. వర్ణాంతర వివాహాలు, గ్రామాల్లో భూస్వామ్య పెత్తందారీ విధానాల వల్ల దళితులు పడుతున్న ఇబ్బందులను వర్ణించిన వారూ ఉన్నారు. ఈ దళిత కథా పరిణామాలను వివిధ వ్యాసాల్లో, గ్రంథాల్లో ఆచార్య కొలకలూరి ఇనాక్, ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, ఆచార్య నముమాసస్వామి, నిఖిలేశ్వర్, బి.ఎస్.రాములు, గుడిపాటి తదితరులు వివరించే ప్రయత్నం చేశారు. వాటిలో 1934 నుండి 1968 వరకూ దళిత కథలకు ప్రాథమిక స్థాయిగా ఆ విమర్శకులు గుర్తించారు. ఈ కాలంలో దళిత సమస్యలను దళితేతరులు రాశారనీ నిఖిలేశ్వర్ (*తెలుగు కథ : దళితవాదం* 1996:63) అన్నారు.

*"1969 నుండి 1980 మధ్యలో మాల - మాదిగల మధ్య సమష్టి పోరాట స్థాయి లేదు. ఆ పోరాటాలు ముందుగా దళితుల్లో ఏర్పడాలని ఉద్బోధిస్తూ కథలు రాశారు. అప్పటికే నక్సల్బరీ - శ్రీకాకుళ పోరాటాలు వచ్చినా రచయితలు వాటిని పట్టించుకోలేదు"* అని కూడా నిఖిలేశ్వర్ వ్యాఖ్యానించారు.

1990 నుండి 1995ల మధ్యలో దళితుల పై జరిగిన దాడుల వల్ల ప్రతిఘటన చైతన్యం వచ్చినా, అది ఆ కథల్లో ప్రతిఫలించలేదని నిఖిలేశ్వర్ అన్నారు. ఈ నేపథ్యంతో పరిశీలించినప్పుడు దళితులు, దళితేతరులు దళిత కథలను రాశారనీ, అందులో భిన్న కోణాలు ప్రతిఫలించాయని తెలుస్తుంది. దీనిలో భాగంగానే దళిత సంస్కృతిని తెలిపే కథలు కూడా వచ్చాయి. ఎండ్లూరి సుధాకర్ *'మల్లె మొగ్గల గొడుగు'* మాదిగ కథలు (1997)లో, నాగప్ప గారి సుందర్రాజు (1968 - 2000) *'మాదిగోడు'* కథల (1997లో మాదిగ జీవితాల్లోని

అనేక కోణాలు వర్ణితమయ్యాయి. *'జాంబవంతుడూ - పిచ్చిమామ', ' ఆరంజ్యోతి* కథలలో ఎండ్లూరి సుధాకర్ మాదిగ జీవితాలకున్న పౌరాణిక వారసత్వాన్ని కొనియాడుతూనే అందులో ఉన్న అగ్రవర్ణ కుట్రను పసిగట్టేటట్లు రాశారు. తెలుగులో వచ్చిన తొలి 'దళిత ఆత్మకథలు'గా వీటిని చెప్పుకోవచ్చు. నాగప్ప గారి సుందర్రాజు ' *మాదిగోడు'* కథల ద్వారా మాదిగ సంస్కృతిని, మాండలిక భాషలన్నింటినీ రాయలసీమ ప్రాంతం నుండి చూపించారు. "మేమిట్లుండం" కథల సంపుటిలో గుండెడప్ప కనకయ్య తెలంగాణ ప్రాంత దళితుల సమస్యలను తెలంగాణ భాషలో రాశారు. వాళ్ళలో ఆత్మన్యూనత పోలేదని దాని ఉద్దేశించి రాశామన్నారు. కొలకలూరి ఇనాక్ *'పొట్ట పేగులెబ్బింది గోడు'* కథలో మాదిగ సంస్కృతిని కళ్ళకు కట్టినట్లుగా వర్ణించారు. మరింత లోతుగా పరిశీలిస్తే కొలకలూరి ఇనాక్ దళిత కథకు తాత్త్విక దృక్పథాన్ని సమకూర్చ గలిగారని నిరూపితమవుతుంది. ఆయన రాసిన ' *తాకట్టు* ', ' *కులవృత్తి'* మొదలైన కథలలో దళిత తాత్త్విక దృక్పథం వ్యక్తమౌతుంది. ఆయనే రాసిన *'గొడ్ల దొంగ'* కథలో మాదిగల పై జరిపే అగ్రవర్ణ భూస్వాముల దురాగతాలు వర్ణితమయ్యాయి. 1969 లో కొలకలూరి ఇనాక్ రాసిన ' *ఊరబావి'* కథలో వ్యవస్థ కోసం వ్యక్తి చేసిన సాహసం వెల్లడవుతుంది. అగ్రవర్ణ చాణక్యనీతిని దళిత స్త్రీ తిప్పికొట్టిన వైనం కనిపిస్తుంది. దీన్ని దళిత జీవితాన్ని స్పృశిస్తూ రాసిన మొట్ట మొదటి దళిత కథగా నునుమాసస్వామి, బి.ఎస్.రాములు మొదలైన కథా విమర్శకులు భావిస్తున్నారు. కొలకలూరి ఇనాక్ *ప్రజాసాహితి* మాస పత్రికలో రాసిన ' *కులవృతి'* (2006) కథ కొంత వివాదాస్పదమైంది. ఆ పత్రికలోనే రచయిత కథకు సంబంధించిన స్పందనను కూడా ప్రకటించారు. అన్ని వృత్తులు గౌరవింపబడుతున్నా మాదిగ కులవృత్తి సమాజ గౌరవానికి నోచుకోవడం లేదనే ఆవేదన ఈ కథలో ప్రధానంగా కనిపిస్తుంది. స్వామి *'తల్లిమాట'* (1990), సింగమనేని నారాయణ ' *మకరముఖం'* (1995) మొదలైన కథల్లో దళితులు తమ కులాన్ని చెప్పుకోవడానికి వెనుకాడుతున్నారని వివరించారు.

మకర ముఖంకథా రచయితతో ఈ వ్యాసకర్త కథ గురించి చర్చించినప్పుడు, రాయలసీమ మాదిగలు చదువుకున్నా, ఒక మంచి హెూదాలో ఉన్నా, అగ్రవర్ణాల వాళ్ళు తమలో కలుపుకోవాలనుకున్నా ఇంకా ఎస్సీ వర్గీకరణ నేపథ్యంతో కూడా కొన్నిదళిత కథలు వచ్చాయి. పైడి తెరేష్ బాబు రాసిన *'అనుబంధ ప్రశ్న '*(1996) కథ అగ్రవర్ణాల వారు దళితుల్ని విడగొట్టేందుకే వర్గీకరణ సమస్యను పైకి తెచ్చారని వివరిస్తుంది. ఈ నేపథ్యం తోనే మరి కొంతమంది కూడా కథలు రాశారు. జుపాక సుభద్ర, గోగు శ్యామలల సంపాదకత్వంలో *'నల్ల రేగటి సాల్లు'* కథలు (2006) వెలువడ్డాయి. దానిలో మాదిగ ఉపకుల స్త్రీల జీవితాల్లోని కొత్త కోణాలు చిత్రితమయ్యాయి. గుండెడప్ప కనకయ్య జుపాక సుభద్ర, గోగు శ్యామల మొదలైన రచయిత్రులు తెలంగాణ భాషలో చక్కని నుడికారంతో కథలు రాస్తున్నారు.

దళిత కథల్లో కనిపించే మరొక ధోరణి దళితులు క్రైస్తవులుగా, ముస్లిములుగా మారడాన్ని వివరించే కథలు. స్వాతంత్ర్యానికి పూర్వం హిందూ మతంలో దళితుల పై ఉన్న నిర్బంధాల కారణంగా దళితులు ఇతర మతాల్లోకి వెళ్ళారని వర్ణించారు. స్వాతంత్ర్యానంతరం

కూడా ఈ ధోరణితో కొన్ని కథలు వచ్చాయి. కొలకలూరి ఇనాక్, ప్రసాదరావు తదితరుల కథల్లో ఇలాంటి ఇతివృత్తం కనిపిస్తుంది. అయితే, క్రైస్తవ మతంలోకి వెళ్లిన తర్వాత దళితుల జీవితాలు ఎలా ఉన్నాయనే విషయాలను ధారాగోపి ' *గుడిసె ఏసోబు*' కథలలో వర్ణించారు. క్రైస్తవులలో కొంతమంది దళితులను దోచుకుతింటున్న వైనాన్ని ఈ కథల్లో వర్ణించగలిగారు. చిలుకూరి దేవ పుత్ర '*బంది* ' కథలో దళితులలో క్రైస్తవ మతాన్ని వ్యతిరేకించే వారి పట్ల వ్యవహరించే తీరుతెన్నుల్ని వివరించారు. బోయ జంగయ్య గారి *పనిష్మెంట్*' కథలో అగ్రకుల ఎం.ఎల్.ఏ., గిరిజన స్త్రీ శీలాన్ని దోచుకోవడం, తదనంతరం జరిగే కోర్టు వ్యవహారాలు, దళితులకున్న భూమిని కోల్పోవడం మొదలైన అంశాల్ని వర్ణించారు. ప్రజా ప్రతి నిధులు దళితుల పట్ల వ్యవహరించే తీరుని ఈ కథ కళ్ళకు కట్టినట్లుగా చూపుతుంది. ఈయనే రాసిన ' *బంచరాయి*' ' *ఇంకానా ఇక పై సాగదు*' కథలలో భూమి సమస్య, సమ్మె ప్రభావం మొదలైన దళిత సమస్యలను వర్ణించారు.

దళిత కథలను మరింత లోతుగా పరిశీలించినపుడు దళిత స్త్రీ వాదానికి సంబంధించిన అంశాలను గోగు శ్యామల, జూపాక సుభద్ర, జాజుల గౌరి, కొలకలూరి స్వరూపారాణి మొదలైనవారు తమ కథల్లో చూపే ప్రయత్నం చేశారు. 'దళిత స్త్రీ' అని పేరు పెట్టి రాయక పోయినా, ఉద్యోగినిగా స్త్రీ ఎదుర్కొనే మానసిక హింస వెనుక కులాధిపత్య భావజాలం ఉందని తెలిపే కథలను ఆచార్య శరత్ జ్యోత్స్నా రాణి '*నీకూ నాకూ నడుమ*,' ' *వెండి కిరీటం*' కథా సంపుటాల్లో చూడవచ్చు. ఇంచుమించు ఇటువంటి నేపథ్యంతో డా.వి. చంద్రశేఖరరావు ' *నలుపు* ' అనే కథను రాశారు. సదానంద శారద రాసిన ' *ఉప్పునీళ్ళు*,' స్వామి రాసిన '*హెచ్. సరస్వతి* ' కథలు విద్యాలయాల్లో దళిత బాలికలు, స్త్రీలకు జరిగే అవమానాలను వర్ణిస్తాయి. దళిత సౌందర్యాన్ని దళిత స్త్రీకోణంలో ' *నలుపు*' కథను కాలువ మల్లయ్య రాశారు.

ఇలా దళితులు అస్పృశ్యత వల్ల మానసికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా కోల్పోతున్న జీవితాలను చాలా వరకూ ఆయా రచయితలు ఆయా కథల్లో చూపించగలగాలి.దళిత కథల్లో ఎంతో వైవిధ్యం కనిపిస్తుందని పైన పేర్కొన్న కొన్ని కథలను చూసినా తెలుస్తుంది. అయితే స్వామి, సింగమనేని నారాయణ మొదలైన వారు దళితుల గురించి కథలు రాసినా, దళితులు తమ కులాన్ని చెప్పుకోవడానికి సిగ్గుపడుతున్నారనే ఆలోచనలు కలిగిస్తాయి. కానీ, దళితుల ఆ మానసిక కోణాలను మరింతగా పట్టుకోవలసిన అవసరం ఉంది. సామాజిక పరిస్థితులను మరింతగా చిత్రించవలసి ఉంది.

దళిత జీవిత లోతులు మరింతగా తెలిస్తే అలాంటి వాటిని సరిగ్గా రాయగలిగి ఉండేవారెమో! లేకపోతే దళితులలోని ఆ కోణాన్ని కూడా చెప్పాలనే ఆలోచనతో కూడా అలాంటి దృష్టిని ప్రదర్శించి ఉండవచ్చు. కొలకలూరి ఇనాక్, ఎండ్లూరి సుధాకర్, బోయ జంగయ్య, అల్లం రాజయ్య గారలు తాత్త్విక, సాంస్కృతిక, ఆర్థిక కోణాలను వారి కథలో చూపడంలో నిజమైన దళిత జీవితం కనిపిస్తుంది. దళితులు రాసిన కథల్లో సమస్యను చెప్పడంతోపాటు, ఆ సమస్య వెనుకున్న అనేక కారణాలను చెప్తూనే, వాటిని అధిగమించే

తత్వం బాగా వ్యక్తమవుతుంది. అయినా, దళితులు కూడా 'మాల-మాదిగల ' మధ్య ఉండే సమస్యలకు అగ్రవర్ణాల వారే కారణమని అనడంలో కొంత వాస్తవం ఉన్నా, అదే పరిపూర్ణ సత్యం అనుకోవడానికి వీల్లేదు. ప్రతి దళిత సమస్యకూ అగ్రవర్ణాల వారే కారణమనడం, అదీ ఎస్సీ వరీకరణ సమస్యకూ ముడిపెట్టడం సమంజసం కాదు. దళితులు కథలు రాయని లేదా ఆ పరిస్థితుల్లో ఏదొక దృష్టితో దళితుల గురించి కూడా దళితేతరులు కథలు రాసారని, అది ఒక సామాజిక, సాహిత్య పరిణామాన్ని అర్థం చేసుకోవడాని దోహదపడుతుందని, ఆ కథలను కూడా స్వాగతించవలసిందే. అయితే దళిత కథలలోప్రస్తుతం సాంస్కృతిక కోణాల నుండి కూడా కథలను చిత్రించవలసిన అవసరం ఉంది. దళితులు ఎదుర్కొంటున్న ప్రాంతీయ సమస్యలను చిత్రించాలి. ముఖ్యంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఊపందుకున్న ఈ తరుణంలో దళితుల మనోభావాలను కథలుగా వర్ణించవలసి ఉంది. ప్రత్యేక రాష్ట్రం రావడం వల్ల గానీ, రాకపోవడం వల్ల గానీ, దళితులకు కలిగే ప్రత్యేక ప్రయోజనాలేమిటో వివరించే కథలు రావలసిన అవసరం ఉంది.అలాగే దళితుల్లో రిజర్వేషన్లు పొందిన, పొందని వర్గాల మధ్య సంఘర్షణను, గ్రామీణ, పట్టణ, చదువుకున్న తరం , చదువు కోసం ఎదురు చూసే తరాల మధ్య  అంతరాలనూ వర్ణించవలసి ఉంది.మొత్తం మీద దళిత కథ జీవిత వాస్తవాలను కథనీకరించే దిశగానే వెళ్తుందని భావించవచ్చు.

# వర్గీకరణ వాదానికి శాస్త్రీయ దృక్పథం

స్వయంగా దళిత కులం (మాదిగ)లో పుట్టి, పెరిగి, అనేక ఆటుపోట్లకు గుర్రై ఉన్నత విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తూనే, తన జాతి వెనుకబాటు తనానికి గల కారణాలను అన్వేషించాలనుకొని పరిశోధనకు పూనుకున్న వారిలో సాంబయ్య గుండిమెడ ఒకడు. పుట్టిందీ, పెరిగిందీ పల్లె ప్రాంతంలోనే. నేటికీ గుండె నిండా పల్లె వాతావరణాన్నీ, దళితుల బాధల గాథల్నీ దాచుకున్నవాడు. ఎన్నుకున్న పరిశోధన అంశంలో, రాసే అక్షరంలో, మాట్లాడే ఆలోచనలో అవన్నీ ప్రతిఫలిస్తూనే ఉన్నాయి. సాంబయ్య గుండిమెడను నేను 'అన్నా' అని పిలుస్తుంటాను. అతడు హైదరాబాదు యూనివర్సిటీలో పి.జి. చేస్తున్నప్పుడు నాకు వ్యక్తిగతంగా తెలుసు. దళితులు అనుభవించే సారూప్య లక్షణాలవల్లే అతనితో నాకు పరిచయం ఏర్పడింది. బహుశా ప్రతి దళితుడి బాధల్లోనూ, సమస్యల్లోనూ ఈ సారూప్యత అనేది గొప్ప అనుబంధాన్ని కలిగిస్తుంటుందేమో! ఈ అనుబంధ పటిష్టతే ఏకవచన సంబోధనకు అవకాశం కల్పించింది. నిజానికి ఆత్మీయుల మధ్య ఏకవచన సంబోధన మరింత చేరువకావడానికి మార్గాన్నేర్పరుస్తుంది.

అన్న సాంబయ్య పి.జి. చేసేటప్పుడు దళితుల గురించి లోతైన ఆలోచన చేస్తున్నట్లు గుర్తించలేకపోయాను. అతనూ నేనూ వేరు వేరు సబ్జెక్టుల్లో పి.జి. చేయడం, అతను చేసే, పాల్గొనే చర్చల్లో విరివిగా పాల్గొనే అవకాశం నాకు కలగకపోవడం వంటివన్నీ దీనికి కారణాలనుకుంటున్నాను. అప్పటికే యూనివర్సిటీ క్యాంపస్లో 'మాదిగ సాహిత్య వేదిక' ద్వారా నాగప్పగారి సుందర్ రాజు, కత్తి కల్యాణ్ చంద్ర, కొలికపూడి శ్రీనివాసరావు వంటి వాళ్ళతో కలిసి మాదిగ సాహిత్యాన్ని రాయడం ప్రారంభించాం. ఈలోగా "సాంబయ్యకి ఫోర్డ్ ఫెలోషిప్ వచ్చింది" అనే వార్త క్యాంపస్ లో గుప్పుమంది. నా మాదిగ సోదరుడికి ఈ ఫెలోషిప్ వచ్చినప్పుడు నేను పొందిన ఆనందాన్ని అక్షరాల్లో వర్ణించలేను! దాన్ని నేనే సాధించినంతగా ఫీలయ్యాను. మాదిగ విద్యార్థి గొప్ప విద్యావంతుడు కాబోతున్నందుకు పొంగిపోయాను.

విమానం ఎక్కి లండన్ వెళ్ళిపోయాడు. హాయిగా సెటిల్ కాబోతున్నాడనుకున్నాను. కానీ, అక్కడ కూడా దళితుల సమస్యలతోనే కుస్తీ పడుతున్నాడని తెలుసుకున్నాను.

ఒకరోజు లండన్ నుండి ఫోన్ చేశాడు. హైదరాబాదు యూనివర్సిటీలో నేను ఉద్యోగం పొందానని తెలుసుకొని ఫోన్ చేశాడు. చాలాసేపు గుండెకు హత్తుకున్నంత ఆనందంతో మాట్లాడాడు. ఆ సందర్భంలో అతడు మాట్లాడిన మాటలు నా జీవితంలో ఎప్పటికీ మరచిపోలేను. అప్పుడే అతనిలో ఒక గొప్ప దళిత మేధావి మాటలు విన్నాను. అతని పరిశోధన గురించి విని సంతోషించాను. దళిత జాతి జాగృతికి అతడు పడే తపనను గమనించాను. అప్పటి నుండి రెగ్యులర్ గా ఫోన్, మెయిల్స్ ద్వారా చర్చలు జరుగుతుండేవి. ఒక రోజు మెయిల్లో ఒక వ్యాసం పంపించి, అభిప్రాయం చెప్పమన్నాడు. ప్రస్తుతం దళితుల్లో జరగవలసిన వర్గీకరణ ఆవశ్యకతను ఒక శాస్త్రీయ దృక్పథంతో ఆ వ్యాసంలో విశ్లేషించాడనిపించింది. దళితులు సమైక్యత సాధించాలంటే తక్షణం జరగవలసిన వర్గీకరణను అందరూ అంగీకరించవలసి ఉంటుందని ఆ వ్యాసంలో ప్రతిపాదించాడు. వ్యాసాన్ని ప్రారంభించింది మాత్రం వర్గీకరణను వ్యతిరేకిస్తూ చేసిన వాదనను ఖండించడానికే! కానీ ఒక వ్యక్తి రాసిన వ్యాసానికి ఖండనగానే దాన్ని రాయడానికి పూనుకున్నా, వ్యక్తులకంటే వ్యవస్థనే లక్ష్యం చేసుకోగలిగే సంయమనాన్ని, సమన్వయాన్ని ఆ రచనలో సాధించగలిగాడు. ఒక పరిశోధన పత్రంలా దాన్ని రూపొందించాడు. మందకృష్ణ మాదిగ, కృపాకర్ మాదిగలు మాదిగ జాతికి లభించిన గొప్ప వరం. అయితే, వీరి ప్రసంగాలు, 'రికార్డు' అయితే వర్తమాన దళిత ఉద్యమానికి ఎంతో మేలు చేయగలుగుతాయి. 'వర్గీకరణ వాదాన్ని' ప్రతి దళితుడి చేత అంగీకరింపజేయగలుగుతాయి. భవిష్యత్తు తరాలకు మార్గదర్శ సూత్రాలవుతాయి. దళితులు- అందులోనూ వృత్తి చేత హీనంగా చూడబడుతున్న మాదిగల గురించి పరిశోధన చేసిన సాంబయ్య, ఈ రకమైన లోపాన్ని పూరించే ప్రయత్నం చేయడానికి పూనుకున్నాడు. ఆ వ్యాసంలో ప్రతి మాదిగకూ, ప్రతి దళిత మేధావికీ, దళిత, దళితేతరులందరికీ వర్గీకరణవాదంలోని సామంజస్యాలను శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషించి చూపగలిగాడు. ఆ వ్యాసాన్ని పుస్తక రూపంలో ప్రకటిస్తే బాగుంటుందన్నాను. దానికి కార్యరూపమే బ్రాహ్మణత్వ మాలత్వమా...? మానవత్వ అంబేద్కరత్వమా...?

వర్గీకరణను వ్యతిరేకించేది దళితుల్లోని ఒక వర్గం వారే వాళ్ళలో మాలలే ప్రధానంగా కనిపిస్తున్నారు. అసమానతను పోగొట్టుకొనే దిశలో అవకాశాల అందుబాటుని సాధించుకోవాలనేది అంబేద్కరిజంలో ఒక ప్రధాన ఆశయం. ఆ ఆశయానికి క్రియారూపమే రిజర్వేషన్ల పొడిగింపు కూడా! అంటే సామాజిక వాస్తవికత నుండి రిజర్వేషన్ల పొడిగింపు కొనసాగుతుంది. దీన్ని వ్యతిరేకించని దళితుల్లోని ఒక ప్రధాన వర్గం, సామాజిక వాస్తవికతలో స్పష్టంగా గణాంక వివరాలతో సహా కనిపిస్తున్న లోపాల్ని పూరించే దిశగా ఎస్.సి. వర్గీకరణ జరగాలనడాన్ని ఆ వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ఇలా అంబేద్కరిజానికి వ్యతిరేకంగా, బ్రాహ్మణత్వ భావజాలంతో వర్గీకరణను వ్యతిరేకించే ఆలోచనను మాలత్వగా వ్యాసకర్త ప్రయోగిస్తున్నాడు. బ్రాహ్మణత్వ మాలత్వ అనే పారిభాషిక పదాలు వైయిక్తిక గుర్తింపుతో

కాకుండా భావజాలం (Idealogy) ఆధారంగా, స్పష్టమైన వివరణతోనే రచన కొనసాగడం వల్ల స్పష్టతకు బలమైన మార్గాన్ని ఏర్పరిచినట్లయ్యింది. 'బ్రహ్మాస్త్రం' బదులు 'అగ్రాస్త్రం' అనడంలో గాని, 'రాజ్యాధికారం', 'అంబేద్కరిజమ్' అనే ప్రయోగాలను గాని వాడటంలో లోతైన అవగాహనతోనే ఉపయోగించాడు.

వర్గీకరణ మాలత్వ వ్యతిరేక వాదంలో గల వివిధ విషయాలను తొమ్మిది అంశాలుగా వర్గీకరించి, చారిత్రక, ఆర్థిక, రాజకీయ, విద్యా ఉద్యోగ రంగాలలో జరుగుతున్న వాస్తవిక సంఘటనలను సోదాహరణంగా నిరూపించగలగడంలో సాంబయ్య దళిత మేధావి పాత్రను నిర్వహిస్తున్నాడు. గ్రామీణ దళితుల్లో ఆంగ్ల విద్యాలోపం, అది వెంటబెట్టుకొచ్చే ఆత్మన్యూనతలను అనుసరించి ప్రతిభాపాటవాల్ని నిర్వచించుకోవలసి ఉంటుందని అంటున్నాడు. ఒక సామాజిక శాస్త్రవేత్త పాత్ర పోషిస్తున్నట్లు ఈ విశ్లేషణలో కనిపిస్తున్నాడు సాంబయ్య.

పలువురి మేధావుల ఆలోచనలను సైద్ధాంతిక లోతుల్లోకి వెళ్ళి, వర్గీకరణ వాదంలో గల సామంజస్యాన్ని నిరూపించడానికి వాటిని ఉపయోగించి ఒక మంచి ప్రయత్నం చేశాడు. ఇవన్నీ వర్గీకరణ వాదాన్ని అందరిచేత అంగీకరింపజేయడానికి గ్రంథకర్త పాటించిన శాస్త్రీయ దృక్పథాన్ని పట్టి చూపిస్తున్నాయి.

వ్యక్తావ్యక్తంగా ఉన్న అస్పష్టతను స్పష్టత వైపుకి తీసుకొని పోవడంలోనే ఈ శాస్త్రీయత వెల్లడవుతుంది. సమాజంలో 'దళితులు' అంటే అందరికీ వ్యక్తమయ్యే అభిప్రాయం ఒకటి ఉంది. తరతరాల సాంఘిక, సాంస్కృతిక, ఆర్థిక పీడనలకు గురై సమాజానికి దూరం చేయబడిన వాళ్ళనేదే అభిప్రాయం. దళితుల్లోనూ ఆంతరంగిక పీడనకూ గురయ్యే వాళ్ళు ఉన్నారనేది అవ్యక్తం, అస్పష్టం. ఇప్పుడిప్పుడే స్పష్టం చేసే ప్రయత్నం కనిపించడం వల్లనే వ్యక్తావ్యక్త, స్పష్టాస్పష్ట వైరుధ్యం గోచరమవుతుంది. అలాగే దళితులందరూ కలిసి ఉంటేనే హక్కుల సాధన లేదా నిజమైన సమైక్యత అనేది వ్యక్తం. హక్కులు సాధించుకొనేదెవరు? దళితుల్లో నిజమైన సమైక్యత ఉందా? అనేది అవ్యక్తం, అస్పష్టం. ఈ అభిప్రాయాలను దళితేతరులే కాదు, దళితుల్లోని ఉపకులాలకూ కలిగేవే. అందుకనే, 'మాలత్వాన్ని' ఒక భావనగా గ్రహించి వ్యక్తావ్యక్తాలను, స్పష్టాస్పష్టాలను తార్కికంగా నిరూపిస్తున్నాడు వ్యాస కర్త. తద్వారా ముసుగేసుకున్న బ్రాహ్మణత్వ, గాంధీ సూచిత సమైక్యత కంటే, అంబేద్కరిజంలోని సమానత్వ భావనను ఎలుగెత్తి చాటుతున్నాడు.

మందకృష్ణ మాదిగ, కృపాకర్ మాదిగ తదితరులు మాదిగ హక్కుల పోరాట సమితిగా, మాదిగ దండోరాగా ఏర్పడి ఉద్యమరూపాన్ని సాధించడానికి బహిర్గతం అయినప్పటి నుండి చూసినా సుమారు దశాబ్ద కాలంగా ఎస్.సి. వర్గీకరణ కోసం ప్రయత్నాలు ముమ్మరంగా చర్చల్లోకి వచ్చి, వాడిగా, వేడిగా కొనసాగుతున్నాయి. మందకృష్ణ మాదిగ, కృపాకర్ మాదిగ ఉద్యమరూపంలో, రాష్ట్రంలోని మాదిగలను అందరినీ సమైక్యంగా పోరాటానికి లేదా హక్కుల సాధనకి ప్రేరేపించడంలో కృతకృత్యులు కాగలి. కానీ, అంతకు ముందు నుంచే ఎస్.సి. వర్గీకరణ జరగాలనే వాదనలు జరగకపోలేదు. అప్పుడు ఎస్.సి. వర్గీకరణ గురించి మాట్లాడే

లేదా పోరాడే వారికి ఇప్పుడున్నంతగా మాదిగల సహాయ సహకారాలు లభించకపోవడం, ఆ మార్గాలు అన్వేషించకపోవడం, తెలిసినా కొంతమంది వైయక్తిక ప్రయోజనాలకు వాడుకోవడం వంటి వాటి వల్ల అవి నేటి వర్గీకరణ వాదానికున్నంత పటిష్ఠతను సాధించలేకపోయాయి.

ఇంతకు ముందు లేనంత సహకారం ఇతర పార్టీలు కూడా ఇప్పుడు మాదిగలకు అందించడంలో గల హిందూత్వ రాజకీయాలను గమనించమంటున్న దళితత్వ భావాలను కూడా ఖచ్చితంగా పరిగణనలోకి తీసుకోవలసిందే. రాజ్యాంగం కల్పించిన అవకాశాల వల్ల, రాష్ట్రంలో జరిగిన కారంచేడు, చుండూరు, పదిరి కుప్పం వంటి ప్రాంతాల్లో జరిగిన దళితేతర వర్ణాలు చేసిన దాడులతో దళితుల్లో వచ్చిన చైతన్యం సామాన్యమైంది కాదు. బహుజన సమాజ్ పార్టీ సిద్ధాంతకర్త, వ్యవస్థాపక అధ్యక్షుడు కాన్షీరామ్ తో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి యన్.టి. రామారావు పొత్తు పెట్టుకోవాలనుకున్నారు. అది ఒక రకంగా దళితుల్లో వచ్చిన చైతన్యాన్ని ఇతరులు గుర్తించడమే. మరి అలాంటి చైతన్యం తర్వాత ఎందుకు కొనసాగలేదు? ఎన్నికల మ్యానిఫెస్టోలలో దళితులను ఆకర్షించే పథకాలు లేకుండా ఉండేవే కాదు. మరిప్పుడు వాటినెందుకు విస్మరిస్తున్నారు? దళితులను విభజించాలని ఎదురు చూసే హిందూత్వ బ్రాహ్మణత్వ భావజాలం కొంత పనిచేసే నేటి వర్గీకరణ వాదానికి పూర్తి మద్దతు కొనసాగుతుందనడంలో కొంత చారిత్రక సత్యం ఉంది. కానీ, అదే పూర్తి సత్యం కాదు.

దళితులను విభజించి పాలించడానికి లేదా దళితులనే కాదు ఎవరినైనా విడగొట్టి తమ ఆధిపత్యం చెలాయించుకోవడానికి దళితేతరులకు అనేక మార్గాలున్నాయి. వాటిని అన్నింటినీ కాదని వర్గీకరణ వాదాన్నే సమర్థించడంలో అన్ని పార్టీలకు ఏకాభిప్రాయం ఏర్పడింది. చివరికి అన్ని పార్టీలు రాష్ట్ర అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదం కూడా తెలిపాయి. ఇవన్నీ హిందూత్వ బ్రాహ్మణత్వ భావజాలాలే అనడం హేతుబద్ధమైన ఆలోచన అనిపించుకోదు! వీటిని ఈ గ్రంథకర్త సాంబయ్య గుండిమెడ శాస్త్రీయంగానే గణాంకాలు, చారిత్రక సత్యాలను చూపుతూనే వర్గీకరణ వాదాన్ని సమర్థించడంలో అన్ని పార్టీల ఆలోచనల్నీ సమన్వయం చేయగలిగాడు. సమకాలీన పరిస్థితులని చూపగలిగాడు.

ఈ సందర్భంలోనే ఒక విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. శాసన, కార్య నిర్వాహక, న్యాయ వ్యవస్థల మధ్య సమన్వయం సాధించనంత వరకూ 'న్యాయం లేదా ధర్మం' అందరికీ అందుబాటులోకి రావడం అంత సులభమైన విషయం కాదు. ఈ సమన్వయం సాధించడంలో దొర్లే పొరపాట్ల వల్లనే సమాజంలో కొంతమంది ప్రజలు ఇక్కట్ల పాలవ్వవలసి వస్తుంది. వీటిని ఉపయోగించుకునే కొంతమంది, మరి కొంతమందిపై ఆధిపత్యాన్ని చెలాయిస్తూ, అందవలసిన హక్కుల్ని అందకుండా ఆపగలుగుతూ, తాము అనుభవించగలుగుతూ, తమకి ఆటంకం కలిగినప్పుడు "అన్యాయం" జరిగిపోతుందని గగ్గోలు పెట్టడం జరుగుతుంటుంది. అప్పుడు వాళ్ళు ఎన్ని వాదనలైనా వినిపించడానికి ముందుకి వస్తారు. వాదనను సమర్థవంతంగా వినిపించగలిగిన, నిరూపించగలిగిన వాళ్లే విజేతలు! విజేతలు అంతా న్యాయం ప్రకారమో, ధర్మం ప్రకారమో తమ హక్కుల్ని

పొందగలుగుతున్నారని అనుకోవడానికి వీలు లేదు.

సుప్రీంకోర్టు ఎస్.సి. వర్గీకరణ చట్టాన్ని కొన్ని సాంకేతిక కారణాల్ని చూపి తాత్కాలికంగా కొట్టేసింది. దానికి కొన్ని రాజ్యాంగపరమైన ఆటంకాలను చూపింది. ఎస్.సి. వర్గీకరణ సమస్యను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శాసనసభ ద్వారా ఆమోదించిన తీర్మానాన్ని పంపినా పార్లమెంటు ఆమోదం ద్వారా మాత్రమే చట్టం కావలసి ఉంది. ఇవన్నీ సాంకేతిక అంశాలే! కానీ, సమాజ వాస్తవికతను జస్టిస్ రామచంద్రరాజు కమీషన్ స్పష్టంగా చూపగలిగింది. మళ్ళీ ఇప్పుడు కేంద్రం నియమించిన దళిత వర్గీకరణ అధ్యయన కమిటీ (ఉషామెహ్రాకమీషన్) ద్వారా నిర్ణయం కావలసి ఉందని అంటున్న వాళ్ళు ఉన్నారు. దీన్నీ వ్యతిరేకించే వాళ్ళూ ఉన్నారు. దీన్ని డా// బి.ఆర్. అంబేద్కర్ ఆలోచన ప్రకారమే చూసినా 1935 భారత ప్రభుత్వ చట్టం ప్రకారం అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం హయాంలోనే ఒక ఉత్తర్వు జారీ చేశారు. దీని ప్రకారం ఒక రాష్ట్రంలో ఒక్కో విధంగా అస్పృశ్యత ఉంటుందని, దాని ప్రకారం అప్పుడు 9 భాగాలుగా ఆ ఉత్తర్వులో వివిధ రాష్ట్రాల్లోని అస్పృశ్య కులాల, జాతుల, తెగలను వివరించారు. దాన్ని డా// బి.ఆర్.అంబేద్కర్ "*సవివరమైనదిగాను, వాస్తవికమైనదిగాను గుర్తించవలిసిందని*" ప్రకటించారు. (బాబా సాహెబ్ అంబేద్కర్ రచనలు - ప్రసంగాలు (సంపుటం- 7) 1992-246) కనుక, కేంద్రం నియమించిన దళితుల వర్గీకరణ అధ్యయన కమిటీ ఎలాంటి ప్రతిపాదనలు చేసినా, ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రకమైన పేర్లతో కులవివక్ష, ఆర్థిక స్థితిగతులు అనేవి కొనసాగుతున్నాయని గుర్తించి, ఆయా రాష్ట్రాల వారీగా ప్రత్యేక ఏర్పాటు ప్రకారం రిజర్వేషన్లను ప్రకటించడమే శాస్త్రీయమవుతుంది. దీన్ని ఈ గ్రంథ కర్త మాదిగ వృత్తులు ఎలా పరాధీనమైపోయాయో, అక్కడ కూడా మాదిగలు కార్మికులుగానే చూడబడుతున్నారో చేసిన విశ్లేషణలో పట్టుకోగలిగాడు. ఇలాంటి లోతైన విశ్లేషణలు దళిత సమస్య పరిష్కారాలకు కొత్త కోణాన్ని అందించగలుగుతుంది. లిడ్ క్యాప్ ద్వారానో, తోలు పరిశ్రమల స్థాపన ద్వారానో మాదిగలకు ఆర్థిక సహాయం అందిస్తే, వాటిని మాదిగల పేరుతో మరొకరు లబ్ది పొందుతారు తప్ప, నిజమైన మాదిగ వృత్తిదారులకు అందవనేది గ్రంథకర్త పరిశోధనలో తేలిన ఒక అంశం! తోలు పరిశ్రమలు స్థాపించిన వారు, లేదా లిడ్ క్యాప్ ద్వారా చెప్పుల దుకాణాలు పెట్టుకున్న వాళ్ళను కేంద్రం నియమించిన వర్గీకరణ అధ్యయన కమిటీ ప్రశ్నించడానికి ఎన్నుకొనే పద్ధతి ఏమిటి? ఎన్నుకునే ప్రశ్నావళి ఎలా ఉంటుంది? దీనికి అంతటికి పట్టే కాలమెంత? ఇవన్నీ దళితుల్లో కొన్ని వర్గాల అవకాశాలను మరొక వర్గం 'స్వాహా' చేయడానికి కలిగించే ఏర్పాటుగా కూడా భావించే వీలుంది.

కేంద్ర ప్రభుత్వం ఓ కమీషన్ వేసి, శాస్త్రీయ పద్ధతిలో నివేదిక సమర్పించి, ఒక్కో రాష్ట్రంలో కనిపించే ఒక్కో పరిస్థితిని వివరించి, ఆయా రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వ మార్గ నిర్దేశాలను అనుసరించి కొన్ని అవకాశాలను ఇవ్వడానికి ఆయా శాసనసభలకే అధికారం కట్టబెట్టవచ్చు లేదా ఉమ్మడిగానే ఒక మార్గాన్ని సూచించవచ్చు. అప్పటి వరకు కొన్నివర్గాలు నష్టపోతున్నాయనే వాస్తవాన్ని గుర్తించి, తక్షణం రాష్ట్ర శాసనసభ ఆమోదించిన తీర్మానం ప్రకారం అవసరమైతే అభివృద్ధిలోకి వచ్చిన దళితులు తమ సహ దళితుల కోసం కొన్ని

త్యాగాలకు సిద్ధం కావలసిన సమయం ఆసన్నమయ్యిందని చెప్పడంలో రచయిత దళిత సమస్యకు నిష్కల్మష దృష్టికోణాన్ని చూపుతున్నాడు. ఇతరుల నుండి పొందడానికి సిద్ధంగా ఉన్నవాళ్ళు, ఇతరులకు నిజాయితీగా తమ అవసరాలు తీరాయని ఒప్పుకొని, అవకాశాలను 'త్యాగం' చేయడానికి దళితులు ఎంత మంది సిద్ధంగా ఉన్నారని అడగడం అనేది కేవలం మాలలనో, ఆ ఉపకులాలనో మాత్రమే కాదు. అలాంటి అభివృద్ధికి చేరువైన మాదిగ, ఉపకులాల వారికి కూడా ఈ సూత్రం అన్వయిస్తుంది.

ఈ గ్రంథంలో సాంబయ్య ప్రతిపాదనలను కింది అంశాలుగా వింగడించే అవకాశం ఉంది.

1) వర్గీకరణతోనే దళిత సమస్యలన్నీ పరిష్కారమైపోతాయనే దానితో గ్రంథ కర్త కూడా విభేదిస్తున్నాడు. కానీ, దళిత సమస్యల పరిష్కారంలో మొదటి మెట్టుగా, లేదా ఒక్కో మెట్టుగా సమస్య పరిష్కారమనేది సాధించటంలో 'వర్గీకరణ'ను ఒకటిగా గుర్తించమంటున్నాడు. దీనికి అవసరమైతే క్రీమీలేయర్ విధానాన్ని కూడా పాటించడం వల్ల నిజమైన దళితులకే అవకాశాలు అందుబాటులోకి రాగలిగి, రిజర్వేషన్ల లక్ష్యం నెరవేరుతుందంటున్నాడు.

2) వర్గీకరణ వాదానికి బ్రాహ్మణత్వ భూమికను రచయిత అంగీకరించడం లేదు. బ్రాహ్మణత్వ/ హిందూత్వ భావాలతో వర్గీకరణను సమర్థించే పార్టీలు ఉన్నా, అదే ప్రభావం పూర్తిగా వర్గీకరణ సమర్ధనకు ఉందనడం సమంజసం కాదంటున్నాడు. దీన్ని సోపపత్తికంగా నిరూపించాడు.

3) పేర్ల వెనుక ఉండే కుల సూచికల పట్ల కూడా రచయిత దృష్టి కేంద్రీకరించడం కనిపిస్తుంది. 'కుల అస్తిత్వం' సమాజంలో వ్యక్తి అస్తిత్వాన్ని నిర్ణయించింది. "అస్పృశ్యులు"గా ఉన్న వాళ్ళే అంతర విభజనలకు గురై వారి కుల సూచికలను గౌరవప్రదంగా భావించుకోవడం వల్లనే గౌరవాన్ని పొందగలిగారు. కానీ, మాల - మాదిగల కుల సూచికలు బలవంతపు ఆరోపిత కుల సూచికలు. నిందార్థంలో, నీచార్థంలో అంగీకరింపజేసినవి. అయినా వాటితోనే 'తిరుగుబాటు తత్వం'తో గౌరవప్రదంగా మార్చుకోగలగాలంటున్నాడు గ్రంథ కర్త. ఈ విషయంలో అంబేద్కరిజమ్తో కొంచెం లోతుగా ఆలోచించవలసిన అవసరం ఉంది. కానీ, ప్రత్యామ్నాయాన్ని ఆలోచించి, అది అందరికీ ప్రసరింపజేయడం కంటే, ఉన్న దానిలోనే ఔన్నత్యాన్ని సాధించుకోవడం అనే పద్ధతి కూడా ఉంది. ఆ పద్ధతిలోనే ఆపాదిత గౌరవం కుల సూచికలకు ఏర్పడుతుంది. దీన్నింకా లోతుగా చర్చించవలసిన అవసరం ఉంది! ఈ విషయంలో ఇక్కడ మాదిగ దండోరా సాధించిన సాంస్కృతిక ఔనత్యాన్ని గ్రంథ కర్త సిద్ధాంతీకరించే ప్రయత్నం కనిపిస్తుంది.

4) ప్రభుత్వ రంగంలో ఉపాధి అవకాశాలు కోల్పోయిన తర్వాత ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ల కోసం దళితులు ఉమ్మడిగా పోరాడవలసిన తరుణంలో, వర్గీకరణ చేటు తెస్తుందనే విషయాన్ని సునిశితంగానే పరిశీలించగలిగాడు. ప్రభుత్వ ఉపాధి అవకాశాల్లో ఉన్న కొద్దిపాటి అవకాశాలనే మాదిగ, తదితర ఉపకులాల వారికి లభించనివ్వని వాళ్ళు, రేపు ఉమ్మడిగా ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లు సాధిస్తే అప్పుడు ఆ అవకాశాల్ని పొందనిస్తారని ఎలా నమ్మగలమని సహేతుకంగానే ప్రశ్నిస్తున్నాడు. రెండో కోణంలో ప్రభుత్వ ఉపాధి అవకాశాలు ఇప్పటికే కోల్పోయినా, ఇకపై రాబోయే ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లనయినా కాపాడుకోవాలంటే వర్గీకరణ ఉండవలసిందే అనేది మరో వాదనగా ముందుకి తీసుకొస్తున్నాడు.

5) రాజ్యాధికార భావన గురించి ఆచరణాత్మక సిద్ధాంతాన్ని ఈ గ్రంథంలో ప్రతిపాదించి, 'దళిత రాజ్యాధికారం' అనే దానికి కొత్త నిర్వచనానివ్వగలుగుతున్నాడు రచయిత. అంబేద్కరిజం పునాదిగానే దీని విస్తృతపరిచే ప్రయత్నం చేశాడు. రాజ్యాధికారం రావడానికి ముందుగా వర్గీకరణ వాదాన్ని అంగీకరించవలసి ఉంటుందంటున్నాడు. అలా వీలుకానంత వరకూ దళితుల పేరుతో మాలలు మాత్రమే రిజర్వేషన్ అవకాశాలను అనుభవిస్తున్నారనేది దళిత సమైక్యత పేరుతో జరిగే కౌటిల్యాన్ని మాదిగలు గుర్తించగలిగారనేది గ్రంథకర్త విశ్లేషణ. దీనితో పాటు ప్రభుత్వ విద్యలో సంస్కరణలు రావాలనేది కూడా రచయిత ఆకాంక్షగా కనిపిస్తుంది. అలా కాకపోతే రిజర్వేషన్ల లక్ష్యం దెబ్బతినే ప్రమాదం ఉందంటున్నాడు. ఇది కేవలం దళితుల్లోని ఒక వర్గ ప్రయోజనాన్ని మాత్రమే ఆకాంక్షించేది కాదు. వర్గీకరణానంతరం దళితుల శాశ్వతాభివృద్ధికి సంబంధించిన తాత్త్విక ఆలోచన. కనుక, ఈ గ్రంథంలో కేవలం దళితుల్లో ఒక వర్గాన్ని గుడ్డిగా సమర్థిస్తున్నాడనుకోవడానికి వీలులేదు.

ఇలా దళిత సమస్యకు వర్గీకరణ వాదంతో 'పంచసూత్ర సిద్ధాంతాన్ని' ఈ గ్రంథంలో ప్రతిపాదించి, ఒక చారిత్రక పత్రం (Historical Document)గా దీన్ని రూపొందించాడు. ప్రతి పల్లె మూలమూలకీ ఈ భావజాలం ప్రచారం కావలసి ఉంది. ఒక వర్గం ఎలా రామాయణం, భారతం, భాగవతాలు చదివించుకుని ఆనందిస్తుందో, అలా ఈ చారిత్రక పత్రం ప్రతి దళితుడూ చదివి/ చదివించుకొని ఆలోచించమంటున్నాడు. వర్గీకరణ పోరాటంలో భాగస్వామ్యం కల్పించుకొని, వర్గీకరణను సాధించుకొనే దిశగా ప్రేరేపిస్తున్నాడు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ఆమోదించిన తీర్మానాన్ని అనుసరించి, రాష్ట్రపతి విడుదల చేసిన ఒకప్పటి ప్రత్యేక చట్టం వలే గానీ, ప్రత్యేక ఉత్తర్వుతో గానీ మాదిగ, అనుబంధ ఉపకులాలు వారి హక్కులను తక్షణం పరిరక్షించాలనేదే గ్రంథకర్త వాదంలోని సారాంశం. అదే ప్రధానంగా మాదిగ దండోరా నాయకులు కూడా కోరుకునేది. మాదిగ, తదితర ఉపకులాలు ఆశించేది! అంతవరకు కేవలం క్రిమీలేయర్, ప్రాంతాలవారీ రిజర్వేషన్లు, గ్రామీణ, పట్టణ దళితుల విభజన, రాజ్యాధికారం వంటివన్నీ తర్వాత ఆలోచించవలసిన విషయాలయినా ప్రాధాన్యక్రమాన్ని పాటించవలసి ఉంటుందని విశ్లేషిస్తున్నాడు.

గ్రంథాన్ని చక్కని శైలిలో రాశాడు. వాక్యాల్లో అక్కడక్కడా హృదయం నుండి పొంగిపొరలే కవిత్వ ధార కూడా కనిపిస్తుంది. స్పష్టతను, ఆత్మీయతను మరింత అర్థవంతంగా చెప్పాలనుకునే అక్షర వేదనగా దీన్ని అర్థం చేసుకోవాలి. సామాన్యుడికి అందే విధంగా తన భావాల్ని బాగా పంచుకోగలిగాడు. ప్రస్తుతం దళితుల్లో సాంఘిక శాస్త్రాల అధ్యయనం వల్ల రాటుదేలిన Social Scientists రావలసిన అవసరం ఉంది. అలాంటి Social Scientists వైయక్తిక అభివృద్ధి కంటే, వ్యవస్థ అభివృద్ధికి తోడ్పడగలుగుతారు. ఆ లక్షణాలు సాంబయ్య గుండిమెడలో కనిపిస్తున్నాయని ఈ పుస్తకం చదివిన వారి అందరికీ అనిపిస్తుంది. ఇంకా అనేక కొత్త ఆలోచనలు గ్రంథంలో ఉన్నాయి. గ్రంథంలోనికి వెళ్ళండి. బయట సమాజంలోని వాస్తవికతను అర్థం చేసుకోండి. నిజమైన న్యాయాన్ని బలపరచండి.

# దళిత సాహిత్యం మాదిగ దృక్పథం

నీగ్రో సాహిత్య ప్రభావంతో భారతదేశంలో దళిత సాహిత్యం ఒక స్పష్టమైన రూపంతో ముందుకొస్తే, ఆంధ్రప్రదేశ్లో దళిత ఉద్యమంలో; దళిత సాహిత్యంలో జరుగుతున్న అంత: సంఘర్షణ ఫలితంగా మాదిగ దండోరా ఉద్యమం; మాదిగ సాహిత్యం ప్రారంభమైంది. దళిత ఉద్యమమైనా, దళిత సాహిత్యమైనా రావడానికి గానీ, మాదిగ దండోరా ఉద్యమమైనా, మాదిగ సాహిత్యమైనా రావడానికి గానీ "వివక్షే" ప్రధాన కారణం. దళితుల ఆత్మగౌరవ ప్రతిఫలన దిశగా 1985 తర్వాత దళిత సాహిత్యం స్పష్టమైన ప్రణాళికతో వచ్చింది. అంతే స్పష్టతతో సుమారు ఒక దశాబ్దం కూడా కాకముందే, అంటే 1996 నుండే మాదిగ సాహిత్యం కూడా తనదైన ప్రణాళికతో మాదిగ సాహిత్యం పేరుతోనే ముందుకొచ్చింది.

మాదిగ హక్కుల దండోరా నేపథ్యంతోనే వచ్చినా, కేవలం ఆ హక్కులను అందరికీ సృజనాత్మక సాహిత్యం ద్వారా చేరవేయాలనేదే ఏకైక లక్ష్యం మాత్రం కాదని మాదిగ సాహిత్యాన్ని లోతుగా అధ్యయనం చేసిన వారికి అర్థమవుతుంది. తమని అన్ని రకాలుగానూ విస్మరించిన పరిస్థితుల నుంచి, తమ పేరుతో ఇతరులు దోపిడీకి ప్రయత్నిస్తున్న వాస్తవిక జీవితాల నుంచీ మాదిగ సాహిత్యం తన సొంత గొంతుని వినిపించడం తప్పనిసరైన చారిత్రక పరిస్థితుల నుంచీ ఆవిర్భవించింది. అయినా, నేటికీ చాలా మంది దళిత సాహితీ వేత్తలు మాదిగసాహిత్యం పేరుతో ఒక ప్రత్యేక వాదం అవసరంలేదనీ, అదికూడా దళిత సాహిత్యమేననీ వాదిస్తూ, మళ్ళీ మాదిగలను విస్మరించడానికి ప్రయత్నిస్తున్నారు. అగ్ర వర్ణాల వారినీ, వర్గ స్వభావాన్ని ప్రదర్శించే వారినీ మాదిగల గురించి రాయనివ్వకపోతే, మాదిగల గురించి మాదిగలు కాక మరెవ్వరు రాసుకోవాలనే అభిప్రాయాలు మాదిగ సాహిత్యకారుల నుండి ఎదురవుతున్నాయి. మాదిగ సాహిత్యం అలా ప్రారంభం కావడం వెనుక ఎంతో నేపథ్యం ఉంది. ఎన్నో చారిత్రక పరిణామాలున్నాయి. వాటిని సహృదయతతో అవగాహన చేసుకోకపోతే, మాదిగ సాహిత్యం

వచ్చిన స్థితి గతులు అర్థం కావు.

మాదిగ సాహిత్యం ప్రారంభం, దాని కొనసాగింపులలో గల చారిత్రక పరిణామాలను మూడు విధాలుగా విభజించుకునే అవకాశం ఉంది.

1) మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎం.ఆర్.పి.ఎస్) పోరాటానికి ప్రేరణగా సాహిత్యం సృజనీకరించే ప్రయత్నం నుండి మాదిగ సాహిత్యం పాటలతో, కర పత్రాలతోనే ప్రారంభమైంది. దీన్ని మాదిగ హక్కుల ప్రచార దశగా అభివర్ణించుకోవచ్చు. తమ మాదిగ జాతికి జరుగుతున్న అన్యాయాలను అందరికీ తెలియజేయడం, సాధ్యమైనంతమంది అందరిచేతా మాదిగలు అడిగే వర్గీకరణ ఫలితాల వాదనను అంగీకరించాలనే ప్రయత్నం సహజంగానే ఈ దశలో జరుగుతుంది. అదే మాదిగ కవులు రాసిన తొలి దశ కవిత్వంలో ప్రతిఫలించింది. అలా అడగటంలో అప్పుడే కలం పట్టిన కవుల్లో ఉండే ఆవేశం మాదిగ కవుల కవితల్లోనూ ఉండక తప్పదు. ఉద్యమ ఆధారంగా వచ్చే ప్రతి సాహిత్యంలోనూ ఇలాంటి ఆవేశం అక్కడక్కడా కనిపిస్తుంటుంది. అదే మాదిగ సాహిత్యంలోనూ జరిగింది. అయితే, ఆ ఆవేశం సహజంగానే తమకు శాశ్వత శత్రువు కాకపోయినా, ప్రత్యక్షంగా, తక్షణం ఆటంకంగా నిలిచే తమ సోదర దళితులైన మాలల పైనే వ్యక్తమవ్వడం వల్ల, మాదిగ సాహిత్యం ప్రారంభంలోనే విమర్శలను ఎదుర్కోక తప్పని పరిస్థితి ఏర్పడింది. నిజానికి ఇంత కంటే తీవ్రంగా ఉమ్మడి దళిత సాహిత్యంలో దళితేతరులను నిరసిస్తూ కవిత్వం వచ్చింది. కానీ, దాన్ని సమర్థించే వర్గం అప్పటికే తయారుగా ఉంది. అది మాదిగ సాహిత్యంలో జరగలేదు. కనుక, మాదిగ సాహిత్యం తొలి దశలోనే అనేక ఒడిదుడుకులను ఎదుర్కోవలసి వచ్చింది.

2) దళిత సాహిత్యంలోనే కాకుండా, యావత్తు సాహిత్యంలోనే మాదిగలు తమ మాదిగ సాహిత్య అస్తిత్వాన్ని నిలుపుకోవాలని భావించి ముందుకు రావాలనుకున్నారు. ఒక వైపు మాదిగ హక్కుల దండోరా ఉద్యమాన్ని సమర్థిస్తూనే, దానికి కావలసిన సాహిత్యాన్ని వివిధ కరపత్రాలు, పాటలు, వీధి నాటికల రూపంలో అప్పటికప్పుడు మౌఖిక, లిఖిత సాహిత్య పద్ధతుల్లోనూ అందిస్తూనే, కవులను, కళాకారులను సంఘటిత పరిచే మార్గంలో నడిచింది. ఒక వైపు తమ ప్రాచీన మూలాలను జానపద, మౌఖిక సాహిత్యాలలో వెతుక్కోవడం, మరొకవైపు మాదిగ హక్కుల దండోరాకు సహకరించే భావజాలాన్ని అందించే ప్రయత్నం చేయడం జరిగింది. ఈ పరిస్థితుల్లో, అప్పటికే ఉమ్మడి దళితుల పేరుతో వ్యవస్థీకృతమైన వారిలో కొంతమంది, కలం పేర్లతో, చాటుమాటుగా సంధించే విమర్శలకు తగిన సమాధానాలను చెప్పడానికి ప్రయత్నించే ఈ కాలాన్ని మాదిగ అస్తిత్వ సంఘర్షణ దశగా అభివర్ణించవచ్చు. ఈ దశలోనే హైదరాబాదు లోని గోల్కొండ హొటల్లో మాదిగ కవులను, రచయితలను, కళాకారులను, మాదిగ మేధావులు సమావేశ పరిచారు. మాదిగ హక్కుల కోసం తమ కలాలను, గళాలను స్పందించాలన్నారు. ఆ సమావేశానికి రాష్ట్రంలోని మాదిగ, దళితుల్లోని అనేక ఉప కులాల వాళ్ళు హాజరైయ్యారు. ఆ సమావేశంలో పాల్గొన్న మాదిగ హక్కుల పోరాట సమితి నాయకులు, మాదిగ మేధావులు ఉత్తేజకరమైన ప్రసంగాలు చేశాడు. ఆ స్ఫూర్తితో కొంతమంది మాదిగ సాహిత్యాన్ని సృజనీకరించే ప్రయత్నం జరిగినా,

అది చాలా వరకూ వ్యక్తిగత స్థాయిలోనే జరిగింది. ఒక బలమైన సాంస్కృతిక శాఖను ఎం.ఆర్.పి.ఎస్ ఏర్పాటు చేయకపోయింది. కానీ, తమ ఉద్యమానికి కావలసిన పాటలను, నినాదాలను, పోస్టర్ సాహిత్యాన్ని అనుభవజ్ఞుల దగ్గర నుండి ఉపయోగించుకోవడానికి ప్రయత్నించడం ద్వారా కూడా మాదిగ అస్తిత్వ సంఘర్షణ ఎదురైంది. ఈ దశలో ఎదురైన అనుభవాలనుండే మాదిగ సాహిత్య వేదిక ఏర్పడింది.

3) మాదిగ హక్కుల దండోరా ఉద్యమానికి వాళ్ళు అడిగినా, అడగకపోయినా, సహకరించినా, సహకరించకపోయినా కొన్ని స్పష్టమైన ఆశయాలు, లక్ష్యాలతో మాదిగ సాహిత్య వేదికను స్థాపించటం జరిగింది. దీని ద్వారా వ్యవస్థీకృతంగా మాదిగ జీవితాలను అధ్యయనం చేసి, గత, వర్తమాన, భవిష్యత్తు తరాల మాదిగల సర్వ కోణాలను ఆవిష్కరించి, మాదిగల అస్తిత్వం కోసం కృషిచేయాలనే ప్రయత్నం మాదిగ సాహిత్య వేదిక లక్ష్యాలలో కనిపిస్తుంది. ఈ కాలాన్ని మాదిగ సాహిత్య వ్యవస్థీకృత దశ అనవచ్చు. ఈ దశలో మాదిగ సాహిత్య వేదిక ఏర్పడి, మాదిగలకు ఒక ప్రత్యేక సంస్కృతి ఉందని చాటి చెప్తూ, ఆత్మగౌరవంతో ప్రత్యేక సాహిత్య వాదంతో నిలబడాలనుకోవడం కూడా కనిపిస్తుంది. మాదిగ సాహిత్యం ఒక వాదంగా రావడం వెనుక ఒక బలమైన ఆలోచనే ఉందని దీన్ని గమనించిన వారికి తెలుస్తుంది. దీన్ని గమనించి కూడా దీన్ని పట్టించుకోకుండా కేవలం దళిత సాహిత్యంలో అంతర్భాగంగా మాత్రమే చూస్తే, ఈ చారిత్రక పరిణామాలు కేవలం ఊహాపరికల్పనలుగా మాత్రమే పరిగణిస్తారు.

పై విశ్లేషణను చూసినప్పుడు, "దళిత సాహిత్యం" షెడ్యూల్డు కులాల్లోని అన్ని ఉపకులాల పేరుతో వెలువడిన సాహిత్యమైతే, మాదిగ సాహిత్యం దళితుల లోని ఒక ఉపకులమైన మాదిగలనే ప్రధాన కేంద్రంగా చేసుకొని అంతర్వివక్షను కూడా నిలదీసే ప్రయత్నంతో వచ్చిన నిర్దిష్టమైన కుల సాహిత్యం అవుతుంది. నిర్దిష్ట కుల సాహిత్యం అనగానే కుల వ్యవస్థను కాపాడే ఆశయంతో కాకుండా కులం పేరుతో జరుగుతున్న వివక్షను ప్రశ్నించే దిశగా ఒక కులాన్ని ప్రధాన కేంద్రంగా చేసుకొని కుల నిర్మూలన కోసం చైతన్యవంతంగా కృషి చేసే సాహిత్యం మాదిగ సాహిత్యం అని అర్థం చేసుకోవలసి ఉంది.

మాదిగల పుట్టుక, వారి వృత్తులు మొత్తం మీద వారి సంస్కృతిని మానవీయ కోణం నుండి చూపించే ప్రయత్నం చేస్తుంది మాదిగ సాహిత్యం. దళిత ఉద్యమానికి ఉన్నట్లే, మాదిగ సాహిత్యానికీ స్పష్టమైన లక్ష్యాలు కనిపిస్తున్నాయి.

అన్ని కులాల వారినీ గౌరవించినట్లే మాదిగలనూ, వారి వృత్తినీ గౌరవించాలని కోరుకోవటం.మాదిగల సంస్కృతిని కించపరచకుండా, మాదిగల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని భావించటం.

ప్రతి కులానికీ, జాతికీ ప్రత్యేక అస్తిత్వం, సంస్కృతి ఉంటాయని ప్రబోధిస్తూనే, షెడ్యూల్డు కులాలు, తెగల్లోని అన్ని ఉపకులాలను చైతన్య పరచటం.

ఒక కులం లేదా జాతి పేరుతో ఆధిపత్యాన్ని చెలాయించే సంస్కృతికి చరమగీతం పాడి, అందరికీ ఆత్మగౌరవాన్ని కలిగించాలనుకోవడం. అవసరమైతే ఆత్మగౌరవం కోసం

ప్రారంభంలో వ్యవస్థీకృత కుల చిహ్నాలను కూడా తమ పేర్లకు తగిలించుకొని, 'ఉష్ణం ఉష్ణేణ శీతలం' అన్నట్టు 'కులం' కులంతోనే పోవాలనీ అందుకు కులాన్నే ఆయుధంగా వాడుకోవాలనీ భావించటం. సమాజంలో కొన్ని కులాలకు గౌరవ మర్యాదలు ఉంటూ, మరి కొన్నికులాలకు ఆ గౌరవ మర్యాదలు దక్కనప్పుడు వ్యవస్థీకృత కుల చిహ్నాలతోనే పోరాడడమనేది కుల నిర్మూలన చైతన్యం ఎలా అవుతుందనే సందేహం చాలా మందికి రావచ్చు. అందరూ తమ తమ కులాలను, కుల చిహ్నాలను వివిధ రకాలుగా ప్రదర్శించుకోవడం వలన కొన్నాళ్ళకు వాటి పట్ల వ్యతిరేకమైన అభిప్రాయం ఏర్పడి, చివరికి కుల చిహ్నాలనే విస్మరించటం జరుగుతుంది. దానికి కేవలం కులాధారిత విభజన మాత్రమే కాకుండా, ఆర్థికపరమైన వర్గ విభజన కూడా తోడవుతుంది. క్రమేపీ, వర్గ విభజనే ప్రధానమై, అదే ముందుకు వచ్చినప్పుడు సమాజంలో కులం అంతరించిపోతుంది. సమాజం వర్గ విభజనను ప్రధానం చేసుకోవాలనుకుంటే భారతదేశంలో కులమే ప్రధాన అవరోధంగా నిలుస్తుంది. కులం ఆధారంగానే అన్ని సౌకర్యాలు, అసౌకర్యాలు లభిస్తున్నాయి. కనుక, కులాన్ని కులంతోనే నిర్మూలించాలనేది మాదిగ దండోరా ఉద్యమం, మాదిగ సాహిత్య లక్ష్యాలలో ఒకటిగా కనిపిస్తుంది.

కులాన్ని కులంతోనే నిర్మూలించటం అనేది అనేక ఉపకులాల, బలహీన వర్గాల వ్యక్తిగత అభివృద్ధితో కూడిన సమైక్య ఉద్యమాలతోనే సాధ్యమవుతుంది. అది ప్రథమ దశగానూ, ఆ తర్వాత అన్ని కులాలలోను వర్గ విభజనే ప్రధానమై వర్గ పోరాటానికి దారి తీయడం అంతిమదశ. ఈ దార్శనికతతోనే మాదిగ దండోరా ఉద్యమం, మాదిగ సాహిత్యం పయనిస్తుందనిపిస్తుంది. అందుకనే, బలహీన వర్గాలతో కలిసి రాజ్యాధికారానికై రావాలనే ఆశయం కూడా మాదిగ దండోరా ఉద్యమంలో కనిపిస్తుంది. రాజ్యాధికారానికి వచ్చినా, రాకపోయినా మాదిగలు, మాదిగలవంటి వివక్షకు గురవుతున్న ఉపకులాలన్నీ ప్రధాన జీవనస్రవంతిలోకి రాగలుగుతాయి. అప్పుడు ఉమ్మడి ప్రయోజనాల కోసం, ఉమ్మడిగా పోరాడతాయి. కనుక, ప్రస్తుతం రావలసిన హక్కులను సాధించుకోవడం తక్షణ కర్తవ్యంగా గుర్తించి, తమహక్కుల తక్షణ సాధనకోసం అడ్డంకి పడేవారితోనే తమ తొలి సంఘర్షణ, పోరాటం తప్పదని మాదిగ ఉద్యమంతో పాటు, మాదిగ సాహిత్యం కూడా ముందుకెళ్ళడం కనిపిస్తుంది.

దళిత ఉద్యమం, దళిత సాహిత్యాలలో ఉమ్మడి ప్రయోజనాల పేరుతో అనేక ఉప కులాల వాస్తవికతను విస్మరించి, కొన్ని ఉపకులాలకే ప్రయోజనకరం చేసుకొని, అన్ని ఉపకులాల ప్రయోజనంగా ప్రచారం చేయడం కూడా కనిపిస్తుందనే విమర్శ అత్యంత ప్రధానంగా కనిపిస్తుంది.

ఇలాంటి అనేక లక్ష్యాలతో మాదిగ సాహిత్యం ప్రారంభమైనా, దాన్ని అర్థం చేసుకోవటంలో వ్యాఖ్యానించటంలో వక్ర మార్గాలను పట్టించినవారు ఉన్నారు. కేవలం షెడ్యూల్డు కులం లోని రిజర్వేషన్లో తమ వాటా కోసమే మాదిగ దండోరా ఉద్యమం వచ్చినట్టు, దాన్ని ప్రచారం చేయడానికే మాదిగ సాహిత్యం పుట్టుకొచ్చినట్లు చెప్పడం సరైంది కాదు. అలా చెప్పడం

లేదా అలా ప్రచారం చేయడం అనేక తరాలుగా సమాజానికి దూరంగా బతుకుతున్న వారి ఆవేదనను కనీసం వినకుండా వారి సమస్యలను సరైన కోణంలో అర్థం చేసుకోకపోవడమే కాక, మాదిగల మానవీయ స్పందనను వినకుండా, వినే అవకాశం లేకుండా చేసే అప్రజాస్వామిక ధోరణే అవుతుంది. చారిత్రక విషాదమేమిటంటే, అగ్రవర్ణ, వర్గపోరాట స్వభావం గల సాహితీ వేత్తలు కూడా మాదిగల వాదన, వేదనలల్లో ప్రజాస్వామిక ధోరణి కనిపిస్తుందని అంటున్నా, "సమైక్యదళిత" వాదులు మాత్రం దాన్ని అంగీకరించలేకపోతున్నారు. జరుగుతున్నదాన్నంతా అగ్రశ్రేణి రచయితలు, మేధావులు, ఉద్యమ నాయకులు మౌనంగా చూస్తున్నారు.

దళిత ఉద్యమం సమైక్యత పేరుతో "దళితు"లలోని... ఇంకా స్పష్టంగా చెప్పాలంటే మాల - మాదిగలలో మాలల నాయకత్వంలో జరిగిన ఉద్యమం, మాలల అభివృద్ధి కోసమే జరిగే ఉద్యమంగా దళిత ఉద్యమాన్ని చాలా మంది మాదిగలు గుర్తిస్తున్నారు. అప్పటి సాహితీవేత్తలకు వీరిపట్ల సరైన అవగాహన లేకపోవడం వల్ల మాల - మాదిగల మధ్య భేదాన్ని పెద్దగా పాటించలేదు. పరిశోధన దృష్టితో చూస్తే అప్పుడు మాల - మాదిగ శబ్దాలు ప్రధానంగా మాదిగలను సూచించేవనని స్పష్టమవుతుంది. సంస్కృతి పరంగా చూసినప్పుడు కూడా ఈ విషయం తెలుస్తూనే ఉంది. మాదిగల వృత్తి, పనిముట్లు మొదలైన వాటిని అనుసరించి చూసినప్పుడు ప్రాచీన సాహిత్యంలో మాదిగలను కూడా మాలలగానే సంభోదించారని నిరూపితమవుతుంది. అలాంటి మాదిగ జీవితాలను కూడా మాల శబ్దం ఉన్నవాళ్ళందరినీ దళిత, దళితేతర రచయితలు వక్రీకరించే ప్రయత్నం చేశాడు.

దళితేతరులు తెలియక చేస్తే, దళితులు కావాలనే మాదిగలను కూడా మాలలుగా వివరించే ప్రయత్నం కనిపిస్తుంది. గుర్రం జాషువా, మాల - మాదిగల మధ్య భేదాన్నీ వారి మధ్య ఉన్న అంతర్విభేదాలను చెప్పే ప్రయత్నం చేశాడు. వీరిద్దరి మధ్యా సఖ్యత ఉండాలనేది కవి గారి ఆశయం. అయినా, గుర్రం జాషువా నాటికైనా మాల - మాదిగల మధ్య గల అనైక్యతనీ, కలవనితనాన్నీచెప్పినట్లైంది. గుర్రం జాషువా తండ్రి మాదిగ యువతిని వివాహం చేసుకున్నాడు. ఆ విధంగా మాదిగలకు ప్రాధాన్యతను ఇవ్వకూడదని గుర్రం జాషువాను తొలి దళిత కవిగా అంగీకరించని పరిస్థితి కనిపిస్తుంది. మాల కులస్థుడైన కుసుమ ధర్మన్నను తొలి దళిత కవిగా ప్రచారం తీసుకొచ్చే ప్రయత్నంలో మాదిగ సాంస్కృతిక వారసత్వ పునాదులపై దాడి చేయటంగా కొంతమంది మాదిగలు భావిస్తున్నారు. అలాగే, దళిత సాహిత్యానికి తెలుగులో నేపథ్యాన్ని అందించిన ఒక గొప్ప కవి గుర్రం జాషువాని కాదని బోయి భీమన్న పేరుతో విశ్వ విద్యాలయ స్థాయిలో పీఠాలను ఏర్పాటు చేయటం వెనుక దళితుల పేరుతో మాదిగ సాంస్కృతిక పునాదిని తిరస్కరించే ప్రయత్నమేనసే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

దళిత ఉద్యమకారులు, సాహితీవేత్తలు "హరిజన పదాన్ని" ముక్త కంఠంతో వ్యతిరేకిస్తుంటే, తన జీవితాంతం వరకూ బోయి భీమన్న "హరిజన" పదాన్నే సమర్థించుకున్నారు. అంతేకాదు, "దళిత" పదాన్ని తీవ్రంగానే వ్యతిరేకించారు. అలాంటి

బోయి భీమన్నకు, గుర్రం జాషువా కంటే ముందు గానే విశ్వ విద్యాలయ స్థాయిలో పీఠం వేయడం వెనుక ఉన్న రాజకీయాన్నీ అర్థం చేసుకోవలసి ఉందని కొంతమంది భావిస్తున్నారు. ఇలా మౌఖికంగా ప్రసంగాల రూపంలోనూ,లిఖితంగా కవిత్వం, కథలు, వ్యాసాల రూపంలోనూ మాదిగలు తమకీ, తమ వర్గానికీ జరుగుతున్న వివక్షను వివిధ రూపాలలో వ్యక్తం చేస్తున్నారు.

మాదిగలకు జరుగుతున్న వివక్షను ప్రశ్నిస్తూ మొట్ట మొదటిసారిగా ఎండ్లూరి సుధాకర్ *దండోరా* అనే ఒక కవితను రాశారు. ఆ తరువాత 1996లో నాగప్పగారి సుందర్రాజు *చండాల చాటింపు* కవితా సంపుటిని ప్రచురించారు. 1997లో *మాదిగ చైతన్యం* పేరుతో మాదిగలే రాసిన కవిత్వాన్ని ఒక సంకలనంగా మాదిగ సాహిత్య వేదిక వాళ్ళు ప్రచురించారు. ఈ మాదిగ సాహిత్య వేదిక, సెంట్రల్ యూనివర్సిటి, హైదరాబాదులో దళిత సాహిత్య వేదిక నుండి విడివడి మాదిగల అస్తిత్వాన్ని నిరూపించుకుంటూ ఏర్పడిన వేదిక. రాష్ట్ర వ్యాప్తంగా అనేక శాఖలతో వేలాది మంది ప్రజల మధ్య పుస్తక ఆవిష్కరణలతో మాదిగ సాహిత్య వేదిక మాదిగల వాదాన్ని ముందుకు తీసుకెళ్ళే ప్రయత్నాన్ని చేసింది. నాగప్పగారి సుందర్రాజు *మాదిగోడు* పేరుతో కథలు ప్రచురించారు. ఈ కథలన్నీ మాదిగ జీవితాలను ఎలా సాహిత్యీకరించాలో చెప్పే నమూనా కథలని చెప్పవచ్చు. ఆ తరువాత కాలంలో మాదిగ సాహిత్యం విస్తృతంగానే వచ్చింది.

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎం.ఆర్.పి.ఎస్) రిజర్వేషన్ల కోసం పోరాటం చేస్తుంటే, మాదిగ ఆత్మగౌరవ పోరాట సమితి మాదిగ హక్కులు, మాదిగ సాహిత్య స్థితిగతులను వివరిస్తూ ముందుకు వెళ్ళేది. అయితే, మాదిగలలో వచ్చిన అంతర్విభేదాలు కూడా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిలో చిన్న చిన్న మనస్పర్థలకు కారణమై విభిన్న శాఖలుగా విడి వడిన ప్రయత్నం కూడా కనిపించింది. మాదిగ విద్యావంతులు మాదిగ ఆత్మగౌరవ పోరాట సమితికి అండగా నిలిచి నడిపించారనే వాదనలు కూడా ఉన్నాయి. తరువాత కాలంలో కూడా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిలో వ్యవస్థాగత ఘర్షణలు కొన్ని జరిగినా, భిన్న పద్ధతులలో విభిన్నమైన పేర్లతో మాదిగల హక్కుల కోసం ఉద్యమాలు జరుగుతూనే ఉన్నాయి. మందకృష్ణ మాదిగ, కృపాకర్ మాదిగల మధ్య వచ్చిన కొద్దిపాటి విభేదాలు మాదిగ దండోరా ఉద్యమాన్ని కొంత నిర్వీర్యం చేసినా, మందకృష్ణ మాదిగ నాయకత్వం లోని మాదిగలు తమ హక్కుల కోసం ఉద్యమిస్తునే ఉన్నారు. కృపాకర్ మాదిగ ఏవో సైద్ధాంతిక కారణాల వలన మందకృష్ణ మాదిగతో కలిసి పని చేయకపోయినా, తనదైన పద్ధతులలో మాదిగ హక్కుల కోసం పని చేస్తూనే ఉన్నారు. కృపాకర్ మాదిగ మాదిగల వాదాన్ని పత్రికలలో వ్యాసాలను పుంఖాను పుంఖాలుగా ప్రచురిస్తూ ముందుకు తీసుకువెళ్తూనే ఉన్నారు. అంతేకాకుండా, మాదిగ సాంస్కృతిక జీవన ప్రతిఫలనాన్ని రికార్డు చేసే ప్రయత్నం చేస్తున్నారు. త్వరలో మాదిగ జీవితాలను అన్ని కోణాలనుండీ అభివ్యక్తీకరించిన కవితలను సేకరించి కైతునకలదండెం కవితా సంకలనం రూపంలో తీసుకొచ్చారు.. ఆయనకు తెలంగాణ నుండి మాదిగ జీవిత వాస్తవికతను బలంగా

వ్యక్తీకరిస్తున్న జూపాక సుభద్ర తోడు కావడంతో మాదిగ జీవిత సాంస్కృతిక అంశాలను మరింత సమర్థవంతంగా అందించే అవకాశం కనిపిస్తుంది. కనుక, మాదిగ ఉద్యమం; మాదిగ సాహిత్యం రెండు మార్గాలుగా పయనిస్తూనే ఉంది.

ఇక ప్రస్తుతం, మాదిగ సాహిత్యం విషయానికి వస్తే, మాదిగల వాదాన్ని అత్యంత శక్తివంతంగా సాహిత్యంలో వినిపించిన కవి రచయిత ఎండ్లూరి సుధాకర్. కవిత్వం, వ్యాసాల రూపంలో మాదిగల వాదాన్ని బలంగా ప్రతిఫలించేటట్లు రాయగలుగుతున్నారు. నిజానికి మాదిగల వాదాన్ని అంత వేగంగా, శక్తివంతంగా, అంత బహిరంగంగా వ్యక్తీకరించగలిగిన వాళ్ళు మరోకరు లేరేమో అనిపించేటట్లు ఎండ్లూరి సుధాకర్ *వర్గీకరణీయం, కొత్త గబ్బిలం* కావ్యాలను రాశారు. ఈ రచనలు వెలువడిన తరువాత వివిధ కలం పేర్లుతో వర్గీకరణ వాదాన్ని విమర్శిస్తూ కొంతమంది అనేక వ్యాసాలు రాశారు. చివరికి ఆయన వైయక్తిక జీవితాన్ని కూడా స్పర్శిస్తూ విమర్శ వ్యాసాలు రాశారు.

ఎండ్లూరి సుధాకర్ రచనలు వచ్చిన తరువాత దళిత సాహిత్యం, దళిత సాహితీవేత్తలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అంతవరకూ దళితేతరులను నిందిస్తూ, నిరసిస్తూ కవిత్వం రాసిన కవులు మాదిగల విషయంలో స్పందించటం లేదేమిటని నిలదీసినందుకే ప్రధానంగా ఎండ్లూరి సుధాకర్ గారి కవిత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. దళిత సమైక్యతకు మాదిగ సాహిత్యం గొడ్డలి పెట్టుగా ఈడ్చవలసిన పని లేదనీ విమర్శించారు.

మరికొంత మంది మాత్రం మాదిగలకు అన్యాయం జరిగిన మాట నిజమే గాని, వర్గీకరణతోనే సమస్య పూర్తిగా పరిష్కారం కాదనీ, నిజమైన పరిష్కారం దళితులంతా కలిసి రాజ్యాధికారం సాధించినప్పుడేననీ, దాని కోసం ముందు కలిసి ఉద్యమించాలనీ, నొప్పింపగా తానొవ్వక తప్పించుకొని తిరిగినట్టు కవిత్వం రాసిన వారు ఉన్నారు. ఆ కవితల సారాంశం మాత్రం మాదిగలకు అన్యాయం జరిగిన మాట నిజమైనా దాని కోసం మాలలనే నిందించవలసిన పని లేదనీ, మాలలకు కులవృత్తి లేకపోవడం వలన బతకడానికి అనేక వృత్తులను నేర్చుకుని అనేక రంగాలలో అభివృద్ధి చెందారనీ అన్నారు. ఆ విధంగా మాలలు ప్రతిభావంతులు కావడం వలనే అన్ని రంగాలలో ముందున్నారనీ, అది వారి తప్పు కాదనీ సమర్థించే ప్రయత్నం కూడా వారి కవిత్వంలో కనిపిస్తుంది. తాత్కాలికంగా వచ్చే వర్గీకరణ రిజర్వేషన్ఫలితాల కంటే ఉమ్మడిగా రాజ్యాధికారం కోసం పోరాడితే నిజమైన హక్కులు పొందగలుగుతామనే ఉద్బోధ కనిపిస్తుంది.

ఈ పరిస్థితుల్లో కొద్దో గొప్పో చదువుకున్న మాదిగలు తమకు తెలిసిన భాషలో, తమకు తెలిసిన ప్రయోగాలతో తమ వాటా తమకు కావాలని కవిత్వం రాశారు. అప్పకవీయాన్ని వ్యతిరేకించిన దళిత విమర్శకులే మాదిగ కవిత్వాన్ని శిల్పపరంగా లోప భూయిష్టంగా ఉందన్నారు. మాదిగ సాహిత్యాన్ని మాదిగ కవులను విమర్శించటంలో గల కుట్రను మాదిగలు గుర్తించగలి. తమదైన రీతిలో పత్రికా ముఖంగా ప్రతి విమర్శ వ్యాసాలు రాశారు.

మాదిగ సాహిత్యం రావడానికి ముందు దళిత సాహిత్యంలో 'దళితుల' పేరుతో మాదిగలకు జరుగుతున్న వివక్షను ప్రశ్నించే దిశగా ప్రారంభమైందని ఇంతకుముందే

చెప్పుకున్నాం. ఆ వివక్షలను గుర్తించి, అక్షరీకరించిన కొన్ని ఆధారాలనైనా స్థాలీపులాకన్యాయంగా కింది విధంగా గమనించవచ్చు.

కత్తి పద్మారావు, మరికొందరి ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్బు (హైదరాబాదు)లో 28-7-2006 న ఒక సభ జరిగింది. ఆ సభలో దళిత కవుల రచనలను ఆవిష్కరించి, కవి సమ్మేళనం నిర్వహించారు. ఆ వివరాలను కత్తి పద్మారావు గారి సారధ్యంలో వెలువడిన *దళిత రాజ్యం* పత్రికలో సీరియల్గా ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ఆ సభలో జరిగిన విశేషాలతో కూడిన నివేదికలను ప్రచురించారు. ఆ కవి సమ్మేళనంలో పాల్గొని మాదిగ హక్కుల గురించి చదివిన మాదిగ కవుల ఆర్తినిగాని కవుల వివరాలను గాని పేర్కొనలేదు. తమ పుస్తకంతో ఒక అవినాభావ సంబంధం ఉండటం వల్ల ఎండ్లూరి సుధాకర్ పేరు మాత్రం ఉటంకించారు. ఆ సభ ఒక చారిత్రక ప్రాధాన్యం కలిగిన సభ అని ముందే ప్రకటించారు. అలాంటప్పుడు ఆ సభా విశేషాల్లో మాదిగ కవులను కావాలనే తప్పించారని విమర్శ వచ్చింది. నాగప్ప గారి సుందర్రాజు ఆ విషయాన్ని పస్తావిస్తూ *ఏకలవ్య* (జనవరి-ఫిబ్రవరి 1997; 45)లో ప్రశ్నించారు. దండోరాను సమర్థిస్తూ "*ఆ రోజు ఎందరో మాదిగ కవులు తమ గళాలను విప్పితే ఒక్క మాదిగ పేరును కూడా రాయలేదు. ఇలా మాదిగ పేర్లను బహిష్కరించటం పెద్ద కుట్ర*' అని దళితుల పేరుతో జరిగే వివక్షను... మాదిగలు ప్రశ్నించారు. ఇలాంటి విషయాలెన్నో చండాల చాటింపు, మాదిగ చైతన్యం కవితా సంపుటుల్లోనూ, మాదిగోడు కథా సంపుటిలోనూ నాగప్పగారి సుందర్రాజు సోదాహరణంగా రాశారు.

*మాదిగ చైతన్యం* పేరుతో మాదిగలు తమ ఆవేదనను కవిత్వీకరిస్తే ఆ కవితా సంపుటిలో శిల్పం, అభివ్యక్తి వంటి విషయాల గురించి ప్రస్తావిస్తూ సరైన కవిత్వం లేదని కొంతమంది దళిత విమర్శకులే విమర్శించారు. అంతే కాకుండా, దళితులలో మాలలు అధికంగా ఉండటం నేరం కాదు కదా అని ఒకాయన వ్యాఖ్యానించారు. దీనిని అంగీకరిస్తే దళితేతరులను వేలెత్తి చూపేటప్పుడు ఆ విషయం మరిచిపోయే దళిత విమర్శకులు ఆ విధంగా వాదనకు దిగారా? అని తరువాత మాదిగ విమర్శకులు సమాధానం చెప్పారు. *అస్పష్ట ఆరోపణలతో ఆధారాలు లేవంటే ఏలా?* అనే శీర్షికతో (ఆంధ్రభూమి 09-6-1997)లో దార్ల వెంకటేశ్వరరావు ఒక వ్యాసాన్ని రాశారు. ఆ తరువాత అంతకు ముందు *మాదిగ చైతన్యం* కవితా సంకలనాన్ని విమర్శించిన దళిత విమర్శకుడే తెలుగు సాహిత్య చరిత్రలో *మాదిగ చైతన్యం* పుస్తకానికి విశిష్ట స్థానం ఏర్పడిందని అంగీకరించారు. (*మాదిగోడు* కథలు 1997 ; XII) ఎండ్లూరి సుధాకర్ రాస్తున్న కవిత్వాన్ని కేంద్రంగా చేసుకొని కొంతమంది తీవ్రంగానే విమర్శించారని ముందే ప్రస్తావించుకున్నాం.

గూటం స్వామి '*ఏకీకరణీయం' నీలి పతాక* దీర్ఘ కావ్యాలు కవిత్వ రూపంలో, మాదిగ సాహిత్యంపై సంధించిన విమర్శ! *కొత్త గబ్బిలం, వర్గీకరణీయం, మాకొద్దు ఈ మాలదొరతనం* వంటివన్నీ మాదిగలకు రావలసిన హక్కులను వివరిస్తూ రాసిన వాదనలతో వేదనలతో కూడిన కవితా స్పందనలు.

దళితేతర సాహితీ వేత్తలు మాదిగల పోరాటాన్ని ప్రజాస్వామ్య బద్ధమైనది గాను, వారి హక్కులు న్యాయ బద్ధమైనవిగానూ సమర్థించిన వారున్నారు. దానితో కొంతమంది మాలలు అగ్రవర్ణ సాహితీవేత్తలను కూడా నిందించటం ప్రారంభించారు. ఎండ్లూరి సుధాకర్ *వర్గీకరణీయం* దీర్ఘ కావ్యాన్ని ప్రచురించి అనేక పత్రికలకు అనేక మంది సాహితీవేత్తలకు అందుబాటులో ఉంచి వారి దగ్గర నుండి వచ్చిన అభిప్రాయాలను పునర్ముద్రణలో ప్రచురించారు. అందులో దళితేతర సాహితీవేత్తలే తమ అభిప్రాయాలను వ్యక్తీకరించటం ప్రధానంగా కనిపిస్తుంది. మాలలు స్పందించక పోగా స్పందించిన దళితేతర సాహితీవేత్తలను తీవ్రమైన పదజాలంతో విమర్శించటాన్ని ఎలా అర్థంచేసుకోవాలి? ఇలా మాదిగ సాహిత్యంపై కొంతమంది దళితుల అభిప్రాయాలను స్పష్టంగా గుర్తించే అవకాశం కలిగింది. విశేషమేమిటంటే దళిత సాహిత్యంలో అగ్రశ్రేణి కవులుగా రచయితలుగా పేరు ప్రఖ్యాతలు పొందినవారు మాత్రం మాదిగ సాహిత్యాన్ని కనీసం స్పర్శించటం లేదు. స్మృతి కవిత్వాన్ని చిన్న చిన్న సంఘటనలకు కూడా స్పందించారు. కానీ, దళితుల మధ్య దూరాలను పెంచకుండా, సామరస్యపూరితమైన పరిష్కారానికి ఉభయ వర్గాల్లోని మేధావులూ అంకితభావంతో ప్రయత్నించటంలేదు. సీనియెర్ మాల కవులూ అత్యంత ముఖ్యమైన మాదిగ సమస్యను పట్టించుకోవడం లేదు. సుమారు దశాబ్దిన్నర కాలంగా జరుగుతున్న ఎస్. సి., రిజర్వేషన్వర్గీకరణ గురించి స్పందించకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలని మాదిగలు ప్రశ్నిస్తున్నారు. ఒకరిద్దరు కవులు మాదిగ హక్కుల గురించి కవిత్వం రాస్తే, వాటిని ఖండిస్తూ కలం పేర్లతో, మారు పేర్లతో మాదిగల మనోభావాలను కించ పరిచే విధంగా వ్యాఖ్యానించటం కనిపిస్తుంది.

మాదిగ దండోరా ఉద్యమాన్ని విమర్శిస్తూ, వర్గీకరణ వాదం సరికాదంటూ రాసిన రాతలన్నింటికీ సమాధానంగా, వర్గీకరణను సమర్థిస్తూ 2006లో గుండిమెడ సాంబయ్య *"బ్రాహ్మణత్వ మాలత్వమా? మానవత్వ అంబేద్కరత్వమా?"* పేరుతో ఒక పుస్తకాన్నే రాశారు. దీనిలో అంబేద్కర్ భావజాలాన్ని ఆధారంగా చేసుకొని, పరిశోధనాత్మక దృష్టితో బ్రాహ్మణత్వ భావనలాగే, అలాంటి భావజాలాన్నే మాలత్వగా భావించిన కొంతమంది భావనల ఆధారంగా వర్గీకరణ వ్యతిరేకవాదాన్ని తిప్పికొట్టే ప్రయత్నం చేశాడు. ఆ తరువాత ఆవంత్స సోమసుందర్ఎండ్లూరి సుధాకర్ గారి *కొత్త గబ్బిలం* దీర్ఘ కావ్యంపై విమర్శ రాశారు. వజ్రాయుధం వంటి అభ్యుదయ కావ్యాన్ని రాసిన ఆవంత్స సోమసుందర్ఈ కాలంలో కొత్త గబ్బిలాలు సందేశ కావ్యాలు అవసరం లేదనడం వెనుక మాల సాహితీవేత్తల ప్రేరణలున్నాయనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆ వ్యాసానికి సమాధానంగా టి. పున్నారావు ఆంధ్రప్రభలోనే (10-12-2007, 17-12-2007) *కొత్త గబ్బిలం* ఎందుకంటే గుర్రం జాషువా గబ్బిలం ఇచ్చిన స్ఫూర్తితో దళితులలో కొత్త చైతన్యాన్ని రగిలించటం కోసమని సోదాహరణంగా వివరించారు. ఇటీవల బహుజన కెరటాలు మాస పత్రిక (జులై - 2007) ఎస్.సి., వర్గీకరణతోనే దళితుల ఐక్యత సాధ్యమవుతుందని ఒక ప్రత్యేక సంచికనే

ప్రచురించారు. దీనిలో చల్లపల్లి స్వరూపరాణి, కేశవ కుమార్, జె. గౌతమ్, జి.ఎస్. రామ్మోహన్, దుర్గం సుబ్బారావు, బత్తుల కాంతయ్య, కలేకూరి ప్రసాద్, సాదు మాల్యాద్రి తదితరుల విశ్లేషణాత్మక వ్యాసాలున్నాయి. వర్గీకరణను సమర్థించటం వీరందరి వాదనలలోను ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. కొంతమందైనా రచయితలు వర్గీకరణ వాదానికి సానుకూలంగా స్పందించటం ఒక శుభపరిణామం. అయితే, ఈ ప్రత్యేక సంచికలోని కొన్ని వ్యాసాలు మాదిగ దండోరా ఉద్యమానికంటే, మాలల ఉద్యమానికే ఉపయోగపడే భావాలనే అందించటం దళిత మేధావుల లోని ఒక గొప్ప నైపుణ్యం!

రాజకీయంగా చూసినప్పుడు దారా సాంబయ్య వంటి వారు మాల - మాదిగ ఇరువర్గాలను కూర్చోపెట్టి సమస్య పరిష్కారానికి ప్రయత్నించటం కూడా ఒక మంచి పరిణామమే. కానీ, అంతకుముందు గద్దర్ ఆధ్వర్యంలో మాల - మాదిగలను సమైక్య పరిచే ప్రయత్నాలేమీ అంకిత భావంతో జరగలేదు.

రామచంద్రరాజు కమీషన్(1997) వర్గీకరణ కోసం చేసిన సిఫార్సులు 1981 జనాభా లెక్కల ప్రకారం జరిగాయని, అవి సరైనవి కాదని వాదించిన వారు, ఉషా మెహ్రా కమీషన్తీసుకున్న 2001 జనాభా లెక్కల ప్రకారం కూడా మాదిగలకు అన్యాయం జరిగిందనే చెప్తున్నా, ఆ కమీషన్నివేదికను కూడా వ్యతిరేకిస్తున్నారు. అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసి వర్గీకరణ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. మాదిగలకు అన్యాయం జరగకుండా ప్రత్యేక జీ.వో., విడుదల చేస్తే, దాన్ని సుప్రీం కోర్టుకు తీసుకువెళ్ళి చెల్లదని రద్దు చేయించారు. పార్లమెంటు ఆమోదించినప్పుడు మాత్రమే వర్గీకరణ సాధ్యమవుతుందని మాల మహానాడు ఆధ్వర్యంలో వాదనలు ప్రాచుర్యంలోకి తీసుకొస్తున్నారు. అంబేద్కర్ భావజాలం ప్రకారం ఆయా రాష్ట్రాలలో భిన్న పేర్లతో ఉన్న, దళితుల సామాజిక స్థితిగతులను ఆధారంగా చేసుకొని ఎప్పటికప్పుడు శాసనాలను మార్చుకోవలసిన అవసరం ఉంటుందనీ, అలాంటి అవసరమే ఆంధ్రప్రదేశ్లో ఏర్పడిందని మాదిగ దండోరా, మాదిగ ఉద్యమ సాహితీకారులు ఆకాంక్షిస్తున్నారు. మాదిగ హక్కుల ప్రచారం కోసం మాత్రమే కాకుండా దాని ఆధారం చేసుకున్నా, *మాదిగోడు* (1997), *మల్లె మొగ్గల గొడుగు* (మాదిగ ఆత్మ కథలు- 1999), *నల్లరేగడి సాళ్లు* (2006) వంటి కథా సంకలనాలు, *జాతర* (1997), *కక్క*(2000) వంటి నవలలు మాదిగ జీవితాల లోని అనేక కోణాలను, మాదిగల అస్తిత్వాన్ని స్థిరీకరించే ప్రయత్నం చేశాయి. గోగు శ్యామల, జాజుల గౌరి, కదిరి కృష్ణ, పరిమళ్, ఐనాల సైదులు, పసునూరి రవీందర్ వంటి వాళ్ళు మాదిగ సాంస్కృతిక జీవితాలను ప్రతిఫలించే దిశగా రచనలు చేస్తూనే ఉన్నారు. వీటన్నింటి దృష్ట్యా చూసినప్పుడు మాదిగ సాహిత్యం దళిత సాహిత్యంలో అంతర్భాగంగా కొనసాగిన గానీ, అవసరమైతే సొంత అస్తిత్వాన్ని నిలుపుకోవడానికి కావలసినంత అవకాశం ఉంది. ఇంకా లోతుగా చెప్పాలంటే, దళిత సాహిత్యం మాదిగల జీవితం మీదే ప్రధానంగా ఆధారపడి ఉంది. కానీ, ఆ మాదిగలను నిర్లక్ష్యానికి గురి చేస్తున్నారనే ఉద్దేశ్యంతోనే తనదైన అస్తిత్వంతో మాదిగ సాహిత్యం ముందుకొస్తుంది.

# దళిత సమస్యలపై ప్రజా సాహితి దృక్పథం

*ప్రజాసాహితి* సాహిత్య, సాంస్కృతికోద్యమ మాసపత్రిక. ఆగస్టు 1977 నుండి నేటి వరకూ నిరంతరాయంగా వెలువడుతున్న పత్రిక. అదీ పీడితుల పక్షాన నిలబడుతున్న పత్రిక. సమాజంలో జరిగే అనేక సంఘటనలకు తనదైన దృక్పథంతో కొనసాగుతున్న పత్రిక. అలాంటి పత్రిక దళితులకు జరుగుతున్న అన్యాయాలను ఎలా అర్థం చేసుకుంది? దళిత సమస్యలను, సంఘర్షణలను ఎలా వ్యాఖ్యానించింది? కొన్నిసార్లు రెండు, మూడు నెలలకు కలిపి ప్రచురించినా మూడు వందల సంచికకు చేరువయ్యింది. ఇది మూడు వందలవ సంచిక. ఈ సందర్భంగా గత *ప్రజాసాహితి* సంచికల్లో దళిత సమస్యలపై ఆ పత్రిక దృక్పథాన్ని స్థాలీపులాక న్యాయంగా అంచనా వేసే ప్రయత్నమే ఈ వ్యాసం!

ప్రతి పత్రికకు ప్రాణం వంటిది సంపాదకీయం. పత్రిక దృక్పథం ప్రధానంగా సంపాదకీయాన్ని బట్టే తెలుస్తుంది. *ప్రజాసాహితి* ఒకోసారి రెండేసి, మూడేసి సంపాదకీయాలను కూడా ప్రచురించింది. ప్రతి సంపాదకీయం ఒక మ్యానిఫెస్టో వంటిదే! ప్రతి వాక్యం చాలా జాగ్రత్తగా ప్రయోగించటం చెప్పుకోదగిన ఒక ప్రత్యేకత. సంపాదకీయాలు 'జనసాహితి' ప్రణాళిక, నిబంధనలు, కర్తవ్యాలను సమన్వయిస్తునట్లే ఉంటాయి. 'కులం' గురించి ప్రస్తావిస్తున్నా, దానితో వర్గాన్ని, భూస్వామ్య వ్యవస్థ వికృత రూపాన్ని, అర్థ వలస పాలనా ప్రభావాన్ని సమన్వయిస్తూనే సంపాదకీయాలు కొనసాగాయి. దళితులు స్వతంత్రంగా పోరాటం చేయటం కంటే, సమష్టి పోరాటం చేయటం ద్వారానే నిజమైన విముక్తి లభిస్తుందనే దృక్పథంతో ఆ సంపాదకీయాలు వెలువడ్డాయి. 'కులం' మరింత విభజనల మయమనీ, విభజన - విభజనతోనే అంతం కాదనీ, అన్ని వర్గాల సమైక్య పోరాటంతోనే అంతమవుతుందనీ స్పష్టం చేస్తుంటాయి. ఇంచుమించు అన్ని *ప్రజాసాహితి* సంపాదకీయాలు కూడా ఇదే దృక్పథంతో కొనసాగాయి. కనుక, పత్రిక మౌలిక దృక్పథం

కొన్ని ముఖ్యమైన సంచికలను పరిశీలించటం ద్వారా కూడా తెలిసే అవకాశం ఉంది.

*ప్రజాసాహితి* పత్రికలో దళిత సమస్యల గురించి సంపాదకీయాలు రాయడమే కాదు. అప్పుడప్పుడు చారిత్రక సందర్భానుసారంగా డా// బి.ఆర్.అంబేద్కర్, జ్యోతిరావ్ పూలేల గురించి ప్రత్యేక సంచికలను ప్రచురించారు. దళిత కవి గుర్రం జాషువాపై కూడా ప్రత్యేక సంచికను వెలువరించారు. నిజానికి దళితులకు, దళిత సాహిత్యానికి పై ముగ్గురూ సిద్ధాంతకర్తలు వంటివారు. వాళ్ళ గురించి ప్రత్యేక సంచికలు ప్రచురించటమంటే, *ప్రజాసాహితి* దళిత మౌలిక సిద్ధాంతాలను, సిద్ధాంతకర్తలను గుర్తించినట్లే! అయితే ఆ సిద్ధాంతాన్నీ, ఆ సిద్ధాంత కర్తలను వర్గ దృక్పథంతో సమన్వయించటం మరంత గుర్తించదగింది!

జ్యోతిరావ్ పూలే, డా// బి.ఆర్.అంబేద్కర్ ముఖచిత్రాలతో వెలువడిన ఏప్రిల్, 1992 (127వ) సంచికలో "దళితుల పోరాటం - నూతన ప్రజాస్వామిక విప్లవంలో అంతర్భాగం" పేరుతో ఒక సంపాదకీయం ఉంది. దీనిలో కింది వ్యాఖ్యలు గమనించదగినవి.

*"భూస్వామ్య వ్యవస్థను బద్దలుకొట్టకుండా, దాని యొక్క విభిన్న దోపిడీ పీడనల రూపాన్ని అంతమొందించలేం. దాని తోడుదొంగైన సామ్రాజ్యవాదాన్ని, వీరి అక్రమ సంతానమైన దళారీ పాలకులను ఓడించలేం. కుల వ్యవస్థతో సహా సమస్త అణచివేతలకూ మూలమైన ధనిక, అగ్రవర్ణ రాజ్యాంగ యంత్రాంగాన్ని రూపుమాపలేం. అందుకే దళితుల పోరాటాలు నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగం కావాలి."*

"వర్గమూ - కులమూ! విప్లవమూ - సంస్కరణా!" పేరుతో ఏప్రిల్ 1995 (162వ) సంచిక ఒక సంపాదకీయం వెలువడింది. దీనిలో డా// బి.ఆర్.అంబేద్కర్ కులనిర్మూలన పోరాట సైద్ధాంతిక విషయాలపై చర్చనీయాంశాలు ఉన్నాయి.

డా// బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా వెలువడిన ఈ సంపాదకీయం ఆధునిక భారతంలో డా// బి.ఆర్.అంబేద్కర్ మహాభారతంలోని కర్ణుడితో పోల్చటం కూడా దళితులకు ఎంత వరకూ అంగీకారయోగ్యమో ఆలోచించవలసిందే! రాజ్యాంగ నిర్ణాయక సభ డ్రాఫ్టింగ్ కమిటీ ఛైర్మన్గా పనిచేయటంలో డా// బి.ఆర్.అంబేద్కర్ మేథోపరమైన కృషిని రాజ్యాంగ పరిషత్తు గుర్తించి, ఆ పరిస్థితుల్లో అంతటి పరిశ్రమ చేసి, భారత రాజ్యాంగాన్ని రూపొందించే శక్తి ఆయనకే ఉందని గుర్తించింది. నెహ్రూ క్యాబినెట్లో మంత్రిగా పనిచేసినా, అది ఎలా నిర్వహించారో, దానిలో ఎంతకాలం ఉన్నారో, ఆ సమయంలో ఎలాంటి సమస్యలకై పనిచేశారో లోతుగా విశ్లేషించవలసిన అవసరం ఉంది. అయినా వీటిని స్పృశించకుండానే, 'ప్రజాసాహితి' సంపాదకీయంలో "ఆయన చేసిన పోరాటాలు, పడిన రాజీలు - కులనిర్మూలనకు ఏదో రూపంలో తోడ్పడతాయన్న అవగాహన తోను, ఆవేదనతోను అమలు జరిపారు" అని వ్యాఖ్యానించారు. డా// బి.ఆర్.అంబేద్కర్ కృషిపై ఈ వ్యాఖ్యలను బట్టి ఆయన కులనిర్మూలనకే పరిమితమయిన వానిగా ప్రజాసాహితి భావించినట్లుంది.

ఈ సంపాదకీయంలోనే మరో విశేషం ఉంది.

1857 ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం నుండి 1925 వరకు (అది డా// బి.ఆర్.అంబేద్కర్, కమ్యూనిస్టు పార్టీలు సామాజిక రాజకీయ రంగ ప్రవేశం చేయటాన్ని

హద్దుగా పెట్టుకుని) జరిగిన ముఖ్యమైన తిరుగుబాట్లూ, గిరిజన గిరిజనేతర రైతాంగ పోరాటాలూ, సాంఘిక వ్యవస్థపైనా సాంస్కృతికాంశాలపైనా సాగిన ఉద్యమాలూ పేర్కొని, మొదటివి వ్యవస్థ మూలాలపై ఎక్కుపెట్టిన విప్లవ స్వభావం గలవిగా, రెండవవి ఉపరితలాంశాలకు చెందిన సంస్కరణ స్వభావం గలవిగా విశ్లేషించారు. సామాజిక విప్లవానికి ప్రధాన చోదకశక్తి (ప్రిన్సిపల్ మోటివ్ ఫోర్స్) వర్గ పోరాటమేనన్నారు. ఈ పునాది వర్గాల పోరాటానికి అనుబంధంగా మిగిలిన సమస్త రంగాలలో కూడా పోరాటం సాగిస్తూ సమన్వయించుకోవాలన్నారు. ఇది పాత వ్యవస్థను ధ్వంసం చేసి కొత్తదాన్ని నిర్మించుకునే దిశగా వుండాలని చెప్పారు. దీనినే విప్లవాత్మక వర్గ పోరాటంగా పేర్కొన్నారు. అమలులో వున్న వ్యవస్థలో మరిన్ని అవకాశాలూ, ఉపశమనాలూ కలిగించే సంస్కరణల కొరకు సాగించేదీ, లక్ష్య పెట్టేదీ సంస్కరణవాదమన్నారు. సారాంశంలో 5 పేజీల ఈ సంపాదకీయం మార్క్సిజాన్ని విప్లవకర సిద్ధాంతమనీ అంబేద్కరిజం సంస్కరణవాదమనీ తేల్చింది. మార్క్సిజం బోధించే వర్గ పోరాట సిద్ధాంతంపై కొన్ని రకాల దాడుల్ని సంపాదకీయం ఖండించింది. అదే సమయంలో అంబేద్కరిజంను చర్చనీయాంశమంది.

ముగింపుగా - "దళితులలో అత్యధికులు గ్రామీణ ప్రాంతాల్లో వున్నారు. భూస్వామ్య వ్యవస్థ యొక్క ఆర్థిక, సాంఘిక, దోపిడీ పీడనలకు వారు గురవుతున్నారు. కులవ్యవస్థ పాలక వర్గాల దోపిడీ సాధనంగా వుంది. కాలం చెల్లిన భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా సాగించే వ్యవసాయిక విప్లవం కులనిర్మూలనా పోరాటానికి ప్రధాన ఆధారంగా వుండగలుగుతుంది. పెరుగుతున్న సామ్రాజ్యవాద దోపిడీ, భూస్వామ్య అగ్రకుల పెత్తందార్లను మరింత బలోపేతం చేస్తోంది.

"డా//బి.ఆర్.అంబేద్కర్ జీవితాశయమైన 'కులనిర్మూలన' పట్ల చిత్తశుద్ధి గలవారు భావోద్వేగాలను విడిచిపెట్టి, కులానికి పునాదిగా వున్న అర్ధవలస - అర్ధఫ్యూడల్ ఆర్థిక వ్యవస్థతోనూ, దాని నిరంకుశ రాజ్యంతోనూ పోరాడటానికి అధిక ప్రాముఖ్యత నిస్తారని ఆశిద్దామ"నే లక్ష్యాన్ని ఈ సంపాదకీయంలో సూచించారు.

జాషువా ముఖచిత్రంతో, ఆయన శతజయంతి (1895 - 1995) సందర్భంగా అక్టోబరు, 1995 (168వ) సంచికను 'గుర్రం జాషువా శతజయంతి సంచిక'గా ప్రకటించారు. 95 శాతం రచనలన్నీ జాషువా సాహిత్య దృక్పథాన్ని విశ్లేషిస్తూ ఉన్నాయి. 'విశిష్ట సాహితీ స్రష్ట గుర్రం జాషువా" పేరుతో సంపాదకీయం ప్రచురించారు. ఆయన కవిత్వంలో కుల వివక్షకు వ్యతిరేకంగా, తీవ్ర ఆవేదనా ఆగ్రహమూ వ్యక్తమయ్యాయని అన్నారు.

గురజాడ, జాషువా సమకాలికులైన అభ్యుదయ కవులు, శ్రీశ్రీ వంటి వారంతా పద్యాన్ని వదిలేసి కొత్తదారుల్లో కవిత్వం రాస్తున్నా, జాషువా మాత్రం పద్య రూపాన్ని మార్చుకోలేకపోయారని వ్యాఖ్యానించారు. అగ్రకులాల సొత్తుగా వున్న కవిత్వంపై పట్టు సాధించి, వారికంటే మెరుగ్గా కవిత్వం రాయగలగాలనేది జాషువా పరమ ఆశయాల్లో ఒకటి అన్నారు.

"జాషువాను దళితకవి అనటం వరకు తప్పులేదు. కానీ, ఆయన దళితవాదికాదు. వర్ణకుల వ్యవస్థలను ఆయన తీవ్రంగా ద్వేషించాడు. ఫ్యూడల్ సంస్కృతి పెంచి పోషిస్తున్న మూఢ (దైవ) విశ్వాసాన్ని, అంటరానితనాన్ని వ్యాప్తి చేసే హిందూ పూజారి వ్యవస్థనూ తనదైన శైలిలో విమర్శించాడని" జాషువాను అంచనా వేశారు.

"జాషువాది సమాజ దళిత స్పృహ. గాంధీయిజం ద్వారా సమాజంలో మార్పులు వస్తాయని భ్రమించాడు. గాంధీ హిందూమతాన్ని, వర్ణ వ్యవస్థనూ పొగుడుతూ కేవలం అస్పృశ్యతను మాత్రమే వ్యతిరేకించాడు. ధర్మకర్తృత్వాన్నీ, అనువంశిక వ్యవస్థలను సమర్థించి, పరోక్షంగా భూస్వామ్య ధనస్వామ్య వ్యవస్థను బలపరిచాడు. జాషువా దీనిని అర్థం చేసుకునేంత తాత్త్విక భావావేశ తీవ్రత కలవాడు కాదు. అయివుంటే గాంధీ సామాజిక అవగాహనలోని లోపాల్ని విమర్శించ గలిగేవాడు."

"దళిత స్పృహ, దళిత చైతన్యం ప్రజాస్వామ్య స్వభావం గలవి. అవి వర్గ పోరాటంతో అనుసంధానమైతే నూతన ప్రజాస్వామిక విప్లవ చైతన్యంగానూ, మార్క్సిజంతో మమేకమైతే సోషలిస్టు చైతన్యంగానూ గుణాత్మక మార్పులని తీసుకుంటాయి. లేకుంటే బూర్జువా తాత్త్విక చైతన్యంగానే మిగిలిపోతాయి. తెలుగు దళితవాదులలో ఎక్కువమంది చైతన్యం తిరోగమన పథంలోకి ప్రయాణిస్తోంది."

ఈ సంపాదకీయంలోని పై వ్యాఖ్యలను గమనిస్తే జాషువా సాహిత్యం సమకాలీన వస్తువుని అందుకున్నా, సమకాలీన రూపాన్నీ అందిపుచ్చుకోవటంలో వెనుకబడి ఉందనే స్పృహ కలుగుతుంది. భావజాలం విషయంలోనూ జాషువాకు సమగ్ర దృక్పథం లేదనీ, ఎలక్ట్రానిక్ మీడియా, నాటకాలను ఆదరించే సామాన్య ప్రజలను వీరి పద్యాలు బాగా ఆకర్షించాయనీ, కులదృక్పథం వల్లనే దళితులు జాషువాని వెనుకేసుకొస్తున్నారనే ఆలోచన కూడా కలిగిస్తుందీ సంపాదకీయం. అయితే, జనవరి, 2007 (290వ) సంచికలో జనసాహితి 10వ మహాసభల కరపత్రాన్నే సంపాదకీయం - 1గా ప్రచురించారు. దీనిలో ప్రగతిశీల రచయితగా జాషువాను కూడా పేర్కొన్నారు. అలాగే, జనసాహితి ప్రధాన కార్యదర్శి దివికుమార్ అధ్యక్షత వహించే జాషువా సభను వివరిస్తూ ఒక కరపత్రం వెలువడింది. ఆ సభ అక్టోబరు 21, 2007 న విజయవాడలో జరిగింది. ఆ కరపత్రంలో దళిత కవి, విశ్వనరుడు జాషువాపై సాహిత్య సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొని, జాషువాను ఒక దళిత మేధావిగా అభివర్ణించారు. ఈ కరపత్రంలోని కొంత భాగాన్ని నవంబరు, 2007 (299వ) సంచికలో కూడా ప్రచురించారు.

అలాంటి "దళిత మేధావి"కి సమగ్ర దృక్పథం లేదా? అనిపించకమానదు! ఏది ఏమైనా, చాలా మంది జాషువాను, ఆయన సాహిత్యాన్ని అర్థం చేసుకోవడంలో భిన్న వైరుధ్యాలునాయి. జాషువాను చదివేవాళ్ళు వాళ్ళ దృక్పథం నుండే అర్థం చేసుకుంటారని ఈ సంచికలోని మిగతా వ్యాసాలు కూడా నిరూపిస్తున్నాయి. అలాగే జాషువాని వర్గ దృక్పథం నుండే ప్రజాసాహితి అవగాహన కలిగించే ప్రయత్నం చేసింది.

"వ్యవస్థ పరిమితిని బహిర్గతపరిచిన సుప్రీం తీర్పు" పేరుతో నవంబరు, 2006 (288వ) సంచికలో ఒక సంపాదకీయం ఉంది. దళితుల రిజర్వేషన్స్ గురించి చర్చించింది. ఎస్.సి., ఎస్.టి., ఒ.బి.సి.లలో సంపన్నవర్గాలకు రిజర్వేషన్ చెల్లదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుని ఆధారం చేసుకొని, దళితులకు రిజర్వేషన్స్ వల్ల ఒనగూరిన ప్రయోజనాలను విశ్లేషించారు. ఈ సంపాదకీయంలో చట్టబద్ధ రిజర్వేషన్స్, వ్యవస్థీకృత రిజర్వేషన్స్ అని రెండు రకాలుగా రిజర్వేషన్స్ ని వర్గీకరించారు. వంశపారంపర్యంగా వస్తున్న ఆస్తులను, అధికార హెూదాలను, ఆ వర్గం వాళ్ళే మళ్ళీ అధికారాన్ని చెలాయించటాన్నీ గుర్తించకుండా, అణచివేతకు గురవుతున్న వర్గాలకు రిజర్వేషన్స్ కల్పించినత మాత్రాన ఉపశమనానికి మించిన ప్రయోజనం ఉండదనీ, అందువల్ల దోపిడీ పాలకవర్గాల దృష్టిలో భిక్షగా వున్నప్పటికీ రిజర్వేషన్స్ ను దళితులు హక్కుగా పొందటంతో కాకుండా, వ్యవస్థీకృత రిజర్వేషన్స్ ని రద్దుపరిచేలా సమైక్యపోరాటం చేయాలన్నారు. అప్పుడు మాత్రమే దళితులకు, సమస్త పీడిత వర్గాలకూ విముక్తి లభించగలదని నమ్ముతున్నారు. దళితులలో కూడా అంతర్గతంగా వివిధ స్థాయిలు తయారవుతున్నాయని వింగడించారు. పైకెదుగుతున్నవారూ 2) వ్యవస్థ అందించే చిట్టిపొట్టి అవకాశాలతో నిలబడాలని చూసేవారూ, 3) వ్యవస్థలోని అవినీతితో సర్దుబాటు చేసుకొంటూ, వ్యవస్థ స్వరూప స్వభావాల్ని వర్గ - కుల దృక్పథంతో అవగాహన చేసుకొని సమైక్య పోరాటానికి సమాయత్తమవుతున్న వాళ్ళు. మూడవ వర్గమే దళితులకు నిజమైన ఆశాదీపంగా ఈ సంపాదకీయంలో అభివర్ణించారు.

జనసాహితి 10వ రాష్ట్ర మహాసభ (తరిమెల)లో చర్చించి ఆమోదించిన 'ప్రజాసాహితీ' సాంస్కృతికోద్యమం - దళితులపై కొనసాగుతున్న కులపరమైన వివక్ష రిజర్వేషన్స్ తో సమసిపోదనీ, దళిత సమస్యను రిజర్వేషన్స్ కే పరిమితం చేయటం - భూస్వామ్య వ్యవస్థ రద్దులాంటి మౌలిక మార్పులు లేకుండా చేయటం పాలక వర్గాల కుట్రలో భాగమన్నారు.

రిజర్వేషన్స్ దళితుల అభివృద్ధికి తోడ్పడుతున్నట్లనిపించినా, అవి కొద్ది మందికే తప్ప, వ్యవస్థ సమగ్ర అభివృద్ధి తోడ్పడకపోగా పాలకవర్గాలు దాన్ని తమ ఓట్ల రాజకీయంలో పావులుగా ఉపయోగించుకుంటున్నారనే దృక్పథాన్ని ప్రజాసాహితి ప్రదర్శించినట్లు స్పష్టమవుతుంది. 60 ఏళ్ల సంస్కరణవాదంపై భ్రమలు వీడమంటోంది. "చైతన్యవంతమైన దళిత యువకుల నాయకత్వం కోసం సమస్త పీడిత జనవాహిని ఎదురు చూస్తోందం'టున్నారు.

డిసెంబరు, 2006 (289వ) సంచికలో "ఖైర్లాంజీ అవమానాల దురాగతాల జీవితాలింకెన్నాళ్ళు" అనే పేరుతో సంపాదకీయం ప్రచురించారు. ఎదుగుతున్న ఒక దళిత కుటుంబాన్ని చూసి భరించలేని ఆధిపత్యతత్త్వంతో, ఆర్థిక, రాజకీయ వనరులు గుప్పెట్లో పెట్టుకున్న వారి నాయకత్వంలో ఖైర్లాంజీ దుస్సంఘటన జరిగిందన్నారు. ఆ సంఘటన పూర్వాపరాలను విశ్లేషించారు.

"2006 సెప్టెంబరు 29న భయ్యాలాల్ బోత్మాంగ్ అనే దళిత కుటుంబ సభ్యులను, భార్య కూతురు, ఇద్దరు కొడుకులను దారుణాతి దారుణంగా హింసిస్తూ, వివస్త్రలను గావించి, గ్రామమంతా నగ్నంగా తిప్పి మానభంగం చేసి, మర్మావయాల్లో కర్రలు దూర్చి శరీరాలు ఛిద్రం చేసి, చివరకు దారుణంగా హత్య గావించి శవాలను ఊరవతల కాలువలో పారేశారు" అంటూ, అక్కడ ఏమి జరిగి ఉంటుందో సమగ్ర కథనంలా వివరిస్తూనే ఆ సమస్యను లోతుగా చర్చించారు."ఆర్థికంగా నిలదొక్కుకున్న దళితులు విద్యాపరంగా ఎదిగిన దళితులు సాంఘిక సమానత్వాన్ని కోరుకుంటే భరించలేనితనం మన కులవ్యవస్థ సృష్టించిన సంస్కృతినిండా ఇంకా పైదొలగలేదు సరికదా, పెచ్చురిల్లిపోతోందనడానికిదొక ప్రత్యక్ష నిదర్శనం."

"భయ్యాలాల్ హిందూ సామాజిక వ్యవస్థ నుండి విముక్తి కావటానికి, బౌద్ధాన్ని స్వీకరించాడు. ఏ సంస్కృతిక ధర్మమూ అతన్ని కాపాడలేదు."

"ఎన్నికల రాజకీయ వ్యవస్థ దళితులను ఓటు బ్యాంకుగా మాత్రమే మిగుల్చుకొని, విభజించి పాలించే సంస్కృతిని అమలుపర్చుకుంటూ, ఇంకా ఉపకులాలుగా చీల్చుతూ తమ ప్రయోజనాలకు వినియోగించుకొంటోంది."

"చిట్టి పొట్టి సంస్కరణలతో, వోటు బ్యాంకు రాజకీయాలతో, మతమార్పిడులతో సాటిమనిషిపట్ల దయా, జాలీ కలిగించని చదువులతో, సామాజిక న్యాయాన్నివ్వలేని వ్యవస్థలో ఎంతకాలం మరింకెన్ని తరాలు ఇలా జీవించాలో ఆత్మపరిశీలన చేసుకోమని ఖైర్లాంజీ ఘోషిస్తోంది. సంపన్నులను కాపాడే కులవ్యవస్థను సృష్టించిన 'చట్రం' బద్దలు చేయకుండా దానిలో యిమిడే ప్రయత్నాలన్నీ అంతిమ సారంలో అశేష దళిత ప్రజానీకానికి ఆకలీ, దారిద్ర్యం అణచివేతలనే కొనసాగిస్తుందని ఎలుగెత్తి చాటుతోంది. సమస్త దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా శ్రమజీవుల సంఘటిత పోరాటాలు సాగించాల్సిన, చైతన్యాన్ని పెంపొందించాల్సిన చారిత్రక సందర్భం గడప ముందుకొచ్చి నిలిచిందని బోధిస్తోంది."

ఈ సంపాదకీయంలో కులాని గుర్తిస్తూనే, దానివల్ల ఉత్పన్నమయ్యే సంఘర్షణలను గుర్తిస్తూనే అది భూస్వామ్య, పాలకవర్గాల దోపిడీ, పీడనల కనుపైన వ్యవస్థగా వ్యాఖ్యానించింది. దళితులు నిజమైన అస్తిత్వం భూమిని సాధించుకొనేటప్పుడే బయటపడుతుందనడానికి ఈ ఖైర్లాంజీ సంఘటన సజీవ సాక్ష్యం అని వివరించారు. ఒకటి, రెండు దళిత కుటుంబాలు కొద్దిపాటి భూమిని సంపాదించుకోవటంతోనో, భూమిపై హక్కుని సాధించటంతోనో కులసమస్య తీరిపోదనీ, సమష్టిగా భూమిపై సమస్త పీడితజనం హక్కుని సాధించగలిగినప్పుడే నిజమైన విముక్తి లభించి, స్వేచ్ఛగా బతకగలుగుతారనే దృక్పథాన్ని వెల్లడించారు. భయ్యాలాల్ వంటి ఒకటి, రెండు కుటుంబాలు భూమిపై హక్కుని సాధించినా, భూమి దక్కనివాళ్ళు ఎక్కువగా దళితుల్లో ఉన్నారు. ఖైర్లాంజీ దుస్సంఘటన వెలుగులోకి రావడానికే చాలా కాలం పట్టిందనీ, అది పైయక్తిక చైతన్యంగా, పైయక్తిక అభివృద్ధిగా కాకుండా, దళిత, సమస్త పీడిత ప్రజా చైతన్యంగా సామాజిక అవగాహన, సాహితీ దృక్పథం అనే పత్రాన్ని వెలువరించారు. అభివృద్ధి చెందాల్సిన చారిత్రక సందర్భం గడప" ముందు కొచ్చిందని వ్యాఖ్యానించారు.

ఇలాంటి సమస్యనే "ఓ రిజర్వు పంచాయితీ కథ" "కులం - వర్గం" సంబంధాలను శక్తివంతంగా నిరూపించగలిగింది. ఆ కథను బొల్లిముంత నాగేశ్వరరావు రాశారు. దాన్ని ప్రజాసాహితి అక్టోబరు, నవంబరు, 1981 (43వ) సంచికలోనే ప్రచురించింది.

విశాఖజిల్లా వాకపల్లి గ్రామంలో 2006 ఆగస్టు 20 వ తేదీన 21 మంది పోలీసులు, 11 మంది గిరిజన మహిళలపై అత్యాచారం చేశారనే సంఘటనను ఖండిస్తూ "వాకపల్లి ఆదివాసీ స్త్రీలపై అత్యాచారాలు: నిష్పాక్షిక న్యాయవిచారణ జరిపించాలి" పేరుతో సంపాదకీయం ప్రచురించారు. ఈ సంపాదకీయంలో గిరిజన, ఆదివాసీ లాంటి పారిభాషిక పదాలే తప్ప, దళిత అనే శబ్దాన్ని ప్రయోగించలేదు. ఇందులోనేకాదు, ఇంచుమించు ప్రస్తావించిన ప్రతి సంపాదకీయంలోనూ "దళిత, గిరిజన" వంటి శబ్దాలనే ఒక స్పష్టమైన అవగాహనతో ప్రయోగిస్తున్నారు. గిరిజనులకు దళితులకు లాగా అస్పృశ్య సమస్య లేదు. జన్మత ఏర్పడిన అస్పృశ్య సమస్య అంటరానితనం కుల సమస్యలు దళితులనే ఎక్కువగా బాధిస్తున్నాయి. గిరిజనులను కూడా విశాలమైన అర్థంలో 'దళితులు' గా చాలా మంది సంభావించడంలో లోతైన అవగాహన మరింత రావలసి ఉంది. ఈ రెండూ వేరు వేరు సాంఘిక సమూహాలనే అవగాహనతోనే 'దళిత', 'గిరిజన' పారిభాషిక పదాలను 'ప్రజాసాహితి' తన సంపాదకీయ వ్యాసాల్లో ప్రయోగించింది. కనుక, దళితులకు, గిరిజనులకు ఉన్న సమస్యలలో వైవిధ్యం గలదనే ఆలోచనలు ప్రజాసాహితికి ఉన్నాయని అర్థం చేసుకోవాలి.

దళిత సమస్యలను దళితులే రాయాలనే వాదన దళిత రచయితలను సామాజిక విప్లవ రచయితలుగా ఎదగనివ్వకుండా చేసే ప్రయత్నమనీ, దళిత జీవన సంఘర్షణ, దళిత జీవితానుభవం ఉన్నవాళ్ళే గాఢంగా చిత్రించగలుగుతారనే దానికి అనుభవ జ్ఞానం ఒక్కటే సరిపోదనీ శాస్త్రీయమైన ఆలోచనలను ముందుకు తీసుకెళ్ళాలని పదవ మహాసభ పత్రంలో వ్యాఖ్యానించారు. పాటిబండ్ల ఆనందరావులా దళితేతర శ్రామికుల జీవన సంఘర్షణను కూడా చిత్రించగలిగేవారుగా దళిత రచయితలు ఎదగాలని జనసాహితి కోరుకుంటోందని నేను అభిప్రాయపడుతున్నాను.

దళితులను విభజించటం పాలకవర్గాల కుట్రగా, దళితులను మరింత అనైక్యతను గురిచేయటంగా ఖైర్లాంజీ సంఘటన గురించి రాసిన సంపాదకీయంలోను, జనసాహితి 10వ రాష్ట్ర మహాసభలు ఆమోదించిన పత్రంలోనూ వివరించారు. అయితే ఎ,బి,సి,డి, వర్గీకరణ ఉద్యమంలో న్యాయం ఉందనీ వ్యాఖ్యానించారు. మాల, మాదిగల వివాదాన్ని తెలిపే ఒక కరపత్రాన్ని నవంబరు, 1998 (202వ) సంచికలో ప్రచురించారు.ఆ కరపత్రాన్ని ఎస్.ఆర్.శంకరన్ రాసింది.

"ఎబిసిడిల విభజనలో మెరుగైన న్యాయం వుండినా పాలక గ్రూపులూ, రకరకాల సంస్కరణవాదులూ, రిజర్వేషన్ల విభజనే కాక దళిత ప్రజల విభజనకు కూడా దాన్ని వినియోగిస్తున్నారు." అని 10వ మహాసభ పత్రంలో వ్యాఖ్యానించారు. ఇలావివిధ సమస్యలపై 'ప్రజాసాహితి' తనదైన పీడిత ప్రజలందరి ఐక్యతా దృక్పథాన్ని ప్రదర్శించింది. ఈ విషయాలకు కళాత్మక అభివ్యక్తిగానే సాహిత్య ప్రక్రియల్లోనూ ప్రతిఫలించింది.

ప్రజాసాహితి పత్రికల్లో దళితుల గురించి రాసిన కవితలు, కథలు, వ్యాసాలు కూడా ప్రచురించారు. "మాలోల్లమంటావు మాదిగలమంటావు, మాట మాటాడితే దూరముండంటావు" అనే చాలా ప్రాచుర్యం పొందిన పాట ప్రజాసాహితి 3వ సంచిక 1977 అక్టోబరులో వచ్చింది. అక్టోబరు, నవంబరు 1981 (43వ) సంచికలో బొల్లిముంత నాగేశ్వరరావు రాసిన "ఓ రిజర్వు పంచాయితీ కథ" (పుట. 18-28)ను ప్రచురించారు. భూమిపై హక్కు లేకుండా, చట్టాలు రిజర్వేషన్స్ పేరుతో అధికారం ఇచ్చినా అది పెత్తందారుల చేతిలో చిక్కి దళితులకు మరెన్నో చిక్కులకు కారణమవుతుందని తెలిపే కథ. భూస్వామ్య పెత్తందార్లు వెంకునాయుడు, అంకిరెడ్డుల తరతరాల గ్రామ సర్పంచ్ గిరీకి "రిజర్వేషన్" అడ్డంకి అవుతుంది. ఎస్.టి.లకు ఆ పంచాయితీ కేటాయించడం, నిరక్షరాస్యుడైన, తినడానికే తిండిలేని యానాది 'బుర్రోడు'ని సర్పంచ్గా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం, తరువాత, తన ప్రాణానికీ గ్రామంలో తన జాతివారందరికీ ఆ రిజర్వేషన్ వల్ల వచ్చిన పదవి తమని కాపాడకపోగా, తమ అస్తిత్వానికే ప్రమాదకారిగా మారుతుందని నిరూపించే కథ.

భూమిలేకుండా, ఆర్థిక పరిస్థితి బాగుపడకుండా చట్టాలు దళిత, గిరిజనులకు ఎన్ని రిజర్వేషన్స్ కల్పించినా, వాటిని పాలక వర్గాలే వాడుకుంటాయి తప్ప, దళిత, గిరిజనుల జీవితంలో మౌలిక మార్పులు చేయలేవని స్పష్టం చేసే కథ.

జులై, 1995 (165వ) సంచికలో అడివి బాపిరాజు కథను ప్రచురించారు. 1945లో రాసిన 'నరసన్న పాపాయి' కథలో దళితులపై దళితేతరులకు ఉన్న భిన్న దృక్పథాలను సృజనీకరించిన కథ. ఒక దళితుడు (నరసన్న) దేవాలయంలోకి ప్రవేశించబోతే ఒక దళితేతర పెత్తందారుడు తీవ్రంగా కొడతాడు. నరసన్న భార్య రత్తాలు పెత్తందారుల ఇంట్లో పనిచేస్తూ ఉంటుంది. ఆమె గర్భంతో ఉండగా, ఆ ఇంటి యజమానురాలు అగ్రవర్ణ స్త్రీ అయినప్పటికీ రత్తాలుతో సన్నిహితంగా ఉండటమే కాకుండా, ఒక రోజు రత్తాలు కూతురికి పాలు కూడా ఇస్తుంది. దళిత - దళితేతురుల సంబంధాలను ఒక వాస్తవిక దృష్టితో రాసినా, ఊహాత్మకత ఎక్కువగా ఉందీ కథలో! అగ్రవర్ణాలవారంతా మంచివాళ్ళు కాదు, అలాగని అందరూ చెడ్డవాళ్ళు కాదని చెప్పే కథ! అయితే, కులం వల్ల కలిగే వ్యథలను హృద్యంగా వర్ణించారు. ఇదే సంచికలో అడవి బాపిరాజు గారి 'దీపావళి కథ' దళిత కథ అని ఎ.బి.సుందరరావు సమీక్షా వ్యాసంలో పేర్కొన్నారు. దాదా హయత్ రాసిన "సెగమంటలు" కథ కూడా దీనిలోనే ప్రచురించారు.

ఎన్నికల మాయాజాలంలో తాగుబోతైన మాల ఓబులేసు దొంగ ఓటు వేయవలసిన దుస్థితి, ప్రజాస్వామ్యంలో ఓట్లను కొనే పద్ధతినీ, దొంగ ఓటు వేయకపోతే దళితులకు కలిగే అనర్థాలను వర్ణించిన కథ. భూస్వామ్య పెత్తందారీ వ్యవస్థలో దళితులెలా నలిగిపోతున్నారో ఆర్థిక, సాంఘిక పరిస్థితులెలా ఉన్నాయో స్పష్టం చేసే కథ. ఆర్థిక దృష్టి ప్రధానంగా ఉన్న ఈ కథలో ఓబులేసుని మాలగా, డప్పుకొట్టేవానిగా చిత్రించారు రచయిత. మాలలు డప్పుని కొడతారా? ఒకవేళ ఒకటి, రెండు ప్రాంతాల్లో అలా జరిగినా అది మాలల వృత్తిగా పరిగణించలేం! కనుక, ఓబులేసు వృత్తి విషయంలో ఇంకొంచెం జాగ్రత్త తీసుకుని వుంటే బాగుండేది.

అక్టోబరు, 1995 (168వ) సంచికలో జాషువా గురించి చాలామంది రాసిన వ్యాసాలు ప్రచురించారు. ఆచార్య వి.రామకృష్ణ 'జాషువా సాహిత్యం - సాంఘిక నేపథ్యం'లో ప్రజాసాహితీ వేత్తలకూ సమకాలీనతే అతని సాహిత్య అస్తిత్వాన్ని నిర్ణయిస్తుందనీ, అలాగే జాషువా రచనల్లోనూ కొనసాగిందన్నారు. దానికి కవి సామాజిక నేపథ్యం నిర్ణయాత్మకంగా పనిచేసిందన్నారు. దానిలోని భావాలు చాలావరకూ ఈ సంచిక సంపాదకీయంలో కనిపిస్తున్నాయి. జాషువాది మానవతావాదమనీ మార్క్సిజం కూడా గొప్ప మానవతావాదమేననీ పేర్కొన్నారు. జాషువా ప్రాపంచిక దృక్పథంపై ఎస్.అంజయ్య రాసిన వ్యాసంలో చర్చించవలసిన అంశాలు ఎన్నో ఉన్నాయి. జాషువా వర్గదృష్టిని అద్దేపల్లి రామమోహనరావు; 'గబ్బిలం' ఆత్మ కథాత్మకావ్యం అంటూ డా// కరెవరపు వెంకట్రామయ్య ; కులాల కతీతుడైన దళిత కవిగా క్రాంతికిరణ్,; జాషువా - ముద్దుకృష్ణల వివాదం గురించి రవిబాబు మొదలైనవాళ్ళంతా వ్యాసాలను ఈ సంచికలో ప్రచురించారు. ముద్దుకృష్ణలోనూ సంస్కరణాభిలాష వుందనీ, ఆయన నడిపిన జ్వాలపత్రిక (1933-3వ సంచిక)లో అలాంటి భావాల్ని వ్యక్తం చేసే కవిత ఉందనీ, కొన్ని సాంకేతిక కారణాల వల్ల కొన్ని పరిమితుల వల్ల జాషువా కవితను 'వైతాళికులు'లో చేర్చకపోయి ఉండవచ్చునన్నారు. అలా చేర్చకపోవడం వల్ల అది జాషువాకు జరిగిన హానిగానో, కుట్రగానో వాపోవడం" పరమ ఆశ్చర్యంగానూ, అసహ్యం గానూ" ఉందని ఆ వ్యాసంలో రవిబాబు వ్యాఖ్యానించారు. ఈ వ్యాసాన్నే ప్రధానంగా మెచ్చుకుంటూ ద్వా.నా.శాస్త్రి ఓ ఉత్తరాన్ని రాస్తే, దాన్ని నవంబరు, 1995 సంచికలో ప్రచురించారు.

ఎస్.అంజయ్య జాషువా వ్యాసాన్ని విమర్శిస్తూ గుంటూరు నుండి టి.రవిచంద్ రాసిన ఉత్తరం ఉంది. జాషువా అభ్యుదయ కవి అనీ, ఆయన కవిత్వంలో ఆధునిక కవిత్వం ఎలాంటిదో ఆధారాలతో చూపే విధంగా ఈ ఉత్తరం ఉంది. అలాగే ఎస్.అంజయ్య రాసిన వ్యాసంపై కూడా టి.రవిచంద్ విమర్శనాత్మక లేఖాంశాలు ఉన్నాయి. డిసెంబరు, 1995 నాటి సంచికలోనూ జాషువా ఆర్థిక - కుల దృక్పథాన్ని విశ్లేషిస్తూ అంజయ్య గారు రాసిన వ్యాసాన్ని తులనాత్మకంగా పరిశీలిస్తూ టి.రవిచంద్ గారి సుదీర్ఘ ఉత్తరాన్ని ప్రచురించారు.

ఇదంతా చర్చలకు అవకాశమిచ్చే ప్రజాస్వామిక పద్ధతి. జాషువా సాహిత్య దృక్పథంపై 'ప్రజాసాహితి' చర్చను ఆహ్వానించింది. ఇలాంటి చర్చనే 'ప్రజాసాహితి' 'కులవృత్తి' కథపై కుడా కొనసాగించింది.

సెప్టెంబరు, 2006 (286వ) సంచికలో ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు రాసిన 'కులవృత్తి' కథను ప్రచురించారు. కులవృత్తులన్నింటికీ గౌరవం లభిస్తున్నా, మాదిగలు చేసే చర్మకారవృత్తికుండే సరైన గుర్తింపు, వారికి ఆత్మగౌరవం లభించడం లేదనే దృష్టితో నిర్మితమైన కథ 'కులవృత్తి' ఇంకా చెప్పాలంటే చిత్తవృత్తికి భౌతిక వాస్తవికతను శాస్త్రీయ పద్ధతిలో వివరించే కథ ఇది.

అక్టోబరు, 2006 (287వ) సంచికలో ఈ కథపై వివిధ స్పందనలను ప్రచురించారు. డా// శాంతికుమార్, పి.నాసరయ్య, నండూరి రాజగోపాల్లు ఈ కథను తీవ్రంగా విమర్శిస్తూ

ఉత్తరాలు రాశారు. అలాగే నవంబరు, 2006 సంచికలో మరికొన్ని ఉత్తరాలను ప్రచురించారు. కథా రచయిత వివరణను కూడా ప్రచురించారు.

'కులవృత్తి' కథను 'ప్రజాసాహితి' ప్రచురించటం సరైందికాదని కొంతమంది, ప్రచురించి చర్చకు అవకాశం ఇవ్వడం ప్రజాస్వామ్య పద్ధతని మరొకరూ, అది ఒక వితండవాదాన్ని ప్రతిపాదిస్తూ, కళ కళ కోసమేననే దృక్పథంతో రాసిన కథ అనీ ఇలా రకరకాల అభిప్రాయాలను వ్యక్తం చేసేటట్లు చర్చ కొనసాగింది. దివికుమార్ దీనికొక ముగింపునిస్తూ చక్కని సమన్వయాన్నిచ్చారు .

*'ఒక అసహజమైన, అమానుషమైన, దుర్మార్గమైన, నీచమైన అస్పృశ్యతతో కూడిన దుష్టకుల వ్యవస్థను తీవ్రాతితీవ్రంగా ద్వేషించలేకపోతున్నాం. కొనసాగుతున్న యథాతథస్థితికి అలవాటుపడిపోయి వున్నాం.... ఇక్కడ రచయిత ఒక అసహజమైన కోర్కెతో సహజమైపోయినదన్నట్టుగా వున్న కులవ్యవస్థపైన ఆగ్రహాన్ని తీవ్రంగా ప్రకటింపజేస్తున్నాడు.... ఉద్దేశ్యం మంచిదే. కంటిని బాగా విప్పారుకునేట్లు చూపాలనే ప్రయత్నంలో కొద్దిగా కాటుక ఎక్కువయ్యింది. అంతే"* అని దివికుమార్ రాశారు.

మొత్తం మీద కులవృత్తి కథపై శాస్త్రీయ దృక్పథంతో చర్చకు అవకాశం కలిగించింది. 'ప్రజాసాహితి'. వీటిని అన్నింటినీ దృష్టిలో పెట్టుకొని డా// దార్ల వెంకటేశ్వరరావు గారు, 'చిత్తవృత్తికి భౌతిక వాస్తవికతను నేర్పే కథ కులవృత్తి' అంటూ ఒక సుదీర్ఘమైన వ్యాసాన్ని 'ప్రజాకళ' ఇంటర్నెట్ పత్రికలో రాశారు. (జూన్, 2007)

'21వ శతాబ్దంలో సాహితీ విమర్శ' గురించి డా// మేడిపల్లి రవికుమార్ గారి ప్రసంగ వ్యాసాన్ని ఏప్రిల్ 2006 (281వ) సంచికలో ప్రచురించారు.

'ఈ రోజున అనేక కులాల్లో విభజన రావడం, విభజన తారాస్థాయికి వెళ్ళడం, అనేకమైన గ్రూపులలో అస్తిత్వానికి సంబంధించిన చైతన్యం, దళితవాదం, స్త్రీవాదం, మైనారిటీ వాదంలాంటివి రావడం - ఇవన్నీ ప్రపంచీకరణ ఫలితాలే" అయినా అవన్నీ సంఘటిత రూపానికి దారితీస్తాయనీ, అలాంటి వాదాల నోరు నొక్కేయడం అశాస్త్రీయమని పేర్కొన్నారు. కులపరంగా ఉన్న వర్గాల సమైక్యత గురించి వ్యాఖ్యానిస్తూ ఈ రచయిత ఒక స్వీయానుభవాన్ని జోడిస్తూ ఒక కళాకారుడు కోలాటం నేర్పుతుంటే రానంత జనం, ప్రదర్శనకొచ్చారనీ, ఆ కళారూపాలే ఆ జనం పాటలే ఆ ఊరివారినంతా శాశ్వతంగా కలిపేసిందని చెప్పుకొన్నారు. దీన్ని కుల, వర్గ సమైక్య పోరాటానికి సాధారణీకరించలేం నీ, కళారూపానికి గొప్ప శక్తి ఉందని మాత్రం రచయిత ఉద్దేశ్యమై ఉంటుంది." ఇదే సంచికలో 'వర్గ సమస్యలో 'కుల' సమస్యను జోడించి పోరాడవలసిన అవసరాన్ని చెప్పే విధంగా ఉన్న డా// దార్ల వెంకటేశ్వరరావు గారు రాసిన 'ఇప్పుడు కావల్సింది!' కవితను ప్రచురించారు.

'దళిత సమస్యపై రెండు నాటికలు - ఒక పరిశీలన' పేరుతో కె.పాల్రాజ్ రాసిన తులనాత్మక వ్యాసంలో బోయి భీమన్నల 'పాలేరు' చూపిందనీ, విప్లవం ఉదయకుమార్సోని, 'నరమేధం' నాటికల గురించి విశ్లేషించారు. చుండూరు సంఘటనకు వేగంగా ప్రతిస్పందించిన రూపొందించిన నాటిక 'నరమేధం' (ప్రచురణ: అక్టోబరు, 91) దళితులు ఒకరిద్దరుగా పాలేర్ల

నుండి ఉద్యోగులుగా మారడాన్ని 'పాలేరు' నాటకం, భూమి సమస్యతో కలిపిన కుల సమస్యను కుల సంఘర్షణకున్న వర్గకోణాన్ని 'నరమేధం' నాటికలో ఉన్నదని, వాటిలో 'నరమేధం విప్లవ దృక్పథాన్నివ్వ గలిగిందన్నారు. ఇలా కొనసాగిన రచనలన్నింటిలోనూ వర్గదృక్పథం, అదీ దళితులను పీడితవర్గంలో భాగంగా చేసుకున్న దృక్పథంలోనే సృజనాత్మక అభివ్యక్తి జరిగిన రచనలు 'ప్రజాసాహితి'లో కనిపిస్తున్నాయి. దళిత సమస్యలపై వర్గ, భౌతిక దృక్పథంతో శాస్త్రీయమైన చర్చ జరగడానికి అవకాశం కలిగించేటట్లు ఉన్నాయి.

మొత్తం మీద 'ప్రజాసాహితి' జనసాహితి ప్రణాళికలో పేర్కొన్న "భూస్వామ్య - సామ్రాజ్య వాద ఆర్థిక వ్యవస్థ పునాదిగా గల భూస్వామ్య సామ్రాజ్యవాద సంస్కృతిని పూర్తిగా నిర్మూలించకుండా నూతన సంస్కృతి నిర్మాణం జరగదు" అన్నట్లే దళిత సాహిత్యాన్ని ప్రచురిస్తూ, దళిత సమస్యలను విశ్లేషించారు. జనసాహితి కర్తవ్యాలలో 3వదైన "అగ్రకుల దురహంకారులకు వ్యతిరేకంగా దళితులూ, ఇతర ప్రజారాశులూ సాగించే కులోన్మాద వ్యతిరేక పోరాటాలకూ మద్దతునిచ్చే" దిశగానే 'ప్రజాసాహితి' దళిత దృక్పథాన్ని ప్రదర్శించింది.

# ఆచార్య కొలకలూరి ఇనాక్ కథల్లో వస్తు వైవిధ్యం సామాజిక వాస్తవికత

చేపట్టిన ప్రతి ప్రక్రియను ఫలవంతం చేయగల కవి, రచయిత, పరిశోధకుడు, విమర్శకుడు, అన్నింటికీ మించిన సహృదయుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు. ఆయన వందలాది కథలు రాసినప్పటికీ ప్రతీ కథలోనూ వస్తు వైవిధ్యంతో పాటు సామాజిక వాస్తవికత కూడా ప్రతిఫలిస్తుంటుంది. ఇప్పటికే అనేక మంది ఆయన రచనలపై పరిశోధనలు చేశారు. నేటికీ యుజీసీ ప్రాజెక్టుల స్థాయిలో ఆయన రచనలు పరిశీలనలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఆయన రాసిన కథల గురించి రాయడం అంటే పెద్ద సాహసమే అవుతుంది. అయినా, ఆయన రచనలను చదువు తున్నప్పుడు ప్రతి వాళ్ళూ తన అనుభూతులను చంద్రునికో నూలు పోగు అన్నట్లు పది మందితో పంచుకోవాలనిపిస్తుంది. నాదీ అలాంటి ప్రయత్నమే!

ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి కథలు *గులాబి నవ్వింది (1960), భవాని (1969), ఇదాజీవితం (1976)?, ఊరబావి (1983), సూర్యుడు తలెత్తాడు (1988), అస్పృశ్య గంగ (1999), కొలుపులు (2006), కట్టడి* (2007)కథా సంపుటాలుగా వచ్చాయి. వీటిలో *ఊరబావి (1968-69),* తలలేనోడు (కులవృత్తి (2006) వంటి ఎన్నో కథలు కథకుడుగా ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి కీర్తిని, తెలుగు కథాస్థాయినీ అత్యున్నత శిఖరాలకు అధిరోహించేలా చేశాయనవచ్చు.

రకరకాల ఇతివృత్తాలను కలిగి ఉండటం వస్తువైవిధ్యం అవుతుంది. ఒక కథలో ఒకే విషయాన్ని ప్రధానం చేసుకున్నా, ఒక సంఘటనే ముఖ్యమైనా, సమాజం నుండి దేనీ విడిగా చూపలేనట్లే, ఒకదానితో మరొకదానికి సంబంధాన్ని కలిగి అనేక అంశాలతో ముడి పడిన వస్తువులు కథలో ఉంటుంటాయి. ఆ లక్షణం ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి కథల్లో మరింతగా కనిపిస్తుంటుంది. కనుక, ఒక కథలో ఒకే వస్తువు ఉందని చెప్పడమంటే, దానిలోని ఒక ప్రధానమైన విషయాన్ని కేంద్రీకరించడమే అవుతుంది. కనుక, అనేక వస్తువులను తన కథలకు ఇతివృత్తాలుగా స్వీకరించారని చెప్పడం సమంజసం అనిపిస్తుంది.

బుభుక్షిత: కిం న కరోతి పుణ్యం ?, విముక్తి, కులవృత్తి, కొలుపులు, విఘ్ననాయకుడు మొదలైన కథల్లో దేవుడు, మతం కుల వృత్తులు మొదలైన వాటి వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలను చిత్రించారు. పొట్టపేగులిబ్బంది గోడు, గొడ్ల దొంగ, మావోటుమీకే, ఏది ఆయుధం వంటి కథల్లో వివిధ కులాల, వర్గాల సంఘర్షణలున్నాయి. ప్రాంతీయ భేదాల వల్ల వచ్చే సామాజిక అసమానతలున్నాయి. ఊరబావి, బర్త్ సర్టిఫికేట్, రమ నా కూతురు, ట్రోఫీ స్త్రీ పురుష సంబంధాల్లోని భిన్న పార్శ్వాలను వర్ణించిన కథలున్నాయి. ప్రకృతికీ మానవుడికీ విడదీయరాని అనుబంధాన్ని చెప్పిన గాజుపూస వంటి కథలున్నాయి.

నమ్మకానికీ అపనమ్మకానికీ, మానవ అనుభూతుల్లోని స్థాయీ భేదాలను విశ్లేషించిన కథలున్నాయి. ఇలా అనేక వస్తువులతో కథలు రాసిన ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి కథలన్నింటిలోనూ సామాజిక వాస్తవిత ప్రాణంగా నిలుస్తుంది. దేవుణ్ణీ, దెయ్యాన్నీ నమ్ముతున్నట్లే అనిపించే మానవ ప్రవర్తనలోని అపనమ్మకాన్నీ, అవిశ్వాసాన్నీ పాత్ర గతంగా పలికిస్తుంటారు.వీటిని లోతుగా పరిశీలించని వాళ్ళకి ఈ రచయిత మళ్ళీ మూఢవిశ్వాసాలను ప్రోత్సహిస్తున్నట్లనిపిస్తుంది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో అనేక విప్లవాత్మక మార్పులతో ఒక వైపు మానవుడు అంతరిక్షాన్ని కూడా శోధిస్తున్నా, సమాజంలో తరతరాలు గా కొనసాగుతున్న ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, వాటిని ఆసరా చేసుకొని చేస్తున్న దోపిడీ మరొక వైపు కొనసాగున్నవైనం కూడా వీరి కథల నిండా కనిపిస్తుంది.

సమాజంలో జరుగుతున్న సంఘటనలను మాత్రమే చిత్రించకుండా, ఆ సంఘటనల సాంద్రతను పాత్రగతంగా చిత్రించి చూపటం లోనే సామాజిక వాస్తవికత వెల్లడవుతుంది. ఇది సామాజిక అభ్యుదయం వైపు పయనించేటట్లు చేసే సంఘర్షణ వీరి కథల నిండా కనిపిస్తుంది. వీరి కథలను చదివిన పాఠకులు చాలా అంశాలను వాస్తవికంగా జరగవన్నట్లో, అవన్నీ ఒకటో రెండో జరగ వచ్చేమో గానీ, వాటిని సాధారణీకరించడం సరైనదేనా? అనే అనుమానాలు కూడా కలుగుతుంటుంటాయి. ఇలాంటప్పుడే రచయితకు ఉండవలసిన లోతైన పరిశీలన కనిపిస్తుంది. అనేక సార్లు అందరికీ తెలిసిన అంశాలే తమ కళాత్మక నైపుణ్యంతో చెప్తే, రచయితల్లో ఉండే నిశిత పరిశీలనను పెద్దగా పరిగణనలోకి తీసుకోవలసిన పనిలేదు. సామాజిక లోతుల్లోకి తొంగి చూడగలిగినప్పుడు మాత్రమే అసహజంగా అనిపించే సంఘటనల్లోనూ, అనంతమైన ఆవేదననూ, పీడననూ పట్టి చూపవచ్చు. అది చాలా కొద్ది మంది రచయితల్లోమాత్రమే ఉండే సుగుణం. అది ఈ రచయిత రచనల్లో కనిపిస్తుంది.

ఎన్నో రకాల వస్తువుల్ని తీసుకొని, కొన్ని వందల కథలను రాసిన వాటన్నింటినీ ఇక్కడ వివరించడం అసాధ్యమే, కాకుండా అలా విశ్లేషించుకోవాలనుకోవడం కూడా అత్యాశే అవుతుంది. దీనివల్ల రచయితలోని ఏదైనా ఒక కోణాన్ని సాధ్యమైనంత సమగ్రంగా చర్చించే వీలులేకుండా పోతుంది. అందువల్ల ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి కథల్లో మాదిగల గురించి రాసిన వాటిలోని వస్తు వైవిధ్యాన్నీ, వాటిలోని సామాజిక వాస్తవికతను గుర్తించే ప్రయత్నం చేస్తాను.

రాజ్యాంగం షెడ్యూల్డు కులాలని పిలిచే ఒక ప్రధానమైన కులాల్లో మాదిగ ఒకటి. ఈ కులాన్ని మాత్రమే ఆశ్రయించుకొని బతికే కులాలకు ప్రత్యేక మైన పేర్లు ఉన్నప్పటికీ కూడా మాదిగ కులం అని సంబోధించడమే సాహిత్యంలో ఆనవాయితీగా వస్తుంది. కొన్నిసార్లు మాదిగేతరులు మాదిగ వృత్తి ని చేసినా, మాదిగ సంస్కృతిని పాటించినా వాటినీ మాదిగ కులంలో అంతర్భాగంగానే తీసుకోవడం సమంజసం. మొత్తం తెలుగు సాహిత్యంలోనే శూద్రులను, వారికంటే కింది కులస్థులను వర్ణించేటప్పుడు మాదిగ జీవితాలనే ప్రధానంగా చేసుకున్నారు. తెలిసో తెలియకో చాలా మంది సాహితీ వేత్తలు ఈ పద్ధతిలోనే తమ రచనలను చేశారు.

ఆధునిక సాహిత్యంలో ప్రత్యేక కుల అస్తిత్వ చైతన్యం పెరిగిన తర్వాత ప్రతి కులం అస్తిత్వాన్ని కాపాడుకుంటూనే, ఆ కులం వల్ల వచ్చిన సౌకర్యాలను పొందుతూనే, ఆ కులం నిర్మూలించాలని చెప్పడానికి కూడా ఆ కుల సంస్కృతినే ప్రధాన ఆయుధంగా చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో చూసినప్పుడు దళిత సాహిత్యం అంటే అణచి వేతకు గురికాబడుతున్న కులాలన్నీ అనే స్పృహ తగ్గిపోతుంది. ఇప్పటికే గిరిజన సాహిత్యం, వెనుకబడిన తరగతుల సాహిత్యం  లేదా బహుజన సాహిత్యం వంటి వర్గీకరణలు కనిపిస్తున్నాయి. స్త్రీలు తమకు ప్రత్యేక సమస్యలున్నాయి. అందువల్ల తమ సమస్యలను ప్రతిఫలిస్తూ, ఆ సమస్యల పరిష్కారం కోసం రాసే సాహిత్యం స్త్రీవాద సాహిత్యం గా పిలుచుకుంటున్నారు. ముస్లింలు తమ మతాన్ని ఆధారంగా చేసుకొని వివక్ష కొనసాగుతున్న పైనాన్ని గుర్తించి తమది ముస్లిం మైనారిటీ సాహిత్యం అని చెప్పుకుంటున్నారు. ఈ విభజనలను ఇంచుమించు సాహిత్తీ వేత్తలతో పాటు పరిశోధకులు కూడా అంగీకరిస్తున్నారు. అలాంటప్పుడు దళిత సాహిత్యం అంటే రాజ్యాంగం షెడ్యూల్డు కులాలని పిలిచే వారి సాహిత్యమేనని స్పష్టంగానే తెలుస్తుంది. ఈ సాహిత్యాన్ని కూడా లోతుగా పరిశీలించినప్పుడు మాదిగల, వారి ఆశ్రిత కులాల సంస్కృతినే ప్రధానం చేసుకున్న విధానం కనిపిస్తుంది. దీనిలో మాల, మాలలను ఆశ్రయించుకున్న కులాల వారి సంస్కృతి చాలా తక్కువగానే ఉంటుంది.

దళిత సాహిత్యం అంటే మాల, మాలల ఆధిక్యంలో ఉన్న సాహిత్యంగానే కొనసాగుతుంది. దళితులు లేదా రాజ్యాంగం ప్రకారం షెడ్యూల్డు  కులాలు అని పిలవబడేవాళ్లంతా, ఆ సాంఘిక, ఆర్థిక, రాజకీయ, విద్యావకాశాలను అందుకుంటున్న వాళ్ళంతా మాల, మాలల అనుబంధకులాల వాళ్ళేనని సామాజికంగా జరుగుతున్న ఉద్యమాలు, రాజ్యాంగ బద్దంగా ప్రభుత్వం నియమించిన కమీషన్స్ చేసిన సర్వేలు చెపుతున్నాయి. సాహిత్యంలోనూ కొనసాగుతున్నఈ వివక్ష గమనించి కూడాసాహితీ మేధావులు మౌనంగా ఉండడం సరైనది కాదు.  దళితసాహిత్యంలో అంతర్భాగంగా మాదిగ సాహిత్యాన్ని చూడడం సరైన ధోరణి కాదు. కనుక, మాదిగ సాహిత్యం లో అంతర్భాగంగానే దళిత సాహిత్యన్ని పరిగణించడం సమంజసం ఆ విధంగా మాదిగ సాహిత్యానికి విస్తృత పరిధి ఉంది. మాదిగ జీవితానికి అంత విశాలత్వం ఉంది. ఆ మాదిగ సాహిత్యంలో కలికి తురాయి వంటి కథలను ఆచార్య కొలకలూరి ఇనాక్ రాశారు.

మాతృస్వామ్య మూలాలను, మాదిగ స్త్రీల్లో కనిపించే తెలివి తేటలు, ధైర్య స్థైర్యాలను, సమయానుకూల నిర్ణయాలను తీసుకోవడంలో మాదిగ స్త్రీ ప్రదర్శించిన ఔన్నత్యాన్ని తెలిపేకథ *ఊరబావి.* స్త్రీవాద చాయలు కనిపించని రోజుల్లోనే మాదిగల్లో ఉండే స్త్రీ చైతన్యాన్ని నిరూపించిన కథ. ప్రకృతి పురుషులలో స్త్రీ శక్తివంతురాలు. ప్రకృతి కూడ శక్తి వంతమైందే. అయినా ప్రకృతిని పురుషుడు తన అధీనంలో ఉంచుకున్నట్లు భావిస్తుంటాడు. కొన్ని సందర్భాలలో తన అశక్తత బయటపడుతుంటుంది. అలాంటప్పుడు ప్రకృతే తనదైన పరిష్కారాన్ని చూపగలుగుతుంది. ఇది మానవ జాతికి అంతటికీ వర్తిస్తుంది. భారతదేశానికి

మరీ వర్తిస్తుంది. భారత దేశంలో ఆదిమ సమాజాలన్నీ మాతృస్వామ్య సమాజాలే. క్రమేపే పితృస్వామ్య సమాజాలుగా పరిణమించాయి. ఒకరి పట్ల మరొకరికి ఆధిక్యతా భావం పెంపొందింది. స్త్రీకి ఉండే సున్నితత్త్వం, వేగంగా స్పందించగలిగే హృదయం, పునరుత్పత్తి శక్తి, శారీరక మానసిక స్థితిని బలహీనురాలుగా మార్చినట్లు పురుష ప్రపంచం భావిస్తుంటుంది. అందులో చాలా వరకూ నిజం ఉన్నా అదే వాస్తవం కాదని నిరూపించిన కథ ఊరబావి. కేవలం మాదిగలకు నీళ్ళు లేకపోవడం, ఆ నీళ్ళు తోడుకోవడానికి మాదిగలే ఒక చచ్చిన బర్రెను పడేయడం వరకే కథను చూస్తే ఇదంతా అర్థం కాదు.  కానీ, మాదిగలే చచ్చిన గొడ్లను తీసి శుభ్రం చేసే పని చేస్తుంటారు. ఆ గొడ్లు, ఆ మాంసం , ఆ చర్మం వంటివి ఎక్కడ కనిపించినా మాదిగలనే అనుమానిస్తారు. దీన్ని తొలి తరం మాదిగలు తలవంచుకొని శిక్షలు అనుభవించినా, తర్వాత తరం వాళ్ళు అలాగే బానిసలుగా ఉండరు. తిరుగుబాటు తప్పదు. ఇది సామాజిక వాస్తవికతలో  భాగం. కానీ అంతకు మించిన తాత్త్వికత ఈ కథలో ఉంది. దీనికి మాదిగలను ఎన్నుకుంటేనే కథకు ప్రాణం వస్తుంది. అలా మాదిగలను కేంద్రీకరించుకుని ఒక గొప్పతాత్త్విక  దర్శనాన్ని రచయిత అందించగలిగారు. ఒక వైపు సామాజిక వాస్తవికత, మరో వైపు సాహిత్య దార్శనికతా చూపగలిగారు. అందుకే ఇది గొప్ప కథ కాగలిగింది.

*కట్టడి* కథలో మాదిగలను ఆశ్రయించుకొని జీవించే పది ఆశ్రిత కులాల్లో ఒక కులం వారి జీవన విధానాన్ని వర్ణించారు. మాదిగలకు కూడా సుమారు పది ఆశ్రిత కులాలున్నాయి. దానిలో ఒక కులానికి చెందిన ఆశ్రిత కులస్థుడు మొండోడు. అతడు మాదిగలను తప్ప మరే కులాన్నీ అన్నం అడగడు. వాళ్ళు వరసగా మూడు రోజులు అన్నం పెట్టకపోతే పక్క గ్రామంలోని మాదిగల దగ్గర తింటాడు అతడు చీకటి పడిన తర్వాత పేటలోకి వస్తాడు. తాను వచ్చిన విషయాన్ని చెప్తాడు. అప్పుడు మాదిగలు ఒక చోట అన్నం పెడుతుంటారు. ఎవరికీ తెలియకుండా వచ్చి, దాన్ని తినేసి వెళ్ళి పోతుంటాడు. అతడిని చూడ్డం అపశకునంగా భావించడం వల్లనే చీకటి పడిన తర్వాత వస్తుంటాడు. పదేళ్ళు కూడా లేని పెద్దోడు అతడెలా ఉంటాడో చూడాలనే కుతూహలంతో ఉంటాడు. కరువు కాటకాల వల్ల, తమకే తిండికి లేకపోవడం వల్లనో ఎవరూ మొండోడికి అన్నం పెట్టలేకపోయిన సందర్భం వస్తుంది. అప్పుడు ఆ మొండోడు మాదిగలకు ఉండే ఒకే  ఒక్క బావినీ కట్టడి చేస్తాడు. దాన్ని వెంట్రుకలతో కడతాడు.  ఆ కట్టడిని ఎవ్వరూ విప్పలేరు. ఇక గిలక కదలదు. దానితో  మాదిగలు నీళ్ళకు కటకటలాడిపోతారు. అది వేసవి కావడంతో మరింత ఇబ్బంది గురవుతారు. అలాంటి పరిస్థితుల్లో రాత్రి   దాచిన తమ పిల్లల కోసం దాచిన అన్నాన్ని కూడా మొండోడికే పెట్టవలసి వస్తుంది. అతడిని చూస్తే అపశకునం అని అంతా భావించినా, ఓ పదేళ్ళు కూడా నిండని పెద్దోడు రహస్యంగా చూస్తాడు. రైలు బొగ్గుల గుట్టల నుండి ఒళ్ళంతా మసి బొగ్గుతో అతడు బయటకు వస్తాడు. అతడి కోసం ఓ చోటులో పెట్టిన  అన్నాన్ని ఎంతో హుాందాగా తింటాడు. ఆ తినడంలో కూడా ఒక దర్పం కనిపిస్తుంటుంది. అలా తినడం తనకున్న హక్కుగా భావిస్తుంటాడు. అది భారంగా తలుస్తుంటారు మాదిగలు.

ఆచారాల్లోని అంతరార్థాన్ని, ఆచారం పేరుతో కొనసాగుతున్న విచిత్ర జీవితాల గురించి రచయిత ఆలోచించవలసి ఉంటుందని ప్రబోధిస్తున్నారు. అందరూ అపశకునంగా భావించి, ఆ మొండోడిని చూడకపోయిన వాళ్ళంతా వయసులో పెద్దవాళ్ళైనా, మూఢ విశ్వాసాలను కొనసాగించడంలో చిన్నవాళ్ళే! వయసులో చిన్నవాడైనా, పదేళ్ళు కూడా లేని పెద్దోడు, ఆ మొండోడిని చూస్తాడు. అయినా అతనికి ఏమీ కాలేదు. అతడు అలా చూడ్డానికి ప్రయత్నించడమే జ్ఞానానికి పునాది. అదే శాస్త్రీయ ఆలోచన. అది ఇప్పుడిప్పుడే బయలుదేరుతుందనేది కథా రచయిత ఇచ్చే సూచన కావచ్చు.

*కులవృత్తి* కథలో దేవాలయంలోకి ప్రవేశించనివ్వని బ్రాహ్మణ పూజారితో ఒక మాదిగ వ్యక్తి తాత్త్విక సంభాషణ చేసి, తన వాదనలోని సామంజస్యాన్ని అంగీకరింప చేస్తాడు. అయినా, ఇంకా తన కుల వృత్తిలో భాగమైన చెప్పులను, ఇతర కులవృత్తుల వారి వస్తువులకు లభిస్తున్న గౌరవమే తమ కులవృత్తులకూ, ఆ కులవృత్తి వల్ల ఉత్పత్తి అయిన వస్తువులకు లభించినప్పుడే దేవాలయ ప్రవేశం చేస్తానని తిరిగి వెళ్ళిపోతాడు. భగవంతుడికీ, భక్తుడికీ మధ్య పూజారి వారధిలా ఉండి భగవంతుడికి కూడా లేని ఆలోచనలను పూజారి చేస్తూ, సామాజిక న్యాయనిర్ణేతగా వ్యవరిస్తున వైనాన్ని, మాదిగ కుల వృత్తిలో అత్యంత ముఖ్యమైన చెప్పులను కథలో వస్తువుగా స్వీకరించారు రచయిత. ఇది మాదిగలు మాత్రమే చేసే వృత్తి. ఒకవేళ చెప్పులు కుట్టడం, చర్మకార వృత్తి చేసినా అది కూడా మాదిగల జీవితంగానే భావించవలసి ఉంటుంది.కనుక మాదిగనే ఒక ప్రధాన పాత్రగా చేసుకోవడం రచయితలో కనిపించే సామాజిక వాస్తవికతకు నిదర్శనం. సమాజంలో అవసరమైనప్పటికీ కొన్ని వృత్తులకు గౌరవం లేకపోవడంతో పాటు ఆ వృత్తిని చేసే వారినీ అగౌరవంగా చూడడాన్ని నిలువెత్తు నిదర్శనంగా చూపిన కథ కులవృత్తి. సమాజంలో నేటికీ మాదిగలను చూసే దృష్టికోణాన్ని కూడా దీనిలో చాలా నిశితమైన పరిశీలనతో అందించగలిగారు

*కొలుపులు* కథలో గ్రామాన్ని రక్షించే పోతురాజుకి పూజలు చేసి జంతువులను బలిచ్చే ఒక మాదిగ పూజారి కుటుంబాన్ని కేంద్రంగా చేసుకొని సాగే కథ. కొలుపులు జరిగినంత కాలం ఆ గ్రామాన్నికి ఎలాంటి అరిష్టం జరగలేదు. వంశపారంపర్యంగా ఆ మాదిగ కుటుంబం వాళ్ళే పోతురాజుకి కొలుపులు ఇచ్చేవారు. మాదిగ పూజారి లింగడు హఠాత్తుగా చనిపోవడం, అతని కొడుకుని నల్లమ్మ చదివించటం. ఆమె మాత్రం మళ్ళీ పెళ్ళి చేసుకోకుండా అలాగే ఉండిపోతుంది. వయస్సులో ఉన్న నల్లమ్మపై ఆ ఊరి మోతుబరి నాంచారయ్య కళ్ళు పడతాయి. ఒక రాత్రి ఆ మాదిగ పేటకు వెళ్ళి ఆమెను లేపాలని ప్రయత్నించి విఫలం కూడా చెందుతాడు. ఆమెను అనుభవించాలని నాంచారయ్య ఎంత ప్రయత్నించినా లొంగదు. ఈ పరిస్థితుల్లో తన కొడుకుని చదివించుకోవాలని ఫీజు కట్టడానికి చాలా ప్రయత్నిస్తుంది. ఊరిలో ఎవ్వరూ ఇవ్వరు. అప్పుడు నాంచారయ్యను అడిగి అప్పుగా డబ్బుని తీసుకుంటుంది. కొన్నాళ్ళ తర్వాత వడ్డీతో సహా తీర్చేసినా అప్పు తీసుకున్న కాగితాన్ని తిరిగి తీసుకోవడం మర్చిపోతుంది. దాన్ని ఆధారంగా చేసుకొని ఆమెను నాంచారయ్య వేధిస్తుంటాడు. ఆమె అప్పు తీర్చేసిందని ఊరందరికి తెలిసినా అతని

మూర్ఖత్వాన్ని, బలాన్ని, బలగాన్ని గుర్తించి ఆతని మాటకెవ్వరూ అడ్డు చెప్పరు. దీనితో తాను ఆడిందే ఆట పాడిందే పాటగా ఉండేది.

నల్లమ్మను ఎలాగైనా అనుభవించాలనుకున్న అతనికి ఊరికి వచ్చిన కరువు కలిసొస్తుంది. కొలుపులు లేకపోవడం వల్లే ఊరు అలా అయిపోతుందని ప్రజలు భావిస్తుంటారు. పట్టణంలో ఇంటర్మీడియట్ చదువుతున్న కొడుకు పోతురాజు కొలుపులు సమయానికి వచ్చేవాడు. ఈలోగా కొలుపులు వచ్చే సమయానికి నల్లమ్మను అనుభవించాలనే కోర్కె ఎక్కువై తనకు ఇవ్వ వలసిన డబ్బులను ఇవ్వమని డిమాండ్ చేస్తాడు. సెత్తి నోరు బాధుకున్నా, ప్రాంసరీ నోటు చూపించి వేదిస్తుంటాడు. రెండు మూడు రోజులు గడువు అడుగుతుంది. ఆ రెండు రోజులు తర్వాత కొలుపులు. ఆ రోజుకి ఇవ్వకపోతే ఆ ఊరందరి జనం ముందూ ఆమె కొడుకుతోనే అత్యాచారం చేయిస్తానంటాడు. కొడుకుతో అత్యాచారం చేయించుకోవడానికి ఇష్టపడకపోతే తానే అందరిలో అత్యాచారం చేస్తానంటాడు. గడువు ప్రకారం ఆమె డబ్బులు ఇవ్వలేకపోతుంది. కొలుపులు జరిగే దగ్గరకు తీసుకొచ్చి జనం మధ్యలో తన ఒప్పందం ప్రకారం జరగాలని పట్టుబడతాడు. ప్రజలంతా, ఊరి మాదిగలంతా జరుగుతున్న తంతునంతా చూస్తారు తప్ప, నాంచారయ్యను ఏమి అనలేరు. ఈలోగా పట్టణం నుండి కొడుకు అక్కడికి వస్తాడు. నాంచారయ్యతో గొడవలున్న కరణం, మునుసబులు కూడా వస్తారు. నాంచారయ్యను ఆ విధంగానైనా ఇబ్బందులో పెట్టాలని ఊరందరి ముందు నల్లమ్మను అలా చేయటం మంచిది కాదని మాదిగలంతా అలా చూస్తూ ఉండటం కూడా లోకువకు కారణమవుతుందంటాడు. అతన్ని నాంచారయ్య లెక్కచేయడు. దూరానికి గెంటేసి నల్లమ్మను హింసిస్తుంటాడు. ఆ సమయంలో కొడుకు వస్తాడు. దిక్కు తోచని స్థితిలో ఆ పెత్తందారికి తల్లిని భార్యగా మారమంటాడు. ఆమె అంగీకరించదు. తల్లి కొడుకులిద్దరినీ హింసిస్తుంటాడు. తల్లిని కొడుకు చేత బలవంతం చేయించాలని ప్రయత్నిస్తుంటాడు. ఆ దిక్కు తోచని పరిస్థితుల్లో నల్లమ్మ ఉపాయం ఆలోచించి అంతమందిలో, అంతమంది ముందు కంటే ఎక్కడికైనా పక్కకి వెళ్ళి లేదా ఇంటికెళ్ళితే తాను అతనికి లొంగిపోవడానికి సిద్ధమంటుంది. ఆ ఊరి వాళ్ళందరినీ పోమ్మంటాడు. కానీ, ఆమె కొడుకుని మాత్రం జరిగేదంతా దగ్గరుండి చూడాలని అలా చూసి చూసి కృశించిపోవాలనీ, అప్పుడే తనకు ఆనందమనీ అంటాడు. ఆ మాట విన్న కొడుకు అతడిపై కలబడతాడు. గట్టిగా అతన్ని దూరంగా నాంచారయ్య విసిరి కొడతాడు. వాళ్ళమ్మ మీద పడతాడు. వాళ్ళిద్దరూ ఏదో మాట్లాడుకుంటారు. అంతే కొడుకు పక్కకి తప్పుకుంటాడు. ఆమె దగ్గరికి నాంచారయ్య చేరుకుంటాడు. ఆమెపై పడతాడు. ఆమె ఒక్కసారిగా గట్టిగా తన్నేస్తుంది. కొడుకు తల్లి వాడ్ని పట్టుకుని చంపేస్తారు. ఆ గ్రామానికి పట్టిన నిజమైన అరిష్టం వదిలిపోతుంది.

నిజానికి ఇలాంటి సంఘటనలు నమ్మశక్యంగా అనిపించవు. కానీ, నిత్యం టి.వీల్లో, పత్రికల్లో ఇలాంటివన్నీ వింతలుగా ప్రసారమవుతుంటాయి. ప్రాచుర్యంలోకి వస్తుంటాయి. ఒకవైపు విజ్ఞానం పెరుగుతున్న చేతబడి, బాణామతి వంటి క్షుద్ర విద్యల ప్రభావంతో పట్ట పగలు బహిరంగంగా జనం మధ్యే మనుషులను కట్టి కొట్టి చంపేస్తున్నారు. చిన్న దొంగతనం

చేసినందుకు చట్టాన్ని పరిరక్షించవలసిన పోలీసులే మోటర్ సైకిల్ కి కట్టి జనం చూస్తుండగానే ఈడ్చి ఈడ్చి హింసించినా సంఘటనలు బీహార్ లో జరిగిందని టివీల్లో ప్రత్యక్షంగా ప్రసారం చేసిన సంఘటనలు కళ్ళెదుట కనిపిస్తునే ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ లోని ఖైర్లాంజిలో ఒక దళిత కుటుంబాన్ని పెత్తందార్లు నానా హింసలకు గురిచేసి చంపేసిన సంఘటన సంచలనం కలిగించిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ లోనే కంచిక చర్లలో ఒక అగ్రవర్ణ స్త్రీని ప్రేమించినందుకు ఒక మాదిగ యువకుడిని స్తంభానికి కట్టేసి సజీవ దహనం చేయడం, ఆ తరువాత కారంచేడు, చుండూరు, తిమ్మ సముద్రం, వేం పెంట మొదలైన చోట్ల మాల మాదిగలను ఘోరంగా హింసించి మారణ కాండ కొనసాగించిన తీరు కొన్నాళ్ళ తర్వాత జరిగిందంటేనే నమ్మలేని స్థితికి చేరుకుంది. ఇలాంటి వన్నీ జరిగినప్పుడు సమాజంలో ఎలాంటి భద్రతాలేని భర్త చనిపోయిన అందమైన స్త్రీకి ఇలాంటి పరాభవాలు జరగడం లేదని ఎలా చెప్పగలం?

ఈ కథలో రచయిత సమాజంలో అత్యున్నత స్థాయిలో ఉన్నా బ్రాహ్మణ వర్గాల వాళ్ళు పౌరోహిత్యం, పూజారితత్వం వంటి వృత్తులను చేసి పేదవాళ్ళైపోయినా, వాళ్ళను పోషించే మగ దిక్కు లేకపోయినా, వాళ్ళ గౌరవ మర్యాదలకు ఎలాంటి లోటూ ఉండదు. పైగా అవసరమైతే ఆ ఊరి వాళ్ళంతా ఆ కుటుంబాన్ని ఆదుకుంటారు. అలాంటి వృత్తే సమాజంలో అత్యంత కింది స్థాయిలో ఉన్న మాదిగలు చేస్తే కొలుపులు కథలో జరిగినట్లు జరగడం సామాజిక వాస్తవికత. విచిత్రమేమిటంటే, ఇలాంటివి జరగవని చాలా చులకనగా తీసిపారేస్తుంటారు. ఇలా జరగడం కూడా వాస్తవమే.

ఇనాక్ గారు ఇలా మాదిగ జీవితాల్లోనే వివిధ వస్తువులతో అనేక కథలను రాశారు. తాతలు ముత్తాతలనుండి వస్తున్న భూమిని కోల్పోతే చట్టపరంగా దానిపై మళ్ళీ ఎలా హక్కు సాధించాలో తెలియక తన ప్రతికారాన్ని తీర్చుకొనే కథ పొట్ట పేగులిబ్బంది గోడు. ఈ కథ పూర్తిగా మాండలికంలో కొనసాగింది. పేగులుని మెడలో వేసుకొని నరసింహమూర్తి తినడం వాస్తవానికి దూరం అనిపిస్తుంది. మాదిగల సాంస్కృతిక అంశాలను ఉపయోగించుకొని కింది వర్గాల వర్ణాల వాళ్ళ భూములను హిరణ్యకశిపుడులా ఆక్రమించుకొని పీడించే వారిని మట్టు పెట్టనంతవరకూ పీడన కొనసాగుతుంటూనే ఉంటుందని భావించే ఒక సామాన్యుడి ఆలోచన ఎలా ఉంటుందో ప్రతికాత్మకంగా చిత్రించిన కథ ఇది. చిన్నప్పుడు తిందామంటే తిండిలేక, కష్ట నష్టాలకు గురవుతునే చదువుకొని ఉద్యోగం సాధించుకున్నా, సమాజంలో తగిన గౌరవం లభించని మాదిగ ఉద్యోగులను ఒక బ్రాహ్మణ ఉద్యోగితో పోలుస్తూ రెండు కులాల్లోను కనిపించే సామాజిక సాంస్కృతిక అంశాలను వివరించిన కథ తాకట్టు.

*గొడ్డ దొంగ* కథలో ఊళ్ళో పశువుల దొంగతనం జరిగినప్పుడల్లా ప్రజలంతా మాదిగలను అనుమానిస్తుంటారు. సర్వ సాధారణంగా ఆయా రంగాలలో మంచి జరిగినా చెడు జరిగినా ఆ కులం వాళ్ళని లేదా ఆ వృతి వాళ్ళనే వాటికి బాధ్యులుగా చూస్తుంటారు. సమాజంలో కనిపించే మానవ నైజమది. దీన్నీ కూడా కొంతమంది ఎలా దోపిడి చేస్తుంటారో వాస్తవిక

దృష్టితో రచయిత వివరించిన కథ. ఒక ఊరిలో పశువులు మాయమవుతుంటాయి. పక్క ఊరికి అమ్మేస్తున్నారని ఉదంతులు వస్తాయి. కానీ అలా అమ్మేసేది ఎవ్వరో గుర్తించలేక పోతారు. అందువల్ల ప్రజలంతా అ ఊరిలో మాదిగ వాళ్ళనే అనుమానంగా చూస్తుంటారు. అలా అనుమానంతో చూడటాన్ని అవమానంగా భావించిన నాగడు గొడ్లను దొంగతనం చేసేదెవరో కనిపెట్టాలనుకుంటాడు. అర్ధరాత్రి ముసుగు వేసుకొని కనిపెడతాడు. ఆ దొరికిన వ్యక్తి నాగడ్నే దొంగగా నిరూపించాలనుకుంటాడు. అప్పుడు గనుక సరైన నిర్ణయం తీసుకోకపోతే నాగడ్ని నేరస్తుడిగా నిరూపించడమే కాకుండా అవమానించి ఆ జాతికి శాశ్వత ముద్ర వేసి అతన్ని చంపేసే అవకాశం కూడా ఉందని భావించి ఆ గొడ్ల దొంగను మాదిగ నాగడు చంపేస్తాడు. కానీ ఆ విషయాన్ని ఊరిలో ఎక్కడ చెప్పడు. కొన్ని రోజుల తరువాత కాలువలో ఒక ఎద్దు దట్టంలో ఒక మనిషి అస్థిపంజరం కనిపిస్తుంది. అంతకు ముందే ఆ ఊరిలో దొర కనిపించటం లేదని జనం చెప్పుకుంటుంటారు. ఇంక ఆ ఊరిలో గొడ్ల దొంగతనాలే జరగవు.

సమాజంలో పీడన వివిధ రకాలుగా ఉంటుంది. అది వర్గాన్ని, కులాన్ని, వృత్తిని, బలం బలహీనతను బట్టి కొనసాగుతుంటుంది. అన్ని వర్గాలకు, కులాలకు, వృత్తులకు కింద ఉండే మాదిగ కుల వృత్తుల వారనుభవించే పీడనను దాని వల్ల ఎదురయ్యే మానసిక సంఘర్షణలను తదనంతర పరిణామాలను ఈ కథలో రచయిత వివరించే ప్రయత్నం చేశారు. ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు రాసిన ప్రతి కథలోను ఒక సందేశాన్ని సూచించినట్లనిపిస్తుంది. ఆ సందేశం కథా వస్తువులోని తీవ్రతను బట్టి ఉంటుంది. మాదిగ జీవితాలను ఆధారంగా చేసుకొని రాసిన కథల్లో ఆలోచనాత్మక పరిష్కారాల కంటే ఆవేశమే ప్రధానంగా కనిపించే సందేశాలుంటాయి. వాటిని రచయిత సూచించిన పరిష్కారాలే అని భావించలేం. ఆ పాత్ర ఆశించిన పరిష్కారంగా అవగాహన చేసుకోవాలి. అప్పుడు మాత్రమే అది సామాజిక వాస్తవికత పరిధిలో కనిపిస్తుంది. సమాజంలో అన్ని సమకూరి సాంఘికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా ప్రధాన జీవన స్రవంతిలో గౌరవనీయంగా పరిగణ పొందే కులంలో వాళ్ళ కథలు కావివి. ఇవేమీ దొరకక పోగా అణచివేతకు కూడా గురికాబడుతున్నా వారిలో నిస్సహాయితా ఎదురుతిరిగితే వాళ్ళు ఇలాంటి పరిష్కారాన్నే ఆశిస్తుంటారు. ఒకవేళ తిరగబడలేక నిస్సహాయితను భరిస్తూ కూడా బానిస జీవితాలకు అలవాటు పడిపోయేవాళ్ళు కూడా ఉంటారు. మాదిగలను, మాదిగ జీవితాలను కేంద్రంగా చేసుకొని రాసిన కథలను చూసినా కూడా ఈ రెండు కోణాలు స్పష్టంగా కనిపిస్తాయి. సమాజంలో ఉండే వర్గాలు, వర్ణాలు, మానవ స్పందనలు, అనుభూతులను పరిశీలించినప్పుడు ఒక మాదిగ కులంలోనే రకరకాల వస్తువులను చూపగలిగిన రచయిత మిగిలిన అన్ని కథల్లో ఎన్ని రకాల వస్తువులను తీసుకొని ఉంటారో, జీవితాలను సమాజ లోతులను నిశితంగా పరిశీలించి ఉంటారో చెప్పడానికి ఉదాహరణలుగా ఈ కథలను చూపవచ్చు.

# అనుబంధం

Sambaiah Gundimeda
SOAS, University of London
123# Canterbury Hall
12-18, Cartwright Gardens
London WCIH 9EE
E-mail : sam.gundimeda@soas.ac.uk
Phone : 0044 (0) 2071217354
Mobile: 0044 (0) 7737461672

# మాదిగ సాహిత్యం
# తెలుగు సాహితీ ఫలకంపై
# కొత్త దరువు

*మాదిగ దండోరా భారతీయ సామాజిక ఉద్యమాల్లో ఒక మార్పు. సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో సైద్ధాంతిక విషయాల్లో అది తెచ్చిన మార్పు గణనీయం. కొందరి ద్వారా తిట్టు పదంగా వాడబడే మాదిగ అనే పదాన్ని వాళ్ళు రావు, రెడ్డి, శాస్త్రి, శర్మ లాగా గౌరవ వాచకంగా మార్చారు, విలువలు మార్చబడ్డాయి, మాదిగ భాష మానవీయమైంది. మాదిగ సాహిత్యం ఉధృతమై పాట, ప్రసంగం, వ్యాసం, కథ, నవల ప్రక్రియలన్నిటిలో విస్తరించింది. మాదిగ దండోరా శ్రామిక కుల సంఘాలలో కొత్త చైతన్యాన్ని తెచ్చింది. లంబాడా నగారా, చాకిరేవు, మొదలైన కులం పేర్లతో పాత కుల సంఘాలకి భిన్నంగా వాటి వెలుపల కొత్త సమీకరణతో ఉద్యమాలు సాగాయి.*

--- బి.యస్. రాములు

(రాములు, బి.యస్. 2003. ‘50 ఏళ్ళ తెలుగు కథ తీరు తెన్నులు’, హైదరాబాద్: విశాల సాహిత్య అకాడమి, పే. 86.) దళితుల విద్య - ఉపాధికై కల్పించిన రిజర్వేషన్ వసతులలో అగ్ర భాగాన్ని ఆ కూటమిలో అప్పటికే సాంఘికంగా,

ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగిన మాలలు, ఆది-ఆంధ్రులు చేజిక్కుంచుకుంటున్న కారణాన మాదిగలు, రెల్లి యిత్యాది దళిత కులాలు ఆ వసతులనుండి దూరంగా నెట్టివేయబడటం జరిగింది. రాజ్యాంగ బద్ధంగా కల్పించిన అవకాశాలు దళిత కూటమిలోని కులాలన్నింటికీ చెందుతాయి. అలాగాక కూటమిలోని కేవలం రెండు కులాలే వినియోగించుకోవడం అనేది ఆ కూటమిలోని మిగిలిన కులాలకు జరుగుతున్న సామాజిక అన్యాయం. రిజర్వేషన్ వసతులను కులపర విభజన చేసి దళిత కూటమిలో అభివృద్ధికి నోచుకోని కులాలకు సామాజిక న్యాయం చేకూర్చమంటూ మాదిగల, రెల్లిల ఇంకా ఇతరకులాలు ఒక కూటమిగా ఏర్పడి ' మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి' (ఎం.ఆర్.పి.యస్.) పేర ' వర్గీకరణ' డిమాండ్ తో దండోరా ఉద్యమానికి పూనుకున్నారు. వర్గీకరణ ఉద్యమానికి వ్యతిరేకంగా మాలలు, ఆది-ఆంధ్రులు ఒక కూటమిగా ' మాల మహానాడు' ను ఏర్పాటు చేసుకుని వర్గీకరణతో సామాజిక న్యాయం జరగదని, పైపెచ్చు అది దళితుల ఐక్యతకు గొడ్డలిపెట్టు అంటూ ప్రతికూల ఉద్యమంతో మాదిగలను ప్రతిఘటించారు. కులం, సామాజిక న్యాయం, ఐక్యత అనే మూడు ప్రధాన అంశాలుగా దండోర - మాల మహానాడు ఉద్యమ వేదికలపై ముందుగా మాదిగ-మాలల మధ్య ఒక గొప్ప చర్చ జరిగింది. ఆ ఉద్యమాలు, అవి లేవనెత్తిన పశ్నలు ప్రధాన వస్తువులుగా ఈ రెండు కులాలకు చెందిన రచయితలు, వ్యాసకర్తలు, కవులు, కథకులు తమదైన రీతిలో స్పందించి దళిత సాహిత్యంలో మరొక నూతన అధ్యాయాన్ని ఆరంభించారు.

దండోరా ఉద్యమ నేపథ్యంలో, ఆ ఉద్యమ స్ఫూర్తితో ఎందరో మాదిగ విద్యావంతులు తమ కలాలకు పదునుపెట్టి కరపత్రాలతో, పాటలతో ప్రారంభించి కవిత, కథానిక, వ్యాసం, నవల మొదలైన ప్రక్రియలతో తెలుగు సాహిత్య నాట్య రమణికి కొత్తనడకలు నేర్పారు. అరంభంలో కేవలం మాదిగోడి గోడు వినిపించడానికే పట్టిన కలం క్రమేపి తమ కుల సమస్యల ఎల్లలను దాటి తమలాగే సామాజిక గుర్తింపు కోల్పోయి, సామాజిక న్యాయాన్యాయాలకు గురైన ఎన్నో దళిత దళితేతర కులాల సమస్యలను కూడా తట్టింది.

మాదిగ దండోరా మానవత్వంతో వారి పక్షాన నిలిచింది. దండోరా లేవనెత్తిన చర్చను, సృష్టించిన సాహిత్యాన్ని ఆమూలాగ్రం పరిశీలించే భగీరథ ప్రయత్నాన్ని దార్ల చేపట్టాడు. అలాంటి కొన్ని ఆణిముత్యాల్లాంటి వ్యాసాల సమాహారమే *'దళిత సాహిత్యం: మాదిగ దృక్పథం'* పుస్తకంగా ప్రచురిస్తున్నాడు. ఆ వ్యాసాలను నాలుగు స్వతంత్ర విభాగాలలో పరిశీలించే ప్రయత్నమే ఈ వ్యాసం.

***పుల్లం రాజు నుండి నల్ల రేగడిసాల్లు వరకు***

**తెలుగు దళిత కథా పరిణామం:**

దళిత కథా పరిణామాన్ని దార్ల వివరిస్తూ దళిత కథకు తెలుగు సాహిత్యంలో ఒక విశిష్ట స్థానాన్ని కల్పించే ప్రయత్నాన్ని *"తెలుగు దళిత కథా పరిణామం"* వ్యాసంలో చేశాడు. సాధారణంగా ఒక వ్యవస్థనో లేదా ఒక రంగాన్నో శాసిస్తున్నవారు కొత్తదనాన్ని

అహ్వానించారు. ముఖ్యంగా ఆ క్రొత్తదనం తమ పీఠలను కదిలించేటట్లుంటే ఆరంభంలోనే దాన్ని భూస్థాపితం చేసేందుకు ఎన్నో సామ,దాన భేద,దండోపాయాలు ఆచరిస్తారు. ఎన్ని చేసినప్పటికీ ఆ కొత్త శక్తిని ఆపడం తమ తరం కానప్పుడు జీవంలేని వాదాలతో దాని ప్రభావాన్ని తగ్గించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తారు. ఇట్టి ప్రయత్నాలు వారి మూర్ఖత్వాన్ని, వితండవాద బుద్ధిని బట్టబయలు చేస్తాయేకాని ఆ నవ్యతలోని శక్తిని ఏ మాత్రం తగ్గింపజాలవు. కవిత్వం, కథ, నాటకం, పాట, విమర్శ తదితర సాహిత్య ప్రక్రియలతో దళిత సాహిత్యం తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేస్తున్నప్పటికీ అట్టి సాహిత్యం ఉద్యమం కాదు అది వాదమేనని మార్క్సిస్టులు, సంప్రదాయవాదులు వాదించడం వారి వితండవాద బుద్ధికి పరాకష్ట. వితండవాదుల వాదాలకు సమాధానాలు యివ్వవలసిన అవసరం ఉండదు, అసలు వానిగురించి పట్టించుకోవలసిన పనే లేదు. అయితే ఈ వితండవాదుల నోర్లు మూయించకుంటే వారు మరలా మరలా అటువంటి వాదాలను చెయ్యడానికి అవకాశం ఉంది. పైగా వీరు తెలుగు సాహితీ రంగాన్ని ఇంకా శాసిస్తునే ఉన్నారు, కాబట్టి కొత్తదనం ముందుకు సాగాలంటే ఆ సణుగుడిని ఆపింపజేయడం తప్పనిసరి అవుతుంది. దళిత కథా పరిణామాన్ని పరిశీలించే ముందు ఈ పనికే దార్ల నడుం బిగించాడు. వాదానికి తాత్విక దృక్పధం కంటే ఆ వాదాన్ని వినిపించేవారి ఆశలను - ఆశయాలను వినిపించడమే ప్రధానంగా ఉంటుంది. పైపెచ్చు వాదం చాలాసార్లు కొన్ని తాత్కాలిక ప్రయోజనాలను మాత్రమే ఆశిస్తుంది. అయితే ఉద్యమం అలాకాదు. దానికి *"స్పష్టమైన ప్రణాళిక, లక్ష్యం, తాత్విక నేపథ్యం, దృక్పధం మొదలైనవి ఉంటాయి"* అని ఉద్యమాన్ని నిర్వచించి దళిత సాహిత్యం ఉద్యమేనని స్పష్టంగా చెబుతాడు. ఆ విషయాన్ని నా మాటలలో కంటే దార్ల మాటలలో పేర్కొంటేనే అందులోని స్పష్టత మరింత బాగా తెలుస్తుంది.

*"దళిత సాహిత్యానికి 'దళిత పాంథర్స్' నుండే ఒక ప్రణాళిక ఉంది. కుల నిర్మూలన లక్ష్యం ఉంది. వర్ణాశ్రమ ధర్మాలపై నిర్మితమైన భారతీయ సమాజం, వివిధ మతాల ప్రభావాలు వంటి వాటినుండి శారీరక, మానసిక, ఆర్థిక, సాంఘిక , సాంస్కృతిక క్షోభలను, అవమానాలను ఎదుర్కొన్న జాతుల ప్రధాన జీవన స్రవంతిలోకి రావాలనే నేపథ్యం ఉంది. డా. బి.ఆర్. అంబేద్కర్, జ్యోతిబా ఫూలే, పెరియార్ రామస్వామి నాయకర్ మొదలైన వారి భావ జాలాన్ని అర్థం చేసుకుంటేగాని ఇవన్నీ అవగాహనలోకిరావు. ఆ దృక్పధంతో తెలుగు దళిత సాహిత్యాన్ని చూస్తేగాని తెలియదు. అలా చూడగలిగినప్పుడు 'దళిత సాహిత్యం' వాదమో, ఉద్యమమో స్పష్టమవుతుంది"*, అని దళిత సాహిత్యానికి ఒక పటిష్టమైన దీప శిఖరాన్ని నిర్మిస్తాడు. ఆ దీప శిఖరంపైనుండి దళిత కథా కట్టడాన్ని పర్యవేక్షిస్తాడు.

తెలుగు దళిత కథా పరిణామం రెండు దశలలో జరిగింది. అవి స్వాతంత్ర్యానికి పూర్వం ఒక దశ అయితే స్వాతంత్ర్యం తరువాత రెండవ దశ. స్వాతంత్ర్యానంతరం తెలుగు రాష్ట్ర రాజకీయాలను, దళితుల (వీరితోపాటు దళితేతరులలో సామాజికంగా-ఆర్థికంగా వెనుకబడిన అణగారిన వర్గాలవారి) జీవన స్థితిగతులను వివిధ తాత్విక ఉద్యమాలు, సంఘటనలు, సమస్యలు ప్రభావితం చేస్తాయి. అట్టి వానిలో ముఖ్యమైనవి: కమ్యూనిస్ట్

తాత్విక ఉద్యమం-రాజకీయాలు, నక్సల్బరీ-శ్రీకాకుళ పోరాటాలు, కారంచేడు-చుండూరు దురాగతాలు, స్త్రీవాద ఉద్యమం, మాదిగ దండోరా వర్గీకరణ డిమాండ్. వీని ఆధారంగా స్వాతంత్ర్యానంతర తెలుగు కథా పరిణామాన్ని మూడు దశలలో దార్ల వీక్షిస్తాడు. దళిత వాదానికి ప్రాతినిధ్యమనదగిన కొన్ని కథలను పరిశీలించడం ద్వారా దళిత కథా స్వరూప స్వభావాలను, పరిణామాన్ని తెలియ జేయడం జరిగింది. కాల ప్రాతిపదికన దళిత కథా పరిణామాన్ని వీక్షించినప్పటికీ వామపక్ష, దళిత, స్త్రీవాద, మాదిగ ఉద్యమాల నేపథ్యంలో ఆయా కాలాల దళిత సమస్యల వస్తుపరంగా ఈ పరిణామాన్ని తెలియజేయడం ఈ వ్యాస విశిష్టత.

స్వాతంత్ర్యానికి పూర్వం వచ్చిన దళిత కథల్లో దళితేతరులు ముఖ్యంగా బ్రాహ్మణ కులానికి చెందినవారు రాశారు. అలా రాసిన వారు మహాత్మా గాంధీ ' హరిజనోద్ధరణ' పిలుపుకి ప్రభావితులై రాయడం జరిగింది. వీరిలో *' పుల్లంరాజు', 'సాగర సంగం'* లాంటి కథలు రాసిన శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, *' నరసన్న పాపాయి'* కథకుడు అడవి బాపిరాజు ముఖ్యులు. వీరి కథలలో కనిపించేవి ప్రధానంగా మూడు విషయాలు: (1) దళితుల మధ్య అనైక్యత, (2) దళితుల మతాంతరీకరణ, (3) దళితుల దేవాలయ ప్రవేశం,హరిజన సమస్యలను వీరు తమ కథానికలలో చెప్పడంతోటే సరిపెట్టుకోక ఏ హరిజనోద్ధరణ పిలుపుతో తాము ప్రభావితులయ్యారో, ఆచరణలో ఆ హరిజనోద్ధరణ డొల్లను నిజాయితీతో స్పష్టం చేశారు. ఉదాహరణకు శ్రీపాద సుబ్రమణ్య శాస్త్రి ' ఇలాంటి తవ్వాయి వస్తే' కథ అసలు సమస్యను అగ్రకులాలు ఎంత చాకచక్యంగా తప్పదారి పట్టిస్తున్నారో స్పష్టం చేస్తుంది. వీరితో పాటు చలం లాంటి సాహితీవేత్తలు *'హరిజన సమస్య', 'మాదిగమ్మాయి'* లాంటి కథలను రాసినప్పటికీ ' హరిజన' సమస్య లోతులు తెలియకుండా రాసిన కథలని దార్ల వ్యాఖ్యానిస్తాడు. ఈ విషయాన్నే బి.యస్. రాములు వేరొక సందర్భంలో స్పష్టం చేస్తూ ఇ లా పేర్కొంటాడు: "చలం రాసిన *'హరిజన విద్యార్థి'* కథ అతనిలో గల బ్రాహ్మణ స్వభావాన్ని పట్టిస్తుంది. హరిజనులంటే మగ వాళ్ళే అన్నట్టు, హరిజనుల్లో స్త్రీలుంటారనే ఆలోచనకు రాని చలం, తన కడుపు మంటతో రాసిన కథ ఇది." (రాములు,బి.యస్. 2003. '50 ఏళ్ళ తెలుగు కథ తీరు తెన్నులు', పే. 163)

స్వాతంత్ర్యం తరువాత, కారంచేడు సంఘటనకు ముందు ఉన్న కాలం దళిత ఉద్యమ-రాజకీయాలకు సంధి కాలమైనట్లే దళిత కథకు కూడా సంధి కాలం అవుతుంది. ఈ కాలంలో అటు దళిత కూటమిలో - ఇ టు హిందూ కూటమిలో గాంధి హరిజనోద్ధరణ ఉద్యమం, రాజ్యంగం ద్వారా దళితుల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికై చేపట్టిన వివిధ పాలసీల రూపేణా ఎన్నో మార్పులు-చేర్పులు జరుగుతాయి. ఈ మార్పు-చేర్పుల సమస్యలే స్వాతంత్ర్యానంతరం వచ్చిన దళిత కథకు ప్రధాన వస్తువులయ్యాయి. అస్పృశ్యత, నీటి సమస్య, రాజకీయధికారం, వృత్తి వల్ల వచ్చే అనారోగ్యం, వృత్తులు మారి చదువుకున్నా వీడని కుల పీడన, గ్రామాల్లో భూస్వామ్య పెత్తందారీ రాబందుల విధానాలవల్ల దళితులు పడిన ఇబ్బందులు ప్రధానమైనవిగా దార్ల గుర్తిస్తాడు. ఈ సంధి కాలంలో దళిత కథను

సుసంపన్నం చేసిన వారు ముఖ్యంగా రెండు కూటమిలకు చెందిన వారు : ఒకరు వామపక్ష కూటమికి చెందిన వారైతే (వీరిలో అధికులు దళితేతరులు), మరొకరు దళిత కూటమికి చెందిన వారు. దళిత కూటమికి చెంది దళిత వస్తువు ప్రధానంగా కథలు రాసిన వారిపై అంబేద్కర్ భావజాల ప్రభావం కనిపిస్తుంది. ఈ కూటమికి చెందిన వారిలో అగ్రజుడు కొలకలూరి ఇనాక్. ఆయన రాసిన '*ఊరబావి*' కథ కేవలం దళిత కథలలోనేగాక మొత్తం తెలుగు కథానికలలోనే ఒక కోహినూర్ వజ్రం లాంటిది. అందుకే ఆ కథ "స్వాతంత్ర్యానంతర తెలుగు ఆధునిక కథ", అని, *"కొలకలూరి ఇనాక్ స్వాతంత్ర్యానంతర ఆధునిక తొలి తెలుగు కథకుడు"* అని బి.యస్. రాములు తన '*50 ఏళ్ళ తెలుగు కథ తీరు తెన్నులు*' వ్యాసంలో ప్రతిపాదిస్తాడు.

దళిత-స్త్రీవాద ఉద్యమాలు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం లో ఏక కాలంలో సమాంతరంగా ముందుకు వచ్చి, హిందూ సమాజంలోని అగ్రకుల తత్వాన్ని, పురుషాహంకారాన్ని జులుపట్టుకుని నడివీధిలోకి లాక్కొచ్చి ఆ అగ్రకుల తత్వం, ఆ పురుషహంకారం ఇకపైన చెల్లవంటూ నిష్కర్షగా తేల్చి చెప్పాయి. ఈ రెండు ఉద్యమాల స్ఫూర్తితో ఆవిర్భవించిన దళిత స్త్రీ వాద ఉద్యమం తమ మగ పుంగవుల పెత్తనం; ఆడది, పేదది అందులోనూ అంటరానికులానికి చెందినదని అలుసు తీసుకుని తమ ఆధిపత్యాన్ని చెలాయించుకొనే అగ్రకులా వారి ఆటలను కట్టి పెట్టమని, లేకుంటే తగినట్లుగా బుద్ధిచెప్పక తప్పదని తూటాల వంటి మాటలతో గట్టిగానే హెచ్చరించింది. ఈ ఉద్యమాల నేపథ్యంలో '*దళిత కథలు*' పేరుతో కె.లక్ష్మీనారాయణ సంపాదకత్వంలో వచ్చిన ఎనిమిది సంపుటాలు; వాటితో పాటు '*ఉప్పు నీళ్ళు*', '*హెచ్. సరస్వతి*', '*నలుపు*' లాంటి అనేక కథలు దళిత కథను సుసంపన్నం చేశాయని తెలుగు దళిత కథా పరిణామంలో ఈ కథల ప్రాముఖ్యతను దార్ల గుర్తిస్తాడు. వీనితో పాటు దండోరా ఉద్యమ నేపథ్యంలో మాదిగల జీవితం ప్రధాన వస్తువుగా వచ్చిన కథలను గురించి కూడా ఈ వ్యాసంలో దార్ల ప్రస్తావిస్తాడు. ఆ ప్రస్తావన గురించి కింద చెప్పటం జరుగుతుంది.

**కరపత్రాలనుండి కక్క నవల వరకు:**

**మాదిగ సాహిత్య పరిణామం, దాని దృక్కోణం:**

ఎండిన చెరుకాకులతో మంట పెట్టి ఆ మంటలో కాపిన తప్పెటలతో మాదిగలు వేసే పదునైన దరువుకి, చేసే లయ బద్ధమైన తాండవానికి ఊరంతా ఒక్కొక్కమారు వెర్రెత్తిపోతే ఒక్కొక్కమారు భయకంపితులై గుండెలు పట్టుకుంటారు. వచ్చీ రావడంతోనే వివిధ సాహిత్య ప్రక్రియలతో సాహిత్య ఫలకంపై మాదిగలు వేసిన దరువుకి, చేసిన తాండవానికి తెలుగు సాహితీ రంగం వెర్రెత్తి పోతే; ఉమ్మడి రిజర్వేషన్లలో దళితుల పేర తమ వారు తిష్ట వేసినట్లే దళిత సాహిత్యం పేర తమ కుల జీవితాన్ని, తమ కుల అజెండాను ముందుకు నెడుతున్న మాల సాహితీకారులు ఒక్కసారిగా భయ భ్రాంతులయ్యారు. బిక్కసచ్చిపొయ్యారు.

మాదిగ సాహిత్య సూర్య కిరణాలను చేవలేని మూడు వాదాలనే చేతులతో అడ్డుకోవడానికి ప్రయత్నించారు.వాటిని ఇలా విభజించి చూపవచ్చు.

(1) సాహిత్యం పేర మాదిగలు రాస్తున్న రాతలు సాహిత్యమేకాదు. వారి కవిత్వం శిల్ప పరంగా లోప భూయిష్టంగా ఉంది.

(2) దళిత రిజర్వేషన్ల వర్గీకరణ డిమాండ్ ప్రచారం చేయడానికే మాదిగ సాహిత్యం పుట్టుకొచ్చింది.

(3) మాదిగ సాహిత్యం పేరుతో ప్రత్యేక సాహిత్యం గాని, ప్రత్యేక వాదం గాని రావలసిన అవసరంలేదు. ఆ సాహిత్యం, ఆ వాదం దళిత సాహిత్యంలో దళిత వాదంలో అంతర్భాగమే అని వాదించే ప్రయత్నం కనిపిస్తుంది.

ఈ మూడు వాదాలను మనం జాగ్రత్తగా పరిశీలిస్తే ఒక్క విషయం స్పష్టంగా అవగతమవుతుంది. ఈ వ్యాసంలో పైన పేర్కొన్నట్లుగా ఒక రంగంలో తిష్ట వేసి దానిని శాసిస్తున్న పాత తరం కొత్త తరం తెచ్చే నవ్యతను గాని, మార్పును గాని హర్షించలేరు, ఆహ్వానించలేరు. దళిత ఉద్యమ నేపథ్యంలో వచ్చిన దళిత సాహిత్యాన్ని మార్క్సిస్టు, సంప్రదాయ సాహితీకారులు ఆహ్వానించక పోగా దానిని ఆదిలోనే అంత మొందించడానికి శతవిధాల ప్రయత్నాలు చేశారు. అలా చేసిన ఏ ప్రయత్నమూ ఫలవంతం కాక పోగా, దళిత సాహిత్య ప్రవాహం పరవళ్ళు త్రొక్కుకుంటూ ముందుకు దూసుకు పోయింది. అప్పటికీ తమ ప్రయత్నాలు వీడక ప్రవాహాన్ని అపడం సాధ్యం కాకపోతే పోయింది కనీసం దాని వేగాన్నయినా అపలేమా అని కొన్ని చొప్పదంటు వాదాలు అడ్డుపెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. దళిత సాహిత్య ప్రవాహ ఒరడిలో ఆ అడ్డులన్నీ కొట్టుకు పోయిన సంగతి సాహితీ కారులందరూ ఎరిగిన విషయమే.

ఇప్పుడు రంగం మారింది. అప్పటి మార్క్సిస్టు, సంప్రదాయ సాహితీ కారుల స్థానాలలో దళిత సాహితీ కారులుగా చెలామణి అవుతున్న మాల సాహితీ కారులు నిలబడితే, అప్పటి దళిత సాహితీ కారుల స్థానాలలో మాదిగ సాహితీ కారులు నిలబడటం జరిగింది. అయితే, ఈ సమరానికి సానపట్టిన వాదకత్తులు, యుద్ధ తంత్రాలు మాత్రం పాతవే, పూర్వపు రంగానికి చెందినవే. అందుకే ముందుగా మాదిగ సాహిత్యాన్ని అసలు సాహిత్యమే కాదన్నారు. అయినా భూమిపై బీజం పడినాక మొలకెత్తక మానదన్నట్లు మాదిగ సాహిత్య బీజానికి మాల సాహితీకారులు పాదులు తీయనంత మాత్రాన దాని ఎదుగుదల ఆగిపోలేదు. పైపెచ్చు వివిధ సాహితీ ప్రక్రియల సంతులిత ఎరువుతో రోజు రోజుకీ ఏపుగా ఎదగడం గమనించవలసి ఉంది. మాదిగ సాహిత్యాన్ని తాము గుర్తించినా గుర్తించక పోయినా దాని ఎదుగుదలను ఆపడం తమకు సాధ్యం కాదని మాలలు నిర్ధారణకు వచ్చి, అలా ఆపలేకపోయినా కనీసం దాని పటుత్వాన్నైనా ఏదొక రూపంలో బలహీన పరచాలనే దురుద్దేశంతో కేవలం దండోరా ఉద్యమ ప్రచారమే మాదిగ సాహిత్య ఆశయ - లక్ష్య ఆద్యంతాలు అని ప్రచారం చేసి ఆ సాహిత్య పరిధిని కుదించే ప్రయత్నం చేశారు. అయితే, మాదిగ కలం గూడెంలో పుట్టినప్పటికీ గూడెపు హద్దులు దాటి అణచివేతకు, అన్యాయానికి గురైన వారందరి పక్షనా

కులాతీతంగా, మతాతీతంగా నిలబడటం సాహితీకరులందరికీ తెలిసిన విషయమే. తాము వెర్రి మొర్రి అనుకున్నదే ఏ రంపానికీ తెగని మర్రి వృక్షమవడంతో ఇక చేసేదేమిలేక ఆ వృక్షం కూడా దళిత సాహితీ వనంలోదే అని మాదిగ సాహిత్యాన్ని స్వంతం చేసుకోవడం మొదలుపెట్టారు దళిత సాహితీ కారులమని చెప్పుకునే కొంతమంది మాల సాహితీ కారులు. మాదిగ సాహిత్యాన్ని ఇలా స్వంతం చేసుకోవడాన్ని ఆ సాహిత్యాన్ని వారు గుర్తించినట్లుగా చాలామంది భావించడానికి అవకాశముంది.

నా దృష్టిలో ఇలా స్వంతం చేసుకోవడం అనేది మాల సాహితీ కారులు పన్నిన మరో పన్నాగం. వృక్షం మర్రి వృక్షమైనా అది దళిత వనంలోదే. దళిత వనంలో అనేక వృక్షాలతో పాటు మర్రి వృక్షాలు కూడా ఉంటాయి. కాబట్టి ఒక్కదాని గురించి ప్రత్యేకంగా చెప్పుకోనవసరం లేదు. అయితే గియితే ఏదైనా చెప్పుకోవాలంటే ఆ వృక్షాలన్నీ ఉన్న వనం గురించే సార్వజనీనకంగా చెప్పుకుంటే సరిపోతుందనేది మాల సాహితీ వేత్తలు ఆలోచన. వివరణలో మాదిగ సాహిత్యం దళిత సాహిత్యంలో అంతర్భాగం అని చెప్పడం ఆ సాహిత్యానికి ఉన్న ప్రత్యేకత, విశిష్టతలను కొల్లగొట్టడం లేదా తగ్గించడానికి చేసిన ప్రయత్నమే.

ఈ విషయాలన్నింటిని సవిస్తరంగా చెబుతూ మాదిగ సాహిత్య చారిత్రక పరిణామాన్ని, ఆ సాహిత్య లక్ష్య దృక్పథాలను, దాని ప్రత్యేకతలను " *దళిత సాహిత్యం: మాదిగ సాహిత్యం*" అన్న వ్యాసంలో దార్ల విశ్లేషణ చేశాడు.

ఈ వ్యాసంలో మూడు ముఖ్యమైన అంశాలపై దార్ల తన దృష్టిని కేంద్రీకరిస్తాడు. అవి:

(1) మాదిగ సాహిత్య చారిత్రక పరిణామం.

(2) మాదిగ సాహిత్య ఆశయ-లక్ష్యాలు.

(3) మాదిగ సాహిత్య ప్రక్రియలు-వస్తు విషయాలు. మాదిగ సాహిత్య పరిణామం మూడు దశలలో జరిగింది. దండోరా ఉద్యమ ఆరంభంతో ఆ ఉద్యమ వాదాన్ని వినిపించేడమనే ఏకైక ఉద్దేశ్యంతో కరపత్రాలు, పాటల రూపంలో ప్రారంభమైన మాదిగ సాహిత్యం కవిత్వంతో ఒక కొత్త మలుపు తిరగడాన్ని ప్రాథమిక దశగా దార్ల గుర్తిస్తాడు. ఈ తొలి దశలో వచ్చిన సాహిత్యంలో పదునైన ఆలోచనలతోపాటు చిక్కనైన ఆవేశం కూడా ఉంది. దళిత రిజర్వేషన్ వసతులలో అధిక శాతాన్ని తమ కంటే తక్కువ జనాభా కలిగిన మాలలు ఎక్కువగా వినియోగించుకోవటం ఈ ఆవేశానికి ఆధారం. కొత్తగా పట్టిన కలం కావడంతో అది ఆవేశాల కట్టను తెంచి, ఆలోచన పంటను ముంచెయ్యడం ఈ దశలో జరిగిన ఒక వైపరీత్యమని దార్ల నిజాయితీగా ఒప్పుకుంటాడు. అయితే, దళిత సాహిత్యం తొలినాళ్ళల్లో దళిత కలం దళితేతరులపైనా, ఇప్పుడు మాదిగ కలం మాల కులంపై విరుచుకుపడింది. అంతకు ముందు దీని కంటే ఎన్నో రెట్లు అధికంగా, తీవ్ర స్థాయిలో అవేశంతో ఊగిపోయినప్పటికీ దళిత ఉద్యమాన్ని దాని కలాన్ని సమర్థించే ఒక వర్గం అప్పటికే ఏర్పడి ఉంది అని దార్ల వ్యాఖ్యానించాడు. అట్టి వర్గమనే పందిరి మాదిగల కలల మల్లెమొగ్గకు లేక పోవడంతో అది ఎదుర్కొన్న ఒడుదుడుకులను కుడా ఈ దశలో గుర్తించాలని దార్ల గుర్తుచేస్తాడు. మాదిగ ఉద్యమానికి అవసరమైన భావజాలాన్ని అందిస్తూనే తమ ప్రాచీనులు తమకు అందించిన

జానపద, మౌఖిక సాహిత్య వారసత్వ సంపదను వెదుక్కోవడాన్ని మాదిగ సాహిత్య పరిణామంలో రెండవ దశగా దార్ల పేర్కొంటాడు.

ఇక మూడవ దశ మాదిగ సాహిత్య వ్యవస్థీకృత దశ.

*"మాదిగ సాహిత్య వేదిక ఏర్పడి, మాదిగలకు ఒక ప్రత్యేక సంస్కృతి ఉందని చాటి చెప్తూ, ఆత్మ గౌరవంతో ప్రత్యేక సాహిత్య వాదంతో నిలబడాలనుకోవడం" ఈ దశలోని ప్రత్యేకత.*

రెండవ అంశమైన మాదిగ సాహిత్య ఆశయ-లక్ష్యాలలో, కులం పేరుతో కారంచేడు కమ్మలు జరిపిన దళితలపై జరిగిన నర మేధానికి వ్యతిరేకంగా దళిత ఆత్మ గౌరవ ఉద్యమం ఆరంభమైతే, దళిత కూటమిలో తమనే ప్రధాన కేంద్రంగా చేసుకుని మాలలు సాగిస్తున్న వివక్షకు వ్యతిరేకంగా వచ్చిందే మాదిగ ఆత్మ గౌరవ ఉద్యమం అంటాడు దార్ల.

కుల నిర్మూలన, రాజ్యాధికారం అనే రెండు ప్రధానమైన అంశాల అజెండా సాధన దళిత ఉద్యమ-సాహిత్యాల ఉమ్మడి ఆశయ-లక్ష్యాలైతే; కుల వివక్ష నిర్మూలన, దళిత రిజర్వేషన్లను దళిత కులాన్నింటికి సమ పంపిణీ, రాజ్యాధికారంలో అందరికి సమాన భాగస్వామ్యం అనే మూడు ప్రధానమైన అంశాల అజెండా సాధనే మాదిగ ఉద్యమ-సాహిత్యాల ఉమ్మడి ఆశయ-లక్ష్యాలని దార్ల స్పష్టంగా ప్రకటిస్తాడు. ఈ విస్పష్ట ప్రకటనతో మాదిగ సాహిత్యం దళిత సాహిత్యంలో అంతర్భాగమని సనిగే నోళ్ళకు గొళ్లేలు వేసి, మాదిగ సాహిత్య స్వతంత్రతను, ప్రత్యేకతలను చాటతాడు.

మాదిగ సాహిత్య స్వతంత్రతను కేవలం ప్రకటించడంతోనే సరిపెట్టుకోక అట్టి స్వతంత్రతను చాటుకునే శక్తి ఆ సాహిత్యానికి ఏ విధంగా ఉందోననే విషయాన్ని ఈ వ్యాసంలో మాదిగ సాహిత్య ప్రక్రియలు-వస్తు విషయాలు అనే మూడవ అంశంలో దార్ల సమన్వయించి చూపాడు. దీన్ని బట్టి నిజానికి దళితసాహిత్యం అని ఇంతవరకూ పిలవబడుతున్నదంతా మాదిగ సాహిత్యమే అని స్పష్టం చేస్తున్నాడు.

ఈ ప్రతిపాదన చాలా ముఖ్యమైంది. లోతుగా దీన్ని చూస్తే మాదిగ సాహిత్యంలో అంతర్భాగంగానే దళిత సాహిత్యం ఉండవలసి వస్తుంది. ఇది యావత్తు తెలుగు సాహిత్య విభజననే మార్చే ప్రతిపాదన. దీన్నిదార్ల చాలా జాగ్రత్తగా ప్రతిపాదించి సమన్వయించాడు. దళిత సాహిత్యం పేరుతో ఎవరు రాసినా మాదిగల జీవితం, మాదిగల వృత్తులు, మాదిగ పనిముట్లే కనిపిస్తాయనేది దార్ల ప్రతిపాదన. ఇది నిజం. ఇప్పటికే ప్రాచుర్యంలోకి వచ్చిన వాటిని ఇక్కడ మాదిగ సాహిత్యంలోని నాలుగు ప్రధానమైన ప్రక్రియల ఆధారంతో ఆ సాహిత్య శక్తి ప్రదర్శన చేయడం జరిగింది. అవి: కవిత, కథానిక, నవల, వ్యాసం. వీనిలో మొదటి ప్రక్రియ అయిన కవితను తీసుకుంటే, కవితలలో వ్యక్తమైన వస్తువు ఆధారంగా మాదిగ కవితను మూడు రకాలుగా విభజింపవచ్చును.

వర్గీకరణ డిమాండ్ చేసే కవితలు మొదటివి. '*మాదిగోడు*', '*మాదిగ మేనిఫెస్టో*', '*వర్గీకరణీయం*', '*దండోరా*' లాంటి కవితలు ఈ కోవకు చెందుతాయి. మాదిగల వర్గీకరణ డిమాడ్ ని వ్యతిరేకిస్తూ, మాదిగ మల్లె మొగ్గలను దళిత వనంలో పూసిన గంజాయి మొక్కలుగా తులనాడుతూ '*ఏకీకరణీయం*', '*నీలి పతాక*' లాంటి మాలలు రాసిన కవితా

రాతలకు సమాధానంగా మాదిగలు రాసిన కవితలు రెండవ కోవకు చెందుతాయి. '*నల్లద్రాక్ష పందిరి*', '*మాకొద్దు ఈ మాల దొరతనం*' లాంటి కవితలు ఈ రెండవ కోవలో ప్రధానమైనవి. మాదిగ సంస్కృతిని, ఆ సంస్కృతి ఔన్నత్యాన్ని చాటి చెప్పే కవితలు మూడవ కోవకు చెందుతాయి. ఈ కోవలో '*చండాల చాటింపు*', '*చెప్పులకు నమస్కరిస్తున్నాను*', '*గూటం దెబ్బ*', '*ఎర్కోషి*' లాంటి కవితలను ముఖ్యంగా చెప్పుకోవచ్చు.

మాదిగ సాహిత్య కవిత మాదిరే మాదిగ సాహిత్య కథానికలను కూడా రెండు రకాలుగా విభజింపవచ్చును. గత, వర్తమాన మాదిగ జీవితాన్ని, ఆ జీవన సంఘర్షణను ప్రతిఫలించే కథనాలు ఒక కోవకి చెందగా, మాదిగ కుల పౌరాణిక వారసత్వాన్ని, ఆ వారసత్వంలో గల కుట్రను కూడా విప్పి చెప్పే కథానికలు రెండవ కోవకి చెందుతాయి. '*మాదిగోడు*', '*మల్లె మొగ్గల గొడుగు (మాదిగ కథలు)*', '*కులవృత్తి*', '*నల్లరేగడి సాల్లు*'- లాంటి కథలు మొదటి రకానికి ఉదాహరణలు కాగా, '*జాంబవంతుడు - పిచ్చిమామ*', '*ఆరంజ్యోతి*' లాంటివి రెండవ కోవకు ఉదాహరణలు. మాదిగ సాహిత్యం సృష్టించిన నవలలో '*జాతర*', '*గద్దలాడతాండాయి*', '*కక్క*' నవలలు ముఖ్యంగా పేర్కొనదగినవి. (దండోరా నేపథ్యంలో మాలల దృష్టికోణం నుండి మాదిగ చైతన్యాన్ని చెప్పిన నవల 'మాదిగ పల్లె'. అయితే ఈ నవలకు మాదిగ పల్లె అనే పేరు కంటే మాల పల్లె అని పేరు పెడితే చక్కగా సరిపోయేది. కథా నాయకుడు మాల కులానికి చెందినవాడు, కథనం అంతా ఆ నాయకుడు, అతని కుటుంబం చుట్టూ పరిభ్రమిస్తూ, మాలల పోరాట పటిమ, సాహసాల గురించి చెప్పిన నవల. మాదిగలలో అటువంటి నాయకత్వం, దీక్ష దక్షతలు ఉన్నట్లు మచ్చుకైనా చెప్పదు. రాయుడు చెప్పినట్లుగా మాల కులానికి చెందిన నరసయ్య మాదిగ పల్లె నవల రాసి తెలిసో, తెలియకో తమ కులానికి మాదిగలపై గల అభిప్రాయాన్ని వెల్లడించడం చేశారు. చూడండి, రాయుడు, కె.యం. 2003. 'స్వైర కల్పనగా మారిన 'మాదిగ పల్లె'', చంద్రశేఖర రెడ్డి, రాచపాళెం, కె. లక్ష్మినారాయణ (సం.) *1980 తర్వాత తెలుగు దళిత నవల* (వ్యాస సంకలనం), అనంతపురం: లక్ష్మి గ్రాఫిక్స్, పే. 73.)

కరువు కాటకాలు, రెడ్ల సామాజిక, ఆర్థిక, రాజకీయాధిపత్యాల రాయలసీమలో మాదిగ జీవనాన్ని వారి సంఘర్షణలను చిత్రించిన నవల *గద్దలాడతాండాయి* అయితే, తెలంగాణ మాదిగల జీవన సంస్కృతి, ఆచార వ్యవహారాలు, దళితుల్లోని అనైక్యత, దళిత ఆత్మ గౌరవ పోరాటంలో భాగంగా పురివిప్పిన మాదిగ చైతన్యాన్ని చిత్రించిన నవల *కక్క*. మాదిగ అస్తిత్వాన్ని స్థిరీకరించే ప్రయత్నం ఈ నవలల్లో చాలా వరకూ జరిగిందని ఘంటాపథంగా చెప్పవచ్చు.

ఈ విధంగా ఆరంభంలో మాదిగ సాహిత్యం దళిత సాహిత్యంలో అంతర్భాగంగా ఆరంభమైనప్పటికీ, ఆ సాహిత్యం తడిమిన పలు ప్రక్రియల, వస్తు వైవిధ్యాల దృష్ట్యా చూచినప్పుడు దాని కంటూ ఒక స్వంత అస్తిత్వం, ప్రత్యేకతలు ఉన్నాయని ఈ పుస్తకంలో దార్ల మాదిగ సాహిత్య స్వతంత్ర బావుటాను దశదిశలా ఎగురవేస్తాడు. ఇదే ఈ పుస్తకంలోని వ్యాసాలన్నింటిలో కనిపించే ఏక సూత్రత.

మాదిగ సాహిత్యంలోని మరొక ప్రక్రియ వ్యాసం. మాదిగల భావాలను స్పష్టంగా, సరళంగా చెప్పడానికి అర్జెంటుగా కావలసిన ప్రక్రియగా మాదిగ సాహితీ కారులు గుర్తించారు. దానిలో భాగంగానే వ్యాసాన్ని బలమైన ఆయుధంగా వాడుకున్నారు. దళిత రిజర్వేషన్లలో మాదిగలకు జరిగిన సామాజిక అన్యాయాన్ని వివరిస్తూ, రిజర్వేషన్ల వర్గీకరణ దళిత కూటమిలోని కులాలన్నిటికి ఏ విధంగా సామాజిక న్యాయానికి తొలి అడుగు కాగలదోనన్న విషయం ప్రధానంగా మాదిగ సాహితీకారులు, మేధావులు పత్రికలల, వివిధ మేగజైన్ లలో, ఇంకా బుక్ లెట్ల రూపంలో ఎన్నో వ్యాసాలను ప్రచురించారు. అలా ప్రచురించిన వారిలో చింతాడ గౌరీ వరప్రసాద్ *('మాదిగలు మేల్కొన్నారు', 'మాదిగలకేం కావాలి'*, (మాదిగల ఆత్మ గౌరవ పోరాటం'), కృపాకర్ మాదిగ *('మాదిగ దండోర : ఏడు వ్యాసాలు')*, పోలుపొంగు ముత్తయ్య *('ఎస్సీలలో వర్గీకరణ ఎందుకు?')* గుండిమెడ సాంబయ్య *(బ్రాహ్మణత్వ మాలత్వమా...? మానవత్వ అంబేద్కరత్వమా...?వర్గీకరణ సమస్యపై చర్చ)* , కొలకలూరి ఇనాక్, దార్ల వెంకటేశ్వరరావు, మొదలైన వాళ్ళు రాసిన వ్యాసాలు ప్రముఖమైనవి. వీటిలో సాంబయ్య పుస్తకం వచ్చిన తర్వాత చాలా మంది మాలలు ఆపుస్తకానికి ముందు మాట రాసిన వాళ్ళనూ, పుస్తక రచయితనూ ఫోన్లు చేసి పేర్లు చెప్పకుండా బూతులు తిట్టిన సందర్భాలున్నాయి. తమ వాదనలను పుస్తకంగానో, వ్యాసంగానో రాసుకోవచ్చని చెప్పినా వినకుండా వ్యక్తిగత దాడులకు కూడా దిగడానికి ప్రయత్నించారంటే ఆ పుస్తకం ఎంత ప్రభావాన్ని చూపిందో తెలుస్తుంది.

మాదిగ దండోర - మాల మహానాడు వర్గీకరణ వాద-వివాదాలను ఒక చోటచేర్చి వర్గీకరణను అంబేద్కర్ దృక్పథానికి వ్యతిరేకమంటూ మాలలు, మాల మాహానాడు సభ్యులు వాదించిన వాదనలన్నీ వాస్తవానికి అంబేద్కర్ దృక్పథానికి వ్యతిరేకమని, నిజమైన అంబేద్కర్ దృక్పథం వర్గీకరణను కోరుకుంటుందని "బ్రాహ్మణత్వ మాలత్వమా...? మానవత్వ అంబేద్కరత్వమా...? (వర్గీకరణ సమస్యపై చర్చ)" పేర ఆ పుస్తకాన్ని నేను రాయడం జరిగింది. ఆ పుస్తకాన్ని విశ్లేషిస్తూ దార్ల రాసిన వ్యాసమే *'వర్గీకరణ వాదానికి శాస్త్రీయ దృక్పథం'*. మాల మాహానాడు వర్గీకరణ వ్యతిరేక వాదనలలో ప్రధానమైన తొమ్మిది వాదనలు తీసుకుని అంబేద్కర్ దృక్పథ వెలుగులో వాటిని నేను త్రిప్పి కొట్టాను. ఆ త్రిప్పి కొట్టడంతో పాటు మాదిగల, వీరితో పాటు దళితుల, సమగ్రాభివృద్ధికి, కుల నిర్మూలనకు కొన్ని ప్రతిపాదనలు కూడా నేనా పుస్తకంలో చేశాను.

పుస్తకం అసాంతం విస్తరించుకున్న ఆ ప్రతిపాదనలను ఏరి అయిదింటిని మరింత లోతుగా గుర్తించవలసిన అంశాలుగా దార్ల వివరించాడు. అవి:

(1) దండోర ఉద్యమ స్ఫూర్తితో మాదిగలు తమ పేర్ల చివరన పై నాలుగు వర్ణాల మాదిరే తమ కులం పేరు పెట్టుకొనడాన్ని హిందూత్వం తమపై రుద్దిన మాదిగ కులాన్ని అంగీకరించడమని, అది కుల నిర్మూలనకు ఆమరణాంతం పోరాటం చేసిన అంబేద్కర్ ను అవమానించడమేనని మాల మహానాడు వారు అక్షేపిస్తారు. వర్గీకరణ వ్యతిరేకోద్యమానికి "మాల మహానాడు" అని తమ కులం పేరు స్వయంగా వారే పెట్టుకుని మాదిగలు

అంబేద్కర్ ని అవమానిస్తున్నారు అని మాలలు అనడం వెగటు కలిగించే ఆక్షేపణ. సరే, వీరి అక్షేపణ ఎలా ఉన్నా, కుల నిర్మూలన జరగాలంటే ముందు కుల బాధితులు కులం నుండి బయట పడాలి. అలా బయటపడాలంటే ముందే కూరుకు పోయిన కుల ఊబి అనే సమస్యలోనుండి బయటపడడం జరగాలి. పేరు చివరన మాదిగను చేర్చుకోవడం అనేది కులతత్వంపై తిరుగుబాటుకు సూచన. కుల ఊబినుండి బయట పడేందుకు వేసిన తొలి అడుగు.

(2) వర్గీకరణతో దళితుల సమస్యలన్నీ తీరిపోవు. అయితే వారి సమస్యల పరిష్కారంలో అది మొదటి మెట్టు. రాజ్యాంగం దళితులకు కల్పించిన అవకాశాలను దళితులలోని దళితులు అందుకోవాలంటే అవసరమైతే క్రీమిలేయర్ విధానాన్ని కూడా పాటించాలి.

(3) విద్యా రంగంలో సంస్కరణలు తెచ్చి ఆధునిక ఉమ్మడి విద్యను అందరికి అందించాలి. అది జరగనంతవరకు అగ్ర కులాల మధ్య అణచివేతకు గురికాబడిన కులాల మధ్య ప్రతిభాపాటవాల అంతరాల దొంతరాలు కొనసాగుతూనే ఉంటాయి గాని వాటికి అంతం ఉండదు. పైగా దళితులకు సామాజికంగా వెనుకబడిన ఇతర వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ల రూపంలో ఎన్ని రాయితీలు కల్పించినా వాని లక్ష్యం నెరవేరదు.

(4) ప్రభుత్వ రంగంలో ఉపాధి అవకాశాలు అడుగంటి కేవలం ప్రైవేటు రంగంలోనే ఆ అవకాశాలు ఉన్న దరిమిలా ప్రైవేటు రంగలో రిజర్వేషన్ల డిమాండ్ సాధనకై దళితులంతా ఉమ్మడిపోరాటం చేపట్టాలంటే వర్గీకరణ సమస్యను పరిష్కరించుకున్నప్పడే అది సాధ్యమవుతుంది. ఒకవేళ వర్గీకరణ సమస్య పరిష్కారం జరగకుండానే దళితులకు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించబడితే అది మాదిగ ఇత్యాది దళితులలోని ఉపకులాలకు సామాజిక అన్యాయ కొనసాగింపే అవుతుంది.

(5) రాజ్యాధికారంలో జనాభా నిష్పత్తి ప్రకారం ప్రతి కులానికి భాగస్వామ్యం కల్పించినప్పడే ఇప్పడున్న కుల రాజ్యం స్థానంలో ప్రజా రాజ్యం అవతరిస్తుంది.

**అంబేద్కర్ నుండి దార్ల వరకు:**

**వర్గ వాదేయులకు కుల బాధితుల ప్రశ్నలు:**

*'దళిత సమస్యలపై ప్రజాసాహితి దృక్పధం'* వ్యాసంలో ఆగష్టు 1977 నుండి నేటి వరకు *ప్రజాసాహితి'* మాసపత్రిక వారు దళితుల సమస్యలు, సంఘర్షణలను వర్గ దృక్పథం వెలుగులో అర్థం చేసుకున్న తీరును, వ్యాఖ్యానించిన రీతులను సహేతుకంగా అంచనా వేసే ఒక బృహత్తర ప్రయత్నాన్ని చేశాడు దార్ల. దళిత ఉద్యమాలకు, రాజకీయాలకు, సాహిత్యానికి జవ జీవా లొసిగిన సిద్ధాంత త్రయం: జ్యోతిరావుబా పూలే, బాబా సాహెబ్ అంబేద్కర్, గుర్రం జాషువా. ఆ సిద్ధాంతాలపై దళితుల సమగ్రాభివృద్ధికి స్వతంత్ర భారతం చేపట్టిన వివిధ విధానాలు, పథకాలు - ముఖ్యంగా రిజర్వేషన్ వసతుల పైన; ఖైర్లాంజీ లో దళిత స్త్రీలను వివస్త్రలను చేసి తన సిగ్గు తీసుకున్న యావత్తు భారతావని - ఆ దారుణ సంఘటన ముందుకు తెచ్చిన సామాజిక - ఆర్థిక ప్రశ్నలపైనా, ఇంకా దళిత సాహిత్యం పైనా ఆ పత్రిక భాష్యాలను, ముందుకు తెచ్చిన వాద-వివాదాలను, దృక్పథాలను సమగ్రంగా,

విమర్శనాత్మకంగా పరిశీలించాడు. గమనించాల్సిందేమిటంటే, *ప్రజాసాహితి* వర్గ దృక్పథాన్ని విమర్శించడం ఒక పనిగా పెట్టుకుని ఆపని చేయ్యలేదు. వర్గ దృక్పథాన్ని భారతీయ కుల సమాజానికి వర్తింప జేయడంలోగల పరిమితులను ఎత్తి చూపి ఆ పరిమితులను అంబేద్కర్ సిద్ధాంతాలతో ఏ విధంగా అధిగమించవచ్చోనని నిర్మాణాత్మకంగా సూచించడం అతనిలోని విషయ స్పష్టత, మేథో పరిణత, సదుద్దేశం తెలుస్తుంది. ఈ వ్యాసంలో దార్ల అడిగిన ప్రశ్నలు తన కాలంలోని సోషలిస్టులకు అంబేద్కర్ వేసిన ప్రశ్నలు, కారంచేడు- చుండూరు దురాగత సంఘటనల తరువాత వామపక్షాలకు, నక్సలైట్లకు కత్తి పద్మారావు, బొజ్జా తారకం, ఉ. సాంబశివరావు, మారోజు వీరన్నలు వేసిన ప్రశ్నలు. 1980వ దశకం నుండి అటు అంబేద్కర్ వర్గీయులలో ఇటు మార్క్స్ వర్గీయులలో నలుగుతున్న- ' అంబేద్కర్ కుల దృక్పథాన్ని కారల్ మార్క్స్ వర్గ దృక్పథాన్ని జత చేసి నూతన ప్రజాస్వామ్య విప్లవాన్ని సాధించాలి' అనే వాదాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్ళాలనే ఆకాంక్షను, అవసరతను ఈ వ్యాసం ద్వారా దార్ల స్పష్టం చేశాడు.

ఈ పరిశీలనను నాలుగు ముఖ్యాంశాలుగా విశ్లేషించవచ్చు.

1) జ్యోతిబా ఫూలే, అంబేద్కర్, జాషువాలపై ప్రత్యేక సంచికలను *ప్రజాసాహితి* ప్రచురించడాన్ని ఆ పత్రిక ఆ దళిత సిద్ధాంతకర్తలను గుర్తించడంగా పేర్కొని అట్టి గుర్తింపును దార్ల ఆహ్వానిస్తాడు. అయితే ఆ సిద్ధాంతకర్తలను గుర్తించినంత మాత్రాన వారి సిద్ధాంతాలను కూడా గుర్తించినట్లేనా? - అనే ఒక బలమైన ప్రశ్నను అతను ఈ వ్యాసంలో అడుగుతాడు. వామ పక్ష ఉద్యమం ఉనికిలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు వర్గ దృక్పథానికి కట్టిబడిన దళితేతరులు అంబేద్కర్ విషయంలో వాదించే వాదాలలో ' అంబేద్కర్ సంస్కరణవాది. కాబట్టి అతని దృక్కోణంగాని, అతని సిద్ధాంతాలుగాని వర్గ పోరాటాలకు, సోషలిస్టు సమాజ స్థాపనకు ఏ మాత్రం పనికిరావు' - అనే ఒక గుడ్డి వాదం ప్రధానమైనది. అంబేద్కర్ సంస్కరణవాదే కావచ్చు. అయితే అతని సంస్కరణవాదాన్ని ముందుకు తెచ్చి, భారత దేశంలో నూతన సామాజిక విప్లవానికి మూల స్తంభాలవంటి అతని సిద్ధాంతాలను వెనుకకు తొయ్యడం *ప్రజాసాహితి* వాళ్ళు కావాలని పక్కదారి పట్టించిన అంశమని దార్ల స్పష్టం చేస్తాడు.

అదే విధంగా దళిత కులాలలో పుట్టిన మనుష్యులు ఏ రంగంలోనైనా అసమానమైన ప్రతిభ కనపరచినప్పటికీ, వారు తమ పురిటి (కుల) కంపునుండి విముక్తం కాలేరని దళిత కులాలలో పుట్టిన మనుష్యులను ఎసెన్షియలైజ్ (essent i al i ze) చేసే ఒక మోసపూరితమైన వాదాన్ని బ్రాహ్మణత్వం మొదటినుండి ముందుకు నెడుతుంది. దళితులను అలా ఎసెన్షియలైజ్ చేయడంలోనే బ్రాహ్మణత్వ మనుగడ ఆధారపడి ఉంది. కాబట్టి బ్రాహ్మణత్వంపై ఆధారపడి బతుకుతున్నవారు అటువంటి ఎసెన్షియలైజ్ అభిప్రాయాలను ముందుకు తేవడాన్ని మనం అర్థం చేసుకోగలం. కాని ' సంపూర్ణ మానవుని ఆవిష్కరణే తన చిర కాల వాంఛ, జీవిత ధ్యేయమని' సగర్వంగా చెప్పుకున్న నిత్య సత్యాన్వేషి మార్క్స్, అటువంటి వ్యక్తి శిష్యులమని చెప్పుకునే వర్గ వాదీయులు కూడా

దళితులను, దళిత మేధావులను అదే బ్రాహ్మణికల్ ఎసెన్షియలైజ్ దృష్టితో చూడాటాన్ని దార్ల తీవ్రంగా ఆక్షేపిస్తాడు. ఉదాహరణకు రాజ్యాంగ పరిషత్తులో రాజ్యాంగ శాస్త్రంలో దిగ్గజాలు వంటి ఎందరో మేధావులు ఉన్నప్పటికీ అంబేద్కర్నే రాజ్యాంగ రచనా కమిటి అధ్యక్షునిగా ఎన్నుకోవడానికి రెండు ముఖ్య కారణాలను గుర్తించవచ్చు: ఆ పరిషత్తులోని మేధావులను మించిన రాజ్యంగ నిపుణత, జాతీయ సమగ్రత. అయినప్పటికీ " *ఆయన (అంబేద్కర్) చేసిన పోరాటాలు, పడిన రాజీలు- కుల నిర్మూలనకు ఏదో రూపంలో తోడ్పడతాయన్న అవగాహనతోను, ఆవేదనతోను అమలు జరిపారు*" అని *ప్రజాసాహితి* (1995: 162వ సంచిక) తన సంపాదకీయంలో పేర్కొని అంబేద్కర్ కృషిని, త్యాగాలను కేవలం కులనిర్మూలనకు మాత్రమే కుదించడాన్ని దార్ల అంగీకరించకూడని విషయం అంటాడు.

అంబేద్కర్ కృషిని కేవలం ఇలా కులనిర్మూలనకే కుదించడం వలన రెండు ప్రమాదాలు ఉన్నాయి:

1) దళితులు కులాతీతంగా ప్రజా శ్రేయస్సును, ప్రజాభివృద్ధిని, జాతి సమగ్రతను దృష్టిలో ఉంచుకుని చేసే జాతి సేవా కార్యకలాపాలు దళితేతర సమాజం గుర్తించేందుకు అవకాశం లేకుండా చేయడం.

2) దళితుల సేవా కార్యకాలాపాల వలన కులాతీతంగా, మతాతీంగా జాతి మొత్తం ప్రయోజనాలు పొందినప్పటికీ, అవి కేవలం దళిత దృష్టి పథం నుండి, వారి విముక్తి నిమిత్తం మాత్రమే చేశారు, చేస్తున్నారు అని దళితేతరులు భావించడానికి అవకాశం కలిగించడం. అంబేద్కర్ మొదలుకొని నేడున్న ఎందరో దళిత మేధావులను, నాయకులను దళితేతర సమాజం గుర్తించక పోవడం అటుంచి, ఏహ్యాభావం కలగటానికి ఈ రకమైన ఆలోచనలు, వాదాలు పరివ్యాప్తిలో ఉండడమే కారణం.

మహాకవి గుర్రం జాషువా విషయంలో కూడా *ప్రజాసాహితిది* ఎసెన్షియలైజ్ దృక్కోణమేనని దార్ల నిర్మోహమాటంగా చెబుతాడు. చోద్యంగా జాషువా కవిత్వానికంటే అతని కవిత్వాన్ని ఆదరించే దళితులపైన తన ఎసెన్షియలైజ్ బాణాలను ఈ పత్రిక సంధించింది. జాషువా శతజయంతి సంధర్భంగా వెలువరించిన ప్రత్యేక సంచికలోని (అక్టోబర్, 1995, 168వ సంచిక) సంపాదకీయాన్ని చదివిన వారెవరికైనా *"ఎలక్ట్రానిక్ మీడియా, నాటకాలను ఆదరించే సామాన్య ప్రజలను వీరి (జాషువా) పద్యాలు బాగా ఆకర్షించాయనీ, కులదృక్పథం వల్లనే దళితులు జాషువాని వెనుకేసుకొస్తున్నారనే*" ఆలోచన కలుగుతుందని ప్రజాసాహితి వ్యాఖ్యానించడాన్ని దార్ల కుండ బ్రద్దలు కొట్టినట్లు ఆ వ్యాఖ్య సరైనది కాదని చెబుతాడు. నిర్మోహమాటంగా చెప్పాలంటే భారతీయ సమాజంలో, హిందూ భావజాల ప్రభావంలో పుట్టి పెరిగిన ఏ వ్యక్తైనా కులాతీతులు కారు. కవులు, కళాకారులు, రచయితలు తమ తమ కులానికి చెందిన వారు కాబట్టే ఆ కవుల కవిత్వానికి, ఆ రచయితల రచనలకు ఉప్పొంగిపోయి అభిమానులుగా మారడం కుల సమాజంలో కనిపించే కుసంస్కృతి.

విశ్వనాథ సత్యనారాయణ, శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) బ్రాహ్మణులు కాకుంటే, బ్రాహ్మణ సమాజం తమ తమ సిద్ధాంతాలకు, దృక్పథాలకు అతీతంగా వారికి బ్రహ్మరథం పట్టేదా?

కమ్మ కులానికి చెందినవారు కాకపోతే సంఘటనతో తమకు సంబంధం లేకున్నా కారంచేడు చుట్టుప్రక్కల గ్రామాలలోని కమ్మలంతా ఏకమై కారంచేడు గ్రామంలోని మాదిగలపై మారణహోమం సృష్టించేవారా? చిరంజీవి కాపు కాకుంటే తన బొందిలో ప్రాణం ఉన్నంత వరకు కాంగ్రేసే తమ బంధువని బీరాలు పలికిన హరిరామ జోగయ్య, తదితరులు తమ బొందిలో ప్రాణముండగానే కాంగ్రేసు పార్టీకి, లేదా ఇతర పార్టీలకు తిలోదకాలిచ్చి ప్రజా రాజ్యం పార్టీ తీర్థం పుచ్చుకునేవారా?

దళిత కులాలలో అరుదుగా లభించే ఆణిముత్యం జాషువా లాంటి కవుల కవిత్వాన్ని దళితులు కూడా తమ సామాజిక వర్గానికి చెందిన వాడు కాబట్టి ఆస్వాదిస్తున్నారు. అంతవరకు దళిత సమాజానిది కూడా కుల దృక్పథమే. అయితే జాషువా కవిత్వానికి వస్తువు, వస్తు విషయాలు ఎవరివి? - దళితులు, వారి ఈతి బాధలు. మరి తమను, తమ సమస్యలను కవిత్వీకరించిన జాషువాను చదవటం కూడా కుల దృక్పథమేనా? శ్రీ పాద సుబ్రమణ్య శాస్త్రి, అడవి బాపిరాజు, ప్రేంచంద్, రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి లాంటి ఎందరో రచయితలు తమ సమాజానికి చెందిన వారు కాకపోయినప్పటికీ తమ గురించి రాసిన వీరి రచనలను దళితులు అధ్యయనం చేశారు, ఆ రచయితలను ఆరాధించారు. మరి ఇది ఏ కుల దృక్పథం కిందికి వస్తుందో *ప్రజాసాహితి* వారు గుర్తించాల్సి ఉంది. అసలు ఒక కవిని అతని అభిమానులు ఏ దృక్పథంతో అభిమానిస్తున్నారు? ఏ దృకోణంతో ఆదరిస్తున్నారు? ఇది ఆ కవుల చేతులలోకంటే వారి అభిమానుల రుచులపైనే ఆధారపడి ఉంటుంది.

*ప్రజాసాహితి* వారు అసలు అడగ వలసిన ప్రశ్నలు: జాషువా కవిత్వం కుల కంపుతో నిండి ఉందా? లేక అందులో కుల కంపుతో మూసుకుపోయిన హిందూ హృదయ కవాటాలను తెరచే ప్రయత్నం జరిగిందా? ఈ ప్రశ్నలకు వారు ధైర్యంగా, నిస్పక్షపాతంగా సమాధానం చెప్పగలిగితే ఏ రచయితది కులతత్వాభివృద్ధి దృక్పథమో, ఏ రచయితది కుల నిర్మూలన దృక్పథమో అనే సత్యం వెలుగులోకి వస్తుంది. విశ్వ నరుడు జాషువా గురించి రాచపాళెం చంద్రశేఖరరెడ్డి చెప్పిన మాటలను ఈ కింద పేర్కొనడం అసందర్భం కాదు:

> “*భావ కవులు ఊహలలో విహరిస్తున్న కాలంలో, సంప్రదాయం కవులు పురాణాలు తిరగరాస్తున్న కాలంలో, జాషువ జీవితంలోని కఠిన వాస్తవాలను కవితా బద్ధం చేసే ప్రయత్నం చేశారు. అందరూ మేనకోడలిమీద, పక్కింటి అమ్మాయిల మీద కవిత్వం రాస్తుంటే జాషువ ‘అనాథ’ మీద రాశాడు. అందరూ కృత్రిమ స్వప్నాలు కంటుంటే జాషువా ‘స్వప్న కథ’ లో మంచి మానవీయ విలువగల కలగన్నారు... ‘విశ్వనరుడ నేను’ అని చెప్పుకున్న జాషువ సమాజం వర్ణాలుగా, కులాలుగా విడిపోవడం చూడలేకపోయాడు. మన సంఘాల మధ్య సహజంగా ఉండవలసిన సోదవరభావం కులం కారణంగా నశించిందని భావించారు. కులాలు కొందరిని అణచిపెట్టడానికి మాత్రమే కాదు అణచివేయబడ్డవాళ్ళలో సైతం అణచివేసే వాళ్ళను సృష్టించడం చూశాడు. ఆ స్థితిని నిరసిస్తూ ప్రజలలో విశ్వ జనీన భావాలను రేకెత్తించడానికి చూశాడు.* (చంద్రశేఖర రెడ్డి, రాచపాళెం. 2002.

*ఆధునికాంధ్ర కవిత్వం: ఉద్యమాలు-సందర్భాలు*, హైదరాబాద్: అనుపమ ప్రింటర్స్, పే: 72 & 74)

1) కారంచేడు, చుండూరు సంఘటనలకు వ్యతిరేకంగా ఆవిర్భవించిన దళిత ఉద్యమం, ఆ ఉద్యమ స్ఫూర్తితో దళిత సమాజం నుండి ఒక సాహితీకారుల పటాలం ఏర్పడటం ఒక వరుస క్రమంలో జరిగింది. పదునైన తమ కలాలతో చిక్కనైన దళిత సాహిత్యాన్ని వెల్లువలై పారించి, దళిత చైతన్య సస్య శ్యామలతకు బాటలు పరిచారీ సాహితీకారులు. వీరికి బాసటగా దళితులు కాకున్నప్పటికీ దళితులపై జరుగుతున్న అమానుషాలకు, హత్యాకాండలకు ఖేదిల్లి, తమ కలాలను కత్తులుగా చేసుకుని కుల సమాజ రక్కసిపై విరుచుకుపడిన దళితేతర కులాల నుండి వచ్చిన మానవతామూర్తులు ఎంతోమంది ఉన్నారు. ఆరంభంలో ఈ దళితేతరుల దళిత విషయ రచనలను దళిత సాహితీకారులు కొంత కామ్రేడరీ దృక్పథంతో, కొంత మొహమాటానికి లోబడి స్వాగతించినప్పటికీ రాను రాను "దళిత సమస్యలను దళితులే రాయాలనే" ఒక వింత-వితండ వాదనను ముందుకు తెచ్చారు. దళితులు తమ కుల సరిహద్దులు దాటి సాధారణ మనుష్యులుగా ఎదగలేరనే వాదనతో దళిత సమాజాన్ని ఎసెన్షియలైజ్ చేయ్యడం పై నుండి జరుగుతుంటే, దళిత జీవితానుభావం లేని వారు దళిత సమస్యలను చిత్రించ లేరు అని వాదించడం కింది నుండి జరుగుతున్న ఎసెన్షియలైజేషన్. దళిత జీవన సంఘర్షణను చిత్రించడానికి అనుభవ జ్ఞానం ఉండటం మంచిదే. అయితే, ఆ జ్ఞానం ఒక్కటే సరిపోదు. శాస్త్రీయంగా విషయాన్ని శోధించి, వివరంగా చెప్పగల జ్ఞానం అవసరం.

ఈ రెండవ రకం జ్ఞానాన్ని వ్యక్తులు తాము పుట్టి పెరిగిన సమాజం నుండి కాకుండా (అంటే అనుభవం నుండి గాక) నిరంతర అధ్యయనం ద్వారా, అవగాహన ద్వారా పెంపొందించుకుంటారు. ఈ విషయాన్నే *ప్రజాసాహితి* తన పదవ మహాసభ పత్రంలో వ్యాఖ్యానించడాన్ని దార్ల స్వాగతిస్తాడు. దళిత సమాజంలో పుట్టి పెరిగినప్పటికీ ఆ సమాజంలో పరివ్యాపితంలో ఉన్న కుత్సిత వాదనలను నిరసించి సత్యాన్ని సత్యంగా తెలుసుకోవాలి. దాన్ని స్వీకరించాలి అని ఘంటాపథంగా చెప్పగలిగే దళిత మేధావులు చాలా అరుదు. ఆ అరుదైన మేధావులలో దార్ల ఒకడని *ప్రజాసాహితి* ప్రతంలోని సత్యంతో అతను ఏకీభవించడం స్పష్టపరుస్తుంది.

3) '*వ్యవస్థ పరిమితిని బహిర్గత పరచిన సుప్రీం తీర్పు*' పేరుతో వెలువరించిన తమ సంపాదకీయంలో *ప్రజాసాహితి* (నవంబరు, 2006: 288వ సంచిక) వారు దళిత రిజర్వేషన్లపై ఒక మంచి విశ్లేషణ చేశారు. ఇందులో చట్టబద్ధ రిజర్వేషన్లు, వ్యవస్థీకృత రిజర్వేషన్లు అని రిజర్వేషన్లను రెండు రకాలుగా వర్గీకరించి, "*వంశ పారంపర్యంగా వస్తున్న ఆస్తులను, అధికార హోదాలను, ఆ వర్గం వాళ్ళే మళ్ళీ అధికారాన్ని చెలాయించడాన్ని గుర్తించకుండా, అణచివేతకు గురవుతున్న వర్గాలకు రిజర్వేషన్స్ కల్పించినంత మాత్రాన (వారికి) ఉపశమనానికి మించిన ప్రయోజనం ఉండదని" ఒక ఆలోచనాత్మకమైన విశ్లేషణ గావించారు.* ఈ ఉపశమనాల ఫలితంగా:

(1) వీనినే ఆసరా చేసుకుని ఎదగాలని దళితులలో ఒక వర్గం అరాట పడుతుండడం వల్ల అలాంటి వాళ్ళు వ్యవస్థలోని అవినీతితో సర్దుబాటు చేసుకోనడానికీ;

(2) దళితులలో వివిధ స్థాయిలు (ముఖ్యంగా ఉపశమనాలను పొందినవారు, పొందలేకున్న వారు లేదా ఉపశమనాలకు దూరంగా ఉంచబడినవారు) తయారుకావడానికీ;

(3) పాలక వర్గాలు దళితులను ఓటు బ్యాంకులుగా రూపాంతరం చెందించుకుని వారిని తమ రాజకీయాలలో పావులుగా ఉపయోగించుకొనడానికి దారి తీస్తున్నదనే *ప్రజాసాహితి* విశ్లేషణకు దార్ల తన పూర్తి సమ్మతాన్ని తెలియజేస్తాడు. అయితే, దళిత రిజర్వేషన్ల మొత్తానికి అనువర్తించే ఈ విశ్లేషణను మాదిగ దండోరా వర్గీకరణ డిమాండ్ కి కూడా *ప్రజాసాహితి* అనువర్తింప జేయడాన్ని ఒక స్పష్టతతో, బలమైన కారణాల ప్రాతిపదికతో దాన్ని దార్ల ఆక్షేపిస్తాడు.

*ప్రజసాహితి* తన నవంబరు, 1998, 202వ సంచికలో ప్రచురించిన కరపత్రంలో: "*ఎబిసిడిల విభజనలో మెరుగైన న్యాయం వుండినా పాలక గ్రూపులూ, రకరకాల సంస్కరణవాదులూ, రిజర్వేషన్ల విభజనే కాక దళిత ప్రజల విభజనకు కూడా దాన్ని వినియోగిస్తున్నారు*" అని చెప్పడం జరిగింది. ఈ పత్రాన్ని తయారు చేసిన వారు యస్. ఆర్. శంకరన్ గారు.

ఈ పై అభిప్రాయాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే రెండు విషయాలు సుస్పష్టం: వర్గీకరణ డిమాండ్ లో న్యాయం ఉంది. ఆ న్యాయం కూడా సాదా సీదాది కాదు. అది సమాజానికి మెరుగైన న్యాయం; రిజర్వేషన్లను విభజించడమనే మిషతో పాలక వర్గాలు దళిత ప్రజలను విభజిస్తున్నారు. వర్గీకరణలో మెరుగైన న్యాయం ఉందని వంతలు పలుకుతూనే దళిత సమాజాన్ని విభజించడానికి పాలక వర్గాల చేతిలో అది సాధనమవుతుందనే వంకర పలుకులు దేనికి? తమ చేతిలో పాలనా పగ్గాలు ఉంచుకోవడమే పాలక వర్గాల పరమావధి. అందుకోసం ప్రజలను విభజిస్తారు, లేదా ప్రజలలోని విభజనలను ఉపయోగించుకుంటారు. వర్గీకరణ కూడా ఏదో ఒక రకంగా ఆ పరమావధికి దోహదపడితే దానిని ఉపయోగించుకునడానికి కూడా ముందుంటారు; లేదు ఏకీకరణ అందుకోసం అక్కరకొస్తే దాని జపం జపిస్తారు. అసలు వర్గీకరణ పాలక వర్గాల చేతిలో ఏవిధంగా వినియోగించబడుతుంది అన్నది ఇక్కడ అధమ విషయం. వర్గీకరణ ద్వారా మాదిగ ఇత్యాది కులాలకు సామాజిక న్యాయం జరుగుతుందా లేదా అన్నదే ప్రధాన విషయం. వర్గీకరణలో మెరుగైన న్యాయం ఉంది అని అంగీకరించడం అంటే ఆయా కులాలకు వర్గీకరణ ద్వారా సామాజిక న్యాయం జరుగుతుంది అని అంగీకరించినట్లే కదా? ఒక వేళ అలా వర్గీకరణ జరగకుంటే ఆ కులాలకు అన్యాయం జరుగుతుంది అని కుడా (పరోక్షంగా) అంగీకరించినట్లే కదా?

ఇక, ఈ వాదనలోనే రెండవ విషయం గురించి చెప్పుకోవాలంటే, అసలు అటువంటి అభిప్రాయాన్ని వ్యక్తపరచిన వ్యక్తి/పత్రికకు గల సామాజిక అవగాహనపైన అనుమానం కలుగుతుంది. మను ధర్మ శాస్త్రం భారతీయులను ఐదు వర్ణాలుగా విభజిస్తే, ఐదు కాదు

ఐదు వందల యాభై ఐదు కులాలుగా వీరు తమను తాము విభజించుకుని పరిపాలించుకుంటున్నారు. అంటే విభజన అనే ఒక సూత్రాన్ని మూల సూత్రంగా చేసుకుని నిర్మించబడిందే భారతీయ కుల సమాజం. ఇది భారతీయ సమాజ కనీస అవగాహన కలిగిన ఏ వ్యక్తైనా అంగీకరించే సత్యం. ఈ ప్రాథమిక నిర్మాణ సూత్ర దృష్టి కోణం నుండి గమనిస్తే దళిత ప్రజల విభజనకు కూడా దాన్ని (వర్గీకరణను) వినియోగిస్తున్నారు, కాబట్టి వర్గీకరణ వద్దు అని అనడం నాకైతే కొంత వెర్రితనంగా, మూర్ఖపు వాదంగా అనిపిస్తుంది. నేను అలా అనడం వ్యంగ్యమనో, అహంకారమనే చాలామంది అభిప్రాయపడవచ్చు. అట్టివారి కోసం నా అభిప్రాయాన్ని మార్చుకునే ప్రసక్తే లేదు.

దళిత సమాజాన్ని విభజించడానికి అసలు ఆ సమాజం ఎప్పుడు ఐక్యంగా ఉంది? 'చిన్న కత్తి పెద్ద కత్తి నాదేనయా, చిందేసే వీరబాహుడు నేనేనయా' - అని మాదిగలు సాంస్కృతికంగా మాలవారిపై ఆధిపత్యం వహించాలని చూడలేదా? మాల కులానికి చెందిన మాదరి బాగయ్య (భాగ్య రెడ్డి వర్మ) నాయకత్వంలో 1930వ దశకంలో హైదరాబాద్ లో నడిచిన ఆది-హిందూ ఉద్యమంలో మాదిగ వారిని దూరంగా ఉంచడమే గాక, మాల-మాదిగల మధ్య కులాంతర వివాహాలకు అడ్డుగోడలు కట్టలేదా?

కాంగ్రేసు పార్టీలో మాల కులానికి చెందిన దామోదరం సంజీవయ్య-మాదిగ కులానికి చెందిన సదాలక్ష్మి ల మధ్య అధికార పోరాటంలో మాల కులం సంజీవయ్య పక్షాన, మాదిగ కులం సదాలక్షి పక్షాన నిలబడలేదా? కాన్షీ రాం చమార్ కులస్థుడనీ, ఉత్తర్ భారత దేశంలో చమార్ లు అంటే ఇక్కడ మాదిగలు అని, కాబట్టి మాదిగల పార్టీకి ఓటు వేసేదేమిటని 1994 అసెంబ్లీ ఎన్నికలలో మాలలు బహుజన్ సమాజ పార్టీకి దూరంగా ఉండలేదా? మాల ఉద్యోగస్తుల సంఘాలుగా, మాదిగ ఉద్యోగస్తులు సంఘాలుగా మాల-మాదిగ కులాలకు చెందిన ఉద్యోగస్తులు తమను తాము విభజించుకోలేదా? ప్రతి విద్యా సంస్థలో మాదిగ విద్యార్థి సంఘాలు, మాల విద్యార్థి సంఘాలు ఉండడం కనపడడంలేదా? మరి ఇన్ని రకాల విభజనలు కళ్ళకు కట్టినట్లుగా, స్పష్టంగా కనబడుతున్నప్పటికీ రిజర్వేషన్ల వర్గీకరణ దళితుల విభజనకు దారితీస్తుంది అనడం ఎంతవరకు సబబు? ఇంకో రకంగా అడగాలంటే ఇటువంటి చొప్పదంటు వాదాలతో ఎవరిని మాయ పుచ్చడానికి? ఎవరిని మోసం చెయ్యడానికి? మేథావులంతా ఆలోచించాల్సిందే.

దళిత సమాజ ఐక్యతను నిజంగా కాంక్షించే వారు అది *ప్రజాసాహితి* లాంటి పత్రికలైనా లేదా యస్ ఆర్ శంకరన్ లాంటి పెద్దలైనా ముందుగా దళిత సమాజం పట్ల, వర్గీకరణ విషయం పట్ల కొంత ఆత్మ శోధన చేసుకుని ఆత్మ శుద్ధి చేసుకోవడం అత్యావశ్యకం. వారు నిజాయితీగా అలా చేసుకోవడం జరిగితే రెండు విషయాలను నిర్భయంగా అంగీకరిస్తారు. అవి,

1) దళిత సమాజం ఇతర వర్ణ సమాజాల మాదిరే విభజనల మయం;

2) వర్గీకరణ సమస్యను సామరశ్యంగా పరిష్కరించకోకుండా ఉంటే యిప్పటికే దళిత సమాజంలోనున్న విభజనలు మరింతగా విజృంభిస్తాయేగాని మట్టుపడే అవకాశం

ఇసుమంతైనా ఉండదు. ఇలా అంగీకరించిన తరువాత పాయలు పాయలుగా విడివడి ఉన్న దళిత కులాలను అనుసంధానం చేయడానికి వారు చేపట్టవలసిన ప్రప్రథమ కార్యక్రమం ఏ ఇసుక మేటలు ఆ అనుసంధానానికి అడ్డుగా ఉన్నాయో వానిని గుర్తించి, చదును చేసి పాయల మధ్య తెన్నులు తీయాలి. అలా జరిగిన రోజున పాయలన్నీ కలసి ప్రవాహ ఉరవడిని పెంచుతాయి. పోను పోను ఆ ఉరవడి ఉధృతమై దళిత సమాజ శక్తిని ఉద్వేలం చేస్తుంది.

ఇప్పుడు మాల-మాదిగ కులాలమధ్య పేరుకుపోయిన పెద్ద ఇసుక మేట - వర్గీకరణ. ఈ మేటను తియ్యకుండా దళిత సమాజ ఐక్యత గురించి ఆలోచన చెయ్యడం అవివేకులు చేసే పని. ఇలా దళిత సమాజ ఐక్యత కొరకు తక్షణం ఏమి చెయ్యాలోనని చెప్పడమే గాక అది ఎక్కడ మొదలు పెట్టాలి అనే ఒక మేథోపర సుదీర్ఘ ఆలోచనను కూడా దార్ల ఈ వ్యాసంలో అందించాడు. మాల - మాదిగలు వర్గీకరణ సమస్యను పరిష్కరించుకుని వారు కలసి ఉండాలనే అతని ఆత్మీయ కాంక్ష కూడా దీనిలో వ్యక్తమవుతుంది.

3) మహారాష్ట్రలో జరిగిన ఖైర్లాంజీ దురాగతం అగ్రకులాలలో నిబిడీకృతమైన రాక్షసత్వానికీ, పాశవికతకూ, దళితులపై వారిలో పేరుకు పోయిన ఏహ్యాభావానికి నిలువెత్తు దర్పణం పడుతుంది. కుల సమాజం భౌతికంగా, మానసికంగా తమపై విధించిన పరిమితులను అధిగమించి, గీచిన సరిహద్దులను దాటి దళితులు మనుష్యులుగా ఎదగడానికి, స్వతంత్ర్యంగా, ఆత్మ గౌరవంతో బతకడానికి ప్రయత్నిస్తే ఏమి జరుగుతుందో, అగ్రకులాలు ఎంత దారుణానికి వడికట్టగలవోనని మరోసారి తేల్చి చెప్పిన సంఘటన ఖైర్లాంజీ అమానుషత్వం మరో కారంచేడు, యింకో చుండూరు. ఈ దుస్సంఘటన జరిగిన తరువాత *ప్రజాసాహితి* వారు తమ 289వ సంచికలో (డిసెంబరు, 2006) *"ఖైర్లాంజీ అవమానాల దురాగతాల జీవితాలింకెన్నాళ్ళు"* అనే సంపాదకీయాన్ని ప్రచురించారు. ఇందులో ఖైర్లాంజీ గ్రామ అగ్రకులాలన్నీ ఏకమై భయ్యాలాల్ బోత్మాంగ్ కుటుంబంపై మూకుమ్మడిగా దాడి చేసిన సంఘటనను వివరిస్తూనే ఆ సంఘటన వెనుక దాగిన, అందుకు దారితీసిన సామాజిక - ఆర్థిక పరిస్థితులను, స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం దళితుల సామాజిక, ఆర్థిక స్థితిగతులాభివృద్ధికి రాజ్యాంగ బద్ధంగా చేపట్టిన పాలసీ-పథకాలు, అంబేద్కర్ చూపెట్టిన మార్గం - వీటన్నిటినీ క్లుప్తంగానేగానే చర్చించినప్పటికీ, సూక్ష్మంగా విశ్లేషించారు.

ఈ విశ్లేషణ నుండి దార్ల తన వ్యాసంలో తీసుకున్నవి, ఈ చర్చకు ఉపయోగపడేవి రెండు విషయాలు:

(1) దళితులను సామాజిక విముక్తులను చేయడంలో మతానికున్న పరిమితులు;

(2) దళితుల వైయక్తిక విముక్తి/అభివృద్ధి పీడిత జన సమిష్టి విముక్తి/అభివృద్ధి జరిగినప్పుడే.

మనిషి మనుగడకు మతం అవసరమా? కాదా? అవసరమైతే ఏ మేరకు దాన్ని మనిషి తన జీవితంలో అహ్వానించాలి? అవసరం లేకుంటే మనిషికి అవసరమైన ఆధ్యాత్మిక

దాహాన్ని ఏ ఆలోచనా ధారతో తీర్చవచ్చు. ఇలాంటి ప్రశ్నలపై సమాధానం కోసం మనిషి నిరంతరం అన్వేషిస్తూనే ఉన్నాడు. ఆ ప్రశ్నలపైననే తాత్వికుల మధ్య, ఆస్తిక-నాస్తిక వాదుల మధ్య నిరంతర వాద-వివాదాలు చెలరేగుతూనే ఉన్నాయి. ఒక మత ఆలోచనాధార చెరసాలలో బంధీలు గావించబడిన ఒక కూటమిని మరో మత ఆలోచనాధార సహాయంతో విముక్తులను చెయ్యవచ్చా? లేదా? అనేది కూడా పైన పేర్కొన్న ప్రశ్నల పరంపర కిందికే వస్తుంది. ఈ ప్రశ్నలను అటుంచి, అంబేద్కర్ మత మార్పిడి చర్యను గమనిస్తే, వేరే మత సహాయంతో దళితులను విముక్తం గావించవచ్చని ఆయన భావించడం స్పష్టంగా గమనించాలి.

కుల సామాజిక వ్యవస్థ పునాదిపై నిర్మితమైన హిందూ మత ధర్మం తన కబంధ హస్తాలలో దళితులను చిక్కించుకుని భౌతికంగా, మానసికంగా వారిని తర తరాలుగా శక్తి విహీనులు చేసుకుంటూ వస్తుంది. అట్టి ధర్మం నుండి, దాని కుల వ్యవస్థనుండి దళితులను విముక్తులను గావించి వారిలో మానవత్వాన్ని రగుల గొల్పి మానవీయత కలిగిన మనుష్యులుగా తీర్చిదిద్దే ఒక మహత్తర శక్తి, సమానత అనే సూత్రంపై నిర్మితమైన బౌద్ధ ధర్మానికే ఉందని అంబేద్కర్ మనస్పూర్తిగా విశ్వసించాడు. ఎందరో వివిధ మత ధర్మ పెద్దలు తమ తమ మతాలలో చేరమని అంబేద్కర్ ని ఎన్నో రకాలుగా ప్రలోభ పెట్టినా ఎట్టి ప్రలోభానికి లొంగక తన విశ్వాసానికి అనుగుణంగా, కొంత ఆలస్యంగానైనా, తన మరణానికి ముందు తాను విశ్వసించిన బౌద్ధ ధర్మాన్నే స్వీకరిస్తాడు. మిగిలిన దళితులను కూడా అట్టి మార్గాన్ని అనుసరించమని ప్రబోధిస్తాడు. ఆ ప్రభోదానికి ప్రభావితులైన భయ్యాలాల్ బోత్మాంగ్ లాంటి దళితులెందరో బౌద్ధాన్ని స్వీకరించి ఆ ధర్మ సూత్రాలకు అనుగుణంగా తమ జీవితాలను మలచుకుని నడుచుకుంటున్నారు. అలా నడుచుకుంటున్నప్పటికీ కుల రక్కసి రక్త కౌగిలి నుండి దళితులను ఆ ధర్మం విముక్తి చెయ్యలేక పోవడం విచారకరం. ఇదే విషయాన్ని *ప్రజాసాహితి* వారు తమ సంపాదకీయంలో ప్రముఖంగా పేర్కొన్నారు.

ఆచరణలో బౌద్ధ ధర్మం దళితులను విముక్తం చెయ్యలేకపోయింది అన్న విషయం మనకందరికీ తెలిసినదే. సరే, ఎందుకు అలా జరుగలేదు? ఈ ప్రశ్నకు సమాధానాన్ని లోతుగా పరిశోధించి చెప్పవలసి ఉన్నా, నాకు ఇందుకు రెండు బలమైన కారణాలు కనిపిస్తున్నాయి. హిందూ మతాన్ని వీడి బౌద్ధాన్ని స్వీకరించిన దళితులు ఆ స్వీకరణను హిందూ మతం నుండి తమను తాము విముక్తం చేసుకొనడానికి దూరంగా జరుపుకొనడానికి ఉపయోగించుకొనడానికి బదులుగా బౌద్ధ ధర్మాన్ని స్వీకరించని ఇతర దళితులతో, దళిత కులాలతో తమను తాము దూరంగా జరుపుకుని, అలా జరుపుకున్నట్లు చూపించుకోవడానికి ఉపయోగించుకోవడం. ఉదాహరణకు, బౌద్ధాన్ని స్వీకరించిన దళితులలో మహారాష్ట్రలోని మహార్లది అగ్రస్థానం. అంబేద్కర్ తమ కులానికి చెందినవాడు కావడం వల్లనే మహార్లు అతని మార్గాన్ని అవలంభించారు అన్న విషయాన్ని అటుంచితే, నయా బౌద్ధులు (బౌద్ధాన్ని స్వీకరించిన మహార్లు), మహార్లు (బౌద్ధాన్ని స్వీకరించని వారు) అనే రెండు కూటమిలుగా వీరు తమను తాము విభజించుకున్నారు. ఈ రెండు కూటమిల

మధ్య వివాహ సంబంధాలు కూడా ఉండవు. ఒకవేళ అలా జరిగినా ఆ జరగడం అనేది చాలా అరుదు అనికూడా తెలుస్తుంది. వివరణలో ఏ కుల నిర్మూలన ప్రయోజనాన్ని ఆశించి అంబేద్కర్ బౌద్ధాన్ని స్వీకరించాడో, మహార్లు నయా బౌద్ధులుగా అవతారమెత్తి ఆ ఆశయాన్ని తుంగలో తొక్కడం ఒక చారిత్రకంగా జరిగిన ఒక పరిణామం. ఈ అనుభవం ఒక్క బౌద్ధానికే పరిమితం కాదు. క్రైస్తవ, సిక్కు, ఇస్లాం-లాంటి మతాలను స్వీకరించిన దళితులలో కూడా ఇదే మాదిరి అనుభవాన్ని గమనించవచ్చు. మతం మార్చుకున్నా హిందూ మతం తమ చుట్టూ కట్టిన కుల గోడలను కూల గొట్టుకోకుండా ఉండడం అటుంచి ఆ గోడల సమీపానికి సైతం యితరులు రాకుండా దళితులు తామే స్వయంగా నయా కులాల రూపంలో కందకాలు త్రవ్వుకోవడం అంబేద్కర్ మార్గ వైఫల్యానికి ఒక కారణమైతే, ఇలా మతం మార్చుకున్న వారిపై బయటి నుండి విధించిన/వచ్చి పడిన పరిమితులు రెండవ కారణం.

రాజ్యాంగ బద్ధంగా దళితులకు కల్పించిన రిజర్వేషన్ వసతులను క్రైస్తవం, ఇస్లాం లాంటి మతాలలోకి మారిన దళితులకు వర్తింపకుండా చట్టం చేశారు. మతం మారినంత మాత్రాన కులం మారుతుందా? వారి ఆర్థిక స్థితి బాగుపడుతుందా? ఈ చట్టాన్ని ఏ ఆధారంతో చేశారో అంతుపట్టదు. క్రైస్తవం పుచ్చుకున్న దళితులకు క్రైస్తవ మిషనరీలు కొంత విద్యాబుద్ధులు నేర్పి ఉద్యోగాలు ఇచ్చిన మాట వాస్తవం. అయితే ఇది బ్రిటీషు వలస ప్రభుత్వ హయాంలో. స్వాతంత్ర్యానికి ముందు, స్వాతంత్ర్యం తరువాత అగ్ర కులాలు మన రాష్ట్రంలో ముఖ్యంగా కమ్మలు-రెడ్లు క్రైస్తవ విద్యాలయాల్లో సీట్ల కొరకు, వారి సంస్థలలో ఉద్యోగాల కొరకు పెద్ద మొత్తంలో క్రైస్తవ మతంలోకి వచ్చి పడటం జరిగింది. ముఖ్యంగా రోమన్ కాథలిక్ సంఘంలోనికి. అంతవరకు ఫారిన్ మిషనరీల హయాంలో దళితులు కొంత సమానత్వాన్ని చవి చూడటం జరిగింది. ఎప్పుడైతే ఈ అగ్ర కులాల ప్రవేశం జరిగిందో అప్పుడే ఆ మతంలో సమానత్వానికి సిలువ వేయడం, అగ్ర కులతత్వానికి బీజాలు పడటం వెంట వెంటనే జరిగిపోయాయి. కాథలిక్ సమాజంలో అగ్రకుల హేరోదులు ఆరంగంతోనే సృష్టించిన వీరంగాన్ని ఎదురించే శక్తి లేని దళిత శిశువులు ప్రొటెస్టెంటుల పశుల పాకలలో తలదాచుకున్నారు. గుంటూరు ప్రకాశం జిల్లాలలో కాథలిక్ సమాజంలో అగ్రకులాలు ఎందుకు ఎక్కువగా ఉన్నారో, ప్రొటెస్టెంటు (బాప్టిస్టులు, పెంటికోస్టులు మున్నగువారు) సమాజాలలో నూటికి తొంబై ఎనిమిది మంది దళితులే ఎందుకు ఉన్నారనే విషయాన్ని పరిశీలిస్తే కాథలిక్ సమాజం నుండి దళితుల మహాభినిష్క్రమణలో అగ్రకుల పరిసయ్యుల పాత్ర బోధపడుతుంది.

పోనీ వారు వెళ్ళిపోగా ఉన్న కొద్ది మంది దళితుల పట్లనైన 'నీ వలే నీ పొరుగువారిని ప్రేమించు' అన్న క్రీస్తు బోధనను ఆచరించారా? అటువంటిదేమీ జరుగలేదు. ఇంగ్లీషు మీడియం స్కూళ్ళల్లో కాథలిక ల కోటాను అచ్చంగా అగ్రకుల కాథలిక్ పిల్లలకిచ్చి, అడపా తడపా ఏర్పాటు చేసిన తెలుగు మీడియం బళ్ళల్లో దళిత క్రైస్తవులను జేర్చుకోవడం జరిగింది. స్కూళ్ళల్లో - కళాశాలల్లో టీచర్ల, లెక్చరర్ల పోస్టులు అగ్రకుల కాథలిక్ లకు రిజర్వ్ చేసి, చప్రాసి పనులతో, పాకీపనులతో దళిత క్రైస్తవులకు ఉపాధి పేరుతో కూలిపని

కల్పించారు. కన్యల ఆసుపత్రులలో అగ్రకుల కాథలిక్ లకు స్టెతస్కోపులిచ్చి దళిత క్రైస్తవులకు చీపుర్లందించారు. సాధారణ దళిత క్రైస్తవులు సరే గురువులుగా, కన్య స్త్రీలుగా మారిన దళిత క్రైస్తవులనన్నా సమానత్వంతో చూశారా? అటువంటిది కూడా జరుగలేదు. చార్లెస్ చౌదరీలు, స్టవిస్లాస్ సుబ్బా రెడ్లు సుపీరియర్ ఫాదర్లు, రెక్టర్ లయితే; యేసుపాదం, జోజప్పల్లాంటి ఎందరో దళిత గురువులు పచారీ సరుకుల కొనుగోలుదారులు; రూములన్నీ శుభ్రంగా ఉడ్చారా?

బిల్డింగ్ మరమ్మత్తులను జాగ్రత్తగా చేస్తున్నారా, లేదా అని సూపర్ వైజ్ చేసే బేలుదారీ మేస్త్రీలు. గోపి రాసిన *'గుడిసె ఏసోపు'* కథలు ఈ సత్యానికి అద్దం పడతాయి. వివరణలో మతం మార్చుకున్నందుకు దళితులు రిజర్వేషన్ వసతులకు చట్టపరంగా దూరం కాబడి, మత సంస్థలలోని అవకాశాలకు కుల పరంగా దూరం గావించబడి రెంటికి చెడ్డ రెవటలయ్యారు. ఆచరణలో దళితులకు ఎదురవుతున్న ఎన్నో సామాజిక-ఆర్థిక సమస్యలను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం ' మతం అనేది ఒక మత్తు మందు' అన్న మార్క్స్ దృక్పథాన్ని ప్రాతిపదికగా చేసుకుని *"భయ్యాలాల్ హిందూ సామాజిక వ్యవస్థ నుండి విముక్తి కావటానికి, బౌద్ధాన్ని స్వీకరించాడు. ఏ సాంస్కృతిక ధర్మమూ అతన్ని కాపాడలేదు"* అని *ప్రజాసాహితి* వారు అంటూ మనిషి కట్టు బాట్లపై ఆలోచనా రీతులపై ఆర్థిక స్థితిగతులపై మత ప్రభావాన్ని ఒక్క ఉదుటున కొట్టిపారేయటం సరికాదని దార్ల ప్రస్ఫుటంగానే చెబుతాడు (దార్ల, పే.46). ఇలా చెప్పటం వెనుక ఇంతవరకూ వివరించిన మత ప్రభావాన్ని గుర్తించాలనే కోణం దార్ల ఆలోచనల్లో కనిపించడం వాస్తవిక దళిత జీవితాలను గుర్తించకుండా కేవలం అన్ని చోట్లా మార్క్స్ సిద్ధాంతాలనే అన్వయించడం సరికాదనే సునిశిత విమర్శ ఉంది.

ఇక, దళితుల వైయక్తిక విముక్తి/అభివృద్ధి సమస్త పీడిత జన సమిష్టి విముక్తి/అభివృద్ధి జరిగినప్పుడే అన్న *ప్రజాసాహితి* వాదన గురించి కొంత చర్చించవలసి ఉంది. దళిత కూటమిలోని వ్యక్తుల వ్యక్తిగత సమస్యలేమైనా గాని, అవి ఏ కోవకు చెందినప్పటివైనా గాని ఆ కూటమిలోని వ్యక్తులందరూ సామూహికంగా అనుభవించే కొన్ని ఉమ్మడి సమస్యలను నాలుగు రకాలకు చెందుతాయని వర్గీకరించే అవకాశం ఉంది. సామాజిక/సాంస్కృతిక గుర్తింపు లేకపోవడం, సాంఘిక అసమానత్వం, ఆర్థిక పీడన, రాజకీయ నిర్బంధనం. ఈ సమస్యల పరిష్కారాలుగా అంటరానితనం పాటింపు నిషేధం, విద్యా-ఉద్యోగ, రాజకీయ అవకాశాలలో దళితులకు దేశ జానాభాలో దళిత జనాభా నిష్పత్తి ప్రాతిపదికన సీట్ల కేటాయింపులను రాజ్యంగా బద్ధంగా గైగొనడం జరిగింది. వీటిని విడమరచి చూస్తే ఒక్క అంటరానితన పాటింపు నిషేధం తప్ప మిగిలిన పరిష్కార మార్గాలన్ని దళిత కూటమిలోని కొద్దిమంది వ్యక్తుల వైయక్తిక అభివృద్ధి మార్గాలు మాత్రమే గాని, కూటమి యొక్క సామూహిక విముక్తికి, అభివృద్ధి సాధనాలు కాదు. ఉదాహరణకు విద్యా-ఉద్యోగాలలో దళితులకు కేటాయించిన 15 శాతం సీట్లను వినియోగించుకుని విద్యా పరంగా, తద్వారా ఆర్థిక పరంగా అబివృద్ధికి నోచుకునేది వారిలో 15 శాతం మంది మాత్రమే. మరి వారిలో

మిగిలిన 85 శాతం జనాభా సంగతేమిటి? దళిత కూటమి సామూహిక విముక్తి జరగనందువలననే ఖైర్లాంజీ, కారంచేడు, చుండూరు లాంటి అగ్రకుల అమానుష దురాగతాలు జరిగాయి, ఇంకా జరుగుతూనే ఉంటాయి. ఈ మేరకు *ప్రజాసాహితి* వారి దృక్పథంతో అంగీకరించక తప్పదని దార్ల ఆ పత్రిక దృక్పథాన్ని తన భుజాలకెత్తుకున్నాడు. సరే, దళిత కూటమిని భారత రాజ్యాంగం కల్పించిన వసతులు విముక్తం చెయ్యలేకపోయాయి. మరి *ప్రజాసాహితి* వారు ఆ కూటమి ప్రజల సామూహిక విముక్తికి చూపిస్తున్న మార్గం ఏమిటి?

బొల్లిముంత నాగేశ్వరరావు రాసిన '*ఓ రిజర్వు పంచాయితీ కథ*' (*ప్రజాసాహితి*, 1981: 43వ సంచిక) ద్వారా *ప్రజాసాహితి* వారు చెప్పిన విషయంలోగాని, 'ఖైర్లాంజీ అవమానాల దురాగతాల జీవితాలింకెన్నాళ్ళు' అన్న సంపాదకీయంలో చెప్పిన దాన్లో గాని రెండు అంశాలలో వారి సందేశం స్పష్టం:

(1) భూమిపై హక్కు సాధించకుండా దళితుల విముక్తి సాధ్యం కాదు.

(2) భూమి లేని వారు దళితులలో అధికంగా ఉన్నప్పటికీ అలా లేనివారు దళితేతరులలోకూడా ఉన్నారు. ఈ పీడితులంతా (భూమిలేని దళితులు - దళితేతరులు) సంఘటితమై ఐక్యంగా భూపోరాటం ద్వారా భూమిని సాధించుకోవాలి.వర్గ మార్గం మంచి మార్గమే. అయితే, కుల సమాజంలో ఈ మార్గ ఆచరణ సాధ్యమేనా? - అన్నదే అసలు ప్రశ్న. ఈ మార్గంలోని కొన్ని పరిమితులను వామపక్ష ఆలోచన విధానానికి కట్టుబడినవారికి అంబేద్కర్ అలోచనకు కట్టుబడిన దళితులు దళితేతరులు మొదటనుండి చెబుతూనే ఉన్నారు. పై వాటిలో

(1) కుల వ్యవస్థ - ఫ్యూడల్ వ్యవస్థ ఒకదానికొకటి పెనవేసుకున్న కాలంలో అగ్రకులాల అధికారానికి నిమ్న కులాల బానిసత్వానికి మూలం పైకులాలకు భూమిపై అధికారం, క్రింది వారికి అలా అధికారం లేక పోవడం. ఫ్యూడల్ వ్యవస్థ పెట్టుబడిదారి వ్యవస్థగా రూపాంతరం చెందిన తరువాత అగ్రకులాల అధికార మూలం కూడా మారింది. అప్పుడు భూమి మూలమైతే ఇప్పుడు విద్య మూలంగా మారింది. ఈ మార్పును గమనించకుండా గతించిన కాలనికి చెందిన సమస్య పరిష్కారాన్ని నడుస్తున్న కాలంలో వర్తింప జేయాలని చూడటం, ఉ. సాంబశివరరావు మాటలలో "జబ్బుకు పొంతనలేని మందును ఇవ్వడం" లాంటిది అవుతుంది.

(2) దళితులలో దళితేతరులలో భూమిలేనివారు ఉన్నారు. సరే, ఈ ఉమ్మడి సమస్య ప్రాతిపదికన వీరిరువురిని ఉమ్మడి వేదికపైకి తీసుకురాగలరా? తీసుకు రాలేరని ఇన్నేళ్ళ వామపక్ష ఉద్యమం-రాజకీయాలు, నక్సలైటు ఉద్యమ వైఫల్యాలు చెబుతూనే ఉన్నాయి. ఈ పరిమితులను అధిగమించేది, దళిత-దళితేతరులలో ఉన్న పీడిత సమాజాన్ని ఆర్థిక-సామాజిక బంధ విముక్తులను గావించేది కేవలం మార్క్స్ వర్గ దృక్పథాన్ని అంబేద్కర్ కుల దృక్పథానికి జతచేసి కుల పోరాటాలను, వర్గ పోరాటాలను జతగా, ఏక కాలంలో చేపట్టినప్పుడే. ఇది దళిత కుల- వర్గ దృక్పథం అనీ, దీనిలో వర్గకరణ వంటి అంశాలను

కూడా భాగస్వామ్యం చేయాలనీ, అంతే తప్ప భూమి కోసం దళితులంతా కలిసి ఉమ్మడి పోరాటాలు చేయడం ద్వారానే తమ సమస్యలు తీరిపోతాయని మాదిగలు నమ్మే స్థితిలో లేరని చాలా సున్నితంగానే దార్ల ప్రజాసాహితి వ్యాసాల్లోని భావజాలాన్ని తిరస్కరిస్తున్నాడు. సమాజం అంతటినీ చూసినప్పుడు వర్గ దృక్పథం, దళితుల్ని కూడా కలుపుకొని చూసినప్పుడు వర్గ- కుల దృపథం, మాదిగల్ని కలుపుకున్నప్పుడు వర్గ,కుల, వర్గీకరణ దృక్పథంతో భూమి కోసం జరిగే పోరాటాలు జరగాలని ఆశించడంలో ఎంతో స్పష్టత కనిపిస్తుంది.

**అరుంధతి - వసిష్ఠుల కల్యాణం: ఐక్యతా సందేశం:**

1959లో బోయి భీమన్న రాసిన ' రాగ వాసిష్ఠం' నాటకం యొక్క విశిష్టతను అంచనా వేసే ప్రయత్నాన్ని దార్ల " *రాగవాసిష్ఠం-నాటక వైశిష్ట్యం* " అన్న వ్యాసంలో చేశాడు. దండోరా ఉద్యమ నేపథ్యం నుండి పుట్టుకొచ్చిన మాదిగ సాహిత్యంతో ఈ నాటకానికి ప్రత్యక్ష సంబంధం లేకపోవడం వలన ఈ వ్యాసాన్ని ఈ పుస్తంలోని మిగిలిన వ్యాసాలతో జత చేయడం ఔచిత్యంగా ఉందనిపించదు. అయితే తమ ప్రాచీనులు తమకు అందించిన పౌరాణిక, జానపద, మౌఖిక సాహిత్య వారసత్వ సంపదను తిరిగి దొరక పుచ్చుకునే కార్యక్రమాన్ని మాదిగ సాహిత్య పరిణామ క్రమంలోని రెండవ దశలో మాదిగ సాహితీకారులు చేపట్టినట్లుగా మనం పైన చెప్పుకోవడం జరిగింది. ఆ ప్రయత్నంలో భాగంగానే మాతంగ కన్య అయిన అరుంధతీదేవి, బ్రాహ్మణ పురుషుడు వసిష్ఠుడిల మధ్య కులాతీతంగా నడచిన ప్రణయం, అది పరిపక్వమై వారిరివురి మధ్య జరిగిన కల్యాణగాధను మాదిగలు బయటకు తీయడం జరిగింది. మాదిగలకు పౌరాణిక చారిత్రక వారసత్వం కోసం జరుగుతున్న అన్వేషణలో నుండి దీన్ని అర్థం చేసుకోవాలి. ఆ ఆరాటాన్ని అర్థం చేసుకోవాలి. అలా ఆ ఆరాటంలోనుండే ఈ వ్యాసాన్ని అర్థంచేసుకోవాలి. కుల సమాజం తమపై రుద్దిన తెలివిలేనితనం నుండి మాదిగలను రక్షించి చరిత్రలో వారికంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించే మృత సంజీవనిలాంటి ఆ గాథను వారు స్వంతం చేసుకోవడానికి దండోరా నేపథ్యమే ప్రధాన భూమిక. ఆ దృష్టితో చూచినప్పుడు అరుంధతీ-వసిష్ఠుడిల కల్యాణం ప్రధాన వస్తువుగా గల నాటక విశ్లేషణ వ్యాసాన్ని ఈ పుస్తకంలో పొందుపరచడం అసమంజసమనిపించదు.

ఇక, రాగ వాసిష్ఠం నాటకంపై దార్ల వ్యాసం గురించి చెప్పుకోవాలంటే, అతని వ్యాసాన్ని రెండు భాగాలుగా చేసి అందలి విశ్లేషణను అవగతం చేసుకొనవచ్చును. మొదటి భాగం నాటకం గురించి అయితే, రెండవ భాగం నాటకం ప్రతిపాదించిన జాతి సిద్ధాంతం గురించి. బోయి భీమన్న ఆ నాటకాన్ని రాయడానికి పురిగొల్పిన చారిత్రక సంఘటన, నాటక కథా సారాంశం, నాటక రచనా విధానం, నాటకతత్వం మొదలైన విషయాలపైన మొదటి భాగంలో సాహితీపర చర్చ జరిగితే; శుద్రులు, అంటరానివారి పుట్టు పూర్వోత్తరాలపై అంబేద్కర్ చేసిన చర్చ వెలుగులో శూద్రులు, చండాలురు, మాల-మాదిగల వంటి పేర్లతో పిలిచే వారంతా భరత ఖండ మూలవాసులే కాకుండా, అసలైన ఆర్య జాతులవుతారని బోయి భీమన్న

చేసిన జాతి సిద్ధాంత ప్రతిపాదనపై సవిస్తరమైన చర్చ రెండవ భాగంలో జరిగింది. అరుంధతీదేవి చండాల కన్య గా కాకుండా, ఆమె ఆర్య జాతికి చెందిన కన్య అని బోయి భీమన్న చేసిన ప్రతిపాదనను వివరణలతో సమర్ధించేందుకు దార్ల పరిశోధించిన గ్రంధ (భగవద్గీత, మనుస్మృతి, సర్వేపల్లి రాధాకృష్ణన్, బి. ఆర్. అంబేద్కర్ రచనలు) వివరాలను బట్టి ఈ వ్యాస రచనకై అతను చేసిన మేధోగత శ్రమను మనం తప్పక గుర్తించవలసివుంది.

అరుంధతీదేవి కథ భూమికగా చేసుకుని ఆర్య-అనార్య భేధాలను చర్చించి శూద్రులు, పంచములు ఈ దేశ మూలవాసులే కాకుండా కుల వ్యవస్థ పై అంతస్తులలోవున్న మిగిలిన మూడు వర్ణాల మాదిరే ఆర్య జాతీయులని బోయి భీమన్న తన రాగ-వాసిష్టం నాటకంలో చెప్పడంలో భారతీయులంతా ఒకే జాతి సంతతి అనే సందేశమిచ్చి, భారత జాతి సమైక్యతను కాంక్షించారని తెలుస్తుంది. అయితే నాటకం ద్వారా రచయిత ఆశించిన ప్రయోజనాన్ని అటుంచి అసలు మూల కథలో నిబిడీకృతమైన మాదిగల తాత్వికతను కొంత సమగ్రంగా చర్చించడం అవసరం. ఈ తాత్వికత దార్ల వ్యాసంలో అంతర్లీనంగా వ్యక్తపరచబడినప్పటికీ వ్యాస పరిధి రీత్యా ఆ విషయాలను లోతుగా చర్చించే అవకాశం అతనికి దొరకలేదనిపిస్తుంది. అరుంధతీదేవి కథలో దాగున్న మాదిగల తాత్వికత ఏమిటి? అరుంధతీయ, ఆది జాంబవ సంఘం లాంటి పేర్లతో హైదరాబాద్-సికింద్రబాద్ జంట నగరాలలో ఉన్న కొన్ని మధ్య తరగతి మాదిగ సంఘాలు తప్ప అరుంధతిదేవి కథను దాదాపుగా మర్చి పోయిన మాదిగలు దండోరా నేపథ్యంలో అకస్మాత్తుగా ఆ కథను స్వంతం చేసుకోవడంలో వారు ఆశిస్తున్న ప్రయోజనం ఏమిటి? ఈ ప్రశ్నలపై సుదీర్ఘమైన చర్చ, పరిశోధన జరగవలసిన అవసరం ఎంతైనా ఉంది.

**చివరి గా ఓమాట:**

గత కొంత కాలంగా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్లలో విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి సారించి ఎన్నో విద్యాసంస్థలను నెలకొల్పుతున్నప్పటికీ విద్యనభ్యసించే అవకాశం దళితులలో ఇంకా కేవలం 15 శాతం మందికే లభిస్తుంది. ఆ 15 శాతంలో కూడా ఆర్థిక స్థోమతరీత్యా ఉన్నత విద్యనభ్యసించే అవకాశం ఏ 5 శాతం మందికో దొరకదు. అలా అవకాశం దొరికి ఉన్నత విధ్యభ్యాసం చేసి ఉన్నతి పొందిన వారిలో సాధారణంగా మూడు రకాల మనుష్యులను చూడవచ్చు. ఒకరు తమ మూలాలను మరచి జన 'ప్రధాన స్రవంతిలో' కలసిపోవడానికి ప్రయత్నాలు చేసేవారు. అట్టి ప్రయత్నాలు నా దృష్టిలో పునాది లేకుండా భవంతిని నిర్మించాలని చూడడమే అవుతుంది. పునాదిలేని భవనం చిరుగాలికి సైతం కుప్పకూలినట్లు, మూలాలు స్థిరంగా లేని ఏ కులం కూడా ప్రధాన స్రవంతిలో భాగం కాలేదు. ఈనాడు ప్రధాన స్రవంతి లేదా ప్రధాన స్రవంతిలో భాగం అని అనుకుంటున్న ఏ కుల చరిత్ర తలుపు తట్టినా కనిపించేది ఈ సత్యమే. కొందరు తమ మూలాలను మరువక ఆ మూలాలనే అంటి పెట్టుకుని అంటపెట్టుకొని వేళ్ళాడుతుంటారు. ఇలా అంటిపెట్టుకుని ఉండడం సాధారణంగా మూలాలు పెట్టుబడిగా స్వప్రయోజన లాభాలు ఆర్జించే నిమిత్తానికే. వీరి వలన వర్తమాన, భావితరాల వారికి ఎటువంటి ప్రయోజనం ఉండదు. వీరు రెండవ రకం మనుష్యులు.

ఇక మూడవ రకానికి చెందిన వారు తమ మూలాలను మరువక, ఆ మూలాలకు బలం కల్పించుకుంటూనే ప్రధాన స్రవంతితో మమేకమయ్యేవారు. వీరు చదువుకుని ఉన్నతి పొందిన వారిగా తాము పుట్టిన కులం పట్ల బాధ్యతా బరువును తమ భుజ స్కంధాలపై మోస్తూనే; తాము-తమ కులం కూడా సమాజంలో భాగమని, ఆ సమాజం పట్ల కూడా బాధ్యతాయుతంగా ఉండేవారు. ఒక రకంగా వీరు తమ కులానికి ప్రధాన స్రవంతికి మధ్య వంతెన వంటివారు. మాదిగ కులంలో ఒక వంతెన వంటి వాడే, భారతీయ దళిత సాహిత్య అకాడమీ అవార్డ్ గ్రహీత దార్ల అని చెప్పడానికి నాకు ఆనందంగాను, గర్వంగానూ ఉంది. మాదిగ కులంలో పుట్టినప్పటికీ మాదిగలు వేసిందే దరువు, రాసిందే సాహిత్యం అని మాదిగ కుల వకల్తా పుచ్చుకోక మాదిగ సాహిత్య ఆరంభంలో అవేశం హద్దు దాటిందని ఒప్పుకునే నిజాయితి ఒక్క దార్లకే స్వంతం. మాదిగ సాహిత్యం సృజించిన ప్రతి సాహితీ ప్రక్రియను తక్కెడలో తూచినట్లుగా ఒక నిబద్ధతో విశ్లేషించి, తెలుగు సాహితీ ఫలకంపై మాదిగ సాహిత్యానిది ఒక కొత్త దరువు అంటూ మాదిగ సాహిత్య స్వతంత్ర ప్రత్యేకతల జెండాను ఎగురవేసిన దార్ల అభినందనీయుడు.

- సాంబయ్య గుండిమెడ

లండన్,

26-12-2008.

# ఉపయుక్త గ్రంథ సూచిక

ఇనాక్ కొలకలూరి. *సాహిత్య దర్శిని* (వ్యాస సంపుటి), జ్యోతి గ్రంథమాల: అనంతపురం 1985
మొదటి ముద్రణ. ద్వితియ ముద్రణ 1993 పుటలు 47- 65

ఇనాక్ కొలకలూరి గారి కథానిక సంపుటాలు

జ్ఞానానందకవి యస్.టి.1997.షెడ్యూలు కులాలు అంటరానివా? కాకినాడ:
సురగాలి ప్రచురణలు

చంద్రశేఖర్ రెడ్డి, ఆర్. & లక్ష్మీనారాయణ, కె. (సంపాదకులు). 1996, దళిత కథలు,
హైదరాబాదు; విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

జగన్నాధం నములకంటి. 1968, అరుంధతీదేవి చరిత్రము. హైదరాబాద్ : వైదిక గ్రంథ ప్రచార
మండలి ప్రచురణలు

ప్రజాసాహితి 300 సంచిక

ప్రజాసాహితి సంచికలు

భీమన్న బోయి. 1959, రాగ వాశిష్ఠం .హైదరాబాదు : సుఖేలానికేతన్ ప్రచురణలు

మూర్తి .బి .బి.యస్. 1992, దళిత కథామంజరి .రాజమండ్రి : త్రివేణి ప్రింటర్స్ ప్రచురణలు

నరసింహాచార్య యన్. యల్. (వ్యాఖ్యాత), *2000,* మనుస్మృతి, *(*తెలుగు తాత్పర్యం సహితం*)*
హైదరాబాదు*:* గాయత్రీ ప్రచురణలు

నారాయణరెడ్డి, సి.(ప్రధాన సంపాదకుడు). 1992, బాబాసాహెబ్ అంబేద్కర్ రచనలు –
ప్రసంగాలు *7*వ సంపుటి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణలు

వెంకటేశ్వరరావు దార్ల. *చిత్తవృత్తికి భౌతిక వాస్తవికతను నేర్పేకథే "కుల వృత్తి"* (వ్యాసం),
www.prajakala.org మే 2007

వెంకట్రామయ్య, యెనమండ్రం. *1994 (*ప్రథమ ముద్రణ*,1879),* పురాణ నామచంద్రిక,
హైదరాబాదు*:* ప్రాచీ ప్రచురణలు

వేదవ్యాస,.*2000,* ప్రాచీన భగవద్గీత *(*పరిష్కృతమైన మూలము*),* యోగమిత్రమండలి
ప్రచురణ, హైదరాబాదు, ప్రథమ ముద్రణ

సాంబయ్య, గుండిమెడ. 2006. బ్రాహ్మణత్వ మాలత్వమా...? మానవత్వ అంబేద్కరత్వమా...?
(వర్గీకరణ సమస్యపై చర్చ), హైదరాబాదు; రాజ్యం ప్రచురణలు.

హైమవతి ,1982, ద్వితీయ ముద్రణ, పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న, (ప్రథమ
ముద్రణ ,1978), హైదరాబాదు : సుఖేలానికేతన్ ప్రచురణలు

# రచయిత పరిచయం

**పూర్తి పేరు** : దార్ల వెంకటేశ్వరరావు
**పుట్టిన ఊరు** : చెయ్యేరు అగ్రహారం, కాట్రేనికోన మండలం, తూర్పు గోదావరి జిల్లా
**ప్రస్తుతం ఉద్యోగం** : లెక్చరర్, తెలుగుశాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం
**పుట్టిన తేది** : 05-09-1973
**తల్లిదండ్రులు** : పెదనాగమ్మ, లంకయ్య (అబ్బాయిగారు)
**చదువు** : బి.ఏ. (లిట్)., (స్పెషల్ తెలుగులో ఆంధ్రా యూనివర్సిటీ ఫస్ట్)
యస్.కె.బి.ఆర్.కళాశాల, అమలాపురం
డిప్లొమా (సంస్కృతం), నిజాం కళాశాల, హైదరాబాదు
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి. (తెలుగు) హైదరాబాదు విశ్వవిద్యాలయం
ఎం.ఏ. (సోషియాలజీ) డా// అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
**పరిశోధన వివరాలు:** ఎం.ఫిల్. డా// యస్.టి. జ్ఞానానందకవి గారి ఆమ్రపాలి పరిశీలన 1998
పిహెచ్.డి. పరిశోధకుడుగా ఆరుద్ర 2003
**పరిశోధన ఆసక్తి** : సాహిత్య విమర్శ,, సౌందర్య శాస్త్రం. దళిత, మాదిగ సాహిత్యం,
**రచనల వివరాలు** :
1. ఆమ్రపాలి పరిశీలన (పరిశోధన గ్రంథం) - 1999
2. దళిత తాత్వికుడు (నా కవితా సంపుటి) 2004
3. మాదిగ చైతన్యం (కవితా సంకలనం - ఉప సంపాదకత్వం) 1997
4. సాహితీమూర్తుల ప్రశస్తి (సహాయ సంకలన కర్త) 1997
5. సృజనాత్మక రచనలు చేయడం ఎలా? (సాహిత్య విమర్శ) 2005
6. సాహితీ సులోచనం (పుస్తక సమీక్షా వ్యాసాలు) 2006
7. ఒక మాదిగ స్మృతి - నాగప్పగారి సుందర్రాజు (మోనో గ్రాఫ్) 2007
8. దళిత సాహిత్యం: మాదిగ దృక్పథం (సాహిత్య విమర్శ) 2008
9. వీచిక (సాహిత్య విమర్శ) ముద్రణలో ఉంది.
10. తెలుగు పరిశోధన: ఆరుద్ర దృక్పథం (పరిశోధన గ్రంథం) ముద్రణలో ఉంది.

**పురస్కారాలు** : కళాప్రపూర్ణ జయంతి రామయ్య పంతులు స్మారక బహుమతి- 1995
కందుకూరి వీరేశలింగం పంతులు, రాజ్య లక్ష్మీ స్మారక బహుమతి- 1995
నండూరి వెంకటరామయ్య & కుటుంబలక్ష్మీ స్మారక బహుమతి- 1995
భారతీయ సాహిత్య పరిషత్ రాష్ట్రశాఖ, రాజమండ్రి వారి బహుమతి- 1996
కళా విశిష్ట పురస్కారం- 2007
డా// బి.ఆర్. అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డ్,
భారతీయ సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ- 2007

**సాధించిన కొన్ని వివరాలు:**

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ వారి పరీక్ష ద్వారా స్లెట్ ఉత్తీర్ణత, రాతపరీక్ష ద్వారా యు.జి.సి. వారి నెట్ & రిసెర్చ్ ఫెలోషిప్ సాధించటం. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ వారి పరీక్ష ద్వారా గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్ గా ఎంపిక. శ్రీ అనంత పద్మనాభ కళాశాల, వికారాబాదులో యు.జి.సి. ఎయిడెడ్ కళాశాలలో మూడేళ్ళ పాటు తెలుగు లెక్చరర్ గా ఉద్యోగం నిర్వహించటం, ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం యువవాణి విభాగంలో కొంతకాలం పాటు క్యాంపియర్ గా పనిచేయడం, జాగృతి ఐ.ఎ.ఎస్. స్టడీ సర్కిల్ లో కొంతకాలం లెక్చరర్ గా పనిచేయడం వంటివి.

**ఇతర అంశాలు** :

సహాయ కార్యదర్శి, జ్యోత్స్న కళాపీఠం, హైదరాబాదు (2003 వరకు)
ప్రధాన కార్యదర్శి, తెలుగు సాహిత్య వేదిక, వికారాబాదు
సంపాదక వర్గ సభ్యుడు: బహుజన కెరటాలు మాస పత్రిక
మేనేజింగ్ ట్రస్టు గౌరవ సభ్యుడు: సొసైటి & ఎడ్యుకేషన్ ట్రస్టు, హైదరాబాదు
సబ్జెక్ట్ కో ఆర్డినేటర్, స్పెషల్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ స్టడీస్,
తెలుగు శాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం

**మాదిగ సంస్కృతి వెబ్ :**

దళిత, మాదిగల సంస్కృతిని ప్రతిబింబించే రచనలు, వీడియోలు, ఫోటోలతో
నడుపుతున్న వెబ్ (బ్లాగు) : www. Madigakavulu.blogspot.com




భారతీయ దళిత సాహిత్య అకాడమీ వారి డా॥ బి॥ ఆర్॥ అంబేద్కర్
రిసెర్చ్ ఫెలోషిప్ అవార్డు స్వీకరిస్తున్న డా॥ దార్ల వెంకటేశ్వరరావు

సమకాలీన సాహిత్యంలో ఒక ప్రధాన ఉద్యమం మాదిగ సాహిత్య ఉద్యమం. ఇది అంబేద్కర్ తాత్విక భూమికను, అయన పోరాట పటిమను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్తున్న ఉద్యమం. ఒక చారిత్రక నేపథ్యంతో జాతి అస్తిత్వాన్ని ప్రతిఫలించే దిశగా పయనిస్తుంది. ఈ పుస్తకాన్ని చదివి ప్రజాస్వామిక వాదులందరూ సామాజికంగానూ, సాహిత్యపరంగానూ మాదిగలసంస్కృతిని స్వీయ అస్తిత్వాన్ని స్వాగతిస్తారని ఆశిస్తున్నాను

...డా॥ దార్ల వెంకటేశ్వరరావు

కుల-వర్గ, వర్తమాన దండోరా ఉద్యమ సమస్యల్లాంటివి సామాజిక ప్రధాన అంశాలై సమగ్రమైన చర్చ లేవదీస్తూ, అది సాహిత్యంలో ప్రతి ఫలిస్తున్న తీరును శాస్త్రీయంగా విశ్లేషిస్తూ ప్రచురించిన ఈ పుస్తకం దార్ల సామాజిక అవగాహనకు సాహిత్యకృషికి అంకిత భావానికి తార్కాణంగా నిలుస్తుంది.

... డా॥ జె॥ భీమయ్య

ఆరంభంలో మాదిగ సాహిత్యం దళిత సాహిత్యంలో అంతర్భాగంగా ఆరంభమైనప్పటికీ ఆ సాహిత్యం తడిమిన పలుప్రక్రియలు వస్తు వైవిధ్యాల దృష్ట్యా చూసినప్పుడు దానికంటూ ఒక స్వంత అస్తిత్వం ప్రత్యేకతలు ఉన్నాయని ఈ పుస్తకంలో దార్ల మాదిగ సాహిత్య స్వతంత్ర బావుటాను దశదిశలా ఎగురవేస్తాడు. ఇదే ఈ పుస్తకంలోని వ్యాసాలన్నింటిలో కనిపించే ఏక సూత్రత.

... సాంబయ్య గుండిమెడ

Dalitha Sahityam : Madiga Drukpadam aptly captures community concerns and traces out the rich cultural heritage of the Madigas in carving a significant place in Telugu society. Dr. Darla Venkatewararao, one of the youngest poets, a dynamic scholar and rational literary critique, covered a wide range of issues and mapped out the contributions of literary

**- Dr. G. Nagaraju**